
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 | సంచిక: 222
SUNDAY Special
ఆదివారం 3-11-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'



విజయంపై భారత్ గురి

ముంబై టెస్టులో న్యూజిలాండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 9 వికెట్లకు 171 పరుగులు చేసింది. ప్రస్తుతం కివీస్ 143 పరుగులు ముందంజలో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 263 పరుగులు చేసింది.


- వివరాలు 14లో



మెల్లగా... వద్దు వెంటనే సరి చేద్దాం...

మెల్లకన్ను ఉందని తెలుసుకోవడమెలా, కారణాలూ, చికిత్స త్వరగా ఎందుకు చేయించాలనే అనేక అంశాలపై అవగాహన కోసం ప్రత్యేక కథనం.


- వివరాలు 13లో



గంగోత్రి ఆలయం మూసివేత

ఉత్తరాఖండ్‌లోని గఢ్వాల్ హిమాలయాల్లో ఉన్న గంగోత్రి ఆలయాన్ని శనివారం అన్న కూట్ ఉత్సవం అనంతరం మూసివేశారు.

- వివరాలు 6లో ▶



మా జోలికి వస్తే అణగదొక్కుతాం

తమ దేశంపై దాడిచేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ ఇజ్రాయెల్, అమెరికాను హెచ్చరించారు.

- వివరాలు 6లో ▶



టోరీల సారథిగా బేడ్‌నాక్

బ్రిటన్ విపక్ష నేతగా, కన్జర్వేటివ్ పార్టీ సారథిగా నైజీరియా మూలాలున్న 44 ఏళ్ల కేమీ బేడ్‌నాక్ ఎన్నికయ్యారు.

- వివరాలు 6లో ▶



వైట్‌హౌస్‌కు దారేది?

అమెరికా అధ్యక్ష ఎన్నికల పోరు తుది అంకానికి చేరింది. ఉత్కంఠతో ఎదురు చూస్తున్న పోలింగ్ ప్రక్రియ మంగళవారం జరగనుంది.

- వివరాలు 6లో ▶

పీఎం వర్సెస్ సీఎం

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం వేదికగా తెలంగాణ అభివృద్ధిపై ప్రధాని సెటైర్లు

- వాగ్దానాలు ఇవ్వడం తేలికే, అమలు కష్టమని తెలిసివచ్చిందంటూ విమర్శలు
- అలవికాని హామీలు వద్దన్న ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే వ్యాఖ్యలను ఉటంకిస్తూ దాడి
- మోదీకి కౌంటర్ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. 'ఎక్స్'లో సుదీర్ఘ పోస్ట్
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా లేని స్థాయిలో ఇక్కడ సంక్షేమం
- గత పదేళ్ల చీకట్లను వదిలించుకుని తెలంగాణ వెలిగిపోతోంది... మోదీ దురభిప్రాయాలు, వాస్తవ లోపాలపై వివరణ ఇస్తున్నట్టు వెల్లడి



తెలంగాణ అభివృద్ధి, కాంగ్రెస్ సర్కారు హామీల అమలు అంశం రచ్చరేపుతోంది. తెలంగాణ సహా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఆర్థిక వ్యవస్థలు కునారిల్లుతున్నాయని మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ కామెంట్లు చేయగా... దానిపై సీఎం రేవంత్‌రెడ్డి దీటుగా స్పందించారు. ప్రధాని మోదీ 'ఎక్స్'లో చేసిన పోస్టుకు కౌంటర్‌గా 'ఎక్స్'లోనే సమాధానమిచ్చారు. మోదీ దురభిప్రాయాలు, ఆయన పోస్టులోని వాస్తవ లోపాలపై వివరణ ఇస్తున్నానంటూనే విమర్శలు గుప్పించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా లేనిస్థాయిలో పథకాలు అమలు చేస్తున్నామని, ఉద్యోగాలు ఇచ్చామని పేర్కొన్నారు. రాష్ట్రంలో వివిధ పథకాలు, వాటి నుంచి లబ్ధిపొందినవారి గణాంకాలను కూడా ప్రస్తావించారు. తామిచ్చిన ప్రతి వాగ్దానం పట్ల పవిత్రమైన చిత్తశుద్ధి ఉందని వ్యాఖ్యానించారు.

మోదీ ఏమన్నారంటే?

నెరవేర్చలేని వాగ్దానాలివ్వడం తేలికేనని, అమలు మాత్రం కష్టమని కాంగ్రెస్ పార్టీకి అర్థమవుతోందని విమర్శిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. నెరవేర్చలేమని తెలిసినప్పటికీ కాంగ్రెస్ నేతలు ప్రతి ఎన్నికల సందర్భంగా హామీలు ఇస్తున్నారని, ప్రజల ముందు దోషులుగా నిలబడుతున్నారని మండిపడ్డారు. ''ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రాన్నయినా చూడండి. హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో అభివృద్ధి తగ్గుముఖం పట్టడంతో ఆర్థిక వ్యవస్థలు కునారిల్లిపోతున్నాయి. వారిచ్చిన గ్యారంటీలు నెరవేర్చడం లేదు. ఈ రాజకీయాలకు పేదలు, యువత, రైతులు, మహిళలు బాధితులుగా మిగిలిపోతున్నారు'' అని ప్రధాని మోదీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

మోదీకి కౌంటర్‌గా రేవంత్ ఏమన్నారంటే?

సాక్షి, హైదరాబాద్: తాము అధికారంలోకి వచ్చిన 11 నెలల్లోనే పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలోని నిరాశ, నిస్పృహలను, నాటి చీకట్లను పారదోలామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం ఉదయపు సూర్యుడిలా వెలుగొందుతోందన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ప్రజలకిచ్చిన హామీలు నెరవేరడం లేదని, ఆ రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి కునారిల్లుతోందని విమర్శిస్తూ ప్రధాని మోదీ శుక్రవారం 'ఎక్స్'లో చేసిన పోస్ట్‌కు ప్రతిగా శనివారం రేవంత్‌రెడ్డి సుదీర్ఘ పోస్ట్ చేశారు. తెలంగాణలో రైతు రాజులా బతుకుతున్నాడని.. మహిళలు, యువత, విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవంతోపాటు ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని వెల్లడించారు. మోదీ పోస్ట్‌కు కౌంటర్‌గా సీఎం రేవంత్ చేసిన పోస్ట్ యథాతథంగా.. ''మీ (ప్రధాని మోదీ) ప్రకటనలో నా రాష్ట్రం, ప్రభుత్వం గురించి వెలువరించిన

మిగతా 2వ పేజీలో ▶

ఫోర్త్‌సిటీకి మెట్రో

రూ.8,000 కోట్లతో 40 కిలోమీటర్ల నిర్మాణం

- రెండోదశ మెట్రోకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం
- రూ. 24,269 కోట్లతో పరిపాలన అనుమతులు
- ఐదు కారిడార్లు.. 76.4 కిలోమీటర్లు
- ఆరో కారిడార్‌గా ఫోర్త్ సిటీకి మెట్రో కనెక్టివిటీ
- మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.32,237 కోట్లు
- కేంద్రంతో కలిసి 50:50 విధానంలో జాయింట్ వెంచర్ ప్రాజెక్టు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రోరైలు రెండో దశ పనులకు ప్రభుత్వం పరిపాలన ఆమోదం తెలిపింది. రెండోదశ ప్రాజెక్టులో భాగంగా రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 76.4 కిలోమీటర్ల మేర ఐదు కారిడార్ల (పార్ట్-ఏ కింద)ను నిర్మించనున్నారు. పార్ట్-బీలో శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్ సిటీ (స్కిల్స్ యూనివర్సిటీ)వరకు ఆరో కారిడార్‌ను నిర్మించనున్నారు. దీనికి రూ.8 వేల కోట్ల వరకు ఖర్చు అవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. దీనికి సంబంధించిన అలైన్‌మెంట్, నిర్మాణ వ్యయం ఇతర అంశాలపై సర్వే జరుగుతోంది. ఈ మేరకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

జాయింట్ వెంచర్‌గా నిర్మాణం

రెండోదశ మెట్రో ప్రాజెక్టును దేశంలోని ఇతర నగరాల తరహాలో కేంద్ర ప్రభుత్వంతో కలిసి 50:50 జాయింట్ వెంచర్ (జేవీ)గా నిర్మించాలని నిర్ణయించినట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రస్తుతం

మిగతా 12వ పేజీలో ▶

న్యూస్‌రీల్

5న రాష్ట్రానికి రాహుల్, ఖర్గే!



రాష్ట్రంలో ఆరో తేదీ నుంచి నిర్వహించనున్న కులగణనపై మేధావుల నుంచి సలహాలు, తీసుకునేందుకు లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ ఈ నెల 5న హైదరాబాద్‌కు వస్తున్నారని మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

- వివరాలు 2లో ▶


28 వరకు ఓటర్ల నమోదు



ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం -2025లో భాగంగా కొత్త ఓటర్ల నమోదు, ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, ఇతర మార్పులు, చేర్పుల ప్రక్రియ కొనసాగుతోందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ) సి.సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

- వివరాలు 16లో ▶

రాష్ట్ర పండుగగా సదర్ సమ్మేళనం



సాక్షి, హైదరాబాద్: సదర్ సమ్మేళనాన్ని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జీహెచ్‌ఎంసీతోపాటు రాష్ట్రవ్యాప్తంగా సదర్ సమ్మేళనాలు యువత అభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అవసరమైన నిధులను ఆ శాఖ నుంచి కేటాయించాలని తెలిపారు.

లాంచీ సర్వీసుల లాంచింగ్

- నాగార్జునసాగర్-శ్రీశైలం, సోమశిల-శ్రీశైలం యాత్రలు మొదలు
- 110 కి.మీ. మేర నదిలో ఆహ్లాదకర ప్రయాణం.. టికెట్ పెద్దలకు రూ.2 వేలు, పిల్లలకు రూ.1,600

- వివరాలు 16లో

ఇందిరమ్మ ఇంటికి ఇక్కట్లు!

పథకం అమలులో కేంద్ర ప్రభుత్వం కొత్త మెలిక

- పట్టణ ప్రాంతాల్లో లబ్ధిదారుల వాటా ఉండాలంటున్న కేంద్రం
- ఇందిరమ్మ ఇళ్లలో ప్రజలకు నయాపైసా ఖర్చు ఉండదని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం హామీ
- కేంద్ర ఆదేశాలతో లబ్ధిదారుల వాటా కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాల్సిన పరిస్థితి



సాక్షి, హైదరాబాద్:

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారులు ఎలాంటి వాటా చెల్లించాల్సిన అవసరం లేదన్నది రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట..

పట్టణ ప్రాంతాల్లో అంతస్తులుగా నిర్మించే పేదల ఇంటికి లబ్ధిదారు వాటా ఉండాలన్నది కేంద్ర ప్రభుత్వ స్పష్టీకరణ..

కేంద్రం పెట్టే నిబంధనలు పాటిస్తేనే.. పేదల ఇళ్ల కోసం ఢిల్లీ నుంచి ఆర్థిక సాయం అందుతుంది.

అంటే.. పట్టణ ప్రాంతాల్లో నిర్మించబోయే గృహ సముదాయాలకు లబ్ధిదారులు వాటా చెల్లించాలి. లేదా ఆ వాటా నిధులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి. అప్పుడే కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రాష్ట్రానికి నిధులు అందుతాయి.

నిరుపేదలకు సొంతింటి వసతి కల్పించే ప్రభుత్వ పథకాల విషయంలో లబ్ధిదారుల వాటా అంశాన్ని కేంద్రం తాజాగా తెరపైకి తెచ్చింది. అయితే వ్యక్తిగత (ఇండిపెండెంట్) ఇళ్లకు లబ్ధిదారుల వాటా లేకున్నా.. అంతస్తుల వారీగా నిర్మించే గృహ సముదాయాల విషయంలో లబ్ధిదారుల

మిగతా 5వ పేజీలో ▶

భారత్‌పై కెనడా మంత్రి ప్రేలాపనలు

- కెనడాలో ఖలిస్తానీ మద్దతుదారులపై దాడులకు అమిత్ షా కారణం
- కెనడా విదేశాంగశాఖ ఉపమంత్రి డేవిడ్ మోరిసన్ ఆరోపణలు
- ఖండించిన భారత్... అసంబద్ధ ఆరోపణలు చేయొద్దని హితవు



భారత్‌కు వ్యతిరేకంగా కెనడా ప్రభుత్వ పెద్దల ప్రేలాపనలు ఆగడం లేదు. కెనడాలో ఖలిస్తానీ మద్దతుదారులపై దాడులకు, కుట్రలకు భారత హోం మంత్రి అమిత్ షా కారణమంటూ కెనడా విదేశాంగ శాఖ ఉప మంత్రి డేవిడ్ మోరిసన్ చేసిన ఆరోపణలతో వివాదం మరింత ముదురుతోంది. కెనడాలో ఉన్న సిక్కు వేర్పాటువాదులకు, ఖలిస్తానీ సానుభూతిపరులకు వ్యతిరేకంగా హింసను ప్రేరేపించాలని భారత నిఘా అధికారులను అమిత్ షా ఆదేశించారని డేవిడ్ మోరిసన్ చెప్పారు. మోరిసన్ ఆరోపణలపై భారత్ తీవ్రంగా స్పందించింది. అర్థంపర్థం లేని, ఆధారాల్లేని ఆరోపణలు చేశారని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మండిపడ్డారు.

- 6లో

75 ప్రశ్నలతో కుటుంబ సర్వే

- సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సన్నద్ధం... పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ విడుదల
- రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమం పూర్తి
- జిల్లాల్లో కొనసాగుతున్న శిక్షణ కార్యక్రమాలు

5 లో

మన ముత్యానికి మెరుపులు

జియో ట్యాగింగ్ కోసం హైదరాబాదీ ముత్యాలు

- వరంగల్ చపాటా మిర్చీకి కూడా గుర్తింపు కోసం దరఖాస్తు
- కేంద్రానికి ప్రతిపాదనలు పంపిన రాష్ట్ర ప్రభుత్వం
- ఇప్పటికే లక్కగాజులు సహా 17 ఉత్పత్తులకు జీఐ గుర్తింపు
- జీఐతో ఉత్పత్తులకు పేటెంట్ రక్షణ, కార్మికులకు ఉపాధి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణకే ప్రత్యేకమైన పలు ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు (జియోగ్రాఫికల్ ఇండికేషన్-జీఐ) సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలోని ఆహారం, హస్తకళలు, వంగడాలు తదితర 17 రకాల ఉత్పత్తులకు ఇప్పటికే జీఐ గుర్తింపు లభించింది. ఇప్పుడు మరిన్ని ఉత్పత్తులకు జీఐ గుర్తింపు సాధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నది. ఈ జాబితాలో హైదరాబాద్ ముత్యాలు, భద్రాచలం కలంకారీ, వరంగల్ మిర్చి తదితర ఉత్పత్తులు ఉన్నాయి. వీటికి జీఐ గుర్తింపు కోసం కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖ అధీనంలోని 'కంప్ట్రోలర్ జనరల్ ఆఫ్ పేటెంట్స్, డిజైన్స్, ట్రేడ్ మార్క్'విభాగానికి రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులు సమర్పించింది.

30 ఉత్పత్తులకు జీఐ ట్యాగింగ్

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే జీఐ ట్యాగింగ్ జాబితాలో తెలంగాణకు చెందిన ఉత్పత్తులకు పెద్దగా చోటు దక్కలేదు. కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక ఉత్పత్తులు పెద్ద సంఖ్యలో జీఐ

మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ సంగతి (ఇదం జగత్)



ఇప్పటి వరకూ అలాంటి హామీలిస్తూ గెలుస్తున్నాం సార్! లేదంటే గెలవడం సాధ్యం కాదా్సర్!



అనుమతి లేకున్నా రూ. వెయ్యి కోట్ల 'సీతారామ' టెండర్లు!

- ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీల పనుల్లో నిబంధనల ఉల్లంఘన
- రూ. 1,842 కోట్లకు పిలిచిన టెండర్లలో రూ. 1,074 కోట్ల పనులకు అనుమతుల్లేని వైనం
- వివాదాస్పదంగా ప్రాజెక్టు అధికారుల తీరు.. సమీక్షలో మంత్రి ఉత్తమ్ ఆగ్రహం?

12 లో

కట్టలు తెగిన దుష్ప్రచారం

ప్రజల్ని తప్పదోవ పట్టించడమే లక్ష్యంగా చంద్రబాబు కుట్ర రాజకీయాలు

చెప్పుకోవడానికి చేసిందేమీ లేక జరగనివి జరిగినట్లు చిత్రీకరణ

ప్రభుత్వ అవసరాల కోసం నిర్మించిన రుషికొండ భవనాలపైనా అవాకులు చెవాకులు



వైఎస్ జగన్ హయాంలో నిర్మించిన రుషికొండలోని ప్రభుత్వ భవనాలను పరిశీలిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు

- రుషికొండ భవనాలపై దిగజారుడు మాటలతో రెచ్చిపోయిన ఏపీ సీఎం చంద్రబాబు
- హైదరాబాద్ పార్క్‌హయత్‌లో కాపురం పెట్టి రూ.30 కోట్లు ప్రభుత్వం నుంచి కట్టించింది ఎవరు?
- ఉండవల్లి, అమరావతి, ఢిల్లీ క్యాంపు ఆఫీసులకు రూ.కోట్లు ఖర్చు చేసిందెవరు?... హైదరాబాద్‌లోని ఫామ్‌హౌస్ మరమ్మతులకు ప్రభుత్వ సొమ్ము వెచ్చించిందెవరు?
- అవన్నీ మరిచి ప్రభుత్వ భవనాలపై అన్యాయంగా నిందలు
- రెండేళ్ల క్రితం జరిగిన విజయమ్మ వాహన ప్రమాదంపై టీడీపీ సోషల్ మీడియాలో దారుణంగా దుష్ప్రచారం
- టీటీడీలో నెయ్యి కల్తీ జరిగిందని విష ప్రచారం చేసి అభాసుపాలు
- బోట్లతో గుద్ది ప్రకాశం బ్యారేజీని ధ్వంసం చేయడానికి ప్రయత్నించారంటూ నిందలు
- వాస్తవానికి నగరంలోకి వరదను మళ్లించింది మీరు కాదా బాబూ?
- కొద్ది రోజులు మదనపల్లె ఫైల్స్.. ఇంకొన్ని రోజులు కాదంబరి పేరుతో హడావుడి..5 నెలలు కావస్తున్నా సూపర్ సిక్స్ అమలుపై మీనమేషాలు
- దీనిపై నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు తరచూ ఏదో ఒక అంశంపై రాజకీయం
- డైవర్షన్ పాలిటిక్స్‌లో తనకెవరూ సాటిరారని ఎప్పటికప్పుడు నిరూపించుకుంటున్న వైనం

- వివరాలు 3లో



చిరంజీవితో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి భేటీ

సాక్షి, హైదరాబాద్: సినీహీరో చిరంజీవితో కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి భేటీ అయ్యారు. శనివారం చిరంజీవి నివాసానికి వెళ్లిన సందర్భంగా ఆయన్ను కిషన్‌రెడ్డి శాలువాతో సన్మానించి అభినందించారు. దీపావళి సందర్భంగా చిరంజీవికి శుభాకాంక్షలు తెలియజేసినట్లు 'ఎక్స్' ద్వారా కిషన్‌రెడ్డి వెల్లడించారు. సినీపరిశ్రమతో పాటు సేవా కార్యక్రమాలతో ఎందరికో స్ఫూర్తిగా నిలిచి ప్రభావితం చేసిన చిరంజీవిని కలుసుకోవడం ఎల్లప్పుడూ ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగిస్తుందని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. అయితే కిషన్‌రెడ్డి చిరంజీవిని మర్యాదపూర్వకంగానే కలుసుకున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. టీటీడీ చైర్మన్‌గా నియమితుడైన బీఆర్ నాయుడిని కూడా కిషన్‌రెడ్డి కలిసి అభినందించినట్లు పార్టీ నాయకుల సమాచారం.

క్లుప్తంగా...

రాజ్యాంగం ప్రకారం కులగణన చేపట్టాలి

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: కులగణన కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలనే హైకోర్టు సూచనను రాష్ట్ర ప్రభుత్వం పక్కన పెట్టి గందరగోళం సృష్టిస్తోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. కులగణన కోసం ఇచ్చిన రెండు వేర్వేరు జీవోలతో ఈ ప్రక్రియలో కాలయాపన జరిగే అవకాశముందని ఆయన అన్నారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, కులగణనలో బిహార్, మహారాష్ట్ర, కర్ణాటకలో చేసిన తప్పిదాలే తెలంగాణలోనూ పునరావృతం చేయడం సమంజసం కాదన్నారు. కులగణన కోసం బీసీ కమిషన్ జిల్లాల్లో పర్యటిస్తున్నా కలెక్టర్లు, అధికారులు స్పందించడం లేదన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 342, 243ల ప్రకారం బీసీ కులగణన చేపట్టాలన్నారు. అసెంబ్లీ సమావేశాలను ఏర్పాటు చేసి.. కులగణనకు న్యాయపరమైన చిక్కులు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన సూచించారు.

ప్రత్యేక కమిషన్‌తోనే బీసీ కులగణన


బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్



సాక్షి, హైదరాబాద్: కులగణన పేరిట బీసీలను మోసం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్ర పన్నారని బీఆర్ఎస్ నాయకుడు దాసోజు శ్రవణ్ విమర్శించారు. కులగణన అధికారం కేంద్ర ప్రభుత్వానిదేనని, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాలంటే చట్ట సవరణ చేయాల్సి ఉంటుందని అన్నారు. శనివారం ఆయన బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వం కులగణన అంటూ జీవోల్లో పేర్కొంటోందని, ప్రణాళిక శాఖ లేదా బీసీ కమిషన్ కుల గణన చేస్తే చట్ట ప్రకారం చెల్లుబాటు కాదని అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 340 ప్రకారం ప్రత్యేక కమిషన్ ద్వారానే కులగణన చేపట్టాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కులగణన కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 199 జీవోపై ఎవరు కోర్టును ఆశ్రయించినా కొట్టివేయడం ఖాయమని దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. బీసీ కుల గణన కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని గతంలో హైకోర్టు తీర్పునిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. హైకోర్టు ఆదేశాలు అందలేదని బీసీ కమిషన్ చెప్పడం దుర్మార్గమని ఆయన విమర్శించారు.

టీటీడీ పాలకమండలిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తా

యుగతులసి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శివకుమార్



పంజగుట్ట (హైదరాబాద్): తాము తిరుమలను ప్రక్షాళన చేస్తామన్న తెలుగు దేశం ప్రభుత్వం పాల కమండలి సభ్యులు గతంలో ఉన్నవారినే ఎందుకు నియమించారని యుగ తులసీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, టీటీడీ మాజీ పాలక మండలి సభ్యుడు కె.శివకుమార్ ప్రశ్నించారు. టీటీడీ నిబంధనల ప్రకారం పాలకమండలిలో రెండు సార్లకన్నా ఎక్కువ ఎవర్నీ నియమించరాదని, కానీ తమిళనాడుకు చెందిన కృష్ణమూర్తి వరుసగా ఐదు సార్లు పాలకమండలి సభ్యుడిగా ఎలా పని చేశారని ప్రశ్నించారు. దీనిపై త్వరలోనే ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని శివకుమార్ చెప్పారు. శనివారం సోమాజి గూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'స్వామి వారి ప్రసాదంలో కల్తీ జరిగిందని పవన్ కల్యాణ్ గగ్గోలు పెట్టారు. అప్పటి పాలకమండలి సభ్యులవల్లే నెయ్యి కల్తీ అయింది, వారందర్నీ విచారించాలన్నారు. కానీ ఆయనే తిరిగి వారిని ఎలా కొనసాగిస్తారు?' అని ప్రశ్నించారు.

మోదీకి కౌంటర్‌గా రేవంత్ ఏమన్నారంటే?

▶ మొదటి పేజీ తరువాయి

దురభిప్రాయాలు, వాస్తవ లోపాలపై వివరణ ఇస్తున్నందుకు సంతోషంగా ఉంది. దాదాపు దశాబ్దపు బీఆర్ఎస్ దుష్పరిపాలన తర్వాత డిసెంబర్ 7, 2023న తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి రాష్ట్రంలో ఉత్సాహం, ఆశలు నెలకొన్నాయి. బాధ్యతలు తీసుకున్న రెండు రోజుల్లోనే ప్రజలకిచ్చిన రెండు హామీలను నెరవేర్చాం. తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిధిని 10 లక్షల రూపాయలకు పెంచుతూ నిర్ణయాలు తీసుకున్నాం. గత 11 నెలల కాలంలో తెలంగాణ తల్లులు, అక్కాచెల్లెళ్లు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా ప్రయాణించారు. 101 కోట్ల ప్రయాణాల ద్వారా తెలంగాణ మహిళలు ఏడాదిలోపే రూ.3,433.36 కోట్లు లబ్ధి పొందారు. ఏడాది పూర్తిగాకముందే తెలంగాణ రైతును రాజును చేస్తూ దేశంలో ఎక్కడా లేని విధంగా రుణమాఫీని అమలు చేశాం. ప్రస్తుతం తెలంగాణలోని 22,22,365 మంది రైతులు ఎలాంటి అప్పులు లేకుండా రాజులా బతుకుతున్నారు. రూ.2 లక్షల వరకు రైతు రుణాలను మాఫీ చేస్తూ కేవలం 25 రోజుల్లో రూ.18 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశాం.

మహిళలు సంతోషంగా ఉన్నారు

గృహ వినియోగానికి 200 యూనిట్ల వరకు ఎలాంటి చార్జీలు లేకుండా విద్యుత్ సౌకర్యం పొందుతున్న మహిళల దీవెనలు మాకు అందుతున్నాయి. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని మహిళలు అధిక గ్యాస్ ధరలతో ఇబ్బందులు పడుతుండగా.. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణలో రూ.500కే సిలిండర్ పొందుతున్న మహిళలు సంతోషంగా ఉన్నారు. మా హయాంలో ఇప్పటివరకు 42,90,246 మంది లబ్ధిదారులకు 1.31 కోట్ల గ్యాస్ సిలిండర్లను డెలివరీ చేయడంతో వారంతా సంతోషంగా వంట గదుల్లోకి వెళుతున్నారు.

50వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం..

గత దశాబ్ద కాలంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ లేకపోవడం, పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు జరిగాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్ద ఎత్తున ఉద్యోగాల భర్తీ చేపట్టాం. గ్రూప్-1, 2, 3, 4 వంటి అన్ని స్థాయిల్లోని పరీక్షలను సకాలంలో నిర్వహిస్తున్నాం. దేశంలోని ఏ రాష్ట్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కూడా చేయని విధంగా 11 నెలల కాలంలో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం 50 వేల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలిచ్చింది. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యానికి గురైన విద్యార్థులు ఇప్పుడు సంతోషంగా ఉన్నారు. వారి డైట్, కాస్మెటిక్ చార్జీలను 40శాతం మేరకు పెంచాం. గతంలో నిర్లక్ష్యానికి గురైన మూసీ నదిని శుద్ధి చేయడంతోపాటు పునరుజ్జీవ కార్యక్రమం చేపట్టాం. మా చెరువులను కాపాడుకుంటున్నాం. గత పదేళ్లలో నిరాటంకంగా ధ్వంసమైన నాలాలు, ఇతర నీటి వనరులను సంరక్షించుకునే పనిలో ఉన్నాం. మేం అధికారంలోకి వచ్చాక ఒక్క చెరువు కూడా కబ్జాకు గురికాలేదు. ఫ్యూచర్‌సిటీని సృష్టిస్తున్నాం. ఇందుకు సంబంధించిన మాస్టర్‌ప్లాన్ తయారవుతోంది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ వర్సిటీతోపాటు ఇంటిగ్రేటెడ్ గురుకులాల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేశాం. మేం ప్రజలకిచ్చిన ప్రతి వాగ్దానం పట్ల మాకు పవిత్రమైన చిత్తశుద్ధి ఉంది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నెలకొన్న నిరాశ, నిస్పృహలను గత 11 నెలల కాలంగా తిప్పికొడుతూ ఆ పాలనా చీకట్లను పారదోలుతున్నాం. ఉదయపు సూర్యుడిలాగా తెలంగాణ ఇప్పుడు వెలుగుతోంది'' అని సీఎం రేవంత్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

కేంద్రానికి రాష్ట్రం సహకారం

రెండు ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- రూ.25 కోట్లతో డబుల్‌రోడ్డు పనులకు శంకుస్థాపన



డబుల్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్

మల్యాల (చొప్పదండి): రాజకీయాలు ఎన్నికల వరకే ఉండాలని, ఎన్నికల తర్వాత అందరూ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. అభివృద్ధి విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. కేంద్రానికి సహకరిస్తున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం క్రాస్‌రోడ్డు నుంచి వేములవాడ నియోజకవర్గంలోని మేడిపల్లి మండలం కాచారం వరకు డబుల్ రోడ్డు విస్తరణ పనులకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలసి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. రోడ్డు విస్తరణ విషయాన్ని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లగానే రూ.25 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. కేంద్రం నుంచి మరిన్ని నిధులు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే సత్యం రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి అనుమతులు మంజూరు చేయించాలని కోరారు. గత ప్రభుత్వం పగ, ప్రతీకారాలతో ప్రొటోకాల్ పాటించలేదని, అభివృద్ధికి సహకరించలేదని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

5న రాష్ట్రానికి రాహుల్, ఖర్గే!

- కులగణన సలహాల కార్యక్రమానికి హాజరు
- నిష్పక్షపాతంగా కులగణన చేపడతాం
- కార్యక్రమంపై పీసీసీ ఆధ్వర్యంలో అఖిలపక్షం
- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆరో తేదీ నుంచి నిర్వహించనున్న కులగణనపై మేధావులు, విద్యార్థి నాయకులు, కుల సంఘాల నేతల నుంచి సలహాలు, సూచనలు తీసుకునేందుకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఈ నెల ఐదో తేదీన హైదరాబాద్‌కు వస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలకు బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో జరిగే సమావేశానికి రాహుల్ హాజరవుతారని, ఇదే సమావేశానికి రావాల్సిందిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కూడా ఆహ్వానించామని చెప్పారు. వీలును బట్టి ఆయన కూడా హాజరవుతారని వెల్లడించారు. కులగణన కోసం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన కనెక్ట్ సెంటర్‌ను పార్టీ నేతలతో కలిసి మహేశ్‌కుమార్‌గౌడ్ శనివారం ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనాభా నిష్పత్తి ప్రకారం సంపద పంపిణీ జరగాలని అన్నారు. అందుకే దేశ వ్యాప్తంగా కులగణన జరగాలని కోరుతున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణన కార్యక్రమంలో ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త భాగం కావాలని పిలుపునిచ్చారు. కులగణనతో పాటు రాష్ట్ర ప్రభుత్వం చేప డుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కనెక్ట్ సెంటర్ ఉపయోగపడుతుందని తెలిపారు. కులగణన ఎక్కడా బ్రేక్ లేకుండా నిష్పక్షపాతంగా, సజావుగా జరగాలన్నదే తమ ఉద్దేశమని అన్నారు. కులగణనపై పీసీసీ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం కూడా ఏర్పాటు చేసి అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను తెలుసుకుంటామని వెల్లడించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే సమగ్ర కుటుంబ సర్వే నివేదికను ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సజావుగా సాగుతుందని చెప్పారు. మహేశ్వర్‌రెడ్డి తనకు మంచి మిత్రుడని, బీజేపీలో ఆయనకు కుర్చీ లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న స్వేచ్ఛ మరే పార్టీలో ఉండదని తెలిపారు. ప్రధాని మోదీ ఎన్నికలకు ముందు అమలు చేస్తానని చెప్పిన సంక్షేమ పథకాలు, ఉద్యోగాలు ఎక్కడ అని పీసీసీ చీఫ్ ప్రశ్నించారు. సంక్షేమం అంటేనే కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మార్చండి.. మా కులాన్నీ చేర్చండి

బీసీ కమిషన్‌కు వినతుల వెల్లువ



విచారణలో పాల్గొన్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, సురేందర్, బాలలక్ష్మి, కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, షేక్ రిజ్వాన్ బాషా తదితరులు

సాక్షిప్రతినిధి, వరంగల్: 'బీసీల్లోని ఏబీసీడీఈ వర్గాలను పునర్వర్గీకరణ చేయాలి. బీసీ కులాలను అవమాన పరిచేవారిని కట్టడి చేసేందుకు 'బీసీ అట్రాసిటీ యాక్ట్'ను తీసుకురావాలి. దూదేకుల కులం వారిని బీసీ–డీ నుంచి బీసీ–సీలోకి, సగర ఉప్పర కులస్థులను బీసీ–డీ నుంచి బీసీ–ఏ లోకి, ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి, ఒడ్డెర కులస్థులను బీసీ–ఏ నుంచి షెడ్యూల్ తెగ (ఎస్టీ)లోకి మార్చాలి' అని శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో రాష్ట్ర బీసీ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ఆయా వర్గాల నుంచి వినతులు వెల్లువెత్తాయి. స్థానిక సంస్థల్లో కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాను ఖరారు చేసే అంశంపై బీసీ కమిషన్ ఆయా వర్గాలనుంచి అభిప్రాయాలను సేకరిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కులాలకు 42% రిజర్వేషన్లు కల్పించాలని, ఇంతవరకు రాజకీయ ప్రాతినిధ్యంలేని కులాలకు అవకాశం ఇవ్వాలని, వీరముష్టి పదం తొలగించి ఆ కులం వారికి 'వీరభద్ర'పదాన్ని వాడాలని కమిషన్‌కు విన్నవించుకున్నారు. రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మిలు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, బీసీ కులసంఘాల నాయకుల నుంచి అభిప్రాయాలు సేకరించారు.

ఇది బృహత్తర కార్యక్రమం: గోపిశెట్టి నిరంజన్

తెలంగాణలో స్థానిక సంస్థల వారీగా రిజర్వేషన్ దామాషాను ఖరారు చేసేందుకు ప్రభుత్వం బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. బహిరంగ విచారణలో మొత్తం 235 అభ్యర్థనలు కమిషన్‌కు అందాయని తెలిపారు. హనుమకొండలోని బాలికల హాస్టల్‌లో వసతులు సరిగా లేవని ఫిర్యాదు అందిందని ఆ సమస్యలకు పరిష్కారం చూపుతామని నిరంజన్ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ అమలుపై హైకోర్టు ఏ నిర్ణయం తీసుకున్న గౌరవిస్తామన్నారు. కానీ, ఇప్పటివరకు హైకోర్టు తీసుకున్న నిర్ణయాలు, ఆదేశాలు తమకు అందలేదన్నారు.

మీ విధ్వంసంతో చీకట్లోకి రాష్ట్రం

సీఎం రేవంత్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ కౌంటర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఉదయిస్తున్న సూర్యుడిలా పురోగమిస్తోందంటూ సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో చేసిన పోస్టుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణను పునర్నిర్మించే బదులు రేవంత్‌రెడ్డి విధ్వంసకర పాలనతో రాష్ట్రాన్ని చీకట్లలోకి నెడుతున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ ఉదయించట్లేదని.. కాంగ్రెస్ శుష్క వాగ్దానాలనే నీడల మాటున నిలిచిందని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన అంతులేని నకిలీ హామీల చిట్టా ఈ జన్మకు నెరవేరదని ఎద్దేవా చేశారు. ఒకవేళ ఆరు గ్యారంటీలను నిజంగా అమలు చేశామని రేవంత్ నమ్మితే పాదయాత్ర చేపట్టి ప్రజల నుంచి నిజాలు తెలుసుకోవాలని మరోసారి సూచించారు. ఈ మేరకు శనివారం 'ఎక్స్'ఖాతాలో సీఎం రేవంత్‌ను ఉద్దేశించి బండి సంజయ్ సుదీర్ఘ పోస్ట్ చేశారు. 'రేవంత్‌రెడ్డి గారు... మీరు యావత్ తెలంగాణను మోసగించారు. మీరిచ్చిన గ్యారంటీ కార్డు మాటున షరతులు వర్తిస్తాయనే విషయాన్ని అమాయకులైన తెలంగాణ ప్రజలు గుర్తించలేకపోయారు. 6 గ్యారంటీలను నెరవేర్చడానికి 100 రోజులు, 1,000 రోజులు కాదు కదా.. 10 వేల రోజులైనా సరిపోవు'అని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. హామీల అమలును కాంగ్రెస్ బోగస్‌గా మార్చిందని దుయ్యబట్టారు. '6 గ్యారంటీల అమలుకు నిధుల్లేని మీవద్ద మూసీ ప్రాజెక్టు కోసం రూ. 1.50 లక్షల కోట్లు మాత్రం ఉన్నాయి. మూసీ ప్రాజెక్టును మరో కాళేశ్వరం తరహా ఏటీఎంగా మారుస్తున్నారు'అని బండి సంజయ్ 'ఎక్స్'లో ఆరోపించారు.

ఒవైసీపై ధ్వజం: టీటీడీలో హిందువులు మాత్రమే పనిచేయాలంటున్న ప్రధాని మోదీ సర్కార్ వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులకు చోటు కల్పించాలని బిల్లు రూపొందించడం ఏమిటంటూ ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. మతాన్ని అడ్డు పెట్టుకొని రాజకీయ వ్యాపారం చేస్తున్న ఒవైసీ అసలు రంగు బయటపడిందని మండిపడ్డారు.

కాంగ్రెస్ కూటమి గెలుపుతోనే రాజ్యాంగ పరిరక్షణ

జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: జార్ఖండ్ రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో దేశంలో రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ కూటమి అభ్యర్థుల గెలుపు అనివార్యమని స్టార్ క్యాంపెయినర్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. జార్ఖండ్ రాష్ట్రంలోని రాంఘఢ్ నియోజకవర్గంలో శనివారం ఆయన పర్యటించారు. నియోజకవర్గంలోని దుల్మి, చిత్తార్పూర్, గోలాస్ బ్లాక్‌ల పరిధిలో ఉన్న కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో భాగంగా ఇంటింటి ప్రచారం, బూత్ లెవల్ మీటింగ్స్ ఏర్పాటు, సోషల్ మీడియా ప్రచారం వంటి అంశాలపై స్థానిక బ్లాక్ కాంగ్రెస్ నేతలకు సలహాలు, సూచనలు ఇచ్చారు. రాంఘఢ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మమతా దేవిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరా రు. పౌరులందరికీ అన్ని రంగాల్లోనూ సమానత్వం ఉండాల ని రాజ్యాంగాన్ని రచించుకుని శాసనంగా రూపొందించుకు న్నామని, ఆ లక్ష్యం అందరికీ అందాలంటే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి అభ్యర్థుల గెలుపు కీలకమని వ్యాఖ్యానించారు. సమావేశం అనంతరం కాంగ్రెస్ కూటమి మేనిఫెస్టోపై కేసీ వేణుగోపాల్‌తోపాటు స్థానిక నేతలతో కలసి కసరత్తు చేశారు. ఈ సందర్భంగా స్థానిక నేతలకు ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టితోపాటు ఏఐసీసీ సభ్యుడు సుధాకర్‌రెడ్డి, మైనారిటీ సెల్ అధ్యక్షుడు తారిఖ్ అన్వర్, రాష్ట్ర మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు షాజాద్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

7న సంస్థాగత ఎన్నికలపై వర్క్‌షాప్

ఎన్నికల రిటర్నింగ్ అధికారి యెండల లక్ష్మీనారాయణ



సాక్షి, హైదరాబాద్: ఈనెల 7న సంస్థాగత ఎన్నికల నిర్వహణపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్టు బీజేపీ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ వెల్లడించారు. ఈ వర్క్‌షాప్‌లో కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 8, 10 తేదీల్లో జిల్లాలు, 11 నుంచి 14 వరకు మండలాల్లో ఈ వర్క్‌షాప్‌లు ఉంటాయన్నారు. పోలింగ్ బూత్ స్థాయి నుంచి మొదలు పెట్టి మండల, జిల్లా, రాష్ట్ర ఆ తర్వాత జాతీయ స్థాయి వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలో పార్టీకి సంస్థాగతంగా 38 జిల్లాలు ఉన్నాయని, ఈ జిల్లాల్లో ఎన్నికల నిర్వహణకు ఎన్నికల అధికారులను నియమించినట్టు లక్ష్మీనారాయణ చెప్పారు.

ప్రభుత్వానిది మూర్ఖపు చర్య

- హెచ్‌ఎండీఏ పరిధిలోని జీపీ లేఅవుట్లలో రిజిస్ట్రేషన్ల నిలిపివేతపై కేటీఆర్
- కాంగ్రెస్ ఉచిత ఎల్‌ఆర్‌ఎస్ హామీ ఇచ్చి ఇప్పుడు మోసగిస్తోందంటూ ఆగ్రహం
- సీఎంవి అసంబద్ధ నిర్ణయాలని ధ్వజం.. రిజిస్ట్రేషన్లకు అనుమతివ్వాలని డిమాండ్



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) పరిధిలోని గ్రామ పంచాయతీ లేఅవుట్లలో వెలిసిన వెంచర్లలో రిజిస్ట్రేషన్లను నిలిపివేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు తప్పుబట్టారు. దీన్ని మూర్ఖపు చర్యగా ఆయన అభివర్ణించారు. పాలనానుభవం లేని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఆర్‌ఆర్ ట్యాక్స్ వసూలుకు కుట్ర..: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేద, మధ్య తరగతి ప్రజలను లక్ష్యంగా చేసుకుందని కేటీఆర్ విమర్శించారు. హైడ్రా, మూసీ సుందరీకరణ పేరిట పేదల గూడు కూల్చిన రేవంత్ ప్రభుత్వం.. ఇప్పుడు వారి ఇళ్ల స్థలాలపై 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. హెచ్ఎండీఏ పరిధిలోని జీపీ లేఅవుట్లలో రియల్టర్లు వేసిన వెంచర్లలో ప్లాట్లు కొనుక్కోవడం ప్రజల తప్పా? అని కేటీఆర్ ప్రశ్నించారు.

ఆ హామీ ఏమైంది?: ఎన్నికలకు ముందు భూముల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్)ను ఉచితంగా చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయాన్ని కేటీఆర్ ఆ ప్రకటనలో గుర్తుచేశారు. ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించకుండా వాటినే సమస్యలుగా ప్రభుత్వం చూపుతోందని మండిపడ్డారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే వేలాదిగా గ్రామ పంచాయతీల్లో లేఅవుట్లు వెలిశాయని.. దీంతో భూలావాదేవీల వల్ల ఎన్నో స్థలాలు చేతులు మారాయన్నారు. ప్రజలు కొనుక్కున్న ఆస్తులు చెల్లవని చెప్పడం కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి నిదర్శనమని దుయ్యబట్టారు. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ ఫీజు రద్దు చేసి గ్రామ పంచాయతీ లేఅవుట్లు, వెంచర్లలో రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. లేకుంటే బాధితులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



నూతన వధూవరులతో సీఎం రేవంత్, శ్రీధర్‌బాబు, పొంగులేటి, శశిథరూర్, బోసు రాజు, మహేశ్‌కుమార్ గౌడ్, ఉత్తమ్, రాజనర్సింహ తదితరులు

ఏఐసీసీ కార్యదర్శి శ్రీనివాసన్ కుమార్తె రిసెప్షన్‌కు హాజరైన సీఎం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం సాయంత్రం కేరళ వెళ్లారు. ఏఐసీసీ కార్యదర్శి శ్రీనివాసన్ కుమార్తె వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఇతర మంత్రులు, కాంగ్రెస్ నేతలతో కలిసి ఆయన కొచ్చి వెళ్లారు. సీఎంతో పాటు మంత్రులు దామోదర రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ ఎంఏ ఫహీం తదితరులున్నారు. వివాహ రిసెప్షన్ అనంతరం శనివారం రాత్రి వీరంతా తిరిగి హైదరాబాద్ చేరుకున్నారు.

బీఆర్ఎస్ జాతకాలు నా దగ్గర ఉన్నాయి

మూసీపై ఆ పార్టీ ఆత్మవిమర్శ చేసుకోవాలి: ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: మూసీ ప్రక్షాళన అంశంపై బీఆర్ఎస్ ఆత్మ విమర్శ చేసుకుంటే బాగుంటుందని ఏఐఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ హితవు చెప్పారు. 'బీఆర్ఎస్ జాతకాలు నా దగ్గర ఉన్నాయి, నోరు విప్పితే వాళ్లు ఇబ్బంది పడతారు'అన్నారు. శనివారం దారుస్సలాంలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మూసీప్రక్షాళన కోసం బీఆర్ఎస్ ప్రణాళిక చేయలేదా..ఆ విషయాలన్నీ ఇప్పుడు బయటపెట్టాలా అంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్ విధానాలు స్థిరంగా ఉండాలని సూచించారు. మూసీ పరీవాహక పరిధిలో ఇళ్లుకూల్చకుండా ప్రక్షాళన చేస్తే స్వాగతిస్తామని అసదుద్దీన్ స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమ మద్దతుతోనే బీఆర్ఎస్‌కు జీహెచ్ఎంసీలో ఎక్కువ సీట్లు వచ్చాయని, ఎన్నికల సమయంలో 24 మంది అభ్యర్థులను మార్చి ఉంటే మళ్లీ బీఆర్ఎస్‌యే అధికారంలోకి వచ్చేదని ఒవైసీ అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ నేతలకు అహంకారం ఉండేదని విమర్శించారు.

ప్రభుత్వ భవనాలు కూల్చివేస్తారా?: ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌పరిధిలో ప్రభుత్వ భవనాలు కూడా ఉన్నాయని, వాటిని కూడా కూల్చివేస్తారా అని ఒవైసీ హైడ్రాను ప్రశ్నించారు. నెక్లెస్ రోడ్ కూడా ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తుందని చెప్పారు. కాగా, నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు నష్టం వాటిల్లుతుందని ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. ఎక్కువ మంది సంతానం ఉండాలని చంద్రబాబు, డీఎంకే అంటున్నారని, అదే విషయాన్ని తాను చెప్పి ఉంటే రాద్ధాంతం చేసేవారన్నారు.

వక్ఫ్ కౌన్సిల్‌లో హిందువులా?: తిరుమల బోర్డులో సభ్యులందరూ హిందువులే ఉండాలని నిబంధన ఉన్నప్పుడు వక్ఫ్ బోర్డు నియామకాలలో హిందువులు కూడా ఉండాలని కేంద్రం బిల్లును ఎలా రూపొందిస్తుందని ఒవైసీ ప్రశ్నించారు. వక్ఫ్ కౌన్సిల్‌లోనూ హిందువులకు స్థానం కల్పిస్తూ కేంద్రం బిల్లులు రూపొందించిందని.. అలాంటప్పుడు అందరూ ముస్లిములే ఉండాలని తాము కూడా డిమాండ్ చేయవలసి వస్తుందని ఆయన స్పష్టం చేశారు.

శుభకార్యానికి వెళ్తూ మృత్యువాత

మెదక్ జిల్లాలో బైకును ఢీకొట్టిన ట్రాక్టర్.. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం



ఆంజనేయులు



లావణ్య



సహస్ర



శాన్వి

తూప్రాన్, మనోహరాబాద్ (తూప్రాన్): శుభ కార్యం కోసం బైక్‌పై వెళ్తున్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురిని మృత్యురూపంలో ట్రాక్టర్ బలిగొంది. ఈ దుర్ఘటన శనివారం సాయంత్రం మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పోతారం వద్ద చోటు చేసుకుంది. ప్రాథమిక సమాచారం మేరకు.. మనోహరాబాద్ మండలం పోతారం గ్రామానికి చెందిన మన్నె ఆంజనేయులు (50), తన మరదలు లావణ్య (35) ఆమె పిల్లలు సహస్ర (10), శాన్వి (6) లను బైక్ మీద పోతారం స్టేజీ వద్ద దింపేందుకు బయలుదేరాడు. గ్రామానికి స్టేజీ మధ్య రెండు కిలోమీటర్ల దూరం ఉండగా, మార్గమధ్యలో రోడ్డుపై రైతులు ధాన్యం ఆరబోశారు. ఒకే వరుసలో వెళ్లడానికి దారి ఉండగా బైక్‌ను ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలతో నలుగురూ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనతో ఆగ్రహానికి గురైన గ్రామస్తులు, బంధువులు ఘటనా స్థలం వద్ద ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పి మృతదేహాలను తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు.

మీరిచ్చిన కొలువులేవి?

హామీలపై దేశాన్నీ మోసం చేస్తున్న రేవంత్

- మా నోటిఫికేషన్లను మీ ఘనతగా చెప్పుకొంటారా?
- రేవంత్‌రెడ్డి సర్కారు చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలు
- బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శలు



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల హామీల అమలు విషయంలో రాష్ట్రంతో పాటు దేశ ప్రజలను కూడా సీఎం రేవంత్‌రెడ్డి తప్పుదోవ పట్టిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో 1.61 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినా తప్పుడు ప్రచారం చేస్తున్నారని హరీశ్‌రావు శనివారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తంచేశారు. గత ప్రభుత్వం జారీచేసిన ఉద్యోగ నోటిఫికేషన్లను తమ ఘనతగా చెప్పుకుంటూ 50 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు సీఎం రేవంత్ డబ్బా కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, అందులో కనీసం పది శాతం కూడా భర్తీ చేయలేదని విమర్శించారు.

అటకెక్కిన బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలు

బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు, దళిత బంధు, బీసీ బంధుతో సహా అనేక పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించిందని హరీశ్‌రావు విమర్శించారు. రుణమాఫీ, మహిళలకు రూ.2,500, రూ.4 వేల సామాజిక పెన్షన్, వరికి బోనస్, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం హామీ ఊసే లేదని అన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీలు నెరవేర్చుతామని హామీ ఇచ్చి ఏడాది కావస్తున్నా వాటిలో ఏవీ అమలుచేయలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేతోపాటు తెలంగాణ కాంగ్రెస్ తమ వైఫల్యాలను విజయాలుగా చూపించేందుకు విఫల ప్రయత్నం చేయడం సిగ్గుచేటు అని హరీశ్‌రావు మండిపడ్డారు.

'సాయుధ నిధి'కి సాయమందించండి

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపు



సాక్షి, హైదరాబాద్: దేశం కోసం తమ జీవితాలను ధారపోసిన మాజీ సైనికులు, వారి కుటుంబాలను కంటికిరెప్పలా చూసుకోవాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి పౌరులు, కార్పొరేట్లు అందరూ ముందుకు వచ్చి ఉదారంగా సహకరించాలని పిలుపునిచ్చారు. శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అధ్యక్షతన సాయుధ దళాల పతాక దినోత్సవ నిధి రాష్ట్ర మేనేజింగ్ కమిటీ నాలుగో సమావేశం జరిగింది. ఈ కమిటీకి చైర్మన్ కూడా అయిన గవర్నర్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతి మాజీ సైనికులు, మాజీ సైనికుల వితంతువుల ఆర్థిక ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలన్నారు. వారికి వినూత్న పథకాలను ప్రవేశపెట్టాలని, మాజీ సైనికులందరి రికార్డులను డిజిటలైజేషన్ చేయాలని సూచించారు. పలు పథకాలకు సంబంధించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ప్రాసెస్ చేయడం, నేరుగా లబ్ధిదారులకు బదిలీ చేయడంలో తెలంగాణ దేశంలోనే రోల్ మోడల్‌గా నిలిచిందని గవర్నర్ కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా సహకరించిన దాతలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

5న పెద్ద శేష వాహనంపై మలయప్ప స్వామి దర్శనం



తిరుమల: తిరుమలలో నవంబరు 5న పెద్దశేష వాహనంపై మలయప్ప స్వామి ఊరేగుతారు. నాగుల చవితి పర్వదినం సందర్భంగా 5వ తేదీ రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామివారు పెద్దశేష వాహనంపై ఉభయ దేవేరులతో కలిసి విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు.

శ్రీవారి సేవలో పలువురు ప్రముఖులు

బాలీవుడ్ తారలు హేమమాలిని, ఈషా డియోల్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. తిరుమలలో శనివారం వర్షం కురిసింది. శ్రీవారి దర్శనానంతరం బయటకు వచ్చిన భక్తులు పరుగులు తీస్తూ షెడ్ల కిందకు వెళ్లారు. కొద్ది గంటలపాటు తిరుమలలో దుకాణాలు మూతపడ్డాయి.

ఆ పత్రిక కథనం అవాస్తవం

- మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో దళిత రైతుల ఫిర్యాదు
- నమస్తే తెలంగాణ మేనేజింగ్ ఎడిటర్‌పై కేసు నమోదు

మీర్‌పేట: 'మా భూములు అమ్ముకుంటున్నామంటూ తప్పుడు కథనాలు ప్రచురించడంతో పాటు మా పరువుకు భంగం కలిగించిన దినపత్రిక (నమస్తే తెలంగాణ)పై చర్యలు తీసుకోవాలి' అని రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం నాదర్ గుల్‌కు చెందిన దళిత రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నవంబర్ 1న మీర్‌పేట పీఎస్‌లో ఫిర్యాదు అందజేశారు. సీఐ నాగరాజు కథనం ప్రకారం.. నాదర్‌గుల్‌లోని ప్రభుత్వ సర్వే నంబర్ 92లోని అసైన్డ్ భూమిపై 'బిగ్ బ్రదర్స్.. ల్యాండ్ పూలింగ్ ' శీర్షికతో గత నెల 31వ తేదీన నమస్తే తెలంగాణ దినపత్రికలో కథనం ప్రచురితమైంది. అయితే తమ తండ్రుల పేరున ఉన్న భూమిని డెవలప్‌మెంట్ కోసం ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడానికి అంగీకరించడంతో పాటు ఎకరాకు వెయ్యి గజాల స్థలం, రూ.10 లక్షలకు అగ్రిమెంట్ చేసుకున్నట్లు నకిలీ పత్రాలు సృష్టించి కథనం రాశారన్నారు. ఇందుకోసం ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించారని ఆరోపిస్తూ రైతులు ఫిర్యాదు చేశారని సీఐ తెలిపారు. నమస్తే తెలంగాణలో వచ్చిన కథనంతో తాము అప్రతిష్టపాలయ్యామని రైతు బాలకృష్ణతో పాటు మరో 8 మంది ఫిర్యాదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ మేరకు పత్రిక మేనేజింగ్ ఎడిటర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

నూరు శాతం వర్సిటీల ప్రక్షాళన

నూతన వీసీలతో భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ స్పష్టీకరణ

- వర్సిటీల్లో వ్యవస్థలు దెబ్బతిన్నాయని.. వాటిపై ప్రజల్లో నమ్మకం తగ్గుతోందని వ్యాఖ్య
- వ్యవస్థల పునరుద్ధరణకు ఏం చేయాలో అధ్యయనం చేయాలని దిశానిర్దేశం



వీసీలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను నూరు శాతం ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కొంతకాలంగా యూనివర్సిటీలపై ప్రజల్లో నమ్మకం తగ్గుతోందని.. వాటిల్లోని పలు వ్యవస్థలు దెబ్బతిన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. వర్సిటీల గౌరవాన్ని పెంచాల్సిన బాధ్యత వైస్ చాన్స్‌లర్లపైనే ఉందన్నారు. ఇటీవల నియమితులైన వివిధ యూనివర్సిటీల వీసీలతో సీఎం రేవంత్ శనివారం తన క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ, సామాజిక సమీకరణాల ఆధారంగానే విశ్వవిద్యాలయాలకు వైస్ చాన్స్‌లర్లను ఎంపిక చేశామని.. ఈ ప్రక్రియలో ఎలాంటి ప్రభావితాలు లేవన్నారు. వర్సిటీల్లో దెబ్బతిన్న వ్యవస్థల పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేయాలని వీసీలకు సూచించారు. ప్రస్తుత పరిస్థితులను పరిశీలించి అవసరమైతే కన్సల్టెన్సీలను ఏర్పాటు చేసుకొని అధ్యయనం చేపట్టి నివేదిక రూపొందించాలని దిశానిర్దేశం చేశారు.

స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోండి..

'గతంలో వీసీలను విద్యార్థులు ఏళ్ల తరబడి గుర్తుపెట్టుకొనేవాళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మా ప్రభుత్వం మీకు స్వేచ్ఛ ఇస్తోంది. మంచిపనులు చేసేందుకు సొంతంగా నిర్ణయాలు తీసుకోండి. బాగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురండి. తప్పు జరిగితే మాత్రం ఆశ్చర్యకరమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. వర్సిటీల్లో డ్రగ్స్, గంజాయి విక్రయాలపై దృష్టిపెట్టండి. విద్యార్థులను ఎప్పటికప్పుడు గమనిస్తూ కౌన్సెలింగ్ ఇవ్వండి' అని సీఎం రేవంత్ వీసీలకు సూచించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.

కట్టలు తెగిన దుష్ప్రచారం



ప్రజల్ని తప్పదోవ పట్టించడమే లక్ష్యంగా చంద్రబాబు కుట్ర రాజకీయాలు

చెప్పుకోవడానికి చేసిందేమీ లేక జరగని వాటిని జరిగినట్లు చిత్రీకరణ

డైవర్షన్ పాలిటిక్స్‌లో తనకెవరూ సాటిరారని ఎప్పటికప్పుడు నిరూపించుకుంటున్న వైనం

ప్రభుత్వ అవసరాల కోసం రుషికొండలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో గత ప్రభుత్వం రూ.430 కోట్లతో భవనాలు నిర్మించింది. ఇవి శాశ్వత భవనాలు. రాష్ట్రంలోనే అతి పెద్ద నగరమైన విశాఖలో ప్రభుత్వ పరంగా ఏ విధంగానైనా ఉపయోగించుకోవచ్చు. వీటిని గుడ్లప్పగించి చూస్తూ.. నోరెళ్లబెట్టిన చంద్రబాబు.. గట్టిగా వానొస్తే నీళ్లు కారేలా ఏకంగా రూ.2,500 కోట్లతో అమరావతిలో తాత్కాలిక సచివాలయం, తాత్కాలిక అసెంబ్లీ, తాత్కాలిక హైకోర్టు ఏ లెక్కన నిర్మించారు? ఇప్పుడు ఈ తాత్కాలిక కట్టడాలను కూల్చేసి.. శాశ్వత భవనాల కోసం ఎన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నారు? తన విలాసాల కోసం చేసిన ఖర్చు ఎవరికి తెలియదు? కుట్రలు, కుతంత్రాలు, దుష్ప్రచారాన్ని మాత్రమే నమ్ముకున్న ఈ పెద్దమనిషికి డైవర్షన్ పాలిటిక్స్ వెన్నతో పెట్టిన విద్య. వాటి ద్వారా ఎప్పటికప్పుడు ప్రజల దృష్టి మళ్లించడానికి ఎంతకైనా దిగజారుతానని మరోమారు నిరూపించుకున్నారు.

సాక్షి, అమరావతి : అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా, చెప్పుకోవడానికి చేసింది ఏమీ లేక ప్రజలను తప్పుదోవ పట్టించడానికి సీఎం చంద్రబాబు విష ప్రచారాలనే నమ్ముకున్నారు. జరగని వాటిని జరిగినట్లు, లేని విషయాలను ఉన్నట్లు ఎడతెగని దుష్ప్రచారం చేస్తూ రోజుకో కుట్రకు తెరతీస్తున్నారు. దీపావళి పండుగ సందర్భంగా ఉత్తరాంధ్ర వెళ్లి అక్కడ తన పని మరచిపోయి, రుషికొండలో గత ప్రభుత్వం నిర్మించిన ప్రభుత్వ భవనాల వద్దకు వెళ్లి అవాకులు చెవాకులు పేలారు. గంట సేపు అక్కడ గడిపి వీడియో, ఫొటో షూట్‌లు చేయించడమే కాకుండా నోటికి వచ్చిన అబద్ధాలను కళ్లార్పకుండా చెప్పేశారు. ప్రభుత్వ అవసరాల కోసం టూరిజం శాఖ కట్టిన భవనాలను అప్పటి సీఎం విలాసాల కోసం కట్టారని.. రాజులు, చక్రవర్తులు ఇలాంటివి కట్టించుకుంటారంటూ అడ్డగోలుగా మాట్లాడారు. కమోడ్‌కు రూ.10 లక్షలు ఖర్చు పెట్టారంటూ అబద్ధాలు చెప్పిన చంద్రబాబు.. 2014లో హైదరాబాద్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో నెలల తరబడి కుటుంబంతో ఉండి రూ.30 కోట్ల బిల్లును ప్రభుత్వంతో కట్టించిన విషయాన్ని మరచిపోయారు. ఉండవల్లి, హైదరాబాద్, ఢిల్లీలోని తన క్యాంపు ఆఫీసులకు కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని వృధా చేసిన వ్యక్తి ఇప్పుడు ప్రభుత్వ అవసరాల కోసం భవనాలు కట్టడాన్ని తప్పుగా చిత్రీకరించడం విడ్డూరంగా ఉంది. హైదరాబాద్ మదీనాగూడలోని తన సొంత ఫామ్‌హౌస్‌లో మరమ్మతులకు ప్రభుత్వ ధనాన్ని ఖర్చు చేయించిన చంద్రబాబు.. ఇప్పుడు ప్రభుత్వ కార్యకలాపాల కోసం నిర్మించిన భవనాలపై అడ్డగోలు నిందలు మోపుతూ శుద్ధపూస కబుర్లు చెప్పడాన్ని ఏమనాలి? రుషికొండపై టూరిజం శాఖ రూ.430 కోట్లతో నిర్మించిన భవనాలు ప్రభుత్వ కార్యకలాపాల కోసమేననే విషయాన్ని పక్కదారి పట్టించి వైఎస్ జగన్ కోసం నిర్మించినట్లుగా దాన్ని చిత్రీకరించడం చంద్రబాబు దిగజారుడు రాజకీయానికి ఒక ఉదాహరణ. ఇందులో భూమి చదును చేయడానికే ఎక్కువ మొత్తం ఖర్చయింది. వెలగపూడిలో తాత్కాలిక సచివాలయం, తాత్కాలిక అసెంబ్లీ, తాత్కాలిక హైకోర్టు భవనాల కోసం ఇదే చంద్రబాబు ప్రభుత్వం గతంలో రూ.2,500 కోట్లు ఖర్చు చేసింది. ఇప్పుడు వీటిని కూలగొట్టి శాశ్వత భవనాలు నిర్మించడానికి ఎన్ని వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తారో ఆయనే సెలవివ్వాలి.

రెండేళ్ల క్రితం ప్రమాదంపై అడ్డగోలుతనం

రెండేళ్ల క్రితం వైఎస్ జగన్ తల్లి విజయమ్మ వాహనానికి జరిగిన ప్రమాదాన్ని ఇటీవలి ఎన్నికలకు ముందు జరిగినట్లు ప్రచారం చేస్తూ కుట్ర రాజకీయం మొదలుపెట్టారు. ఎప్పుడో 2022లో విజయమ్మ వాహనం టైర్లు ప్రమాదవశాత్తు పంక్చర్ అయితే, దాన్ని ఇటీవలే జరిగినట్టు.. దాని వెనుక కుట్ర ఉన్నట్లు, జగన్ కావాలని చేయించినట్లు అనుమానాలు కలిగేలా టీడీపీ సోషల్ మీడియా మూడు రోజులుగా వైరల్ చేస్తూ శునకానందం పొందుతోంది. అబద్ధానికి రెక్కలు తొడిగి పబ్బం గడుపుకునే చంద్రబాబుకు, ఆయన పరివారానికి కనీస విచక్షణా జ్ఞానం లేదని, కుట్రతో బురద జల్లడమే తెలుసని ఈ విషయం ద్వారా తేటతెల్లమైంది. అనుకోకుండా జరిగిన ప్రమాదాన్ని రెండేళ్ల తర్వాత తెరపైకి తెచ్చి, దానిపై ఆరోపణలు చేయడం చంద్రబాబు కుట్రలకు పరాకాష్ట.

శ్రీవారి సాక్షిగా అబద్ధాలు



కలియుగ వైకుంఠంగా చెప్పుకునే తిరుమలనే వేదికగా చేసుకుని వేంకటేశ్వరస్వామిని రాజకీయాల్లోకి లాగి చంద్రబాబు అభాసుపాలయ్యారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని, ఇందుకు గత ప్రభుత్వమే కారణమని దారుణమైన అబద్ధాన్ని పదే పదే చెప్పి రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నించారు. వేంకటేశ్వరస్వామి తన కుల దైవం అని చెప్పుకుంటూనే ఆయన్ను రాజకీయంలోకి లాగి చివరికి సుప్రీంకోర్టుతో చీవాట్లు తిన్నారు. నెయ్యిలో ఎటువంటి కల్తీ జరగలేదని తేలడంతో దానిపై అడ్డగోలుగా మాట్లాడిన చంద్రబాబు, ఆయన అనుయాయుల నోళ్లు మూత పడ్డాయి.

ఎప్పటికప్పుడు డైవర్షన్ పాలిటిక్స్

- హనీ ట్రాప్‌ల మాయలేడి, ముంబయికి చెందిన నటి కాదంబరి జత్వాని కేసును తెరపైకి తెచ్చి నలుగురు ఐపీఎస్ అధికారులపై కేసులు బనాయించారు. పారిశ్రామికవేత్తలు, ధనికులను లక్ష్యంగా చేసుకుని హనీ ట్రాప్‌తో బ్లాక్ మెయిల్ చేసే కేసును ఏపీ పోలీసులు చాకచక్యంగా ఛేదిస్తే, దాన్ని కూడా రాజకీయం చేసి ఆమెకు వత్తాసు పలికి రాచమర్యాదలు చేయించారు చంద్రబాబు.
- మదనపల్లి ఆర్డీఓ కార్యాలయంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగితే.. దాన్ని వైఎస్సార్‌సీపీ కావాలని చేసిందంటూ ఆ ఘటనను రాజకీయానికి వాడుకున్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొన్ని ఫైళ్లు తగులబెట్టించడానికి ఇది చేయించారంటూ అడ్డగోలు వాదనకు దిగి కేసులు పెట్టి నానా రభస సృష్టించారు. డీజీపీని హెలికాప్టర్‌లో అక్కడికి పంపించారు. ఆ కేసులో ఇంతవరకు ఏమీ నిరూపించలేకపోయారు.
- ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత పెరుగుతుందన్నప్పుడల్లా ఇలా ఏదో అంశాన్ని తెరపైకి తెచ్చి, వైఎస్ జగన్‌కు వ్యతిరేకంగా చిత్రీకరించి ఆయనపై దుష్ప్రచారం చేయడమే చంద్రబాబు, ఆయన కూటమి పనిగా పెట్టుకుంది. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలకు ఎక్కడ సమాధానం చెప్పాల్సి వస్తుందోననే భయంతో ఇలాంటి దారుణమైన కుట్ర రాజకీయాలు చేస్తూ చంద్రబాబు తన దిగజారుడుతనాన్ని ప్రతిరోజూ బయట పెట్టుకుంటున్నారు. మోసం, నయవంచనతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. వాటినే ఆలంబనగా చేసుకుని తన పరిపాలన కొనసాగిస్తున్నారు. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అటకెక్కించి వాటిని పక్కదారి పట్టించేందుకు దారుణంగా దుష్ప్రచారం చేసి పబ్బం గడుపుకుంటున్నారు.

వరదల్లోనూ రాజకీయం



విజయవాడ వరదలను ఎదుర్కోవడంలో దారుణంగా వైఫల్యం చెంది లక్షలాది మందిని నీటిలో ముంచిన చంద్రబాబు ఆ విషయం నుంచి రాష్ట్ర ప్రజలను ఏమార్చేందుకు ప్రకాశం బ్యారేజీని బోట్లతో గుద్దించి ధ్వంసం చేయడానికి జగన్ పథకం పన్నారంటూ అన్యాయంగా విష ప్రచారం చేశారు. వరదలో కొట్టుకువచ్చిన నాలుగు బోట్లు ప్రకాశం బ్యారేజీ గేట్లకు అడ్డం పడితే, దాన్ని రాజకీయం చేసి వైఎస్సార్‌సీపీయే కావాలని బోట్లతో గుద్దించిందని, దీని వెనుక జగన్ ఉన్నారని చెబుతూ కేసులు పెట్టిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. రాజకీయ చరిత్రలో ఇంతటి దగుల్బాజీ రాజకీయం చంద్రబాబు తప్ప వేరెవరూ చేయలేరని ఆ కేసు ద్వారా నిరూపించుకున్నారు. వాస్తవానికి వరద నీటిని నగరంలోకి మళ్లించిందే చంద్రబాబు. ఆ పడవలన్నీ టీడీపీ వాళ్లవే.

వైద్య కళాశాలలకు అనుబంధంగా నర్సింగ్ కాలేజీలు

- ప్రవేశాల ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలి
- మంత్రి దామోదర రాజనర్సింహ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వైద్య కళాశాలలకు అనుబంధంగా నర్సింగ్ కాలేజీలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన 15 మెడికల్ కాలేజీలకు అనుబంధంగా నర్సింగ్ కాలేజీలను కూడా ఏర్పాటు చేశామని, వీటిలో ప్రవేశాల ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోందన్నారు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు మౌలిక వసతుల కల్పన కోసం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సూచించారు. నర్సింగ్ కాలేజీల్లో అడ్మిషన్లు, వసతుల కల్పనపై శనివారం రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కొత్తగా జనగాం, భూపాలపల్లి, కరీంనగర్, కొడంగల్, ఆందోల్, ఆసిఫాబాద్, మెదక్, కుత్బుల్లాపూర్, ములుగు, నారాయణపేట, నిర్మల్, రామగుండం, మహేశ్వరం, నర్సంపేట, యాదాద్రిలలో ఏర్పాటు చేసిన నర్సింగ్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. అడ్మిషన్లు పూర్తయిన వెంటనే తరగతులు ప్రారంభించాలని, ప్రవేశాలు పొందిన విద్యార్థులకు అన్నిరకాల వసతులు కల్పించాలని పేర్కొన్నారు.

రుషికొండ టూరిజం భవనాలు అద్భుతం

స్వయంగా పరిశీలించి కితాబిచ్చిన సీఎం చంద్రబాబు

సాక్షి, విశాఖపట్నం: విశాఖలో రుషికొండపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పర్యాటక శాఖ నిర్మించిన భవనాలు అద్భుతంగా ఉన్నాయని సీఎం చంద్రబాబునాయుడు ప్రశంసించారు. ఆయన శనివారం సాయంత్రం రుషికొండపై నిర్మించిన భవనాల్ని మంత్రులతో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కొండ చరియలు విరిగి పడకుండా జపాన్ సాంకేతికతను వినియోగించి, నాలుగు బ్లాక్‌లు అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించారని కితాబిచ్చారు. వీటిని చూస్తే మైండ్ బ్లో అయిందన్నారు. ఎన్నో దేశాల్లో ప్యాలెస్‌లు చూశానని, ఇలాంటి కట్టడాలు చూడలేదని తెలిపారు. రాష్ట్రపతి భవన్‌కంటే అద్భుతంగా కట్టారని, కారిడార్‌ని చూస్తే.. అమెరికాలోని వైట్‌హౌస్‌లో కూడా ఇలా ఉండదని అన్నారు. ప్రజాస్వామ్యంలో కూడా ఇలాంటివి కడతారని ఊహించలేదన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, హైకోర్టుకు, కేంద్ర ప్రభుత్వానికి అబద్ధాలు చెప్పి, అధికారాన్ని అడ్డం పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం దీన్ని నిర్మించిందని అన్నారు. వీటి గురించి బయటకు చెప్పాలని మీడియా ప్రయత్నించినా అనుమతించలేదని, ప్రతిపక్ష నేతల్ని రానివ్వలేదని, తనను, పవన్‌ను కూడా రానివ్వలేదని చెప్పారు.

మన ముత్యానికి మెరుపులు

▶ మొదటి పేజీ తరువాయి

ట్యాగింగ్ జాబితాలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కనీసం 30 ప్రత్యేక ఉత్పత్తులకు జీఐ ట్యాగింగ్ దక్కేలా చూడాలని పరిశ్రమల శాఖ నిర్ణయించింది. హైదరాబాద్ ముత్యాలు, భద్రాచలం కళంకారీ, వరంగల్ చపాటా మిర్చీకి గుర్తింపు ఇవ్వాలని దరఖాస్తు చేసింది. వరంగల్ చపాటా మిర్చీ తరహాలోనే ఖమ్మం మిర్చికి కూడా జీఐ ట్యాగింగ్ ఇవ్వాలనే డిమాండ్ వస్తోంది. ఈ నేపథ్యంలో కంట్రోలర్ జనరల్ ఆఫ్ పేటెంట్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి మరిన్ని వివరాలు కోరింది. తెలంగాణకు చెందిన ప్రత్యేక ఉత్పత్తుల జాబితాను సిద్ధం చేసే ప్రక్రియ పురోగతిలో ఉన్నట్లు జీఐ టాగింగ్ నోడల్ అధికారి శ్రీహరిరెడ్డి 'సాక్షి'కి తెలిపారు.

- ఇప్పటివరకు తెలంగాణకు చెందిన 17 ప్రత్యేక ఉత్పత్తులకు జీఐ ట్యాగింగ్ లభించింది. పోచంపల్లి ఇక్కత్, కరీంనగర్ వెండి ఫిలిగ్రీ, నిర్మల్ కొయ్య బొమ్మలు, నిర్మల్ పెయింటింగ్స్, నిర్మల్ ఫర్నిచర్, గద్వాల చీరలు, హైదరాబాద్ హలీమ్, చేర్యాల పెయింటింగ్స్, పెంబర్తి ఇత్తడి కళాకృతులు, సిద్దిపేట గొల్లభామ చీరలు, బంగినపల్లి మామిడి, ఆదిలాబాద్ డోక్రా, వరంగల్ దర్రీస్, తేలియా రుమాల్, లక్క గాజులు, నారాయణపేట చేనేత చీరలు, తాండూరు ఎర్ర కందులకు జీఐ గుర్తింపు లభించింది.
- జీఐ చట్టం 1999 ప్రకారం భౌగోళిక ప్రత్యేకత, నాణ్యత, ప్రాముఖ్యత తదితరాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హత కలిగిన వాటికి జీఐ గుర్తింపు ఇస్తారు. వారసత్వ, సాంస్కృతిక సంపదను కాపాడటం, ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పనను ప్రోత్సహించడం, ఉత్పత్తుల నాణ్యత, ప్రత్యేకతను పరిరక్షించడం, ఉత్పత్తులను నకలు కొట్టకుండా నిరోధించడం, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉత్పత్తులకు ప్రాచుర్యం కల్పించడం జీఐ ట్యాగింగ్ లక్ష్యం.

పత్తి తేమ శాతంపై సడలింపులు

- కొనుగోలు కేంద్రాల్లో సీసీఐ అధికారులు అందుబాటులో ఉండాలి
- అధికారులకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల సూచన

సాక్షి, హైదరాబాద్: పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎక్కువసేపు వేచి ఉండాల్సిన అవసరం లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, ప్రతి కొనుగోలు కేంద్రంలో సీసీఐ అధికారులు అందుబాటులో ఉండాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. శనివారం సచివాలయంలో పత్తి కొనుగోళ్లపై మార్కెటింగ్ డైరెక్టర్ ఉదయ్‌కుమార్, సీసీఐ జీఎం అర్జున్ దావే, అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అన్ని పత్తి కొనుగోలు కేంద్రాలు ఈనెల నాలుగు వరకు ప్రారంభించి, కొనుగోళ్లు చేయాలని సీసీఐ అధికారులను ఆదేశించారు. అలాగే తేమ శాతంపై కూడా సడలింపులు ఇవ్వాలని కోరారు. తద్వారా రైతులు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పొందే అవకాశం ఉంటుందన్నారు. సీసీఐ ప్రమాణాలకు అనుగుణంగా తేమశాతం 8 శాతం నుంచి 12 శాతం మధ్యలో ఉండేవిధంగా పంటను మార్కెట్‌కు తీసుకొచ్చేలా రైతులకు సూచించాలని మార్కెటింగ్ అధికారులకు సూచించారు. వాట్సాప్ (8897281111) ద్వారా వచ్చిన రైతుల ఫిర్యాదులు రెండు పనిదినాల్లో పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి హెడ్ ఆఫీస్, జిల్లా కార్యాలయాలలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని సూచించారు.

వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహించాలి

నూతన ఏఓల శిక్షణ కార్యక్రమంలో మంత్రి తుమ్మల



శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: వాణిజ్య పంటల సాగువైపు రైతాంగాన్ని ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. ప్రధానంగా పంటల మార్పిడిపైన విస్తృత అవగాహన కల్పించాలని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా నియమితులైన వ్యవసాయ అధికారులకు శనివారం మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి తుమ్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయరంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, రానున్న ఐదేళ్లలో దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలబెట్టాలనే సంకల్పంతో ప్రభుత్వం వ్యూహాత్మకంగా పనిచేస్తోందని అన్నారు. ప్రభుత్వ సంకల్పంలో వ్యవసాయాధికారులంతా భాగస్వామ్యం కావాలన్నారు. సాంకేతికంగా వస్తున్న మార్పులను, పద్ధతులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అప్‌డేట్ కావాలన్నారు. నూతన విషయాలు తెలుసుకునే విధంగా వ్యవసాయ శాఖ అధికారులకు క్రమం తప్పకుండా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సంచాలకుడు గోపి, కోర్సు కోఆర్డినేటర్ ఉషారాణి, ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ డీజీ శశాంక్ గోయల్ తదితరులు పాల్గొన్నారు. కొత్తగా నియమితులైన అధికారులు ముఖ్యమంత్రి సహాయనిధి కోసం రూ.51 వేల చెక్కును మంత్రి తుమ్మలకు అందచేశారు.



నాయందు విశ్వాసముంచు ప్రతివాడు చీకటిలో నిలిచి యుండకుండునట్లు నేను ఈ లోకమునకు వెలుగుగా వచ్చియున్నాను.
– క్రైస్తవ ధర్మం

సిగ్గేస్తున్నది బాబూ!

జనతంత్రం



వర్ధెల్లి మురళి

అది మహారాజాధిరాజ రాజమార్తాండ రాజగండభేరుండ చక్రవర్తులు నివసించదగిన మహాప్రాసాదమట! ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్, హైదరాబాద్‌లోని ఫలక్‌నుమా ప్యాలెస్‌లు దాని ముందు దిగదుడుపట! అంతోటి మహత్తరమైన ప్యాలెస్‌ను మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన నివాసం కోసం నిర్మించుకున్నారట! సామెతలు ఊరికే పుట్టవు. వినేవారు వెర్రివాళ్లయితే చెప్పేవారు చంద్రబాబు అనే నానుడి ఊరికే రాలేదు. చంద్రబాబు ఎప్పుడూ అబద్ధాలే చెబుతారు. ఎందుకంటే నిజం చెబితే ఆయన తల వెయ్యి వక్కలవుతుందనే ముని శాపం ఉన్నదని వైఎస్సార్ విమర్శిస్తుండేవారు. క్లాస్ ఆఫ్ సెవెంటీ ఎయిట్ ('78) బ్యాచ్‌మేట్స్ కదా! పూర్తి అవగాహనతోనే మాట్లాడి ఉంటారు.రిషికొండలో గత ప్రభుత్వం హయాంలో టూరిజం శాఖ నిర్మించిన భవనాలను శనివారం నాడు చంద్రబాబు సందర్శించారు. 'ప్రజాస్వామ్యంలో కూడా ఇటువంటి కట్టడాలుంటాయా!' అంటూ బోలెడంత ఆశ్చర్యాన్ని మీడియా ముందు ఆయన గుమ్మరించారు. ఆ నిర్మాణాలను చూసి దిగ్భ్రాంతికి గురయ్యామని కూడా ఆయన చెప్పారు. ఆయనే చెప్పిన లెక్క ప్రకారం ఆ నిర్మాణాలకయిన ఖర్చు రూ.430 కోట్లు. ఈ భవనాల నిర్మాణాని కంటే ఏడెనిమిదేళ్ల ముందు అమరావతిలో చంద్రబాబు కొన్ని 'తాత్కాలిక' భవనాలను నిర్మించారు. అందులో తాత్కాలిక సచివాలయానికే సుమారు వెయ్యి కోట్లు ఖర్చయింది. రిషికొండ నిర్మాణాల కంటే రెండున్నర రెట్లు ఎక్కువ ఖర్చు. ఈ లెక్కన ఆ తాత్కాలిక భవనం అంబర్ ప్యాలెసో, మైసూర్ ప్యాలెసో అయ్యుండాలి.

మరి వెయ్యి కోట్ల తాత్కాలిక ప్యాలెస్‌ను చూసినప్పుడు ఎందుకని దిగ్భ్రాంతి కలుగలేదు? నిర్మాణ సంస్థవారు దిగ్భ్రాంతి కలిగించే హంగూ ఆర్భాటాలను ఇక్కడి నుంచి వేరేచోటుకు తరలించి లెక్క తాత్కాలికంలో రాసేశారా? ఆ లెక్కతో ఏ జూబిలీ హిల్స్ ప్యాలెస్‌కో నగిషీలు చెక్కారా? ఎందుకని ఆ వెయ్యి కోట్ల తాత్కాలిక భవనం ఏపీ ముఖ్యమంత్రిని నివ్వెరపాటుకు గురి చేయలేకపోయింది? భవనం లోపలికి కూడా వానచినుకులు ప్రవేశించగలిగే వర్ష పారదర్శకత మినహా మరే ప్రత్యేకతా ఈ తాత్కాలిక సచివాలయంలో ప్రజలకు కనిపించలేదు.

ముఖ్యమంత్రికి మనస్తాపం కలిగించిన మరో అంశం పర్యావరణ విధ్వంసమట! రుషి పుంగవులు తపస్సు చేసిన రుషికొండను ధ్వంసం చేసి జగన్ సర్కార్ ప్యాలెస్‌ను కట్టిందట! అసలు రుషికొండకు గుండుకొట్టి పర్యాటకం కోసం 'హరిత రిసార్ట్స్' నిర్మించిందే టీడీపీ సర్కార్. పాతబడిన ఆ భవనాలను తొలగించి వాటి స్థానంలో ఈ కొత్త భవనాలను పర్యాటక శాఖ ఆధ్వర్యంలోనే జగన్ సర్కార్ నిర్మించింది. ఈ భవనాలు తాత్కాలికం కాదు. శాశ్వత ప్రభుత్వ భవనాలు. అమరావతిలో ఐకానిక్ భవనాలు నిర్మించాలని చంద్రబాబు పదేపదే చెబుతుంటారు. అదిగో అటువంటి ఐకానిక్ భవనాన్నే విశాఖలో జగన్ సర్కార్ నిర్మించింది. అమరావతికి లేని హంగు విశాఖకు ఎందుకని ఆయన భావిస్తున్నారేమో!

అలవి కాని హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చారు. ఐదు నెలలు గడిచిపోయాయి. 'హామీల అమలు ఇంకెప్పుడ'ని పబ్లిక్ వాయిస్ ప్రశ్నించడం మొదలైంది. ఈ వాయిస్ వినిపించగూడదు. అందు కోసం ఇంకెక్కడో ఓ కృత్రిమ వివాదం చిటపటలాడాలి. డైవర్షన్ స్కీమ్ పాహిమాం! అప్పుడెప్పుడో రెండేళ్ల కిందట వైఎస్ విజయమ్మ వాహనానికి జరిగిన ప్రమాదం ఇప్పుడెందుకు వార్తల్లోకి వచ్చింది? తాయెత్తు మహిమ. షర్మిల ఆస్తుల వివాదం ఎందుకొచ్చింది? తిరుపతి లడ్డూలో కల్తీ ఆరోపణలు ఎందుకొచ్చాయి? కృష్ణా వరదల్లో బోట్ల వివాదం ఎందుకు తెరపైకి తెచ్చారు? ఇలాంటివెన్నో తాయెత్తులు, ఎత్తులు ఈ ఐదు మాసాల్లో చూడవలసి వచ్చింది. టాపిక్ డైవర్షనే ఆ తాయెత్తు మంత్రం.



పాత నిర్మాణాల స్థానంలో కొత్తగా ఏయే భవనాలను నిర్మిస్తున్నారో, ఎందుకోసం నిర్మిస్తున్నారో తెలియజేస్తూ 2021లోనే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖకు వివరాలు అందజేసింది. కానీ, తెలుగుదేశం, దాని మిత్రపక్షాలు మాత్రం జగన్‌మోహన్‌రెడ్డి నివసించడం కోసమే ప్రభుత్వ భవనాన్ని నిర్మిస్తున్నారని ప్రచారం మొదలుపెట్టాయి. ప్రభుత్వ స్థలంలో, ప్రభుత్వ ధనంతో సొంత భవనాన్ని ఎవరైనా ఎట్లా నిర్మించుకుంటారు? కనీస ఇంగిత జ్ఞానం కదా! కానీ, గోబెల్స్ దుష్ప్రచారాలకు ఇంగితంతో పనిలేదు. అవసరార్థం ఏ ప్రచారమైనా చేస్తారు. ఇప్పుడు మళ్లీ ఓ కొత్త అవసరం వచ్చిపడింది. కనుక చంద్రబాబు పనిగట్టుకొని అదే దుష్ప్రచారానికి రంగురంగుల రెక్కలు తొడిగి జనం మీదకు వదిలారు.

అలవి కాని హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చారు. ఐదు నెలలు గడిచిపోయాయి. 'హామీల అమలు ఇంకెప్పుడ'ని పబ్లిక్ వాయిస్ ప్రశ్నించడం మొదలైంది. ఈ వాయిస్ వినిపించగూడదు. అందుకోసం ఇంకెక్కడో ఓ కృత్రిమ వివాదం చిటపటలాడాలి. డైవర్షన్ స్కీమ్ పాహిమాం! అప్పుడెప్పుడో రెండేళ్ల కిందట వైఎస్ విజయమ్మ వాహనానికి జరిగిన ప్రమాదం ఇప్పుడెందుకు వార్తల్లోకి వచ్చింది? తాయెత్తు మహిమ. షర్మిల ఆస్తుల వివాదం ఎందుకొచ్చింది? తిరుపతి లడ్డూలో కల్తీ ఆరోపణలు ఎందుకొచ్చాయి? కృష్ణా వరదల్లో బోట్ల వివాదం ఎందుకు తెరపైకి తెచ్చారు? ఇలాంటివెన్నో తాయెత్తులు, ఎత్తులు ఈ ఐదు మాసాల్లో చూడవలసి వచ్చింది. టాపిక్ డైవర్షనే ఆ తాయెత్తు మంత్రం.

పరిపాలన వైఫల్యాలనూ, వాగ్దాన భంగాలనూ ఈ ఎత్తులూ, తాయెత్తులూ ఎంతకాలం కప్పి ఉంచగలవు? ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇంత దారుణమైన శాంతిభద్రతల పరిస్థితి ఎన్నడూ లేదన్న మాట జనం నోట వినబడుతున్నది. వాగ్దానాలు అటక మీద పడుకున్నాయి. నాణ్యమైన విద్యకు, వైద్యానికి పేద వర్గాలను దూరం చేశారు. మహిళా సాధికారత పథకాలను చాపచుట్టేశారు. ఇప్పుడు తాజాగా ప్రతిష్ఠాత్మక పోలవరం ప్రాజెక్టును బరాజ్ స్థాయికి కుదించాలన్న కేంద్ర ఆదేశాలకు డూడూ బసవన్నలా తలూపి వచ్చారు. ఫలితంగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి సుదూర స్వప్నంగా మిగిలిపోనున్నది. విశాఖ ఉక్కు భవిష్యత్తు దినదిన గండంగా మార్చేస్తున్న కేంద్రం ముందు జోహుకుం అంటున్నారు. అవమాన గాయాలతో ఉత్తరాంధ్ర ప్రజల్లో సెగ రగులుతున్నది. అందుకే విశాఖలో ఈ సరికొత్త డైవర్షన్ తాయెత్తు ప్రయోగం. వెయ్యికోట్లు ఖర్చు పెట్టి నీళ్లుకారే తాత్కాలిక భవనాన్ని నిర్మించిన వ్యక్తి 430 కోట్ల ఖర్చుతో ఐకానిక్ కట్టడాన్ని కడితే ఔరా అని ముక్కున వేలేసుకోవడాన్ని చూసి సిగ్గేస్తున్నది బాబూ! ఏపీలో ముఖ్యమంత్రిగా ఉంటూ హైదరాబాద్ సెవెన్ స్టార్ హోటల్‌లో కొద్దిరోజులు సకుటుంబ సపరివారంగా గడపడానికి 30 కోట్ల ప్రజాధనాన్ని ఖర్చుపెట్టిన వ్యక్తి, క్యాంపు కార్యాలయాలకు, వాటి సెక్యూరిటీ ఏర్పాట్లకూ 126 కోట్లు ఖర్చు చేసిన నాయకుని నోట వినిపించిన మాట – రిషికొండలో బాత్ టబ్‌లకూ, కమోడ్‌లకూ, ఫ్యాన్‌లకూ లక్షలు ఖర్చు చేశారని! చచ్చేంత సిగ్గేస్తున్నది బాబూ!

vardhelli1959@gmail.com

చరిత్రలో సువర్ణాధ్యాయం

కామెంట్



కరణ్ థాపర్

రోమ్‌కు, ఆ తరువాత మధ్యధరా, యూరప్‌కు గ్రీస్ ఎలాంటిదో... దక్షిణాసియా, మధ్యఆసియా, ఆ మాటకొస్తే చైనాకూ భారత్ అలాంటిదని అంటారు విలియం డార్లింపిల్. క్రీ.పూ. 3 నుంచి క్రీ.శ. 12, 13 శతాబ్దాల కాలం ఇండియాలో సువర్ణాధ్యాయం అని చెబుతారు తన తాజా పుస్తకంలో. భారతీయ గణిత, ఖగోళ శాస్త్ర భావనలు అరబ్ దేశాలకు, అక్కడి నుంచి యూరప్‌కు వ్యాప్తి చెందిన వైనం గురించి రాశారు. ప్రాచీన భారతదేశం విశ్వగురు అని, 12వ శతాబ్దంలో ముస్లిం పాలకుల రాకతో ఆ బంగారు కాలం అంతరించడం మొదలైందని వాదించే హిందుత్వవాదులకు ఈ పుస్తకం మద్దతుగా నిలుస్తుందన్న విమర్శలను డార్లింపిల్ కొట్టేస్తారు. "అది యాదృచ్ఛికం" అంటారు.


విలియం డార్లింపిల్ తాజా పుస్తకం భారతీయ చదువరులకు బాగా నచ్చుతుందనుకుంటున్నాను. ఎందుకంటే... మన లాంటి వాళ్లు చాలాకాలంగా నమ్ముతున్న విషయాన్ని ఆయన మరోసారి రూఢి చేశారు. అయితే అదేమిటన్నది ఆయన మాటల్లో వినడమే మేలు. డార్లింపిల్ రాసిన పుస్తకం క్రీస్తు పూర్వం మూడవ శతాబ్దం నుంచి క్రీస్తు శకం 12 – 13 శతాబ్దాల మధ్య కాలం నాటి పరిణామాలకు సంబంధించినది. ఈ కాలానికి సంబంధించి ఆయన ఏమంటారంటే... "రోమ్‌కు, ఆ తరువాత మధ్యధరా, యూరప్‌కు గ్రీస్ ఎలాంటిదో... దక్షిణాసియా, మధ్య ఆసియా, ఆ మాటకొస్తే చైనాకూ భారత్ అలాంటిది" అని!


ప్రాచీన భారతదేశం ప్రపంచంలో తీసుకొచ్చిన మార్పుల గురించి డార్లింపిల్ 'ద గోల్డెన్ రోడ్: హౌ ఏన్షియంట్ ఇండియా ట్రాన్స్‌ఫార్మ్‌డ్ ద వరల్డ్' పేరుతో రాసిన పుస్తకంలో అక్షరబద్ధం చేశారు. భారతీయుల చెవులకు ఇంపైన ఇంకో మాట కూడా ఇందులో ఉంది. ఇది చైనాతో భారత్ పోలికకు సంబంధించినది. చైనా తనను తాను ఈ ప్రపంచానికి కేంద్రంగా చెప్పుకుంటూ ఉంటుంది. కానీ ఇక్కడి నుంచి పాశ్చాత్య దేశాలకు ప్రత్యక్ష వ్యాపారం ఉన్న ఆనవాళ్లేమీ లేవంటారు ఆయన. ఆ కాలంలో "ఒకరి గురించి మరొకరికి చూచాయగా మాత్రమే తెలుసు" అని ఆయన యూరప్, చైనాల గురించి నాతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు.

మరోవైపు భారత్, రోమన్ సామ్రాజ్యాల మధ్య వాణిజ్య విస్తృతి చాలా ఎక్కువ. భారత్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై వసూలు చేసే సుంకం రోమన్ సామ్రాజ్య ఖజానాలో మూడో వంతు వరకూ ఉండేది. ఇంకో రుజువు ఏమిటంటే... భారతీయ సంగ్రహాలయాల్లో రోమ్ సరిహద్దుల్లోని దేశాల్లోనూ లేనన్ని రోమన్ నాణేలు ఉండటం. ఇది భారత్– చైనాల మధ్య శత్రుత్వాన్ని కొత్త రూపంలో రాజేసినట్టుగా లేదూ?

ఇవన్నీ డార్లింపిల్ పుస్తకంలో మూడు రకాల కథనాల్లో కనిపిస్తాయి. చైనా, మధ్యాసియాలకు ఆపై సైబీరియా, మంగోలియాల వరకూ విస్తరించిన బౌద్ధం తాలూకూ కథనం ఒకటైతే... భారతీయ గణిత, ఖగోళ శాస్త్ర భావనలు అరబ్ దేశాలకు, అక్కడి నుంచి యూరప్‌కు వ్యాప్తి చెందిన వైనం రెండో కథనం. హిందూయిజం, సంస్కృతాలు దక్షిణాసియాలో కంబోడియా, లావోస్, జావాల వరకూ వ్యాపించిన కథనం చివరిది. బాగ్దాద్ మంత్రుల మొదలుకొని ఇటలీ గణిత శాస్త్రవేత్తల వరకూ రకరకాల పాత్రల ద్వారా ఈ కథనాలు నడుస్తాయి. టొలెడో మతాధికారి, చైనాలోని ఏకైక మహిళ సామ్రాజ్ఞి, కంబోడియాలోని అంగ్‌కోర్‌వాట్, జావాలోని బోరోబుడుర్, బిహార్‌లోని నలందాల వెనుక దాగి ఉన్న ఎన్నో కథలను వివరిస్తుందీ పుస్తకం.

టొలెడో మతాధికారి 1068లో ప్రపంచంలోని మేధా చరిత్ర గురించి రాస్తూ... అది భారత కాలమని వర్ణించాడు.





విలియం డార్లింపిల్

'విలియం ద కాంకరర్' తొలిసారిగా బ్రిటిష్ గడ్డపై అడుగుపెట్టిన ఈ కాలంలోనే రాసిన ఈ చరిత్రలో భారత్ తన వరాలకు పేరొందిందని రాశాడు. "శతాబ్దాలుగా విజ్ఞానానికి సంబంధించిన అన్ని శాఖల్లో భారతీయుల సామర్థ్యాన్ని రాజులు అందరూ గుర్తించారు. జ్ఞానవంతులు వాళ్లు. జ్యామితి, అంకగణితాల్లో ఎంతో పురోగతి సాధించారు. వైద్యం విషయంలో మానవులందరి కంటే ముందున్నారు" అని కీర్తించాడు.

ఈ పుస్తకం ద్వారా నాకు మూడు విషయాలు స్పష్టమయ్యాయి. పుస్తక శీర్షికలోని బంగారు దారి నేల మార్గం కాదు. సముద్రాల పైది. శక్తిమంతమైన వానాకాలపు గాలులు భారతీయ వర్తకులను పశ్చిమాన అరేబియాకు, తూర్పున సుమత్రా, జావా వరకు చేరేలా చేశాయి.

దక్షిణాసియాకు హిందూయిజం, సంస్కృత సంబంధిత సంస్కృతి విస్తరించేందుకు యుద్ధాలు కారణం కాదు. ఇందులో బ్రాహ్మణ మిషనరీలు ముందుంటే... తరువాతి కాలంలో వ్యాపారులు వ్యాప్తి చేశారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... భారత్‌లోని అన్యాయ కుల వ్యవస్థ ఇక్కడకు విస్తరించకపోవడం. దురదృష్టం కొద్దీ డార్లింపిల్ ఈ విషయంపై ఎక్కువగా వివరించలేదు.

అన్నింటికంటే ఆసక్తికరమైన అంశం, ఇది మనం ఆశించేది అయినప్పటికీ చారిత్రక వాస్తవం కాకపోవచ్చు... సోర్‌బోన్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ వంటి ప్రఖ్యాత విశ్వవిద్యాలయాన్నీ నలందా విశ్వవిద్యాలయ స్ఫూర్తితో ఏర్పాటు చేశారని అనిపిస్తుంది.

చివరగా... ప్రాచీన భారతదేశం విశ్వగురు అని, 12వ శతాబ్దంలో ముస్లిం పాలకుల రాకతో ఆ బంగారు కాలం అంతరించడం మొదలైందని వాదించే హిందుత్వవాదులకు ఈ పుస్తకం మద్దతుగా నిలుస్తుందని కొంతమంది విమర్శకులు ఎత్తిచూపుతున్నారు. డార్లింపిల్ రెండింటికీ సంబంధమే లేదని స్పష్టం చేస్తారు. "అది యాదృచ్ఛికం, అసంగతం." ఆయన పుస్తకంలో చెప్పే ఇంకా ఆసక్తికరమైన సంగతులు చాలానే ఉన్నాయి. వాటిని మీ కోసమే వదిలేస్తాను.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సల్మాన్ ఖాన్ (బాలీవుడ్ స్టార్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

తప్పులు మానవ సహజం అయినప్పుడు శిక్షలు అమానుషంగా ఎందుకు ఉండాలి?!

చట్టాల గురించి, బిష్ణోయ్ లారెన్స్ గ్యాంగ్ గురించీ కాదు నా ఆలోచన. శిక్షను విధిస్తున్నట్లు తెలియపరచకుండానే మూతి బిగింపుల మౌనంతో యావజ్జీవ దూరాన్ని పాటిస్తుండే సొంత మనుషుల గురించి. 'నా' అనుకున్నా, నా వాళ్లు కాకుండా పోయిన వాళ్ల గురించి.

చట్టం విధించే శిక్ష నిర్దాక్షిణ్యమైనదిగా కనిపించవచ్చు. కానీ, ఏ రూల్ బుక్కూ లేకుండా మనిషికి మనిషి విధించే శిక్ష అన్యాయమైనది. న్యాయం లేకపోవటం కన్నా దయ లేకపోవటం ఏమంత చెడ్డ విషయం?!



శిక్షల విధింపులో చట్టానికి ఒక చక్కదనం ఉంటుంది. ఒక సక్రమం ఉంటుంది. చింపిరి జుట్టుకు దువ్వెన, దారిలో పెట్టే దండన... చట్టం.

కారును ఢీకొట్టించు. జింకను వేటాడు. ఆయుధాలు కలిగి ఉండు. 26/11 పై కామెంట్లు చెయ్యి. యాకూబ్ మెమన్ మీద ట్వీట్‌లు పెట్టు. దరిద్రం నీ నెత్తి మీద ఉండి ఆఖరికి ఐశ్వర్యారాయ్ పైన కూడా చెయ్యి చేస్కో. నువ్వెన్ని చేసినా... చట్టం వెంటనే నిన్ను దూలానికి వేలాడదీయదు. శూలాలతో పొడిపించదు. మొదట విచారణ జరుపుతుంది. వాదనలు వింటుంది. వాయిదాలు వేస్తుంది. తీర్పును రిజర్వు చేస్తుంది. ఆ తర్వాతే నువ్వు దోషివో, నిర్దోషివో తేలుస్తుంది. దోషివైతే జైలుకు పంపుతుంది. కావాలంటే బెయిలిస్తుంది.

మనుషులు విధించే శిక్షలో ఇవేవీ ఉండవు. దువ్వెనా, దండనా అసలే ఉండవు. దూరంగా జరిగిపోతారంతే. "ఎలా ఉన్నావ్?" అని అడిగేందుకైనా దగ్గరకు రారు. "భద్రంగా ఉండు.." అని చెప్పేందుకైనా దూరాన్ని తగ్గించుకోరు. ఎంత అమానుషం!!

"నువ్వు పెంచుకున్న దూరమే ఇది సల్మాన్.."

ఎంత తేలిగ్గా అనేస్తారు!

బంధాలను కదా నేను పెంచుకున్నాను. దూరాలనా?! స్నేహబంధం, ప్రేమబంధం, జీవితబంధం... అన్ని బంధాలనూ తెంచుకుని వెళ్లింది ఎవరు?!

"కానీ సల్మాన్, నువ్వొట్టి పొసెసివ్. గట్టిగా పట్టేసుకుంటావ్. ఎటూ కదలనివ్వవు. ఎటూ చూడనివ్వవు. ఏదీ మాట్లాడనివ్వవు. ఏమీ చెప్పనివ్వవు. దాన్నేమంటారు మరి? దూరం పెరగటమే కదా! నువ్వు పెంచుకున్న దూరం.." అంటారు!

కేరింగ్‌ను పొసెసివ్ అని ఎందుకు అనుకుంటారు వీళ్లంతా?! కేరింగ్ అవసరం లేదని చెయ్యి విడిపించుకున్నప్పుడు దూరం పెరిగితే అది చెయ్యి వదిలిన వాళ్లు పెంచుకున్న దూరం అవుతుందా?!

రోజుకొకరు ఫోన్ చేసి, "సల్మాన్ నిన్ను చంపేస్తాం" అని బెదిరిస్తున్నారు. వాళ్లు నయం కదా... "సల్మాన్ బాగున్నావా?" అని పరామర్శగా ఒక్క కాల్ అయినా చేయకుండా జుహూలో, బాంద్రాలో ఏళ్లకు ఏళ్లు నాకు 'దగ్గరగా' ఉంటున్న వారి కంటే!

బయట క్రాకర్స్ పేలుతున్నాయి. గన్ పేలి నప్పుడు వచ్చే శబ్దం ప్రత్యేకంగా ఏమీ ఉండదు. సైలెన్సర్ బిగిస్తే అసలు శబ్దమే ఉండదు.

నవ్వొచ్చింది నాకు. నా చుట్టూ ఉన్న వాళ్లంతా మౌనాన్ని బిగించుకున్న తుపాకుల్లా అయిపోయారా! సైలెన్సర్ ఉన్న బులెట్ మౌనంగా ఒకసారే దిగిపోతుంది. మౌనం అదే పనిగా బులెట్‌లను దింపుతూ ఉంటుంది.

లేచి బాల్కనీ లోకి వచ్చాను. ఒక్కక్షణం నాకు గెలాక్సీ అపార్ట్‌మెంట్‌లో ఉన్నానో, పాన్వెల్ ఫామ్‌హౌస్‌లో ఉన్నానో అర్థం కాలేదు. ఎక్కడుంటే ఏమిటి, పక్కన మనిషే లేనప్పుడు? పలకరింపు కూడా కరువైనప్పుడు!

కళ్లెదురుగా ఆకాశం వెలిగి ఆరిపోతూ, వెలిగి ఆరిపోతూ ఉంది. ఎగసిన కాంతి పూలు ఫెటేల్మని విచ్చుకుని, చప్పున అంతెత్తు నుంచి చీకట్లోకి జారిపోతున్నాయి.

ఏనాడో జీవితంలోంచి వెళ్లిపోయినవారు ఇప్పుడు ఒక్కొక్కరూ గుర్తుకు వస్తున్నారంటే.. కష్టంలో ఉన్నామనా? కష్టాన్ని తట్టుకుని ఉన్నామనా?

కథల గిజిగాని స్ఫూర్తి కొనసాగాలి!

తెలుగు కథా ప్రపంచంలో కాళీపట్నం రామారావు (కారా) మాస్టారు పేరు చిరస్మరణీయమైనది. 1924 నవంబర్ 9న జన్మించిన ఈయన ఉపాధ్యాయ శిక్షణ పూర్తి అయిన తర్వాత గణిత ఉపాధ్యాయునిగా ఉద్యోగంలో చేరారు. అక్కడే 31 ఏళ్లు పనిచేసి 1979లో పదవీ విరమణ పొందారు. ఉద్యోగ కాలంలోనే 'విశాఖ రచయితల సంఘం'లో సభ్యునిగా ఉంటూ కథా రచనపై చర్చలు జరిపేవారు. ఆంధ్రభూమి దినపత్రికలో 'నేటి కథ' శీర్షికను నిర్వహించి కొత్త రచయితలకు ప్రాధాన్యం ఇచ్చేవారు. వారికి కథ రాయడంలో మెలకువలు నేర్పేవారు. ఈయన వామపక్ష దృక్పథాన్ని తన కథల్లో ఇమిడ్చినంతగా మరొకరు రాయలేదంటే అతిశయోక్తి కాదు. అందుకే కథాలోకంలో కారా పేరు శాశ్వతంగా నిలిచిందని చెప్పవచ్చు. 1995లో కారా 'యజ్ఞం'తో పాటు 9 కథలకు గాను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అందుకున్నారు.

1943 సెప్టెంబర్ నెలలో 'చిత్రగుప్త' కార్తు కథల శీర్షికతో ఆయన మొదటి కథ 'ప్లాట్ ఫారమ్' అచ్చయింది. పిమ్మట మరికొన్ని కథలను రాశారు. 'యజ్ఞం, అభిమానాలు, రాగమయి, జీవధార, రుతుపవనాలు' వంటి ఎన్నో కథలను రాసిన ఆయన తన జీవన పర్యంతం కథా సాహిత్య సేవలోనే తలమునకలై ఉన్నారు. తన కథల్లో ప్రజా జీవన సంఘర్షణలను పలు కోణాల్లో ఆవిష్కరించిన తీరు అమోఘం. 1964లో 'యజ్ఞం' కథ రాశారు. కానీ ఇది 1966లో వెలువడింది. ఈ కథ తెలుగు కథా సాహిత్యం ముఖచిత్రాన్నే మార్చేసింది. యజ్ఞం కథ సృష్టించిన ప్రభంజనం అంతా ఇంతా కాదు. బహుశా తెలుగులో ఏ కథపై అంతలా చర్చ జరగలేదంటే ఆశ్చర్యమేమీ లేదు. అంటే ఆ కథలో నాటి ఫ్యూడల్ దోపిడీ కళ్ళముందు పెట్టారు. మాస్టారి కథలు సరళమైన శైలిలో కొనసాగినప్పటికీ ఒక్కసారి చదివితే అర్థం కావు. అవి మరల మరల చదివితేగాని బుర్రకెక్కవు. వాటిని సంపూర్ణంగా అర్థం చేసుకోవాలంటే వామపక్ష సిద్ధాంతంపై కొంతమేర పట్టు ఉండాల్సిందే. అందుకే మాస్టారు తన 'యజ్ఞం' కథ పాఠకులకు అర్థమవ్వాలంటే, తన 'అప్రజ్ఞాతం' కథ చదివి తీరాల్సిందే అనేవారు.

ప్రపంచంలోనే మొదటిసారిగా కథల కోసం ఒక లైబ్రరీ (కథానిలయం)ని ఏర్పాటు చేశారు కారా. దీని ఏర్పాటుకు ఎంతో కసరత్తు జరిగింది. 1910 నుంచి వరుసగా ప్రతి పదేళ్లలో వచ్చిన కథా సాహిత్యంపై అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ ఆచార్యులు రాచపాళెం చంద్రశేఖర రెడ్డి నేతృత్వంలో గల పరిశోధక విద్యార్థుల బృందం కథలపై పరిశోధన చేస్తున్నట్లు కారా తెలుసుకున్నారు. వారితో మాట్లాడాక, కథా సాహిత్యం అంతటినీ ఒక దగ్గర చేర్చి, భద్రపరచగలననే నమ్మకం ఆయనకు కుదిరింది. ఈ క్రమంలోనే పెనుగొండ లక్ష్మీనారాయణ లాంటి రచయితలతో జరిపిన చర్చల్లో కథల భద్రతపై ఒక అవగాహనకొచ్చారు. 'శ్రీకాకుళం సాహితి' వారి అండదండలూ వారికి ఉన్నాయి. దాంతో కథలను భద్రపరచడం కోసం ఒక పూర్తిస్థాయి భవనాన్ని నిర్మించడానికి నిశ్చయించుకున్నారు. 1996లో అభిమానులు సమర్పించిన 'జనపీఠ' అవార్డును మాస్టారు స్వీకరించిన సందర్భంగా వచ్చిన లక్ష రూపాయలు, 'సాహితీ హారతి', 'ఖమ్మం సాహితీమిత్రులు' ఇచ్చిన 20 వేల రూపాయల నగదుతో 'కథానిలయం' శాశ్వత భవన నిర్మాణం 1996లో ప్రారంభించారు. అది పూర్తయిన తర్వాత, 1997 ఫిబ్రవరి 22న శ్రీకాకుళం పట్టణంలో 'కథానిలయం' వ్యవస్థాపన జరిగింది.



కాళీపట్నం రామారావు

అప్పుడు కేవలం 800 వందల పుస్తకాలతో సంస్థను ప్రారంభించారు. ఈ కథానిలయం ప్రారంభోత్సవానికి లండన్ నుండి ఆచార్య గూటాల కృష్ణమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నాకు తెలిసి ఒక సాహిత్య ప్రక్రియకు ప్రత్యేకంగా ఒక గ్రంథాలయం ఏర్పడడమనేది కథానిలయంతోనే ఆరంభమయ్యింది' అంటూ మాస్టారి సాహితీ సేవలను కొనియాడారు. కథా నిలయం నిర్వహణలో మాస్టారి కుటుంబ సభ్యుల పాత్ర ఎనలేనిది. 1998 లో కారా అధ్యక్షులుగా, బి.వి.ఎ. రామారావు నాయుడు కార్యదర్శిగా ఉంటూ మరో ఎనిమిది మంది సభ్యులను ధర్మకర్తల మండలిలో చేర్చుకున్నారు. తరువాతి కాలంలో మరికొంతమందిని చేర్చుకుని దాన్ని విస్తృతపరిచారు. అలాగే 'శ్రీకాకుళ సాహితి' సభ్యులందరూ శక్తివంచన లేకుండా కథానిలయం కార్యకలాపాలకు సహకారం అందించారు. వారంతా పత్రికల్లో అచ్చయిన కథలను సేకరించడం వాటిని జాగ్రత్తగా భద్రపరచడం చేసేవారు. కథల కోసం కారా మాస్టారే స్వయంగా ఆ యా రచయితలకు పోస్టుకార్డు రాసి తెప్పించుకునేవారు. మొదట కొన్ని వందల కథలతో ప్రారంభమైన కథా నిలయం నేడు సుమారు లక్షకు పైగా కథలను సేకరించ గలిగిందంటే మామూలు విషయం కాదు. నిర్వాహకులు ఆనాటి 'భారతి' పత్రిక నుంచి నేటి పత్రికల వరకు ప్రచురితమైన కథలను సేకరించడం ఒక పనిగా పెట్టుకున్నారు. వివిధ రచయితల స్వదస్తూరితోగల కథా ప్రచురణలను సేకరించడం, రచయిత ఆడియో ద్వారా కథను రికార్డు చేసి పదిలపరచడం వంటి లక్ష్యాలతో కథానిలయం ధర్మకర్తల మండలి పనిచేసింది. వివిధ ప్రాంతాల నుండి కథలు రాస్తున్న రచయితల ఛాయా చిత్రాలను సేకరించి భద్రపరిచారు కూడా!

2009 లో పుస్తకాల డిజిటలైజేషన్ చేపట్టారు. దాంతో ఎవరైనా కథానిలయం వెబ్ సైట్ లోకి వెళ్లి తమకు నచ్చిన కథల్ని డౌన్లోడ్ చేసుకోవచ్చు. పై అంతస్తులో వందమంది వ్యక్తులు కూర్చునేలా ఒక సమావేశ మందిరం ఉంటుంది. అక్కడే సాహితీ సమావేశాలు జరుగుతుంటాయి. కారా మాస్టారి రచనలు వివిధ పుస్తకాలుగా 971 పుటలతో ప్రచురించారు. ఆ పుస్తకాలను అమ్మగా వచ్చిన సొమ్ముతో కథానిలయాన్ని నిర్వహిస్తున్నారు. అంతేకాదు వివిధ సాహితీ సంస్థలు, వ్యక్తులు... ఐదు రూపాయల నుంచి లక్ష రూపాయల వరకు ఆర్థిక సహాయం చేయడంతో కథానిలయం ఎటువంటి ఆర్థిక ఇబ్బందులూ లేకుండా తన సాహితీ సేవలను కొనసాగిస్తున్నది.

2021 జూన్ 4వ తేదీన మాస్టారు తన 97వ ఏట తుది శ్వాస విడిచారు. ఆయన అడుగుజాడల్లో భావి కథా సాహిత్యం పరిఢవిల్లాలి. ఆయన మానసపుత్రిక 'కథానిలయం' నిర్వహణలో తమ వంతు పాత్ర పోషించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉంది.

– పిల్లా తిరుపతిరావు । 7095184846

(నేడు శ్రీకాకుళంలో 'కారా మాస్టారి' శతజయంతి సభ)

దేవుడు – మానవుడు

దేవుడిని సులభంగా అర్థం చేసుకోవచ్చు. కానీ మనిషి అంతరంగాన్ని అర్థం చేసుకొనడం చాలా కష్టం. భగవంతుడు నిర్మల, నిష్కపట, పరిపూర్ణానందుడు. ఇందుకు భిన్నంగా మానవుడు సాధారణంగా అత్యంత క్లిష్టంగా స్వార్థంతో, ఈర్ష్య, ద్వేషాలతో నిండివుంటాడు. మానవ జన్మం ఉన్నత లక్ష్యసాధనకే అనగా భగవంతునిలో ఐక్యం చెందుటకే వచ్చింది. కానీ, అయ్యో! మానవుడు తన జన్మమునకు కారణం ఏమిటో (మానవ జన్మ ఎందుకు వచ్చిందో) మరచిపోయి... కామ, కర్మ, అవిద్య అనే చక్రంలో చిక్కుకున్నాడు. స్వార్థబుద్ధిని పోనీయక, సొంతలాభము కొరకు ఇతరులకు నష్టం చేయుటకు కూడా సిద్ధముగా ఉన్నాడు.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

అలాంటివారికి ఎన్నటికీ విమోచనం ఉండదు. మన పురాణములందు, శాస్త్రములందు వివరింపబడినట్లుగా, ఏ మానవుడు స్వార్థ పరిధులను దాటి ఇతరుల గూర్చి ఆలోచించడో, అంతవరకు అట్టి వ్యక్తికి మోక్షం లభించు అవకాశమే లేదు. కావున, ఇకనైనా మనం ఆత్మ వివేక మార్గంలో నడచి, భగవంతుడు వరప్రసాదంగా ఇచ్చిన ఈ జన్మను సార్థకం చేసుకోవాలి!

ఇతరుల దోషాలను, తన చుట్టు గల వాతావరణమునందలి లోపాలను ఎంచుట మనిషి సాధారణ లక్షణం. ఈ విధంగా తప్పులను ఎంచుటవలన ఏ ప్రయోజనమూ లేదు. వాస్తవముగా ఈ లక్షణము మనిషి మానసిక ప్రశాంతతను భంగపరుస్తుంది. దీనివలన సమతాస్థితిని పొందలేడు. అన్ని విషయాలు మానసిక పరిస్థితి పైననే ఆధారపడి ఉంటాయి. మన మనస్సు నిజాయతీగా, నిర్మలంగా ఉంటే ప్రతి ఒక్కటి నిర్మలంగా ఉన్నట్లు కనబడుతుంది. ఇందుకు భిన్నంగా, మన మనస్సు కల్మషంతో నిండివుంటే బాహ్య ప్రపంచం కూడా అసహ్యమును, కలవరపాటును కలిగిస్తుంది.

ఆధ్యాత్మిక మార్గం అనుసరించదలచిన భక్తుడు చిత్తశుద్ధిని పెంపొందించుకోవాలి. అలా ఉన్నప్పుడు మాత్రమే ఆధ్యాత్మిక జీవితము సాధ్యమవుతుంది. ఇతరుల దోషాలను ఎంచుట మాని, మనలను మనం సరిచేసుకోవడానికి ప్రయత్నించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం; **తిథి:** శు.విదియ రా.8.06 వరకు, తదుపరి తదియ; **నక్షత్రం:** అనూరాధ పూర్తి(24 గంటలు); **వర్జ్యం:** ఉ.9.46 నుండి 11.26 వరకు; **దుర్ముహూర్తం:** సా.3.57 నుండి 4.45 వరకు; **అమృత ఘడియలు:** రా.7.51 నుండి 9.34 వరకు; **రాహుకాలం:** సా.4.30 నుండి 6.00 వరకు; **యమగండం:** ప.12.00 నుండి 1.30 వరకు; **సూర్యోదయం:** 6.02; **సూర్యాస్తమయం:** 5.26; భగినీ హస్త భోజనం.

ఇందిరమ్మ ఇంటికి ఇక్కట్లు!

▶ మొదటి పేజీ తరువాయి

వాటా ఉండాల్సిందేనని కేంద్రం స్పష్టం చేసినట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం సొంత నిధులతో చేపట్టే పథకాలకు ఇది వర్తించకున్నా.. కేంద్ర ప్రభుత్వ చేయూతతో అమలు చేసే పథకాల్లో మాత్రం ఈ నిబంధనను అమలు చేయాల్సి ఉంటుంది. హైదరాబాద్ నగరంలో పేదలు వ్యక్తిగత ఇళ్లను నిర్మించుకునేందుకు సొంత జాగా ఉండటం కష్టమే. అందుకే అపార్ట్‌మెంట్ల తరహాలో ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి ఇస్తోంది. గతంలో వాంబే పథకం, ఆ తర్వాత ఇందిరమ్మ ఇళ్లు, ఇటీవల డబుల్ బెడ్రూం ఇళ్లు అదే తరహాలో నిర్మితమయ్యాయి. కాంగ్రెస్ సర్కారు ఇందిరమ్మ పథకం కింద కూడా ఇళ్ల సముదాయాలనే నిర్మించి ఇవ్వనుంది. ఈ తరహా ఇళ్లకు లబ్ధిదారుల వాటా చూపాలని కేంద్రం అడుగుతోంది.

పైసా అవసరం లేదన్న రాష్ట్ర సర్కారు

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారులు నయాపైసా చెల్లించాల్సిన అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. కానీ కేంద్ర నిబంధన ప్రకారం.. యూనిట్ కాస్ట్ కింద రాష్ట్ర ప్రభుత్వం భరించే రూ.5 లక్షలకుతోడు లబ్ధిదారుల వాటాను కూడా చూపించాల్సి వస్తుంది. ఆ మొత్తాన్ని లబ్ధిదారులు చెల్లించడంగానీ, లేదా రాష్ట్ర ప్రభుత్వమే భరించడంగానీ తప్పదని అధికారవర్గాలు చెప్తున్నాయి. హైదరాబాద్‌లో డబుల్ బెడ్రూం ఇళ్లకు రూ.ఏడు లక్షల నుంచి రూ.8 లక్షల చొప్పున ఖర్చయ్యాయి. యూనిట్ కాస్ట్‌కు అదనంగా అయ్యే మొత్తాన్ని లబ్ధిదారు వాటాగా చూపే చాన్స్ ఉండనుంది.

పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల ప్రణాళిక ఏంటి?

తొలుత ఇందిరమ్మ ఇళ్లను సొంత జాగా ఉన్నవారికే మంజూరు చేయనున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. అయితే హైదరాబాద్, ఇతర ప్రధాన పట్టణాల్లో సొంత జాగా ఉన్న పేదల సంఖ్య నామమాత్రమే. అలాంటప్పుడు పేదలకు ఇళ్లు ఎలాగనే ప్రశ్నలు వస్తున్నాయి. ఈ దిశగా ప్రభుత్వ ప్రణాళిక ఏమిటనే చర్చ జరుగుతోంది.

హెచ్‌ఎండీఏ మాస్టర్‌ప్లాన్- 2031ను పునఃపరిశీలించాలి

సీఎంకు బీజేపీ నేత గూడూరు సూచన

సాక్షి, హైదరాబాద్: 2013లో నోటిఫై చేసిన హెచ్‌ఎండీఏ మాస్టర్‌ప్లాన్-2031ను పునఃపరిశీలించి, అవసరమైన మార్పులు చేర్పులు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి బీజేపీనేత గూడూరు నారాయణరెడ్డి సూచించారు. ప్రస్తుతం హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో మారిన పరిస్థితులకు మాస్టర్‌ప్లాన్-31 ఏమాత్రం ఉపయోగపడదని శనివారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ మాస్టర్‌ప్లాన్ బిల్డర్లు, రియల్ ఎస్టేట్ డెవలపర్లను యాచకులుగా మార్చేస్తుందని ఆందోళన వెలిబుచ్చారు. ఇప్పటికే హైడ్రా రియల్ ఎస్టేట్ డెవలపర్ల వెన్నువిరిచేసిందన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత హైదరాబాద్ అభివృద్ధికి అనుగుణంగా ఈ మోడల్‌ను మార్చాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల అనేక మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నందున మళ్లీ మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.



75 ప్రశ్నలతో కుటుంబ సర్వే

- సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సన్నద్ధం
- పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ విడుదల
- రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమం పూర్తి
- జిల్లాల్లో కొనసాగుతున్న శిక్షణ కార్యక్రమాలు

సాక్షి, హైదరాబాద్: ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలు నమోదు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు అధికార యంత్రాంగం సిద్ధమవుతున్నది. ఈ సర్వేపై రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించిన ప్రభుత్వం.. సర్వే ఉద్దేశం, లక్ష్యం తదితర అంశాలను వివరిస్తూ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌ను విడుదల చేసింది. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో కొనసాగే ఈ సర్వేకు సంబంధించిన పూర్తిస్థాయి సూచనలను అందులో పొందుపర్చింది. సర్వే రెండు భాగాలుగా సాగుతుంది. మొదటి విభాగం (పార్ట్-1)లో కుటుంబ యజమాని, సభ్యుల వ్యక్తిగత వివరాలకు సంబంధించిన ప్రశ్నలుంటాయి. రెండో విభాగం(పార్ట్-2)లో కుటుంబ వివరాలకు సంబంధించిన ప్రశ్నలుంటాయి. సర్వే ప్రశ్నావళిలో 75 ప్రశ్నలుంటాయి. ఇందులో 56 ప్రధాన ప్రశ్నలు కాగా.. మిగతా 19 ఉప ప్రశ్నలు.

ఎంపిక బాధ్యతలు జిల్లా కలెక్టర్లకు

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియలో జిల్లా కలెక్టర్ల పాత్ర కీలకం. జిల్లాస్థాయి, మండల స్థాయి నోడల్ అధికారుల నియామకం మొదలు, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్ల గుర్తింపు ప్రక్రియ అంతా కలెక్టర్ల ఆధ్వర్యంలోనే కొనసాగుతుంది. అదేవిధంగా ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు బ్లాకుల కేటాయింపు బాధ్యత కూడా కలెక్టర్లదే. కిందిస్థాయి అధికారులకు సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు సర్వే నిర్వహించాల్సిన తీరు, సమాచార గోప్యత తదితరాలకు సంబంధించిన శిక్షణ కలెక్టర్లే ఇస్తారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లుగా ప్రభుత్వ ఉద్యోగులనే ఎంపిక చేయాలి. అవసరం ఉన్న చోట మాత్రం సీఆర్పీ (కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్), గెస్ట్ టీచర్ల సేవలు వినియోగించుకోవచ్చు. సెన్సెస్ డైరెక్టర్ నుంచి ఎన్యుమరేషన్ బ్లాక్ (ఈబీ) మ్యాపులు తీసుకుని ఆ మేరకు బ్లాకుల విభజన చేయాలి. ఒక ఎన్యుమరేషన్ బ్లాక్‌లో 175 వరకు కుటుంబాలుంటాయి. అంతకంటే ఎక్కువ కుటుంబాలు ఉంటే బ్లాకుల విభజన చేయాలి. ఎన్యుమరేటర్లు సర్వే పూర్తి చేసిన తర్వాత ఆ సమాచారంలోని 10 శాతం కుటుంబాలను ర్యాండమ్ పద్ధతిలో ఎంపిక చేసి వాటిని సూపర్‌వైజర్లు మరోమారు తనిఖీ చేయాలి. ఎన్యుమరేటర్ పనితీరును ఈ రకంగా అంచనా వేయాలి. జిల్లా నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్‌ను నియమించాలి. సర్వే నిర్వహణలో భాగంగా రోజువారీ పురోగతిని ప్రణాళిక శాఖకు ప్రతిరోజు సాయంత్రం 6గంటల లోపు పంపాలి.

పక్షం రోజుల్లో ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక

5న లేదా 6న ప్రక్రియ ప్రారంభిస్తాం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- రాజకీయ జోక్యం లేకుండా యాప్ ద్వారా ఎంపిక
- ఇంటి పునాదుల నుంచి పూర్తయ్యేదాకా దశలవారీగా సొమ్ము విడుదల
- అవసరమైతే కేంద్ర ప్రభుత్వ పెద్దల ఫొటోలు పెడతామని వెల్లడి
- ఈ టర్మ్ అంతా రేవంత్‌రెడ్డే సీఎంగా ఉంటారని వ్యాఖ్య



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పథకానికి లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమాన్ని ఈ నెల ఐదు, ఆరు తేదీల్లో ప్రారంభించి పక్షం రోజుల్లో పూర్తి చేస్తామని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రత్యేక యాప్ ద్వారా జరుగుతుందని, ఎంపికలో రాజకీయ జోక్యం ఏమాత్రం ఉండదని చెప్పారు. నిరుపేదలకు సొంతింటి వసతి కల్పించడం లక్ష్యంగా ముందుకుసాగుతున్నామని పేర్కొన్నారు. శనివారం సాయంత్రం సచివాలయంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేరిటే మంజూరు చేస్తాం. 400 చదరపు అడుగుల విస్తీర్ణానికి తగ్గకుండా ఇళ్లను నిర్మించుకోవాల్సి ఉంటుంది. ఈ ఇళ్లకు ప్రత్యేక డిజైన్ అంటూ ఉండదు. లబ్ధిదారులకు ఉన్న జాగా ఆధారంగా వారే కావాల్సిన ఆకృతిలో నిర్మించుకోవచ్చు. అయితే వంటగది, మరుగుదొడ్డి కచ్చితంగా ఉండేలా చూడాలి.

దశలవారీగా సొమ్ము విడుదల

ఇందిరమ్మ ఇళ్లకు పునాదులు నిర్మించుకున్నాక రూ.లక్ష, గోడల నిర్మాణం తర్వాత రూ.లక్షన్నర, పైకప్పునకు రూ.లక్షన్నర చొప్పున చెల్లిస్తాం. ఇంటి నిర్మాణం పూర్తయ్యాక మిగతా మొత్తం అందజేస్తాం. ఈ సొమ్మును బ్యాంకు ఖాతాకు ఆన్‌లైన్ ద్వారా జమ చేస్తాం. తొలిదశలో కేవలం సొంత జాగా ఉన్నవారికే ఇళ్లను మంజూరు చేస్తాం. తదుపరి విడతలో భూమిలేని నిరుపేదలకు స్థలం ఇచ్చి నిధులు అందజేస్తాం. నియోజకవర్గానికి 3,500కు తగ్గకుండా ఇళ్లను మొదటి విడతలో మంజూరు చేస్తున్నాం. నాలుగేళ్లలో 20 లక్షల ఇళ్లను నిర్మించేలా చూస్తాం. ఈ ఇళ్ల నిర్మాణ పర్యవేక్షణ కోసం 16 శాఖల నుంచి సిబ్బందిని సమీకరిస్తున్నాం.

నిధులను సమీకరించుకుంటాం..

తొలిదశ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.20వేల కోట్ల వరకు ఖర్చవుతాయి. బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.7,740 కోట్లను కేటాయించింది. కేంద్రం నుంచి వీలైనన్ని ఎక్కువ నిధులు పొందేందుకు ప్రయత్నిస్తున్నాం. గత ప్రభుత్వం చేపట్టి వదిలేసిన ఇళ్లను కూడా పూర్తి చేస్తాం. అవసరమైన నిధులను వివిధ మార్గాల్లో సమీకరించుకుంటాం. కొత్తగా ఏర్పడే ఇందిరమ్మ కాలనీల్లో ప్రభుత్వమే మౌలిక వసతులు కల్పిస్తుంది.

కేంద్ర ప్రభుత్వ పెద్దల ఫొటోలు పెడతాం..

గత ప్రభుత్వం కేంద్రం నుంచి నిధులు తేవటంలో విఫలమైంది. మేం ఆ పరిస్థితి రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. కేంద్ర నిబంధనలు అనుసరించటంతోపాటు అవసరమైతే కేంద్ర ప్రభుత్వ పెద్దల ఫొటోలు పెట్టాలంటే కూడా పెడతాం. మాకు భేషజాలు లేవు. సర్పంచుల పదవీకాలం పూర్తయినందున ప్రస్తుతం ఇందిరమ్మ కమిటీల్లో వారి ప్రాతినిధ్యం లేదు. తదుపరి దశ నాటికి వారు ఉండేలా అవసరమైతే జనవరి నాటికే సర్పంచ్ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేస్తాం..''అని పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఈ టర్మ్ అంతా రేవంతే సీఎం

సీఎం రేవంత్‌రెడ్డిని మారుస్తారంటూ కొందరు పనిగట్టుకుని చేస్తున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం టర్మ్ పూర్తయ్యేందుకు ఇంకా నాలుగేళ్ల ఒక నెల సమయం ఉందని, అప్పటి వరకు రేవంతే సీఎంగా ఉంటారని చెప్పారు. తదుపరి కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి ఎవరనేది అధిష్టానం నిర్ణయిస్తుందన్నారు. ఏదో ఒకటి మాట్లాడాలన్న ఉద్దేశంతో విపక్షాలు లేనిపోని ప్రకటనలు చేస్తున్నాయని విమర్శించారు. ఒకట్రెండు రోజులు అటూఇటూ అయినా.. తాను చెప్పినట్టు రాజకీయ బాంబులు పేలటం తథ్యమని పేర్కొన్నారు.

ఏఈవోలతో చర్చలు సఫలం

- సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలత
- నిర్దేశించిన బాధ్యతలు నిర్వర్తిస్తామని ప్రభుత్వానికి స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వంతో వ్యవసాయ విస్తరణ అధికారుల(ఏఈవో) సంఘ ప్రతినిధుల చర్చలు సఫలమయ్యాయి. ఏఈవోలకు నిర్దేశించిన బాధ్యతలను నిర్వర్తించనున్నట్లు ఏఈవో సంఘాల ప్రతినిధులు ప్రభుత్వానికి హామీ ఇచ్చారు. వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో శనివారం జరిపిన చర్చలు సఫలమైన తర్వాత వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డి.శ్రీనివాస్‌గౌడ్, కె.సురేశ్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ఏఈవో లంతా వెంటనే డీసీఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని విధులను నిర్వర్తించాలని కోరారు. నిర్దేశించిన విధులను పూర్తి చేయాలని, ఫొటోలను కూడా అప్‌లోడ్ చేయాలని ఏఈవోలకు సూచించారు. సస్పెండ్ అయిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోనున్నట్లు ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఒకట్రెండురోజుల్లో ఉత్తర్వులు వస్తాయని వివరించారు. సర్వీసు రిజిస్టర్‌లో వారి సస్పెన్షన్ ఉత్తర్వుల ప్రస్తావన ఉండదని స్పష్టం చేశారు. ఏడీవో గ్రేడ్-2లను గ్రేడ్-1గా పదోన్నతి కల్పించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని, దీంతో కేడర్‌స్ట్రెంగ్త్‌కు అనుగుణంగా అర్హులందరికీ పదోన్నతులు వస్తాయన్నారు. ఇందుకు సంబంధించిన ఫైలు వెంటనే సర్క్యులేట్ చేస్తామని కార్యదర్శి హామీ ఇచ్చినట్లు తెలిపారు. రైతుబీమా పథకం అమలులో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతువేదికల నిర్వహణ నిధులను కూడా ప్రభుత్వం వెంటనే విడుదల చేస్తుందని తెలిపారు.

వచ్చే నెలలో మహిళా శక్తి వారోత్సవాలు

- ఉపాధి హామీ పనులపై డీఆర్డీవోలకు మంత్రి సీతక్క ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: వచ్చేనెల మొదటి వారంలో ఇందిరా మహిళా శక్తి పథకానికి సంబంధించి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క తెలిపారు. మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. బ్యాంకుల ద్వారా మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇప్పించేలా గ్రామాల్లో బ్యాంకర్లతో సదస్సులు నిర్వహించాలని సూచించారు. ప్రతీ మహిళా స్వయం సహాయక సంఘాల్లో చేర్చేలా అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. శనివారం సచివాలయంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారుల (డీఆర్‌డీవో)లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా వచ్చే ఐదునెలల్లో చేపట్టాల్సిన పనులపై జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ పథకంద్వారా కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు ప్రజలకు ఉప యోగపడే పనులను చేప ట్టాలన్నారు. మార్చి లోపు చేపట్టే ఉపాధి హామీ పనుల కోసం రూ.1,372 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పీఆర్ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్, సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్, పీఆర్-ఆర్డీ కమిషనర్ అనితా రామచంద్రన్ పాల్గొన్నారు.

వైట్‌హౌస్‌కు దారేది?

7 స్వింగ్ స్టేట్లే కీలకం ● హారిస్ విజయానికి మూడు చాలు ● ట్రంప్ దాదాపు క్లీన్‌స్వీప్ చేయాల్సిందే





అమెరికా అధ్యక్ష ఎన్నికల పోరు తుది అంకానికి చేరింది. అంతా అత్యంత ఉత్కంఠతో ఎదురు చూస్తున్న పోలింగ్ ప్రక్రియ మంగళవారం జరగనుంది. డెమొక్రాట్ల అభ్యర్థి, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్, రిపబ్లికన్ల అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ అత్యంత హోరాహోరీగా తలపడుతున్నారు. దాంతో వారిలో ఎవరు గెలుస్తారో ఎవరూ కచ్చితంగా చెప్పలేని పరిస్థితి! అమెరికాలోని 50 రాష్ట్రాల్లో చాలావరకు రిపబ్లికన్, డెమొక్రటిక్ పార్టీల్లో ఏదో ఒకదానికి స్పష్టంగా మద్దతిచ్చేవే. వీటిని సేఫ్ స్టేట్స్‌గా పిలుస్తారు. ప్రతి అధ్యక్ష ఎన్నికల్లోనూ సదరు రాష్ట్రాలను ఆయా పార్టీలే గెలుచుకుంటాయి. కనుక ఎటూ తేల్చుకోని ఓటర్లు ఎక్కువగా ఉండే కొన్ని రాష్ట్రాల్లోనే పోటీ ప్రధానంగా కేంద్రీకృతం అవుతుంటుంది. వాటిని స్వింగ్ స్టేట్స్‌గా పిలుస్తుంటారు. ఈసారి అలాంటి రాష్ట్రాలు ఏడున్నాయి. అవే పెన్సిల్వేనియా, విస్కాన్సిన్, మిషిగన్, నార్త్ కరోలినా, జార్జియా, నెవడా, అరిజోనా. 93 ఎలక్టోరల్ ఓట్లు వీటి సొంతం. వాటిలో మెజారిటీ ఓట్లను ఒడిసిపట్టే వారే అధ్యక్ష పీఠమెక్కుతారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ట్రంప్‌కు 51, హారిస్‌కు 44

అమెరికాలో మొత్తం 538 ఎలక్టోరల్ ఓట్లున్నాయి. విజయానికి కనీసం 270 ఓట్లు రావాలి. 48 రాష్ట్రాల్లో మెజారిటీ ఓట్లు సాధించిన అభ్యర్థి తాలూకు పార్టీకే ఆ రాష్ట్రంలోని మొత్తం ఎలక్టోరల్ ఓట్లు దఖలు పడే (విన్నర్ టేక్స్ ఆల్) విధానం అమల్లో ఉంది. ఆ లెక్కన సేఫ్ స్టేట్లన్నీ ఈసారి ఆయా పార్టీల ఖాతాలోనే పడే పక్షంలో హారిస్ 226 ఓట్లు సాధిస్తారు. ట్రంప్‌కు మాత్రం 219 ఓట్లే వస్తాయి. స్వింగ్ స్టేట్లలోని 93 ఓట్లు అత్యంత కీలకంగా మారడానికి కారణమిదే. ట్రంప్ గెలవాలంటే వాటిలో కనీసం 51 ఓట్లు సాధించాలి. హారిస్‌కు మాత్రం 44 ఓట్లు చాలు. గత కొద్ది ఎన్నికలుగా ఈ ఏడు స్వింగ్ స్టేట్ల ఓటింగ్ ధోరణి, ప్రస్తుత పరిస్థితుల ఆధారంగా వాటిలో ఈసారి ఫలితాలు ఎలా ఉండవచ్చన్న దానిపై జోరుగా అంచనాలు, విశ్లేషణలు సాగుతున్నాయి.

పెన్సిల్వేనియా కీలకం

19 ఎలక్టోరల్ ఓట్లున్న పెన్సిల్వేనియా ఈసారి మొత్తం అమెరికా దృష్టినీ ఆకర్షిస్తోంది. అక్కడ నెగ్గిన అభ్యర్థే అధ్యక్షుడయ్యే అవకాశాలు ఏకంగా 90 శాతమని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. జనాభా వైవిధ్యం విషయంలో కూడా ఆ రాష్ట్రం అచ్చం అమెరికాకు నకలులా ఉంటుంది. డెమొక్రాట్ల ఆధిపత్యం సాగే పెద్ద నగరాలు, రిపబ్లికన్ కంచుకోటలైన గ్రామీణ ప్రాంతాలు పెన్సిల్వేనియా సొంతం. దాంతో హారిస్, ట్రంప్ మధ్య హోరాహోరీ నెలకొంది.

రస్ట్ బెల్ట్-సన్ బెల్ట్

అమెరికా నిర్మాణ రంగంలో ప్రముఖ పాత్ర పోషించే విస్కాన్సిన్, మిషిగన్, పెన్సిల్వేనియాలను రస్ట్ బెల్ట్ రాష్ట్రాలుగా పిలుస్తారు. ఈ మూడింట్లో కలిపి 44 ఓట్లున్నాయి. మిగతా దేశంతో పోలిస్తే ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉండే నెవడా, అరిజోనా, నార్త్ కరోలినా, జార్జియాలను సన్ బెల్ట్ రాష్ట్రాలంటారు. వీటిలో మొత్తం 49 ఓట్లున్నాయి.

- రస్ట్ బెల్ట్ నిర్మాణ రంగానికి నిలయం. దాంతో విస్కాన్సిన్, మిషిగన్, పెన్సిల్వేనియాల్లో ఓటర్లపై కార్మిక సంఘాల ప్రభావం ఎక్కువే.
- ఈ రాష్ట్రాలపై దశాబ్దాలుగా డెమొక్రాట్ల ఆధిపత్యమే సాగుతూ వస్తోంది. ఎంతగా అంటే, గత ఎనిమిది అధ్యక్ష ఎన్నికల్లో ఏకంగా ఏడు సార్లు ఈ మూడు రాష్ట్రాలూ ఆ పార్టీ ఖాతాలోనే పడ్డాయి. ఒక్క 2016లో మాత్రం వాటిలో పూర్తిగా ట్రంప్ హవా నడిచింది.
- ఈసారి కూడా డెమొక్రాట్ల ఆధిపత్యమే సాగితే 44 ఓట్లూ కమల ఖాతాలోనే పడతాయి. అదే జరిగితే తొలి మహిళా ప్రెసిడెంట్‌గా ఆమె చరిత్ర సృష్టిస్తారు.
- అలాగాక 2016లో మాదిరిగా ట్రంప్ మరోసారి ఈ మూడు రాష్ట్రాలనూ నెగ్గినా విజయానికి ఏడు ఓట్ల దూరంలో నిలుస్తారు. అప్పుడాయన విజయం కోసం కనీసం మరో స్వింగ్ స్టేట్‌ను కైవసం చేసుకోవాల్సి ఉంటుంది.
- ఒకవేళ హారిస్ రస్ట్ బెల్ట్ రాష్ట్రాల్లో కీలకమైన పెన్సిల్వేనియాతో పాటు మరోదాన్ని దక్కించుకున్నా ఆమె విజయావకాశాలు మెరుగ్గానే ఉంటాయి. మిగతా నాలుగు స్వింగ్ స్టేట్లలో ఏ ఒక్కదాన్ని నెగ్గినా ఆమె గెలిచినట్టే. ట్రంప్ గెలవాలంటే ఆ నాలుగింటినీ స్వీప్ చేయాల్సి ఉంటుంది.
- హారిస్ రస్ట్ బెల్ట్‌లో సున్నా చుట్టినా నాలుగు సన్ బెల్ట్ రాష్ట్రాలను స్వీప్ చేస్తే విజయం ఆమెదే.
- అయితే ఇందుకు అవకాశాలు చాలా తక్కువ. ఎందుకంటే 1948 తర్వాత డెమొక్రాట్లు సన్ బెల్ట్‌ను క్లీన్‌స్వీప్ చేయలేదు.
- రిపబ్లికన్లకు మాత్రం సన్ బెల్ట్‌ను పలుమార్లు క్లీన్‌స్వీప్ చేసిన చరిత్ర ఉంది. ఈసారీ అలా జరిగినా ట్రంప్ విజయానికి అది చాలదు. రస్ట్ బెల్ట్ నుంచి కనీసం ఒక్క రాష్ట్రాన్నైనా ఆయన చేజిక్కించుకోవాలి. లేదంటే 269 ఓట్లకు పరిమితమై ఓటమి పాలవుతారు.

రస్ట్ బెల్ట్‌లో విజయావకాశాలు

- రస్ట్ బెల్ట్‌లో హారిస్ గెలవాలంటే పట్టణ ఓటర్లు భారీగా ఓటేయాల్సి ఉంటుంది. నల్లజాతీయులు, మైనారిటీలు, విద్యాధికులు, మధ్య తరగతి ఓట్లు, ముఖ్యంగా మహిళలు పోలింగ్ బూత్‌లకు తరలడం తప్పనిసరి.
- అలాగాక గ్రామీణ ఓటర్లు భారీగా ఓటేస్తే 2016లో మాదిరిగా మరోసారి రస్ట్ బెల్ట్ ట్రంప్‌దే అవుతుంది.
- ఈసారి గ్రామీణులతో పాటు యువ ఓటర్లు కూడా తనకే జైకొడతారని ఆయన ధీమాగా ఉన్నారు.

సన్ బెల్ట్‌లో విజయావకాశాలు

- ఇక్కడ విజయావకాశాలను అమితంగా ప్రభావితం చేసేది నల్లజాతీయులు, లాటిన్ అమెరికన్ ఓటర్లే.
- జార్జియా, నార్త్ కరోలినాల్లో నల్లజాతి ఓటర్ల సంఖ్య చాలా ఎక్కువ. అరిజోనా, నెవడాల్లో లాటిన్ అమెరికన్ జనాభా నానాటికీ పెరుగుతోంది.
- హారిస్ జమైకన్ మూలాల దృష్ట్యా నల్లజాతీయులు ఆమెవైపే మొగ్గుతారని భావిస్తున్నారు. ఇక ట్రంప్ ర్యాలీలో ప్యూర్టోరీకన్లు, లాటిన్ అమెరికన్లపై వెలువడ్డ వ్యంగ్య వ్యాఖ్యలపై ఆగ్రహంతో వారు కూడా హారిస్‌కే ఓటేస్తారని డెమొక్రాట్లు ఆశిస్తున్నారు.

వైషమ్యాలను పెంచుతారు

ట్రంప్‌పై హారిస్ మండిపాటు

వాషింగ్టన్: రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ వ్యక్తులను పరస్పరం ఎగదోసి వారిమధ్య వైషమ్యాలు పెంచే రకమంటూ డెమొక్రాట్ల అభ్యర్థి కమలా హారిస్ దుయ్యబట్టారు. ట్రంప్ కంటే చాలా మెరుగైన వ్యక్తి మాత్రమే అమెరికాకు నాయకత్వం వహించాలని అభిప్రాయపడ్డారు. స్వింగ్ రాష్ట్రమైన విస్కాన్సిన్‌లో ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాజకీయ ప్రత్యర్థులను, తనకు ఓట్లేయని వారని శత్రువులుగా భావించే ప్రమాదకరమైన మనస్తత్వం ట్రంప్ సొంతమని ఆక్షేపించారు. ఆయన జేబులో రాసిపెట్టుకున్న శత్రువుల జాబితా నానాటికీ పెరిగిపోతూనే ఉందన్నారు. ''మరోవైపు రిపబ్లికన్ల నుంచి కూడా ఒకరికి నా మంత్రివర్గంలో చోటివ్వాలన్న మనస్తత్వం నాది. మా ఇద్దరి మధ్య ఇదే తేడా''అని చెప్పుకొచ్చారు. భిన్నాభిప్రాయాలు ఉన్నప్పుడే ప్రజాస్వామ్యం రాణిస్తుందన్నారు.

నేనొస్తే ఆర్థికంగా అద్భుతాలే: ట్రంప్

అమెరికాను హారిస్ నాశనం చేశారంటూ ధ్వజం

వాషింగ్టన్: అమెరికా ఉపాధ్యక్షురాలిగా కమలా హారిస్ అనుసరించిన ఆర్థిక విధానాలు అత్యంత అసమర్థమైనవంటూ రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ దుయ్యబట్టారు. ''నేను గెలిస్తే వాటికి ముగింపు పలుకుతా. 'బిల్డ్ అమెరికన్, బై అమెరికన్, హైర్ అమెరికన్'వంటి సరికొత్త విధానాలతో ఆర్థిక రంగంలో అద్భుతాలు చేసి చూపిస్తా''అన్నారు. స్వింగ్ రాష్ట్రమైన మిషిగన్‌లోని డెట్రాయిట్‌లో శుక్రవారం ఆయన ర్యాలీలో పాల్గొన్నారు. ''అమెరికాను హారిస్ సర్వనాశనం చేశారు. ఆమె ఆర్థిక విధానాల వల్ల గత కొద్ది రోజుల్లోనే ప్రైవేట్ రంగంలో ఏకంగా 30 వేలు, నిర్మాణ రంగంలో ఏకంగా 50 వేల ఉద్యోగాలకు కోత పడింది. కార్మిక లోకాన్ని ఆమె నిండా ముంచుతున్నారు''అని ఆరోపించారు. ''ఉక్రెయిన్ యుద్ధానికి, పశ్చిమాసియాలో అనిశ్చితికి నేను ముగింపు పలుకుతా. మూడో ప్రపంచ యుద్ధాన్ని నివారిస్తా. సైన్యాన్ని ఆధునీకరిస్తా. మత స్వేచ్ఛను, ఆయుధాలు కలిగి ఉండే హక్కును పరిరక్షిస్తా. అక్రమ వలసలకు శాశ్వతంగా అడ్డుకట్ట వేస్తా''అని పేర్కొన్నారు.

నార్త్ కరోలినాపై నేతల గురి

వాషింగ్టన్: ప్రచారం తుది ఘట్టంలో అధ్యక్ష అభ్యర్థులు డొనాల్డ్ ట్రంప్, కమలా హారిస్ ఇద్దరూ కీలక స్వింగ్ రాష్ట్రమైన నార్త్ కరోలినాపై దృష్టి సారించారు. ట్రంప్ ఆది, సోమవారాల్లో అక్కడ ప్రచారం చేయనున్నారు. శనివారం న్యూ మెక్సికో, వర్జీనియాల్లో ప్రచారం ముగించుకుని ఆయన కరోలినాలో అడుగుపెట్టారు. మంగళవారం పోలింగ్ రోజున కూడా అక్కడే ఉంటారు. గత రెండు ఎన్నికల్లోనూ ఈ రాష్ట్రాన్ని ట్రంపే చేజిక్కించుకున్నారు. హారిస్ కూడా శనివారం నార్త్ కరోలినాలోని చార్లెటీలో పర్యటించారు. ఆదివారం కూడా రాష్ట్రంలో పలు ర్యాలీల్లో పాల్గొననున్నారు.

7 కోట్లు దాటిన ముందస్తు ఓటింగ్

అమెరికావ్యాప్తంగా ముందస్తుగా ఓటేసిన వారి సంఖ్య ఏకంగా 7 కోట్లు దాటేసింది. అయితే 2020తో పోలిస్తే ఇది తక్కువే కావడం విశేషం. 2020లో కరోనా కారణంగా ఏకంగా 10 కోట్ల పై చిలుకు అమెరికన్లు ముందస్తుగా ఓటేశారు.

టోరీల సారథిగా బేడ్‌నాక్

తొలి నల్లజాతి మహిళగా రికార్డు ● స్టార్మర్, సునాక్ అభినందనలు

లండన్: బ్రిటన్ విపక్ష నేతగా, కన్జర్వేటివ్ పార్టీ సారథిగా కేమీ బేడ్‌నాక్ ఎన్నికయ్యారు. నైజీరియా మూలాలున్న 44 ఏళ్ల కేమీ ఈ ఘనత సాధించిన తొలి నల్లజాతి మహిళగా రికార్డు సృష్టించారు. మూడు నెలల పాటు జరిగిన పార్టీపరమైన ఎన్నికల్లో మాజీ మంత్రి రాబర్ట్ జెన్రిక్‌ను బేడ్‌నాక్ ఓడించారు. ఆమెకు 53,806 ఓట్లు రాగానే జెన్రిక్‌కు 41,388 ఓట్లతో సరిపెట్టుకున్నారు. ఇటీవలి ఎన్నికల్లో ఘోర పరాజయం నేపథ్యంలో రాజీనామా చేసిన మాజీ ప్రధాని రిషి సునాక్ స్థానంలో ఆమె పార్టీ పగ్గాలు స్వీకరించారు. ఈ సందర్భంగా సునాక్‌కు బేడ్‌నాక్ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన స్థానంలో ఇంకెవరున్నా ఈ కష్టకాలంలో పార్టీ కోసం అంతగా కష్టపడేవారు కాదంటూ ప్రశంసల్లో ముంచెత్తారు. సునాక్ కూడా ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. పార్టీ సారథిగా గొప్పగా రాణిస్తారని ఆశాభావం వెలిబుచ్చారు. ప్రధాని కియర్ స్టార్మర్ కూడా బేడ్‌నాక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఒక నల్లజాతి మహిళ తొలిసారి కన్జర్వేటివ్ పార్టీ పగ్గాలు స్వీకరించడాన్ని చరిత్రాత్మక పరిణామంగా అభివర్ణించారు. బేడ్‌నాక్ నార్త్‌వెస్ట్ ఎసెక్స్ నుంచి పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.



భారత్‌పై కెనడా మంత్రి ప్రేలాపనలు

- కెనడాలో ఖలిస్తానీ మద్దతుదారులపై దాడులకు అమిత్ షా కారణం
- కెనడా విదేశాంగ శాఖ ఉప మంత్రి డేవిడ్ మోరిసన్ ఆరోపణలు
- తీవ్రంగా ఖండించిన భారత్... అసంబద్ధ ఆరోపణలు చేయొద్దని హితవు

న్యూఢిల్లీ: భారత్‌కు వ్యతిరేకంగా కెనడా ప్రభుత్వ పెద్దల ప్రేలాపనలు ఆగడం లేదు. ఒకవైపు ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతింటున్నప్పటికీ మరోవైపు వారు మరింత ఆజ్యం పోస్తున్నారు. కెనడాలో ఖలిస్తానీ మద్దతుదారులపై దాడులకు, కుట్రలకు భారత హోంశాఖ మంత్రి అమిత్ షా కారణమంటూ కెనడా విదేశాంగ శాఖ ఉప మంత్రి డేవిడ్ మోరిసన్ చేసిన ఆరోపణలతో వివాదం మరింత ముదురుతోంది. మోరిసన్ మంగళవారం కెనడా జాతీయ భద్రతా కమిటీకి సంబంధించిన పార్లమెంట్ సభ్యులతో మాట్లాడుతూ అమిత్ షా ప్రస్తావన తీసుకొచ్చారు. కెనడాలో ఉన్న సిక్కు వేర్పాటువాదులకు, ఖలిస్తానీ సానుభూతిపరులకు వ్యతిరేకంగా హింసను ప్రేరేపించాలని, సిక్కులను భయాందోళనకు గురి చేయాలని, వారికి సంబంధించిన సమాచారం సేకరించాలంటూ భారత నిఘా అధికారులను అమిత్ షా ఆదేశించారని చెప్పారు. అయితే, అమిత్ షా ఈ ఆదేశాలిచ్చినట్లు కెనడాకు ఎలా తెలిసిందో మోరిసన్ వెల్లడించలేదు. 2023 జూన్‌లో జరిగిన ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనుక భారత్ హస్తం ఉందని కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో పదే పదే ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. జస్టిన్ ట్రూడో వైఖరితో భారత్-కెనడా మధ్య సంబంధాలు ఇప్పటికే చాలావరకు క్షీణించాయి. అయినా కూడా కెనడా మంత్రి మోరిసన్ నోరుపారేసుకోవడం గమనార్హం.



భారత అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్



కెనడా మంత్రి డేవిడ్ మోరిసన్

కెనడా హైకమిషన్ ప్రతినిధికి నిరసన

కెనడా మంత్రి డేవిస్ మోరిసన్ చేసిన ఆరోపణలపై భారత్ తీవ్రంగా స్పందించింది. అర్థంపర్థం లేని, ఆధారాల్లేని ఆరోపణలు చేశారని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మండిపడ్డారు. తాము తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. బాధ్యతారాహిత్యమైన ప్రవర్తన భారత్, కెనడా సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. అసంబద్ధమైన ఆరోపణలతో పరిస్థితిని దిగజార్చవద్దని సూచించారు. భారత్‌ను అప్రతిష్టపాలు చేసే కుతంత్రాలు మానుకోవాలని కెనడాకు స్పష్టంచేశారు. కెనడా మంత్రులు, అధికారులు భారత్ గురించి అంతర్జాతీయ మీడియాకు ఉద్దేశపూర్వకంగా తప్పుడు లీకులు ఇస్తున్నారని రణధీర్ జైస్వాల్ ఆరోపించారు. కెనడా మంత్రి మోరిస్ తాజా ఆరోపణల పట్ల భారత్‌లోని కెనడా హైకమిషన్ ప్రతినిధిని పిలిపించి, తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశామని తెలిపారు.

కెనడాలో భారత కాన్సులర్ సిబ్బందికి వేధింపులు

కెనడాలోని భారత కాన్సులర్ సిబ్బందిని కెనడా ప్రభుత్వం వేధింపులకు గురి చేస్తోందని రణధీర్ జైస్వాల్ ఆరోపించారు. వారిపై ఆడియో, వీడియో నిఘా పెట్టిందని చెప్పారు. సిబ్బంది మధ్య సమాచార మార్పిడిని అడ్డుకుంటోందని వెల్లడించారు. తరచుగా వేధించడంతోపాటు భయభ్రాంతులకు గురిచేస్తోందని ధ్వజమెత్తారు. దౌత్యపరమైన నిబంధనలు, ఒప్పందాలను కెనడా ఉల్లంఘిస్తోందని విమర్శించారు. దీనిపై తమ నిరసనను కెనడా ప్రభుత్వానికి తెలియజేశామని చెప్పారు.

విమానంలో బుల్లెట్ల కాట్రిడ్జ్

కలకలం రేపిన ఘటన

న్యూఢిల్లీ: దుబాయ్ నుంచి వచ్చిన ఎయిరిండియా విమానంలో బుల్లెట్ల కాట్రిడ్జ్ కనిపించడం కలకలం రేపింది. దేశీయ విమానయాన సంస్థలకు వరుస బాంబు బెదిరింపులు వస్తున్న వేళ్ల చోటుచేసుకున్న ఈ ఘటన అలజడి సృష్టించింది. నంబర్ ఏఐ 916 ఎయిరిండియా విమానం అక్టోబర్ 27వ తేదీన దుబాయ్ నుంచి న్యూఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండయ్యింది. ప్రయాణికులంతా సురక్షితంగా కిందికి దిగిన తర్వాత ఒక సీటుపైనున్న బుల్లెట్ల కాట్రిడ్జ్‌ను సిబ్బంది గమనించారు. దీనిపై వెంటనే వారు విమానాశ్రయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటువంటి వాటిని విమానంలోకి తీసుకురావడం పూర్తి నిషేధం ఉంది. ఇప్పటికే 400కు పైగా విమాన సర్వీసులకు బాంబు బెదిరింపులు రావడం..అవన్నీ ఉత్తుత్తివేనని తేలడం తెలిసిందే. భద్రతా చర్యలను తనిఖీలను ముమ్మరం చేసినా పేలుడు సామగ్రి కనిపించడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఇలా ఉండగా, సోమవారం నేపాల్‌లోని త్రిభువన్ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి రావాల్సిన ఎయిరిండియా విమానానికి బాంబు బెదిరింపు అందింది. విమానాశ్రయం అధికారులు వెంటనే సిబ్బందిని కిందికి దించి పూర్తి స్థాయిలో సోదాలు జరిపారు. ఎటువంటి ప్రమాదకర వస్తువులు లేకపోవడంతో కొద్దిసేపటికి విమానం టేకాఫ్ తీసుకుంది.

దిమ్మతిరిగేలా బదులిస్తాం

అమెరికా, ఇజ్రాయెల్‌కు ఖమేనీ హెచ్చరిక

దుబాయ్/టెహ్రాన్: గత నెలాఖరులో ఇజ్రాయెల్ తమ మిలటరీ లక్ష్యాలపై చేపట్టిన దాడులపై ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ తీవ్రంగా స్పందించారు. దిమ్మతిరిగేలా బదులిచ్చి తీరతామంటూ అమెరికా, ఇజ్రాయెల్‌లను హెచ్చరించారు. ''మాకు, హెజ్‌బొల్లా, హమాస్ వంటి మా మిత్ర గ్రూపులకు హాని తలపెడుతున్నందుకు తగు మూల్యం చెల్లించుకోకతప్పదు. మాపై, మా మిత్ర దేశాలపై దాడులకు దిగితే తీవ్ర పరిణామాలుంటాయి. శత్రువులను పూర్తిగా అణగదొక్కేలా మా ప్రతిస్పందన ఉంటుందని అమెరికా, ఇజ్రాయెల్ గ్రహించాలి. అనవసరంగా మా జోలికి రావొద్దు. ఇబ్బందుల్లో పడొద్దు''అని శనివారం టెహ్రాన్ వర్సిటీ విద్యార్థులతో జరిగిన సమావేశంలో ఖమేనీ పేర్కొన్నారు. ఇరాన్ అధికారిక టీవీ చానల్ ఈ మేరకు తెలిపింది. 'మా నరాల్లో ప్రవహిస్తున్న రక్తం మా నాయకుడికి బహుమానం'అంటూ ఖమేనీకి మద్దతుగా విద్యార్థులు భారీగా నినాదాలు చేశారు. హమాస్, హెజ్‌బొల్లా అగ్ర నాయకులు హతమైన నేపథ్యంలో ఇరాన్ అక్టోబర్ ఒకటో తేదీన ఇజ్రాయెల్‌పై పెద్ద సంఖ్యలో క్షిపణులతో విరుచుకుపడింది. ప్రతిగా ఇజ్రాయెల్ గత శనివారం ఇరాన్‌లోని సైనిక లక్ష్యాలపై దాడులు చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరు పక్షాల్లో ఎవరు ఎవరిపై దాడికి దిగినా పశ్చిమాసియా అగ్నిగుండం అవుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్, అమెరికా శత్రు దేశాలుగా మారడానికి కారణమైన ఘటనకు ఆదివారం 45 ఏళ్లు నిండనుండటం మరింత ఉత్కంఠ కలిగిస్తోంది. 1979 నవంబర్ 4న ఇరాన్‌లోని అమెరికా రాయబార కార్యాలయాన్ని ఇస్లామిస్టు విద్యార్థులు దిగ్బంధించారు. సిబ్బందిని కార్యాలయంలోని బంధించారు. ఈ సంక్షోభం ఏకంగా 444 రోజులు కొనసాగింది. నాటినుంచే ఇరాన్, అమెరికా శత్రు దేశాలుగా మారిపోయాయి.

ఇజ్రాయెల్‌కు మరింత సాయం

ఇజ్రాయెల్‌కు అమెరికా మరింత సాయం ప్రకటించింది. అగ్నిమాపక ఎయిర్ ట్యాంకర్ విమానాలు, బాలిస్టిక్ క్షిపణి రక్షణ వ్యవస్థలు, ఫైటర్ విమానాలు, లాంగ్ రేంజ్ బి-52 బాంబర్లను పశ్చిమాసియాకు తరలించనున్నట్లు శనివారం పేర్కొంది. అమెరికా ఇప్పటికే ఇజ్రాయెల్‌కు గగనతల రక్షణ వ్యవస్థలను, భారీగా సైనిక, ఆయుధ సామగ్రిని సమకూర్చడం తెలిసిందే.



కెనడా 'సైబర్ ముప్పు' జాబితాలో భారత్

ఒట్టావా/న్యూఢిల్లీ: ఇండియా విషయంలో కెనడా ప్రభుత్వం దుందుడుకు చర్యలకు పాల్పడుతోంది. ఇండియా నుంచి తమకు సైబర్ ముప్పు పొంచి ఉందని పేర్కొంది. ఏయే దేశాల నుంచి సైబర్ ముప్పు ఉందన్న దానిపై గత నెల 30న కెనడియన్ సెంటర్ ఫర్ సైబర్ సెక్యూరిటీ(సైబర్ సెంటర్) ఓ జాబితా విడుదల చేసింది. ఇందులో ఇండియాను సైతం చేర్చింది. నేషనల్ సైబర్ థ్రెట్ అసెస్‌మెంట్(ఎన్‌సీటీఏ) 2025-26లో చైనా, రష్యా, ఇరాన్, ఉత్తర కొరియా తర్వాత ఇండియా పేరును చేర్చడం గమనార్హం. భారత ప్రభుత్వం నియమించిన వ్యక్తులు గూఢచర్యం కోసం తమ ప్రభుత్వ నెట్‌వర్క్‌పై సైబర్ ముప్పు కార్యకలాపాలకు పాల్పడే ప్రమాదం ఉందని కెనడా ప్రభుత్వం ఆరోపించింది. ఎన్‌సీటీఏ జాబితాను ప్రతి రెండేళ్లకోసారి విడుదల చేస్తుంటారు. 2018, 2020, 2023-24 నాటి జాబితాలో ఇండియా పేరులేదు. తొలిసారిగా 2025-26 జాబితాలో ఇండియా పేరు చేర్చారు. ఇదిలా ఉండగా, భారత్ నుంచి సైబర్ ముప్పు పొంచి ఉందంటూ కెనడా విడుదల చేసిన జాబితాపై భారత విదేశాంగ శాఖ అధికారి రణధీర్ జైస్వాల్ శనివారం అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాల అభిప్రాయాన్ని భారత్‌కు వ్యతిరేకంగా మార్చాలన్నదే కెనడా కుట్ర అని ఆరోపించారు.

లెబనాన్‌లో 52కు చేరిన మృతులు

బీరుట్: లెబనాన్‌లోని బెకా లోయపై ఇజ్రాయెల్ ఆర్మీ శుక్రవారం జరిపిన వైమానిక దాడుల్లో మృతుల సంఖ్య 52కు చేరింది. మరో 72 మంది గాయపడ్డారు. బాల్బెక్ నగరం సహా కనీసం 25 పట్టణాలు, గ్రామాల్లోని లక్ష్యాలపై దాడులు జరిగాయి. భవనాలు శిథిలాల దిబ్బలుగా మారాయని, ఇంకా చాలా శిథిలాల కింద చిక్కుకుని ఉన్నారని సహాయక సిబ్బంది అంటున్నారు. పర్వత శ్రేణుల మధ్యలో ఉన్న ఈ ప్రాంతంలోని కుగ్రామాల్లో వ్యవసాయమే ప్రధానవృత్తి. ఆలివ్, ద్రాక్ష తోటలు, మద్యం తయారీ యూనిట్లకు ప్రసిద్ధి. ఇప్పటి వరకు ఇజ్రాయెల్ ఆర్మీ ఈ ప్రాంతం జోలికి వెళ్లలేదు. ఒక్కసారిగా జరిగిన భీకర వైమానిక దాడులతో భీతిల్లిన జనం ఇళ్లు విడిచి కట్టుబట్టలతో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు.

24 గంటల్లో 84 మంది

గాజా ఉత్తరప్రాంతంపై ఇజ్రాయెల్ సైన్యం జరిపిన దాడుల్లో 24 గంటల వ్యవధిలో 50 మంది చిన్నారులు సహా 84 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. మరో 200 మంది వరకు గాయాలపాలయ్యారని గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. ఖాన్‌యూనిస్‌లో జరిపిన దాడిలో హమాస్ సీనియర్ అధికారి ఇజ్ అల్- దిన్ కస్సబ్ మృతి చెందినట్లు ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించింది. దీనిపై హమాస్ స్పందించలేదు.

జేఎంఎంకు 43, కాంగ్రెస్‌కు 30 సీట్లు

- ఆర్జేడీకి 6, వామపక్షాలకు 3
- జార్ఖండ్‌లో పూర్తయిన సీట్ల సర్దుబాటు

రాంచీ: జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో 'ఇండియా'కూటమిలో సీట్ల సర్దుబాటు పూర్తయ్యింది. ఈ మేరకు కూటమి పార్టీలు శనివారం ఒప్పందం ఖరారు చేసుకున్నాయి. జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) 43 సీట్లు, కాంగ్రెస్ 30, రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) 6, వామపక్షాలు 3 సీట్లలో పోటీ చేయనున్నాయి. మూడు చోట్ల కూటమి పార్టీల మధ్య స్నేహపూర్వక పోటీ ఉండనుంది. అధికార సీట్ల సర్దుబాటు ఇండియా కూటమి ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. 82 స్థానాలున్న జార్ఖండ్ అసెంబ్లీకి ఈ నెల 13, 20న ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నెల 23 ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. మరోవైపు జేఎంఎం అప్పటికే తమ అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది. జేఎంఎం అగ్రనేత, ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ బార్హైత్ స్థానం నుంచి, ఆయన భార్య కల్పనా సోరెన్ గాండే స్థానం నుంచి పోటీ చేస్తున్నారు.

గంగోత్రి ఆలయం మూసివేత

నేడు యమునోత్రి, కేదార్‌నాథ్, 17న బద్రీనాథ్ ఆలయాలు కూడా

ఉత్తరకాశీ: ఉత్తరాఖండ్‌లోని గఢ్వాల్ హిమాలయాల్లో ఉన్న గంగోత్రి ఆలయాన్ని శనివారం అధికారులు మూసివేశారు. సముద్ర మట్టానికి 10 వేల అడుగుల ఎత్తులో ఆలయం ఉంటుంది. అన్నకూట్ ఉత్సవం అనంతరం మధ్యాహ్నం 12.14 గంటలకు హర్ హర్ గంగే, జై మా గంగే అంటూ భక్తులు, పూజారుల మంత్రోచ్చారణల నడుమ ఆలయ తలుపులను మూసివేశారు. ఆలయంలో గంగా మాత విగ్రహాన్ని పల్లకీలో ఊరేగింపుగా ముఖ్బాకు తీసుకెళ్లారు. శీతాకాలం ముగిసే వరకు గంగా మాత విగ్రహం అక్కడే ఉంటుంది. ఈ ఆలయాన్ని ఈ సీజన్‌లో 8 లక్షల మంది దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. గంగోత్రితో పాటు చార్‌ధామ్‌లో భాగమైన యమునోత్రి, కేదార్‌నాథ్ ఆలయాలను ఆదివారం, బద్రీనాథ్‌ను ఈ నెల 17వ తేదీన ఆఖరుగా మూసివేస్తారు. ఈ ఆలయాల తలుపులను వేసవి ఆరంభంలో ఏప్రిల్- మే నెలల్లో తిరిగి తెరుస్తారు.

క్షమాపణ చెప్పిన ఎంపీ సావంత్

ముంబై: శివసేన(షిండే) అభ్యర్థి షైనా ఎన్‌సీకి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలపై శివసేన(ఉద్ధవ్)ఎంపీ అరవింద్ సావంత్ క్షమాపణలు చెప్పారు. సావంత్ చేసిన వ్యాఖ్యలపై షైనా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయడం తెలిసిందే. సావంత్ శనివారం మీడియాతో మాట్లాడారు. 'మహిళలను గౌరవించే వారిలో నేనెప్పుడూ ముందే ఉంటా. నా 55 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎవరినీ అవమానించలేదు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ కారణాలతో నా వ్యాఖ్యలను కావాలనే వక్రీకరించారు. నా వ్యాఖ్యలతో ఎవరి మనోభావాలకైనా ఇబ్బంది కలిగినట్లయితే క్షమాపణ కోరుతున్నా'అని అన్నారు. 'గతంలో జెర్సీ ఆవు, శూర్పణఖ అంటూ ఇతర నేతలు వ్యాఖ్యానించినప్పుడు ఏం చేశారు? సుప్రియా సూలేపై చేసిన వ్యాఖ్యలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అని ప్రశ్నించారు. సావంత్ వ్యాఖ్యలపై షైనా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై ఏం చర్యలు తీసుకున్నారో తెలపాలంటూ జాతీయ మహిళా కమిషన్ చీఫ్ విజయా రాహత్కర్ శనివారం పోలీసులను, ఎన్నికల కమిషన్‌ను కోరారు.

బాలికపై అత్యాచారం, హత్య.. మూకదాడిలో నిందితుడు మృతి

కోల్‌కతా: బాలికపై అత్యాచారానికి పాల్పడి, హత్య చేశాడనే కోపంతో గ్రామస్తులంతా కలిసి ఓ వ్యక్తిని చితక్కొట్టి చంపేశారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రం అలిపూర్‌దువార్ జిల్లా ఫలకటా ప్రాంతంలో శుక్రవారం మధ్యాహ్నం ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బాలిక మృతదేహం స్థానిక చెరువులో ప్రత్యక్షమైంది. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ గ్రామస్తులు ఇందుకు కారణమని భావిస్తూ నలభయ్యేళ్ల వ్యక్తిని తాళ్లతో చెట్టుకు కట్టేసి, విచక్షణా రహితంగా కొట్టారు. పోలీసులు అక్కడికి చేరుకుని, బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ కేసులో నిందితుడిగా భావిస్తున్న మరో వ్యక్తి పోలీసుల ఎదుట లొంగిపోయాడు. బాధితురాలికి న్యాయం జరగాలని, నిందితుడికి మరణ శిక్ష వేయాలంటూ గ్రామస్తులు పోలీస్ స్టేషన్ ఎదుట నిరసనకు దిగారు. గ్రామంలో పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించారు.



శాండ్ విచ్.. పోషకాలు రిచ్..
నగరంలో అత్యంత క్రేజీ స్నాక్స్‌లో శాండ్‌విచ్ ఒకటి. రకరకాల ఫ్లేవర్స్‌లో అందుబాటులో ఉండే ఈ రుచికరమైన శాండ్‌విచ్ పోషకాహా రంగా కూడా పేరొందింది. - సిటీప్లస్‌లో



పరిసరాలపై 'విశ్వా'సం
చెరువుల్లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాల తొలగింపునకు నడుం బిగించింది. అయిదుగురితో ప్రారంభమైన విశ్వ సస్టెనబుల్ ఫౌండేషన్ ప్రస్తుతం 500 మందికిపైగా వలంటీర్లను జత చేసుకుంది. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
32.0/20.0
నగరంలో ఆదివారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది . గరిష్ఠంగా 32, కనిష్ఠంగా 20 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

6, 7 తేదీల్లో హెచ్ఐసీసీలో ఫెసా-2024



వివరాలు వెల్లడిస్తున్న ఎఫ్ఎస్ఏఐ ప్రతినిధులు

సనత్‌నగర్: హైదరాబాద్ ఫార్మా పరిశ్రమపై ఫైర్ సంబంధిత అంశాలపై తొలిసారిగా జాతీయ స్థాయి సదస్సుకు నగరం వేదిక కానుంది. దేశంలోనే అతి పెద్ద సెమినార్ నిర్వహణను ఈ నెల 6, 7 తేదీల్లో రెండు రోజుల పాటు మాదాపూర్ హెచ్ఐసీసీలో తలపెట్టారు. ఫైర్ అండ్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఏఐ) ఆధ్వర్యంలో ఫైర్, ఎలక్ట్రికల్, సెక్యూరిటీ అండ్ ఆటోమేషన్ (ఫెసా–2024) పేరిట జరిగే ఈ సదస్సులో దేశ నలుమూలల నుంచి వచ్చిన ఆయా రంగాలకు చెందిన నిపుణులు చర్చించనున్నారు. ఈ సదస్సు వివరాలను శనివారం బేగంపేట హరితా ప్లాజాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎఫ్ఎస్ఏఐ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ వల్లూరి, హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడు ప్రసాద్ నిష్టల, సౌత్ రీజినల్ డైరెక్టర్ ప్రసాద్‌రాజు, చైర్మన్ మనోజ్ బాలకృష్ణన్, ఆపరేషన్స్ వైస్ చైర్మన్ శ్రావణ్‌కుమార్, కార్యదర్శి చంద్రశేఖర్‌లు వెల్లడించారు.

ఇంటింటికీ స్టిక్కర్!



మొత్తం 56 ప్రశ్నలు సిద్ధం చేసిన జిల్లా యంత్రాంగం

- 150 నుంచి 175 ఇళ్లకో ఎన్యూమరేటర్ నియామకం
- 5,375 మంది ఉపాధ్యాయులకు విధులు
- కుల గణనపై శంషాబాద్‌లో కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం
- బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు, ఇతర నేతలు డుమ్మా

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఇంటింటి, సమగ్ర కులగణన సర్వేకు రంగారెడ్డి జిల్లాలో యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. 2011 జనాభా లెక్కల ప్రకారంగా..అధికారులు ఇప్పటికే సమగ్ర మ్యాప్‌ను సిద్ధం చేసుకున్నారు. సర్వేలో భాగంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల, విద్య, ఉపాధి వంటి 56 అంశాలను సేకరించనున్నారు. వివరాల సేకరణ అనంతరం సంబంధిత ఇళ్లకు స్టిక్కర్లు అంటించనున్నారు. రంగారెడ్డి జిల్లాలో 21 మండలాలు, 13 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లు సహా 549 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో తొమ్మిది లక్షలకుపైగా కుటుంబాలు ఉన్నట్లు అంచనా. జిల్లా వ్యాప్తంగా 36,51,513 మంది ఓటర్లు ఉన్నారు. 18 ఏళ్లలోపు మరో 20 లక్షల మంది ఉన్నట్లు అంచనా. ఈ నెల 6 నుంచి 30 వరకు నిర్వహించనున్న ఈ ఇంటింటి సర్వేకు జిల్లా వ్యాప్తంగా 5,375 మంది ఎన్యూమరేటర్లు అవసరం ఉంటుందని అంచనా వేశారు. 150 నుంచి 175 కుటుంబాలకు ఒక ఎన్యూమరేటర్‌ను నియమించనున్నారు. ఏ రోజు.. ఏ గ్రామంలో.. ఏ వార్డులో.. ఏ సమయంలో.. సర్వే చేయపట్టనున్నారనే సమాచారాన్ని ముందే ఆయా ప్రాంతాల్లోని కుటుంబ సభ్యులకు తెలియజేస్తారు. సర్వే సమయంలో కుటుంబ సభ్యులంతా ఉండాల్సిన అవసరం లేదు. ఎవరో ఒకరు ఉండి..అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబితే సరిపోతుంది. సర్వేలో భాగంగా ఎలాంటి ఫొటోలు, గుర్తింపు పత్రాలు స్వీకరించరు. సర్వేలో భాగంగా 56 అంశాలతో అధికారులు ప్రశ్నావళిని రూపొందించారు. వీటిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఆ ఎమ్మెల్యేలు గైర్హాజరు..
సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం శంషాబాద్‌లో నిర్వహించిన విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశానికి.. ఇటీవల బీఆర్ఎస్‌ను వీడి.. కాంగ్రెస్‌లో చేరిన రాజేంద్రనగర్, చేవెళ్ల, శేరిలింగంపల్లి ఎమ్మెల్యేలు ప్రకాష్‌గౌడ్, కాలె యాదయ్య, అరికెపూడి గాంధీ గైర్హాజరయ్యారు. అధికార పార్టీలో చేరినప్పటికీ.. ఆ పార్టీ అంతర్గత సమావేశాలకు హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

కులగణనతో బలహీన వర్గాలకు బాసట: శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

శంషాబాద్: బలహీన వర్గాలకు బాసటగా నిలిచేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆలోచన మేరకు రాష్ట్రంలో కులగణన సర్వేను చేపట్టనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. సామాజిక, ఆర్థిక, కుల గణన సర్వేపై జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ నేతలతో పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశానికి మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. ఇటీవల వర్సిటీల వీసీల నియామకంలోనూ ప్రభుత్వం బలహీన వర్గాలకే ప్రాధాన్యమిచ్చిందని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు జరుగుతున్న కులగణన సర్వేను విజయవంతం చేయడంలో కాంగ్రెస్ శ్రేణులు కీలకంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పి. మహేందర్‌రెడ్డి, భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్ రెడ్డి, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్ ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకరయ్య, పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ధనుంజయ్, రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ అనితారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కుమారుడిని కరిచిందనే కోపంతో..

- పెంపుడు కుక్కను భవనంపై నుంచి పడేసి చంపిన తండ్రి
- పోలీసులకు శునకం యజమానురాలి ఫిర్యాదు



అబిడ్స్: కుమారుడిని కరిచిందని ఆగ్రహానికి గురైన ఓ తండ్రి.. శునకాన్ని కొట్టడంతో పాటు దానిని భవనంపై నుంచి కింద పడేసి చంపిన ఘటన షాహినాయత్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జుమ్మేరాత్‌బజార్ దేవినగర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ జి.రాజేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జుమ్మేరాత్‌బజార్ దేవినగర్ ప్రాంతంలో నివాసం ఉండే మల్లమ్మ అనే మహిళ శునకాన్ని పెంచుకుంటోంది. ఇదే ప్రాంతానికి చెందిన సత్తులు అనే వ్యక్తి పది, పన్నెండేళ్ల వయసున్న ఇద్దరు కుమారులు శుక్రవారం రాత్రి టపాసులు కాలుస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని టపాకాయలు మల్లమ్మకు చెందిన శునకంపై పడ్డాయి. కోపంతో అది సత్తులు కుమారుడిని కరిచింది. విషయం తెలుసుకున్న సత్తులు ఆగ్రహంతో శునకాన్ని కర్రతో కొట్టి భవనంపై అంతస్తు నుంచి కింద పడవేయడంతో అది అక్కడికక్కడే మృతి చెందింది. తన పెంపుడు కుక్కను చంపిన సత్తులుపై మల్లమ్మ షాహినాయత్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

దూసుకొచ్చిన మృత్యువు



బస్సు చక్రాల కింద పడి మృతిచెందిన రోహిత

లాలాపేట: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందిన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఓయూ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా మంథనికి చెందిన మారుపాక రోహిత (25) సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. తార్నాకలోని వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో తన సోదరి హర్షితతో కలిసి ఉంటున్నారు. ఉదయం 10 గంటల ప్రాంతంలో హైటెక్ సిటీలో ఉద్యోగానికి వెళ్లేందుకు తార్నాక నుంచి హబ్సిగూడ వైపు తన ద్విచక్ర వాహనంపై బయలుదేరింది. తార్నాకలోని స్మార్ట్ బజార్ వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు(కుషాయిగూడ డిపోకు చెందిన 3కె, బస్సు నెంబర్ ఏపీ 28జెడ్ 4637) రోహిత ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె ఎగిరి బస్సు ముందు చక్రం కింద పడింది. బస్సు టైరు రోహిత తలపై నుంచి వెళ్లడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం 108 అంబులెన్స్ ద్వారా గాంధీ మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ఓయూ పీఎస్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెత్త సేకరణ ఉత్తిదే!

- ఇళ్లకు బదులు హోటళ్లు, ఫంక్షన్ హాళ్లకు సేవలు
- ఏటా వృథా అవుతున్న రూ.వందల కోట్లు
- అధికారుల నిర్లక్ష్యంతో తీరని వ్యర్థాల సమస్య

గ్రేటర్‌లో గాడి తప్పిన స్వచ్ఛ ఆటో వ్యవస్థ



సాక్షి, సిటీబ్యూరో: కోటి మందికి పైగా ప్రజలున్న మహా నగరంలో చెత్త సమస్యకు జీహెచ్ఎంసీ పరిష్కారం చూపలేకపోతోంది. ఏటా వందల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా చెత్త నిర్వహణలో విఫలమవుతోంది. సమస్యలు పరిష్కరించేందుకు.. ఏరోజు చెత్త ఆ రోజు ఇళ్ల నుంచి నిర్వహణ కేంద్రం వరకు సజావుగా వెళ్లేందుకు ప్రధాన కార్యాలయ స్థాయిలో అడిషనల్, జాయింట్ కమిషనర్లు.. జోన్లు, సర్కిళ్ల స్థాయిల్లో జోనల్, డిప్యూటీ కమిషనర్లు, ఏఎంఓహెచ్‌లున్నా పరిస్థితిలో మార్పు మాత్రం కనిపించడం లేదు.

దారి మళ్లుతున్న ఆటోలు..
స్వచ్ఛ నగరం కోసమంటూ దాదాపు 4,500 ఆటోలను కొనుగోలు చేసి.. వాటిని స్వచ్ఛ ఆటోలుగా వ్యవహరిస్తున్నా, ఇళ్లనుంచి చెత్తను తరలించేందుకు అవి ఉపయోగపడటం లేదు. ఒక్కో ఆటోకు దాదాపు రూ.7 లక్షల వంతున వ్యయమైంది. ఇంతమంది అధికారులున్నా.. కార్మికుల పేరిట ఆటోల కొనుగోళ్లకు తీసుకున్న రుణాలకు నెలనెలా ఈఎంఐలు చెల్లిస్తున్నా.. వాటిలో ఎన్ని ఆటోలు చెత్త తరలిస్తున్నాయో, ఎన్ని మాయమయ్యాయో అధికారుల వద్ద లెక్కలు లేకపోవడం పరిస్థితికి దర్పణం పడుతోంది. స్వచ్ఛ ఆటోల మీద అధికారులకు పట్టు, నియంత్రణ లేకపోవడంతో ఇవి దారి మళ్లుతున్నాయి.

రెండు మూడు రోజుల దాకా అడ్రసే ఉండవ్..
ఒక్కో ఆటో ప్రతిరోజూ దాదాపు 500 ఇళ్లనుంచి చెత్త సేకరించాల్సి ఉన్నప్పటికీ ఆ పని జరగడం లేదు. ఇళ్ల బదులు ప్రైవేట్ హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు, హాస్టళ్ల నుంచి సేకరణకే అవి మొగ్గు చూపుతుండటంతో ఇళ్లలో చెత్త పేరుకుపోతోంది. రెండు మూడు రోజులకు కూడా స్వచ్ఛ ఆటో రాకపోవడంతో ప్రజలు రోడ్లపై వేస్తున్నారు. దీంతో గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ (జీవీపీ) పెరుగుతున్నాయి. స్వచ్ఛ ఆటోల కొనుగోలు లక్ష్యమేమిటో కూడా తెలుసుకోలేని స్థితిలో అధికారులుండటం దౌర్భాగ్యం. వాటిని నడపాల్సిన కార్మికులు ఇళ్లకు బదులు హోటళ్లకు వెళ్తున్నా కట్టడి చేయలేక.. చేతులెత్తేయడం పరిస్థితికి దర్పణం పడుతోంది. దీంతో కోట్ల రూపాయలు వెచ్చించినా ఫలితం లేకుండా పోతోంది.

పైకి అంతా పటాటోపమే..
అసలు స్వచ్ఛ ఆటో ఆలోచనే జీహెచ్ఎంసీది కాగా.. జీహెచ్ఎంసీని చూశాక అమలు ప్రారంభించిన ఇండోర్ వంటి నగరాల్లో ఇంటింటి నుంచి చెత్త సేకరణ పటిష్ఠంగా అమలవుతుండగా, ఇక్కడ మాత్రం గాడి తప్పడం అధికారుల నిర్లక్ష్యానికి మచ్చుతునక. ప్రతి ఆటో ఏ గంట ఎక్కడికి వెళ్లాలో ఇండోర్‌లో కచ్చితంగా తెలుస్తుండగా, జీహెచ్ఎంసీలో మాత్రం అసలు ఎన్ని ఆటోలు పని చేస్తున్నాయో కూడా తెలియని దుస్థితి. ప్రతి ఆటో ఎప్పుడు ఎక్కడుందో తెలిసేలా జీపీఎస్‌తో ట్రాకింగ్, ప్రత్యేక వెబ్‌పోర్టల్, చెత్త సేకరించగానే ఇళ్ల వద్ద క్యూఆర్ కోడ్‌తో స్కానింగ్ తదితరమైనవన్నీ ప్రకటనల పటాటోపాలుగా తప్ప అమలుకు నోచుకోవడం లేదు. అధికారులు ఇలాగే వ్యవహరిస్తే ఇంకెన్నేళ్లయినా ఈ చెత్త సమస్య తీరదని పట్టణ వ్యవహారాల, పర్యావరణ నిపుణులు చెబుతున్నారు.

అధ్యయన యాత్రలు సరే.. బెస్ట్ ప్రాక్టీసెస్ అమలేదీ..?
ఆయా నగరాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై అధ్యయనానికి వెళ్తున్న కార్పొరేటర్లు అక్కడ గ్రహిస్తున్న అంశాలతో నగరంలో ఏమార్పు తెస్తున్నారో వారికే తెలియాలి. దీంతో అవి వారి విహార యాత్రలుగా మాత్రమే మారుతున్నాయి. ఇటీవలే ఇండోర్, లక్నో తదితర నగరాలు చుట్టి వచ్చారు. త్వరలోనే అధికారులు సైతం ఇండోర్‌కు వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

నిబంధనలు తుంగలో తొక్కి..

నిబంధనల మేరకు స్వచ్ఛఆటోల ద్వారా తరలించే చెత్త బయటకు కనిపించకూడదు. తడి, పొడి చెత్త వేర్వేరుగా ఆటోల్లో వేయాలి. కానీ.. ప్రజలు తడి, పొడి వేరు చేసి ఇచ్చినా కలిపే ఆటోలో వేస్తుండటంతో తడి, పొడి వేరు చేసేవారు కూడా మానేశారు. ఆటో నిండుగా చెత్త నింపడమే కాక, ఆటో ట్రాలీలకు రెండు వైపులా నిండిన బస్తాలను వేలాడదీస్తూ వెళ్తుండటంతో రోడ్లపై పడుతోంది. ఇలా ఏ ఒక్క అంశంలోనూ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, అశ్రద్ధ వల్లే ఎన్ని కోట్లు ఖర్చుచేసినా నగరంలో చెత్త సమస్య తీరడం లేదు. స్వచ్ఛ ఆటోలన్నింటినీ జీహెచ్ఎంసీ తన కంట్రోల్‌లోకి తెచ్చుకోలేకపోయినంత కాలం ఈ సమస్య తీరదని సంబంధిత నిపుణులు చెబుతున్నారు.



హవ్వ.. 10 శాతమే..

ఓటీఎస్‌తో నీటి బకాయిల చెల్లింపు అంతంతమాత్రమే

- గడువుకు చేరువలో సంక్షిప్త సమాచారం
- వినియోగదారులకు అవగాహన కరువు
- విస్తృత ప్రచారంలో విఫలమైన జలమండలి
- ఈ నెల 30 వరకు మళ్లీ గడువు పొడిగింపు



సాక్షి, సిటీబ్యూరో: నల్లా నీటి పెండింగ్ బకాయిలను ప్రభుత్వం ఎలాంటి ఆలస్య రుసుం, వడ్డీ లేకుండా చెల్లించేందుకు వెసులుబాటు కల్పించినా.. సంబంధిత అధికారగణం విస్తృత ప్రచారంతో వినియోగదారులకు అవగాహ కల్పించడంలో పూర్తిగా విఫలమైంది. కేవలం గడువుకు వారం రోజుల ముందు వినియోగదారుల రిజిస్టర్డ్ ఫోన్లకు మొక్కుబడిగా సంక్షిప్త సమాచారం పంపించి చేతులు దులుపుకొంది. ఫలితంగా వన్‌టైమ్ సెటిల్‌మెంట్ సద్వినియోగం అంతంత మాత్రంగా తయారైంది. వాస్తవంగా నల్లా నీటి బకాయిలు చెల్లించేందుకు వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్–2024) పథకానికి సంబంధించి గత నెల 4న పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. జలమండలి అధికార గణం మాత్రం 22వ తేదీ తర్వాత నుంచి బిల్లులు బకాయిపడిన వినియోగదారులకు సంక్షిప్త సమాచారం పంపించడం ప్రారంభించడం గమనార్హం. తాజాగా వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని నవంబర్ చివర వరకు పొడిగించినట్లు జలమండలి ప్రకటించింది.

సద్వినియోగం చేసుకుంది 70,335 మంది మాత్రమే..
జలమండలి పరిధిలో సుమారు 13.50 లక్షల నల్లా కనెక్షన్లు ఉండగా అందులో సుమారు 7.11 లక్షల కనెక్షన్‌దారుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అందులో అక్టోబర్ 31 నాటికి కేవలం పది శాతం వినియోగదారులు మాత్రమే వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకున్నట్లు జలమండలి ప్రకటించింది. మొత్తమ్మీద దాదాపు రూ.1,792 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. ఇందులో ఆలస్య రుసుంతో పాటు వడ్డీ రూపంలో ఉన్న రూ.1,230 కోట్ల బకాయిలు మాఫీ కానున్నాయి. ఇప్పటి వరకు కేవలం 70,335 మంది వినియోగదారులు మాత్రమే వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని సద్వినియోగం చేసుకొని వడ్డీ, ఆలస్య రుసుం మినహాయింపుతో కేవలం రూ.49 కోట్లు చెల్లించినట్లు జలమండలి ప్రకటించింది.

ఆన్‌లైన్ చెల్లింపులతోనూ సమస్యే..
ఆన్‌లైన్‌లో బకాయి బిల్లులు చెల్లింపు సమస్యగానే తయారైంది. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం ద్వారా చెల్లించే వారికి హామీ పత్రం అప్‌లోడ్ సమస్యగా తయారైంది. ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించే విధానం సరిగా లేక వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి కానీ, ఆన్‌లైన్ లింక్ ఓపెన్ చేసి కానీ, అందులో క్యాన్ నంబర్ ఎంటర్ చేయగానే మొత్తం పెండింగ్ బిల్ ఎంత? ఓటీఎస్‌లో ప్రిన్సిపల్ ఎమౌంట్ ఎంత చెల్లించాలనే వస్తోంది. మొత్తం వివరాలు నమోదు చేసిన తర్వాత అఫిడవిట్ ఫామ్‌ను డౌన్ లోడ్ చేసుకుని మళ్లీ అందులో యజమాని వివరాలు నింపి రూ. 20 నాన్ జ్యుడీషియల్ స్టాంప్ అతికించి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. చాలా మందికి ఇది తెలియక క్యూఆర్ కోడ్ వరకు స్కాన్ చేసి వదిలేశారు.

మరో మెలిక..
జలమండలి నిబంధనల ప్రకారం వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకం కింద ప్రయోజనం పొందాలనుకునే వినియోగదారులు భవిష్యత్తులో 24 నెలల పాటు తప్పనిసరిగా క్రమంగా బిల్లులు చెల్లిస్తామని హామీ పత్రం ఇవ్వాల్సి ఉంటుంది. బిల్లు చెల్లింపుల విషయంలో వారు విఫలమైతే వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకం కింద పొందిన ప్రయోజనాన్ని రద్దు చేస్తామని పేర్కొనడమూ ప్రభావం చూపిది.

దర్శన భాగ్యం.. వెండి నాణెం..

చార్మినార్: దీపావళి వేడుకలను పురస్కరించుకొని చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి దర్శనం కోసం శనివారం మూడో రోజూ భక్తులు పోటెత్తారు. అర్ధరాత్రి వరకూ రద్దీ కొనసాగింది. చార్మినార్ నుంచి చార్ కమాన్ దాకా భక్తులు క్యూ కట్టారు. పలువురు ప్రముఖులు భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా అమ్మవారి ఖజానా పంపిణీ కొనసాగింది. ఇందులో భాగంగా వెండి నాణెంపై ఒకవైపు భాగ్యలక్ష్మి అమ్మవారి చిత్రాన్ని.. మరోవైపు చార్మినార్ కట్టడం బొమ్మను ముద్రించారు. ఈ నాణేలు దక్కించుకోవడానికి భక్తులు పోటీ పడ్డారు. దాదాపు రెండు లక్షల వెండి నాణేలు అందజేసినట్లు ఆలయ ట్రస్టీ శశికళ తెలిపారు.



పూజారికే టోకరా..

- గుడి నిర్మాణానికి స్థలం ఇప్పిస్తానని మోసం
- అరెస్ట్ చేసిన సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: ఫోర్జరీ సంతకాలతో ప్రభుత్వ భూమికి నకిలీ డాక్యుమెంట్లను సృష్టించడంతో పాటు ఆ భూమిని ఓ పూజారికి విక్రయించి మోసం చేసిన ఘనాపాటీని సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు శనివారం అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్‌లోని సూరారంలోని శ్రీనిఖిల సాయి మైత్రేయ మధుసూదన సరస్వతీ పీఠంలో ఎన్‌వీవీ సుబ్రహ్మణ్యం పూజారిగా పని చేస్తున్నారు. మెదక్ జిల్లా శివంపేట మండలంలో గుడిని నిర్మించాలని భావించిన సుబ్రహ్మణ్యం.. తగిన స్థలం కోసం వెతుకుతున్నారు. ఈ క్రమంలో 2018లో శివంపేట తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న రత్నాపూర్ గ్రామానికి చెందిన ఉద్దండపురం నర్సింహులతో పరిచయమైంది. తాను తహసీల్దార్ ఆఫీసులో పని చేస్తున్నానని, త్వరలోనే డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతి రానుందని మాయమాటలు చెప్పాడు. ఆ తర్వాత గుడి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని అందిస్తామని నమ్మించాడు. పథకం ప్రకారం కొద్ది రోజుల తర్వాత అలీపూర్ గ్రామ శివార్లలో పలు ప్రభుత్వ భూములను సుబ్రహ్మణ్యానికి చూపించాడు. దీంతో సుబ్రహ్మణ్యం స్థలాన్ని కొనేందుకు ఆసక్తి చూపించడంతో.. నర్సింహులు ఫోర్జరీ సంతకాలతో ప్రభుత్వ భూమికి నకిలీ డాక్యుమెంట్లను, పహాణీలను సృష్టించాడు. ఆ స్థలాన్ని తహసీల్దార్ జారీ చేశారని నమ్మించి బాధితుడి నుంచి రూ.1.20 కోట్లు వసూలు చేశాడు. ఇదే విధంగా మరో బాధితుడు ఏలేటి కుమార్ అనే వ్యక్తి నుంచి రూ.50 లక్షలు వసూలు చేశాడు. ఎన్ని రోజులు గడిచినా రిజిస్ట్రేషన్ జరగకపోవడంతో మోసపోయానని గ్రహించిన సుబ్రహ్మణ్యం సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడు నర్సింహులును అరెస్ట్ చేశారు.

హృదయానికి ప్రాణం పోశారు!

కోత లేకుండానే నిమ్స్‌లో గుండెకు శస్త్ర చికిత్స

- దేశంలోనే తొలిసారిగా ఈ తరహా ఆపరేషన్
- పల్మనరీ వాల్వ్‌ను విజయవంతంగా అమర్చిన వైద్యులు
- వివరాలు వెల్లడించిన డాక్టర్ సాయి సతీష్

లక్డీకాపూల్: నగరంలోని నిమ్స్ ఆస్పత్రి వైద్యులు అరుదైన ఘనత సాధించారు. ఆధునిక సాంకేతికతను వినియోగించి ఎటువంటి కోత లేకుండానే 20 ఏళ్ల యువకుడి గుండెకు శస్త్ర చికిత్స చేసి పునర్జన్మనిచ్చారు. ఓపెన్ హార్ట్ సర్జరీ లేకుండా బానోత్ అశోక్ గుండె కుడి జఠరిక నుంచి పుపుస ధమని వరకు రక్తాన్ని నడిపించే పల్మనరీ వాల్వ్‌ను విజయవంతంగా అమర్చినట్టు ప్రొఫెసర్ సాయి సతీష్ తెలిపారు. శనివారం నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రోగికి గుండె కుడి జఠరిక నుంచి పుపుస ధమని వరకు రక్తాన్ని నడిపించే పల్మనరీ వాల్వ్‌ను విజయవంతంగా అమర్చామని.. ఇది దేశంలోనే తొలిసారి అని స్పష్టం చేశారు.

అయిదేళ్ల వయసులోనే..
మహబూబాబాద్ జిల్లా నారాయణపూర్ గ్రామానికి చెందిన అశోక్ టెట్రాలజీ ఆఫ్ ఫాలోట్ అనే సైనోటిక్ గుండె జబ్బుతో బాధపడుతున్నాడు. అశోక్ అయిదేళ్ల వయసులో ఉండగా ఓపెన్ హార్ట్ సర్జరీ చేశారు. గత నాలుగేళ్లుగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్న అతని ఆరోగ్యం విషమ పరిస్థితికి చేరింది. గుండె కుడి వైపు ఉన్న వాల్వ్ సరిగా పని చేయని పరిస్థితి. పల్మనరీ ఆర్టరీ నుంచి గుండె కుడి కవాటానికి వెళ్లాల్సిన రక్తం వెనక్కి వస్తున్న దుస్థితి. దీంతో రోగి తీవ్రమైన శ్వాసలోపం, గుండె దడ సమస్యను ఎదుర్కొంటున్న పరిస్థితి.

ఆరోగ్యశ్రీ ద్వారా..
అశోక్ తల్లిదండ్రులు ప్రైవేట్ ఆస్పత్రులను సంప్రదించారు. అతనికి పల్మనరీ వాల్వ్ నుంచి రక్తం లీక్ అవుతున్నట్టు నిర్ధారించిన వైద్యులు చికిత్సలకు రూ.25 నుంచి రూ.35 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పారు. దాంతో చివరిగా నిమ్స్‌ను ఆశ్రయించారు. కార్డియాలజీ విభాగం వైద్యులు సమగ్రంగా వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధి తీవ్రతను అంచనా వేశారు. అప్పటికే బైపాస్ చికిత్స జరిగినట్టు గుర్తించారు. ఆ పరిస్థితుల్లో మళ్లీ గుండెకు మళ్లీ ఓపెన్ హార్ట్ సర్జరీ చేయడం కష్టం.. సంక్లిష్టమైందని నిర్ధారించుకున్న వైద్య బృందం.. అశోక్ గుండెకు ఎలాంటి కోత లేకుండానే పెర్క్యుటేనియస్ విధానం ద్వారా వాల్వ్‌ను స్టెక్ ట్రాన్స్‌కాథెటర్ ప్లేస్‌మెంట్ చేయాలని నిర్ణయించారు. ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్స చేసేందుకు సమాయత్తమయ్యారు. 3 గంటల్లో వైద్యులు శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. అయితే సాధారణంగా అందుబాటులో ఉండే వాల్వ్‌లు అతనికి సరిపడలేదు. దాంతో ప్రత్యేకంగా 35 మి.మీ సైజు వాల్వ్‌ను ఊపిరితిత్తుల ప్రాంతంలో అమర్చారు. ఈ తరహా ప్రక్రియ దేశంలోనే అతిపెద్దది. గుండెకు కోత లేకుండా అరుదైన చికిత్సను ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య శ్రీ ద్వారా నిర్వహించామని రోగి కుటుంబానికి రూ.5 లక్షలు ఖర్చయిందని డాక్టర్ సాయి సతీష్ తెలిపారు.



గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్న అశోక్‌తో నిమ్స్ వైద్యులు

9 మంది జలమండలి ఉద్యోగులకు పదోన్నతి



సాక్షి,సిటీబ్యూరో: జలమండలిలో తొమ్మిది మంది ఉద్యోగులకు పదోన్నతి లభించింది. బోర్డులో జనరల్ పర్పస్ ఎంప్లాయీ (జీపీఈ)గా పనిచేస్తున్న తొమ్మిది మందికి అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. వీరిలో ఏడుగురిని అసిస్టెంట్ ఎఫ్ అండ్ ఏ, ఇద్దరిని అసిస్టెంట్ పీ అండ్ ఏ విభాగానికి కేటాయించారు. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఎండీ అశోక్ రెడ్డి వీరికి నియామకపత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మరింత ఉత్సాహంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పర్సనల్ డైరెక్టర్ సుదర్శన్, పీ అండ్ ఏ సీజీఎం అబ్దుల్ ఖాదర్, జీఎం సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మీర్‌పేట: మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. శుక్రవారం పోలీసులు తెలిపిన ప్రకారం.. గాయత్రీ నగర్‌లోని ఖాళీ స్థలంలో ఓ వ్యక్తి విగతజీవిగా పడిఉన్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి చేతులపై హనుమంతు, అజయ్, మహేశ్ అని పచ్చబొట్లు ఉన్నాయని, తెలిసిన వారు ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

ఏడాది క్రితం అదృశ్యం..

ఎట్టకేలకు ఆచూకీ లభ్యం

- ఓ వ్యక్తి..ఐదుగురు పిల్లలను బోయిన్‌పల్లిలో గుర్తించిన పోలీసులు
- కుటుంబ తగాదాలతో ఇంట్లో చెప్పకుండా వెళ్లిన వైనం..
- ఆధార్ కార్డు నెంబర్ ఆధారంగా ఛేదించిన నాగోలు పోలీసులు



నాగోలు పోలీస్ స్టేషన్‌లో బోలా ప్రసాద్, పిల్లలు, భార్య

నాగోలు: ఏడాది క్రితం ఐదుగురు పిల్లలతో అదృశ్యమైన ఓ వ్యక్తిని నాగోలు పోలీసులు ఆధార్ కార్డు నెంబర్ ఆధారంగా ఛేదించి పట్టుకున్నారు. నాగోలు ఇన్‌స్పెక్టర్ సూర్యనాయక్ తెలిపిన వివరాల ప్రకారం..జార్ఖండ్‌లోని ధన్‌బాద్ జిల్లా ప్రాంతానికి చెందిన బోలా ప్రసాద్, బీహార్‌కు చెందిన మాల్టీదేవి 17 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇద్దరు కలిసి తట్టిఅన్నారంలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు, నలుగురు కుమారులు జన్మించారు. ఈ నేపథ్యంలో సంపాదన సరిగా లేక..పిల్లల పోషణ భారమై భార్యాభర్తలు గొడవలు పడ్డారు. దీంతో గతేడాది నవంబర్ 8న బోలా ప్రసాద్ తన పిల్లలు బాల్య(16), దీపక్ (12), సూరజ్ (10), సునీల్(8), మనీషా(7)లను తీసుకుని భార్యకు చెప్పకుండా ఇంటి నుండి వెళ్లిపోయాడు. భర్త, పిల్లల అదృశ్యంపై భార్య మాల్టీదేవి అదేరోజు నాగోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే వీరు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కావడంతో వివరాలు ఏవీ లేక పోలీసులకు ఎంత వెదికినా ఆచూకీ చిక్కలేదు. ఇటీవల మరోసారి బాధితురాలి ద్వారా ఆధార్ కార్డు తెప్పించుకొని స్టేషన్ ఎస్ఐ వి.రమేష్, క్రైమ్ పీసీలు సుభాష్, సాయిష్‌లు విచారణ ప్రారంభించారు. ఇటీవల బోలా ప్రసాద్ కొత్త మొబైల్ నెంబర్ కోసం సిమ్ తీసుకుని అక్కడ ఆధార్ కార్డు నెంబర్ ఇచ్చినట్లు తెలుసుకున్నారు. దీని ద్వారా అతను బోయిన్‌పల్లిలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడికి వెళ్లి పిల్లలతో సహా ప్రసాద్‌ను పట్టుకుని మాల్టీ దేవికి శనివారం అప్పగించారు. కేసును ఛేదించడంలో ప్రతిభ చూపిన పోలీసులను ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

డ్రంకన్ డ్రైవ్‌లో పోలీసులను చూసి సీటు మారిన యువకుడు

- ప్రశ్నించిన పోలీసులపై మద్యం మత్తులో వీరంగం
- ఆరు గంటల పాటు రోడ్డుపై బైఠాయింపు
- కేసు నమోదు చేసి అరెస్టు చేసిన పోలీసులు

బంజారాహిల్స్: డ్రంకన్ డ్రైవ్ జరుగుతున్న విషయం తెలుసుకుని డ్రైవర్ సీటులో నుంచి మారిన ఓ యువకుడు తన స్థానంలో ఓ యువతిని కూర్చోబెట్టగా గమనించిన ట్రాఫిక్ పోలీసు ఇదేమిటని ప్రశ్నించడంతో జరిగిన గొడవలో ఇద్దరు మందుబాబులపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. పోలీసు విధులను అడ్డుకోవడమే కాకుండా నడిరోడ్డుపై కారు నిలిపి న్యూసెన్స్‌కు పాల్పడ్డ యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..మారేడుపల్లికి చెందిన పర్మార్ సిద్ధార్థ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కాగా ఆయన స్నేహితుడు పొన్నం శేషశాయి ప్రసాద్ అలియాస్ కిట్టు మరో ముగ్గురు యువతులు కలిసి క్లబ్ రోగ్ పబ్‌లో శుక్రవారం రాత్రి ఒంటిగంట దాకా విందు చేసుకుని తమ కారులో ఇంటికి బయలుదేరారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని పార్క్‌హయత్ హోటల్ వద్ద ట్రాఫిక్ ఎస్ఐ గోవర్ధన్‌రెడ్డి నేతృత్వంలో డ్రంకన్ డ్రైవ్ జరుగుతుండగా ఈ విషయాన్ని కారు నడుపుతున్న సిద్ధార్థ ఎల్వీప్రసాద్ ఆస్పత్రి సమీపంలో గమనించాడు. తాను మద్యం సేవించడంతో డ్రంకన్ డ్రైవ్‌లో దొరికిపోతాననే ఉద్దేశంతో పక్క సీట్లోకి మారి ఆ సీట్లో ఉన్న యువతిని డ్రైవర్ సీట్లోకి మార్చాడు. అక్కడే విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ హోంగార్డు హరికృష్ణ ఈ విషయాన్ని గమనించి వెంటనే ముందున్న ఎస్ఐకి సమాచారం ఇచ్చాడు. దీంతో సిద్ధార్థకు డ్రంకన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించేందుకు యత్నించగా సహకరించలేదు. అదే సమయంలో సిద్ధార్థ స్నేహితుడు శేషశాయి ప్రసాద్ వెనకాల ర్యాపిడో బైక్‌పై వచ్చి పోలీసులతో వాగ్వివాదానికి దిగాడు. కారును నడిరోడ్డుపై ఆపి ఏమి చేసుకుంటావో చేసుకో అంటూ పోలీసు విధులకు అడ్డుపడ్డారు. అర్ధరాత్రి ఒంటి గంట నుంచి శనివారం ఉదయం 7 గంటల వరకు..దాదాపు 6 గంటల పాటు ముగ్గురు యువతులు, ఇద్దరు యువకులు రోడ్డుపై బైఠాయించి నానా రభస చేశారు. సిద్ధార్థకు శ్వాస పరీక్ష నిర్వహించగా మద్యం మోతాదు 75 ఎంజీగా తేలింది. ఎస్ఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. ముగ్గురు యువతులను అదుపులోకి తీసుకున్నారు. వీరిపై బీఎన్ఎస్ సెక్షన్ 110, 292, 132, 221, 351 (2), 126 (2), 324 (2), రెడ్‌విత్ 3 అండ్ 5 కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

యువకుడి కిడ్నాప్..హత్యాయత్నం

చంచల్‌గూడ: చావణీ చంచల్‌గూడ మెయిన్ రోడ్డులో గత శుక్రవారం జరిగిన సదర్ మేళా నుంచి ఇంటికి తిరిగి వెళ్తున్న యువకుడిని ఓ వర్గానికి చెందిన యువకులు కిడ్నాప్ చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ సంఘటన మాదన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే యాకుత్‌పురా ఈస్ట్ చంద్రనగర్‌కు చెందిన విశాల్ (22) సదర్ మేళాకు హాజరై తిరిగి ఇంటికి వెళ్తుండగా చావణీలోని ఇమ్లీ కాజాడ్ వద్దకు రాగానే అప్పటికే వెంబడిస్తున్న సోహెల్ మరో ఇద్దరు కలిసి అడ్డగించారు. యాక్టివా బైక్ మీదకు బలవంతంగా ఎక్కించి రేతికీ ఏరియాకు తీసుకెళ్లారు. అప్పటికే అక్కడ మరో ఇద్దరు మాటువేసి ఉన్నారు. విశాల్ పెట్టిన సోషల్ మీడియా పోస్ట్ గురించి ఆరాతీస్తూ ఐదుగురు కలిసి విచక్షణరహితంగా దాడి చేశారు. అందులో ఒకరు వెనక నుంచి తలపై గట్టిగా రాయితో బాదారు. బేబులో ఉన్న రూ.2500 లాక్కున్నారు. విశాల్ వెంట ఉన్న మిత్రుడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. తీవ్ర గాయాలతో ఉన్న బాధితుడిని పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. నిందితులపై కిడ్నాప్, హత్యాయత్నం, దోపిడీ కేసులు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మ్యారేజ్ బ్యూరో ముసుగులో వ్యభిచారం

ఖైరతాబాద్: మ్యారేజ్ బ్యూరో ముసుగులో వ్యభిచారం గృహం నిర్వహిస్తున్న వారిపై సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్‌కు చెందిన ఆయేషా సిద్దీఖీ షాదాన్ కాలేజ్ లేన్‌లో మ్యారేజ్‌బ్యూరో పేరుతో కొంతకాలంగా వ్యభిచారం నిర్వహిస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి అమ్మాయిలను తీసుకువచ్చి వ్యాపారం నిర్వహిస్తోందని తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి చేసి ప్రధాన నిర్వాహకురాలితో పాటు విటులు బానోత్ వీరుడు, షేక్ సిహబ్, మహ్మద్ సులేమాన్, మహ్మద్ నిజాముద్దీన్‌లను అదుపులోకి తీసుకొని వీరివద్ద నుంచి ఫోన్లు, నగదు, కండోమ్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని ఖైరతాబాద్ పోలీసుకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మెడికల్ కాలేజీలో సీటు ఇప్పిస్తానని మోసం



నిందితుడు శ్యామ్ ప్రసాద్

పంజగుట్ట: మెడికల్ కాలేజీల్లో సీటు ఇప్పిస్తానని చెప్పి డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తిని శనివారం పంజగుట్ట పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..లక్డీకాపూల్‌లో నివాసం ఉండే బత్తుల శ్యామ్ ప్రసాద్.. ద్వారకాపురి కాలనీకి చెందిన ఓ విద్యార్థినికి మెడికల్ కాలేజీలో సీటు ఇప్పిస్తానని చెప్పి 2022 అక్టోబర్‌లో రూ.1.18 లక్షల నగదు తీసుకున్నాడు. మెడికల్ సీటు ఇప్పించకపోగా డబ్బులు అడిగితే నేడు, రేపు అంటూ కాలం వెల్లదీస్తున్నాడు. దీంతో బాధితురాలు కుటుంబ సభ్యులతో కలిసి పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు శ్యామ్ ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

అగ్నిప్రమాదం ఘటనలో మరొకరి మృతి

డబీర్‌పురా: పాతబస్తీలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన టపాసులు ప్రమాదవశాత్తు పేలడంతో ఇద్దరు ఇప్పటికే మృతి చెందగా..ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మృతురాలి మనవరాలు శృతి (15) శనివారం ఉదయం 9.30 గంటలకు మృతి చెందింది. ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ... యాకుత్‌పురా ఈస్ట్ చంద్రానగర్ ప్రాంతానికి చెందిన మోహన్‌లాల్, ఉషాబాయి దంపతులు ఇంట్లో టపాసులను నిల్వ చేసి ఉంచారు. దీంతో గత నెల 29వ తేదీన ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో మోహన్‌లాల్, ఉషాబాయి అక్కడికక్కడే మృతి చెందారు. కాగా వీరి వద్ద ఉంటూ ఇంటర్ చదువుతున్న మనవరాలు శృతి (15) తీవ్రంగా గాయపడగా ఆసుపత్రిలో చేర్పించారు. ఈమె కూడా చికిత్స పొందుతూ శనివారం ఉదయం 9.30 గంటలకు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

మార్ట్‌లో యువతిపై లైంగిక దాడి

- ఆలస్యంగా వెలుగులోకి..
- బయటకు చెబితే చంపుతానని బెదిరించిన నిందితుడు
- రిమాండ్‌కు తరలించిన పోలీసులు



నిందితుడు ఖాజా బషీర్ (ఫైల్)

ఘట్‌కేసర్: పట్టణంలోని ఓ మార్టులో పనిచేసే యువతిపై సూపర్‌వైజర్ లైంగిక దాడికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. ఘట్‌కేసర్‌లోని ఓ మార్ట్‌లో బాలాజీనగర్‌కు చెందిన ఖాజా బషీర్ (35) సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అదే మార్ట్‌లో పనిచేసే ఓ యువతి(20)పై నెలరోజుల క్రితం లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం బయటకు చెబితే చంపేస్తానని బెదిరించడంతో యువతి భయపడి కుటుంబ సభ్యులకు చెప్పలేదు. ఎవరికీ చెప్పుకోలేక మానసిక వ్యథకు గురయింది. శనివారం మార్ట్‌లో కళ్లు తిరిగి పడిపోవడంతో నిర్వాహకులు తల్లితండ్రులకు సమాచారం ఇచ్చి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె గర్భం దాల్చినట్లు తెలిపారు. దీంతో యువతిని తల్లితండ్రులు నిలదీయడతో లైంగిక దాడి సంఘటన వెలుగులోకి వచ్చింది. వెంటనే తల్లితండ్రులతో కలిసి శనివారం ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై సీఐ పరుశురాంను వివరణ కోరగా నిందితుడిని రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు.

విగ్రహం ధ్వంసం చేసిన నిందితుడి అరెస్టు

రాంగోపాల్‌పేట్: కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనలో నిందితున్ని సీసీఎస్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం గత నెల 14వ తేదీ తెల్లవారుజామున కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయంలోని ప్రధాన గేటు తాళం పగులగొట్టి అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. స్థానికులు వచ్చి నిందితున్ని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అప్పటి నుంచి నిందితుడు నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మహారాష్ట్రకు చెందిన నిందితుడు (32) మెట్రో పోలీస్ హోటల్‌లో జరుగుతున్న ఇంగ్లీష్ హౌజ్ అకాడమీలో ఆంగ్ల శిక్షణ కోసం వచ్చి ఈ ఘటనకు పాల్పడ్డారు. కేసును మార్కెట్ పోలీసులు నమోదు చేయగా ఇటీవలే సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఆస్పత్రి నుంచి కోలుకున్న నిందితున్ని సీసీఎస్ పోలీసులు అరెస్టు చేసి శనివారం రిమాండుకు తరలించారు. నిందితుడు గతంలో కూడా ముంబయిలో ఇలాంటి ఘటనలకే పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

తెగిపడిన హైటెన్షన్ విద్యుత్ వైర్లు

భయాందోళనకు గురైన స్థానికులు

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీ వడ్డెరబస్తీలో విద్యుత్ హైటెన్షన్ వైర్లు తెగిపడటంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. శనివారం ఉదయం కరెంట్ సరఫరాలో లోపాలు రావడంతో బస్తీలో ఉన్న హైటెన్షన్ వైర్ తెగింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరుగలేదని, రెండేళ్ల క్రితం ఇదే హైటెన్షన్ వైరు తెగి మీదపడడంతో మనీలా అనే మహిళ మృతిచెందిందని స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. హైటెన్షన్ లైన్‌లో చాలా సమస్యలున్నాయని అధికారులకు విన్నవించినా ఇప్పటికీ సమస్యను పరిష్కరించలేదని వాపోయారు. పక్కనే ప్రభుత్వ పాఠశాల ఉందని, స్కూల్ ఆవరణలో సైతం వైర్లు తెగిపడ్డాయని అన్నారు. విద్యార్థులు పరిసరప్రాంతాలకు రానివ్వకుండా అడ్డుకొని విద్యుత్ అధికారలకు సమాచారం ఇచ్చి కరెంట్ సరఫరా నిలిపివేశామన్నారు. స్థానిక కార్పొరేటర్ వనం సంగీత, సీనియర్ నేత వనం శ్రీనివాసయాదవ్, బస్తీ నేత వడ్డెర లక్ష్మణ్ ఆధ్వర్యంలో స్థానిక వడ్డెర బస్తీ నుండి శ్రీనగర్‌కాలనీ మీదుగా శ్రీనగర్‌కాలనీ సబ్‌స్టేషన్ వరకూ ర్యాలీగా వెళ్లి ధర్నాకు దిగారు. హైటెన్షన్ లైన్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఈ లైన్ తొలగింపుకు సిఫార్సు చేశామని, ప్రభుత్వం మారడంతో పెండింగ్‌లో ఉందని, త్వరితగతిన ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఏడీఈ ప్రేమ్‌కుమార్ తెలిపారు.



తెగిన హైటెన్షన్ లైన్‌ను చూపిస్తున్న స్థానికులు



ఆలయాలకు కార్తీకమాస శోభ

ప్రారంభమైన కార్తీక మాసం... పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు



వేంకటేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు







గోవర్ధనపూజ, కార్తీక దీపోత్సవంలో భక్తులు

బంజారాహిల్స్: కార్తీక మాసం సందర్భంగా ఆలయాల్లో కార్తీక మాస పూజలు ప్రారంభమయ్యాయి. శనివారం సాయంత్రం శ్రీనగర్‌కాలనీ శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో ఆకాశ దీపోత్సవంతో అర్చకులు కార్తీక మాసాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కార్తీక దీపాలు వెలిగించారు. అదే విధంగా పంజగుట్ట దుర్గానగర్‌కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తీక దీపాలు వెలిగించారు.

హరేకృష్ణ స్వర్ణ దేవాలయంలో...

బంజారాహిల్స్: హరేకృష్ణ స్వర్ణ దేవాలయంలో గోవర్ధన పూజ, కార్తీక దీపోత్సవం వేడుకలు శనివారం సాయంత్రం వైభవంగా జరిగాయి. చిన్న కొండను పోలి ఉండేవిధంగా 350 కిలోల వివిధ రకాల ఆహార పదార్థాలతో తయారు చేసిన అద్భుతమైన 'అన్నకూటము' ఈ వేడుకల్లో ప్రధానాకర్షణగా నిలిచింది. గోపూజతో ఈ వేడుకలు ప్రారంభం కాగా, సాయంత్రం వివిధ రకాల మధురమైన ఆహార పదార్థాలు, రంగురంగుల కుకీలు, స్వీట్లు, పండ్లు తదితర వాటితో చక్కగా అలంకరణ చేసిన అన్నకూట దర్శనం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. సాయంత్రం కీర్తనల ఆలాపనలు, పల్లకీ ఉత్సవం జరిగాయి. హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు శ్రీసత్య గౌర చంద్రదాస ప్రభూజీ గోవర్ధన లీల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం పవిత్రమైన కార్తీకదీపం వెలిగించడంతో కార్తీక దీపోత్సవం ప్రారంభమైంది.

నియామకం

ఎఫ్ఎన్‌సీసీ కల్చరల్ కమిటీ అడిషనల్ చైర్మన్‌గా సురేష్ కొండేటి



నియామకపు పత్రాన్ని అందుకుంటున్న సురేష్ కొండేటి

బంజారాహిల్స్: సినీ జర్నలిస్ట్, సంతోషం సంస్థల అధినేత, నిర్మాత సురేష్ కొండేటిని మరో పదవి వరించింది. గతంలో ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్ఎన్‌సీసీ) కల్చరల్ కమిటీ సభ్యుడిగా, ప్రచార కమిటీకి చైర్మన్‌గా, ఎఫ్ఎన్‌సీసీ కల్చరల్ కమిటీ చైర్మన్‌గా, మేనేజ్‌మెంట్ కమిటీ మెంబర్‌గా, వైస్‌చైర్మన్‌గా పనిచేసిన ఆయన కల్చరల్ కమిటీకి అడిషనల్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. దీనికి చైర్మన్‌గా గోపాలరావు, కన్వీనర్‌గా ఏడిద రాజా నియమితులయ్యారు. ఈ మేరకు ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ ప్రెసిడెంట్ కేఎస్ రామారావు, సెక్రటరీ తుమ్మల రంగారావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని సురేష్ కొండేటి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను దీనిని ఒక పదవిలా కాకుండా బాధ్యతలా చూస్తానని, కల్చరల్ కమిటీ అడిషనల్ చైర్మన్‌గా తనవంతు కృషి చేస్తానన్నారు.

జిల్లా ఖోఖో జట్టుకు రాజ్‌భవన్ విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బంజారాహిల్స్: హైదరాబాద్ జిల్లా ఖోఖో జట్టుకు రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు గోపాల్ తెలిపారు. అండర్-14 బాలికల విభాగంలో ఎనిమిదో తరగతికి చెందిన అనుప్రియ, అండర్-14 బాలుర విభాగంలో ఎనిమిదో తరగతికి చెందిన మనిషరాజ్, 9వ తరగతికి చెందిన రామ్ చరణ్‌లు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరంతా జోనల్, మండల స్థాయిల్లో గెలిచి జిల్లా జట్టుకు ఎంపిక కావడం జరిగిందని వివరించారు. త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో హైదరాబాద్ జిల్లా తరుపున వీరు ఆడనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారిని గోపాల్‌తో పాటు ఫిజికల్ డైరెక్టర్లు పీర్ కొండ, లతలు అభినందించారు.

ఉత్సాహంగా సదర్ ఉత్సవాలు

ఆకట్టుకున్న దున్నరాజుల విన్యాసాలు

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లో సదర్ ఉత్సవాలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. నవయుగ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలకు బోయిన్‌పల్లి, చంచల్‌గూడ, అమీర్‌పేట తదితర ప్రాంతాల నుంచి దున్నపోతులను తీసుకువచ్చి సదర్ ఉత్సవాల్లో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిలు పాల్గొన్నారు. అదే విధంగా ఖైరతాబాద్ హనుమాన్ వ్యాయామశాల వద్ద నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో కార్పొరేటర్ విజయారెడ్డి పాల్గొన్నారు.



సదర్ ఉత్సవాల్లో మాజీ మంత్రి, తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు



హనుమాన్ వ్యాయామశాల వద్ద విజయారెడ్డి

5న బీసీల మేధో మదన సదస్సు

కాచిగూడ: బీసీ ఉద్యమాన్ని మరింత పటిష్టంగా, నిర్మాణాత్మకంగా ఉధృతం చేయడానికి అవసరమైన నిర్ణయాలు తీసుకోవడానికి ఈనెల 5వ తేదీన మంగళవారం కాచిగూడలో బీసీల మేధో మదన సదస్సును నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, పీ. సుధాకర్‌ల నేతృత్వంలో శనివారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సదస్సులో బీసీ మేధావులు, లెక్చరర్లు, యువకులు, విద్యార్థులు, బీసీ సంఘాల ప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతమున్న 12 బీసీ కుల ఫెడరేషన్లను బీసీ కార్పొరేషన్లుగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లోని రూ.5వేల కోట్ల ఫీజుబకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఇంజినీరింగ్, ఇంటర్, పీజీ, డిగ్రీ, ఫార్మసీ, ఎంసీఏ, ఎంబీఏ కోర్సులు చదివే బీసీ విద్యార్థుల మొత్తం ఫీజులు ప్రభుత్వమే చెల్లించాలని అన్నారు. అలాగే బీసీ ఆత్మగౌరవ భవనాలను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, నందగోపాల్, అనంతయ్య, భాస్కర్, రాజేందర్ ఉదయ్ నేత, రవి, శివ, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

డీసిల్టింగ్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న సుదర్శన్

బంజారాహిల్స్: జీహెచ్ఎంసీ 90 రోజుల ప్రణాళికలో భాగంగా బంజారాహిల్స్ సెక్షన్ పరిధిలోని ఆనంద్‌నగర్ కాలనీలో జలమండలి డైరెక్టర్ సుదర్శన్ శనివారం డీసిల్టింగ్ పనులను పర్యవేక్షించారు. జలమండలి డివిజన్-6 జీఎం హరిశంకర్‌తో కలిసి డీసిల్టింగ్ జరుగుతున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. జలమండలి విభాగం చేపట్టిన పనులను వేగవంతం చేసి 90 రోజుల ప్రణాళిక లక్ష్యాన్ని చేరువ కావాలని ఈ సందర్భంగా సూచించారు. ఆయనతో పాటు డీజీఎంలు, మేనేజర్లు, సిబ్బంది ఉన్నారు.

అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్స్‌లో శనివారం దీపావళి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. దీపావళి పండుగ విశిష్టతను తెలియజేసే విధంగా విద్యార్థులు చేసిన నృత్యాలు, నాటక ప్రదర్శనలు ఆద్యంతం ఆసక్తికరంగా సాగాయి. అనంతరం ప్రిన్సిపాల్ కాంచన వల్లి చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ దీపావళి వేడుకలు జరుపుకుంటున్నామన్నారు.

మూసీ బాధితులకు అండగా నిలవాలి



కోదండరాంను ఆహ్వానిస్తున్న దిడ్డి సుధాకర్

లిబర్టీ: మూసీ బాధితుల సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని అధికార, ప్రతిపక్ష నేతలకు ఆమ్‌ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ కోరారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్సీ ఎం. కోదండరాం, బీఆర్ఎస్ నాయకులు బి.వినోద్‌కుమార్, టీడీపీ నాయకుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, బీజేపీ, ఎంఐఎం నేతలను కలిసి మూసీ బాధితుల సమస్యల శాశ్వత పరిష్కారానికి నవంబర్ 4న ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశంలో తమ సలహాలు, సూచనలు అందజేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసీ ప్రాజెక్టును అన్ని కోణాల నుంచి పునపరిశీలించి, అఖిల పక్ష సూచనలు, సమగ్ర ప్రాజెక్టు నివేదిక, బాధితులకు పునరావాసం కల్పించడం వంటి డిమాండ్లపై ఈ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశానికి అఖిల పక్ష నేతలతో పాటు మేధావులు, ఉద్యమకారులు, పర్యావరణ వేత్తలు, విద్యావేత్తలు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు బుర్రా రాములుగౌడ్, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, ప్రధాన కార్యదర్శి యమునాగౌడ్, శివాజీ, ఎస్.ఎన్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ కోసం అనువైన స్థలాన్ని పరిశీలించిన అధికారులు

ఆక్రమణ స్థలాల్లో పార్కింగ్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయం



ఆక్రమణలను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్ 34లోని పెద్దమ్మ గుడి పరిసరాల్లో కొందరు వ్యాపారులు ఖాళీ స్థలాలను ఆక్రమించుకొని వ్యాపారాలను చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఈ ఆక్రమణల ప్రాంతాన్ని పార్కింగ్ కోసం వినియోగించేందుకు జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ క్రమంలోనే జీహెచ్ఎంసీ సర్కిల్-18 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ ఈ ప్రాంతంలో పర్యటించి ఆక్రమణలు తొలగించాలని స్థానిక వ్యాపారులకు సూచించారు. శనివారం వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్, జీహెచ్ఎంసీ ఏఈ వెంకటేష్‌లతో పాటు జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు ఇక్కడ పర్యటించారు. పార్కింగ్ సదుపాయానికి అనువుగా ఉన్న ఈ ప్రాంతంలో ఆక్రమణలు తొలగించాలని సూచించడమే కాకుండా అప్పటికప్పుడు కొన్ని ఆక్రమణలను తొలగించారు. పెద్దమ్మ గుడికి వచ్చే భక్తులతో పాటు ఇతరులు ఈ ప్రాంతాన్ని వినియోగించుకునేలా నిర్ణయించారు. అంతేకాకుండా ఫుట్‌పాత్‌ల వినియోగాన్ని అందుబాటులోకి తీసుకువస్తామన్నామని వారు తెలిపారు.

భవిష్యత్ ప్రణాళిక కోసమే ఇంటింటి సర్వే

డీఎంసీ జకియా సుల్తానా

వెంగళరావునగర్: భవిష్యత్ ప్రణాళిక కోసమే ఇంటింటి సర్వే రూపొందించారని, ప్రతి ఎన్యుమరేటర్ తమకు అప్పజెప్పిన విధులను సమగ్రంగా నిర్వహించాలని జీహెచ్ఎంసీ సర్కిల్-19 ఉప కమిషనర్ జకియా సుల్తానా తెలియజేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు ఇంటింటి సర్వే చేపట్టనున్న ఎన్యుమరేటర్లకు శనివారం వెంగళరావునగర్‌లోని మహిళా అభివృద్ధి కుటుంబ సంక్షేమశాఖ కార్యాలయం ఆడిటోరియంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జకియా సుల్తానా మాట్లాడుతూ ఒక్కో ఎన్యుమరేటర్ తప్పకుండా 150 ఇళ్లను సందర్శించాలన్నారు. సూపర్‌వైజర్లు 10 ఎన్యుమరేటర్ బ్లాకులను పర్యవేక్షించాలని, ఎన్యుమరేటర్ ప్రతి ఇంటిపై సర్వే స్టిక్కర్‌ను అంటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ వెంకటకిషన్‌రావు, సూపర్‌వైజర్లు, అధికారులు వాణి, లక్ష్మి, ప్రభుత్వ టీచర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జకియా సుల్తానా

ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి



అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగుల నిరసన

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పదెకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి (జేఎన్ఎఫ్ఏయూ) కేటాయించే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనుక్కు తీసుకోవాలని ఉద్యోగులు ఆందోళన చేశారు. అంబేడ్కర్ వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు శనివారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో విశ్వవిద్యాలయంలోని డైరెక్టరేట్, మెటీరియల్స్ అండ్ పబ్లికేషన్స్ భవనం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మెటీరియల్స్ అండ్ పబ్లికేషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆనంద్ పవార్, డిప్యూటీ డైరెక్టర్ పరాకుశం వెంకటరమణలు మాట్లాడుతూ ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. విశ్వవిద్యాలయంలో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఈ నిరసనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ పల్లవీ కాబ్డే, కన్వీనర్ వడ్డాణం శ్రీనివాస్, యాకేష్ దైదా, ప్రమీల కేతావత్, రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ముగిసిన చెఫ్స్ డే వారోత్సవాలు

బంజారాహిల్స్: అంతర్జాతీయ చెఫ్స్ డేను పురస్కరించుకొని బంజారాహిల్స్‌లోని రీజెన్స్ కాలేజీ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో వారం రోజులపాటు సామాజిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వారం రోజుల పాటు నిర్వహించిన సాంస్కృతి, సామాజిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. ప్రతియేటా మాదిరిగానే ఈసారి కూడా నగర వ్యాప్తంగా ఒక రోజు కలినరి కళల వేడుక పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో వ్యాసరచన, పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించగా, 100 మంది విద్యార్థుల రక్తదానం చేశారన్నారు. అలాగే 200 మంది విద్యార్థులకు ఆహార భద్రతపై శిక్షణ, 600 మంది దివ్యాంగులకు అన్నదానం, జీరో హంగర్ డ్రైవ్‌పేరుతో నగరంలోని ఐదు ప్రముఖ ఆస్పత్రుల్లో 1200 మందికి అన్నదానం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. భద్రత, సామాజిక బాధ్యతను విద్యార్థులకు తెలియజేసేందుకు వీటిని నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం

లిబర్టీ: ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేయడంతో పాటు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదుగుతామని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు కె.బి.శ్రీధర్ తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా పార్టీని విస్తరింపచేస్తామని ఆయన వెల్లడించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలోనే జాతీయ కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసి పోరాట ప్రణాళికను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతెన్నులను ప్రజా సమస్యలపై సాగించాల్సిన పోరాట కార్యాచరణను ఖరారు చేస్తామని తెలిపారు.

వేముల రామకృష్ణకు సత్కారం



వేముల రామకృష్ణను సత్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

కాచిగూడ: బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, విద్యార్థి ఉద్యమనేత వేముల రామకృష్ణ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అందిస్తున్న సేవలను గుర్తించి నృత్యమాల నాట్యకళ వెల్ఫేర్ సొసైటీ, సిరి ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, సొసైటీ డైరెక్టర్ ఎం.వీరేష్ యాదవ్, తదితరులు పాల్గొని వేముల రామకృష్ణ అందిస్తున్న సేవలను కొనియాడారు. భవిష్యత్‌లో రామకృష్ణ మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వారు ఆకాంక్షించారు.

ప్రత్యేక పూజలు, అన్నదానం



అన్నదానం చేస్తున్న శ్రీఅన్నపూర్ణాదేవి అన్న సమర్పణ సొసైటీ సభ్యులు

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని రహమత్‌నగర్ చౌరస్తాలో శనివారం శ్రీ అన్నపూర్ణాదేవి అన్న సమర్పణ సొసైటీ ఆధ్వర్యంలో అన్నపూర్ణాదేవి, శివపార్వతులకు ఘనంగా పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలంతా సుఖశాంతులతో, సంతోషంగా ఉండేందుకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు సొసైటీ నేతలు తెలియజేశారు. అంతేగాకుండా ప్రతి అమావాస్య నాడు అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తున్నదని పేర్కొన్నారు. అనంతరం స్థానికులకు పెద్దఎత్తున అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు తాడికొండ కృష్ణమూర్తి గుప్తా, ఎం.శ్యాంరావు ముదిరాజ్, జి.నటరాజ్ యాదవ్, బి. ఆంజనేయులు యాదవ్, బుద్ధ నాగార్జున గుప్తా, పీ.వీ.బ్రహ్మానందం గుప్తా, కొవ్వూరి ప్రభు గుప్తా, జి.సత్యనారాయణ గౌడ్, పీ.చందర్‌గౌడ్, టీ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం

సనత్‌నగర్: ఎన్నికల సంఘం గత నెల 29న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించింది. కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్)లో భాగంగా కొత్త ఓటర్ల నమోదుతో పాటు మార్పులు చేర్పులకు అవకాశం ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఆ ప్రక్రియను పూర్తిచేసిన అధికారులు ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసి అభ్యంతరాల స్వీకరణను చేపట్టింది. ముసాయిదా ఓటరు జాబితా ప్రకారం సనత్‌నగర్ నియోజకవర్గంలో మొత్తం 2,54,165 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారు. ఇందులో 1,31,385 మంది పురుషులు, 1,22,767 మంది మహిళలు, థర్డ్ జెండర్ 13 మంది ఉన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా 97 లొకేషన్స్‌లో 229 పోలింగ్ స్టేషన్స్ ఉన్నాయి. ఈ నెల 28 వరకు నెల రోజుల పాటు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అదేవిధంగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 9, 10 తేదీల్లో (శని, ఆదివారాలు) నియోజకవర్గంలోని 229 పోలింగ్ బూత్‌ల్లో ఓటరు జాబితాలను ప్రదర్శించనున్నారు. ఆయా తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్ఓలు ఆయా పోలింగ్ బూత్‌ల్లో అందుబాటులో ఉంటారు. జనవరి 1, 2025 నాటికి 18 ఏళ్లు నిండుతున్న వారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చు.

తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

షిర్డీసాయి విశ్వ సమాజ్ వ్యవస్థాపకులు మైనంపాటి ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

పంజగుట్ట: ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు ఉన్న సాయిబాబా మీద కొంతమంది పనికట్టుకుని అబద్ధపు ప్రచారాలు చేస్తూ భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నారని షిర్డీసాయి విశ్వ సమాజ్ వ్యవస్థాపకులు మైనంపాటి ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. సాయిబాబా ఎవరు, ఆయనది ఏ మతం, షిర్డీలో వచ్చే ఆదాయంపై విష ప్రచారం జరుగుతుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాయిబాబా పూర్ణ పరబ్రహ్మ, పరమాత్మ స్వరూపుడని శాస్త్రపరంగా నిరూపించబడిందని అన్నారు. ద్వాపర యుగంలో శ్రీకృష్ణ పరమాత్మ సహజంగా అందరితో కలిసి ఎలా జీవించాడో సాయిబాబా కూడా అలానే జీవించారని తెలిపారు. సాయిబాబా దత్తావతారమని ఎంతో మంది మహాత్ములు, చెప్పడమే కాకుండా ఆయనను భగవత్ స్వరూపునిగా కొలిచారని గుర్తుచేశారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, ప్రధాని నరేంద్ర మోదీ కూడా సాయిబాబాను దర్శించుకున్న విషయాన్ని మరిచిపోవద్దన్నారు. మద్రాస్ హైకోర్టు దేవాలయాల నుంచి సాయిబాబా విగ్రహాలు తొలగించాలని ఆదేశించిందని ప్రచారం జరుగుతుందని అందులో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. అలాగే సాయి ట్రస్ట్ నుంచి వచ్చే డబ్బులు ఒక మతం వారు తీసుకుంటారని ప్రచారం జరుగుతుందని అందులోనూ వాస్తవం లేదని ట్రస్ట్ కలెక్టర్ ఆధీనంలో మహారాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తుందన్నారు. ఇకపై ఎవరైనా సాయిబాబా గూర్చి తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనకాడమని అన్నారు. ఈ సమావేశంలో రుద్ర నాగేష్, ఎమ్.జ్యోతి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నమ్మి ఆశ్రయమిస్తే... నగదు, నగలతో ఉడాయించింది

బంజారాహిల్స్: తన రాష్ట్రానికి చెందిన మహిళ కదా అని మానవత్వంతో ఇంట్లో ఆశ్రయమిస్తే నగదు, నగలతో ఓ మహిళ ఉడాయించిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని ఇందిరానగర్‌లో నివసించే గీతాంజలి మహాపాత్ర రోడ్డునెంబర్-14లోని రోస్టరీ కాఫీ షాపులో రిసెప్షనిస్టుగా పనిచేస్తుంది. ఒడిస్సాకు చెందిన గీతాంజలికి తమ ప్రాంతానికే చెందిన కళ్యాణిబెహ్రా అనే మహిళ ఫోన్ చేసి తనకు ఏమైనా పని ఇప్పించాల్సిందిగా కోరింది. తన ఇంట్లోనే పనిచేయాల్సిందిగా గీతాంజలి చెప్పగా కళ్యాణి తన కొడుకుతో పాటు గత నెల 29వ తేదీన ఆ ఇంట్లో చేరింది. ఈ క్రమంలో గత నెల 30వ తేదీ మధ్యాహ్నం గీతాంజలికి కళ్యాణి ఫోన్ చేసి తన కొడుకును హాస్టల్‌లో చేరుస్తున్నానని, తాను తన స్వగ్రామానికి వెళ్తున్నానని చెప్పింది. విధులు ముగించుకొని రాత్రి ఇంటికి వచ్చిన గీతాంజలి షాపింగ్ కోసం బ్యాగ్‌లో పెట్టిన నగదు కోసం చూడగా కనిపించలేదు. అంతేకాకుండా నగదుతోపాటు బ్యాగులో ఉన్న నగలు కూడా మాయమయ్యాయి. దీంతో ఇంట్లో పనిచేసే కళ్యాణి దోచుకుని వెళ్లిందనే అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇదే విషయమై తాను కళ్యాణికి ఫోన్ చేయగా తనతో మాట్లాడేందుకు నిరాకరించడమే కాకుండా తన ఫోన్‌నెంబర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టిందని, ఆమె పైనే పూర్తి అనుమానాలు ఉన్నాయంటూ పేర్కొంది. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా.. సదర్

- నారాయణగూడలో నేత్రపర్వంగా దున్నపోతుల విన్యాసాలు
- ఆటపాటలతో సందడి చేసిన యాదవ యువకులు
- సంస్కృతిని భావితరాలకు అందించాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



కాచిగూడ: నిగనిగలాడే నలుపుతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన దున్నపోతుల విన్యాసాలు.. డప్పుల దరువులు.. కళాకారుల నృత్యాలు.. యాదవ సోదరుల ఆటపాటలతో శనివారం రాత్రి నారాయణగూడ చౌరస్తా, పరిసరాలు దద్దరిల్లాయి. దశాబ్దాల చరిత్ర ఉన్న యాదవుల సదర్ ఉత్సవాలు ఈ ప్రాంతంలో కోలాహలంగా జరిగాయి. చూపరులను కట్టిపడేశాయి. ప్రత్యేకంగా అలంకరించి తీసుకువచ్చిన బాహుబలి, చేతక్, సూర్యకుమార్, రుద్ర, భీమ్, విరాట్, బాదల్, మున్నా, బాబు, శ్రీకృష్ణ, అర్జున్, కింగ్ తదితర పేర్లు కలిగిన దున్నపోతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దున్నపోతులపైన ఎక్కి యువకులు చేసిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు దున్నపోతులు చేసిన వీరంగాన్ని తిలకించి ఆనందపరవశుల య్యారు. ఔత్సాహికులు భారీ సంఖ్యలో పాల్గొనడంతో పరిసర ప్రాంతాలు జనసందోహంతో కిక్కిరిసిపోయాయి. నేతలూ నృత్యాలు చేస్తూ చేసిన సందడి వేడుకలకు మరింత వన్నె తెచ్చింది. దున్నపోతులతో హాజరైన వారికి సదర్ వేడుకల నిర్వాహకులు మెమొంటోలు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు.





సంతోషాలు పంచుకోవాలి: కిషన్‌రెడ్డి

పండగలు మనకు సంతోషాలు పంచేందుకు వస్తాయని, వాటిని అందరూ కలిసి మెలిసి నిర్వహించుకుంటే అవి మరింత రెట్టింపు అవుతాయని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. హిందువుల పండగలు ప్రకృతి, పర్యావరణం, పశు, పక్ష్యాదులను పూజించేలా ఉంటాయని పేర్కొన్నారు. వాటిని భావితరాల వారికి అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమాజంలో ఐక్యతకు, స్నేహానికి, సంస్కృతి పరిరక్షణకు సదర్ ఉత్సవాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలను యాదవులు అత్యంత వైభవంగా జరుపుతున్నారని, సబ్బండ వర్గాల నుంచి సైతం ఆదరణ లభించడం అభినందనీయమని అన్నారు. మంచి వర్షాలతో, పాడిపంటలతో అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. వేడుకల్లో ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, ముఠా గోపాల్, కార్పొరేటర్లు పి.విజయారెడ్డి, వై.అమృత, జి.మహాలక్ష్మీ రామన్ గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, నేతలు సి.వినోద్ యాదవ్, జంగాల అనిల్ యాదవ్, గడ్డం శ్రీనివాస్ యాదవ్, లడ్డూ యాదవ్, సి.సందీప్ యాదవ్, మదన్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



నగరంలో నేడు

- ఆరిగపూడి పూర్ణచంద్రారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో లయన్ డాక్టర్ ఎ.విజయ్‌కుమార్ జన్మదిన వేడుకల సందర్భంగా బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 9.30 గంటలకు లయన్ ఎ.కృష్ణకుమారి స్మారక జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం జరుగుతుంది.
- జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో 19వ ఓపెన్ నేషనల్ కరాటే చాంపియన్‌షిప్–2024 పోటీలు యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఉదయం 9 గంటలకు జరుగుతాయి.
- కార్తీకమాస వన సమారాధన కార్యక్రమం అల్లూరి క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్‌లో ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుంది.
- మీరాలం సబ్ డివిజన్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించనున్నారు.
- హరిహర పుత్ర భక్త సమాజం ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారణ భక్తులకు కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో మధ్యాహ్నం 12.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు నిత్య అన్నదాన కార్యక్రమం జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజు నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

7న బీసీ కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ



సాక్షి, సిటీబ్యూరో: నగర శివారులోని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నవంబర్ 7న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరగనున్నట్లు మేడ్చల్–మల్కాజిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో అత్యంత వెనుకబడిన తరగతుల కులాల స్థితిగతులపై కమిషన్ బృందానికి స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ఏమైనా వినతులు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలు ఉన్నట్లయితే వారి వాదనలను తెలిపేందుకు వ్యక్తులుగానీ, నమోదిత, నమోదుకాని అసోసియేషన్ల సభ్యులుగానీ హాజరుకావాలని సూచించారు.

వైద్యాధికారులకు శిక్షణ అవసరం

సాక్షి,సిటీబ్యూరో: వ్యాక్సినేషన్‌తోపాటు ప్రజల ఆరోగ్య సేవలను మెరుగుపరచడం వంటి లక్ష్యాలను చేరుకోవటానికి వైద్యాధికారులకు శిక్షణ ఉపయోగపడుతుందని డీఎంహెచ్‌వో డాక్టర్ రఘునాథ్‌స్వామి అన్నారు. ప్రాథమిక ఆరోగ్య సేవల్లో సమగ్రత, సామర్థ్యాన్ని పెంచేవిధంగా ఈ శిక్షణ దోహదపడుతుందని పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం హాలులో ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ, పల్లె దవాఖానాల వైద్యాధికారులకు రాష్ట్రస్థాయి శిక్షకులు వైద్యవృత్తిపై దిశా, మార్గనిర్దేశం చేశారు.

హెచ్‌ఎండీఏ మాస్టర్‌ప్లాన్‌ను పునఃపరిశీలించాలి



సిటీబ్యూరో: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 2013లో అప్పటి ప్రభుత్వం నోటిఫై చేసి హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ మాస్టర్ ప్లాన్–2031ని పునఃపరిశీలించాలని బీజేపీ సీనియర్ నేత గూడూరు నారాయణరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. శనివారం ఈ మేరకు మీడియాకు ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్, పరిసర ప్రాంతాల అభివృద్ధి ప్రణాళిక మాస్టర్‌ప్లాన్–31 నిరుపయోగంగా మారిందని, ఇప్పుడు హైదరాబాద్, పరిసరాల పరిస్థితులకు ఏమాత్రం ఉపయోగపడటంలేదని పేర్కొన్నారు. హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో కుదేలైన రియల్ ఎస్టేట్ రంగాన్ని దృష్టిలో ఉంచుకుని, సామాన్యుల సొంతింటి కల సాకారం చేసేవిధంగా హైదరాబాద్‌ను సర్వతోముఖంగా అభివృద్ధి చేసేలా మాస్టర్‌ప్లాన్‌ను ముఖ్యమంత్రి సిద్ధం చేయాలని కోరారు. హైడ్రా వంటి సంస్థల ఏర్పాటు వల్ల రియల్ ఎస్టేట్ డెవలపర్లు, బిల్డర్ల వెన్ను విరిగిపోయిందని అభిప్రాయపడ్డారు.

కేసీఆర్‌కు ఉచ్చు ఎందుకు బిగించలేదు

- బీజేపీని ప్రశ్నించిన రవీంద్ర నాయక్

సాక్షి, సిటీబ్యూరో: పదేళ్ల పాటు రాష్ట్రాన్ని దోచుకున్న బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంపై ఉచ్చు ఎందుకు బిగించలేదో బీజేపీ సమాధానం చెప్పాలని మాజీమంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రవీంద్ర నాయక్ డిమాండ్ చేశారు. లేదంటే బీజేపీ నాయకులు కేసీఆర్ చేసిన అవినీతిలో భాగస్వాములేనని భావించాల్సి వస్తుందన్నారు. తెలంగాణకు బీజేపీ అగ్రనేతలు వచ్చినప్పుడల్లా కేసీఆర్ కుటుంబంపై చర్యలుంటాయని, ఉచ్చు బిగిస్తోందంటూ ప్రగల్భాలు పలికారని గుర్తు చేశారు. గత పదేళ్లల్లో తెలంగాణలో జరిగిన కుంభకోణాలపై చర్యలు తీసుకోవాలని కేంద్ర దర్యాప్తు సంస్థలపై ఒత్తిడిచేసే దమ్ము ధైర్యం లేని బీజేపీ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై సన్నాయి నొక్కులు నొక్కడం సిగ్గుచేటన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రాభివృద్ధికి అవసరమైన కేంద్ర నిధులు తీసుకురాకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం బీజేపీకి తగదన్నారు.

అనిల్, వెంకట్‌లను విమర్శించడం తగదు



మాట్లాడుతున్న వీవీ రవీంద్రనాథ్ నాయుడు

- టీపీసీసీ రాష్ట్ర కార్మిక విభాగం కార్యదర్శి రవీంద్రనాథ్ నాయుడు

సుందరయ్య విజ్ఞానకేంద్రం: రాజ్యాంగబద్ధంగా రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్‌లను విమర్శించే నైతిక అర్హత ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి లేదని టీపీసీసీ కార్మిక విభాగం రాష్ట్ర కార్యదర్శి వీవీ రవీంద్రనాథ్ నాయుడు అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జన్వాడ ఫాంహౌస్‌లో జరిగిన రేవ్‌పార్టీని గృహప్రవేశం పార్టీ అని పేర్కొంటూ మాజీ మంత్రి కేటీఆర్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. కౌశిక్‌రెడ్డికి నేర చరిత్ర ఉందని, అందుకే గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవిని ఆయనకు కేటాయించడాన్ని గత గవర్నర్ తిరస్కరించారని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనను గెలిపించకపోతే కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మహత్య చేసుకుంటానని ప్రజలను బెదిరించి ఓట్లు వేయించుకొని గెలిచిన చరిత్రను ఆయన మర్చిపోయారని అన్నారు. రాజకీయ లబ్ధి కోసం కేసీఆర్, కేటీఆర్ మెప్పు కోసం కాంగ్రెస్ నేతలపై విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. జన్వాడ ఫాంహౌస్ కేసులో కేటీఆర్ బావమరిది గృహప్రవేశం చేసుకుంటే కేటీఆర్, అతని భార్య ఎందుకు ఆ పార్టీలో పాల్గొనలేదని ప్రశ్నించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డీహెచ్ ఉమేష్, సి.రఘునందన్‌రావు, సత్యనారాయణ, జానకీ శ్రీనివాస్, వాహిద్ హుస్సేన్, నరేందర్‌రెడ్డి, ఎ. జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

లింగాయత్‌లకు కులగణనపై అవగాహన



అవగాహన కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎంపీ సురేష్ షెట్కర్

- జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్

పంజగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కులగణన ద్వారా అన్ని వర్గాలకు ఎంతో న్యాయం జరుగుతుందని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ అన్నారు. కులగణన సర్వేలో వీరశైవ లింగాయత్‌లు అందరూ కులం పేరును వీరశైవ లింగాయత్ లింగబలిజ అనే రాయించాలని, అలా కాకుండా బలిజ, లింగబలిజ, లింగాయత్ అని రకరకాలుగా రాయిస్తే మొత్తం కుల జనాభా తెలియదని, దాంతో మనకు వచ్చే ఫలాలు అందకుండా పోతాయని అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర వీరశైవలింగాయత్ లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో సమగ్ర కులగణన అవగాహనా కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప, రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల సగమేశ్వర్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. గతంలో ఓసీలుగా ఉన్న లింగాయత్‌లను దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి బీసీ డి గ్రూప్‌లో చేర్చుతూ జీవో 46 తీసుకువచ్చారని, ఆ జీవోలో తమ కులం పేరు వీరశైవ లింగాయత్ లింగబలిజగా పేర్కొందని, ఇప్పుడు కులసర్వేలో అదే పేరును రాయించాలని కోరారు. వీరశైవలింగాయత్ లింగబలిజ కులస్తులను చైతన్యపరిచేందుకు అన్ని జిల్లాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దినేష్ పాటిల్, హన్మంత్‌రావు, శెట్టి శివకుమార్, రాచప్ప, శివశరణ్, మధు, రఘు, రాకేష్, మహేష్, పృధ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురికి 'కారుణ్య' ఉద్యోగాలు

సాక్షి,సిటీబ్యూరో: జలమండలిలో ఐదుగురికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు లభించాయి. బోర్డులో విధులు నిర్వర్తిస్తుండగానే మరణించిన ఐదుగురు ఉద్యోగుల వారసులకు విద్యార్హతలను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో శనివారం ఎండీ అశోక్‌రెడ్డి నియామకపత్రాలను అందించారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలుపుతూ కష్టపడి పని చేసి బోర్డుకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పర్సనల్ డైరెక్టర్ సుదర్శన్, పీ అండ్ ఏ సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల వివరాల సేకరణ



ఖానామెట్‌లో నిర్మాణాల వివరాలు తెలుసుకుంటున్న హైడ్రా డిప్యూటీ కలెక్టర్ విజయ్

గచ్చిబౌలి: ఖానామెట్‌లోని సర్వే నెంబర్ 41/14లోని నిర్మాణాలను హైడ్రా డిప్యూటీ కలెక్టర్ విజయ్ కుమార్ పరిశీలించారు. శనివారం శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లోని పలు ప్రాంతాల్లో ప్రైవేట్ సర్వే నెంబర్లు వేసి ప్రభుత్వస్థలంలో చేపట్టిన నిర్మాణాల వివరాలను సేకరించారు. బీఆర్‌ఎస్ హయాంలో ఖానామెట్ సర్వే నెంబర్ 41/14లో వివిధ సంస్థలకు 250 ఎకరాల భూమిని కేటాయించిందని, మిగిలిన మరో 70 ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శోభన్, నాయకులు కృష్ణ హైడ్రా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఫిర్యాదు అందిన నేపథ్యంలో హైడ్రా డిప్యూటీ కలెక్టర్ అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. ఫిర్యాదుదారుల నుంచి మరిన్ని వివరాలు సేకరించారు. సీపీఎం నాయకులు శోభన్ మాట్లాడుతూ అక్రమనిర్మాణాలపై గతంలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రభుత్వ భూమికి ప్రైవేట్ సర్వే నెంబర్లు వేసి అనుమతులు తీసుకొని నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు.

అంకురాలకు ఎలీప్ వీహబ్ చేయూత




విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎలీప్ అధ్యక్షురాలు రమాదేవి



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

నిజాంపేట్: విద్యార్థుల నూతన ఆవిష్కరణకు, అంకుర సంస్థలకు చేయూతనిచ్చేందుకు సంసిద్ధంగా ఉన్నామని ఎలీప్ వీహబ్ అధ్యక్షురాలు రమాదేవి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని అటల్ టింకరింగ్ లాబ్స్, అటల్ ఇన్నోవేషన్ మిషన్, నీతీ ఆయోగ్‌లు సంయుక్తంగా ప్రగతినగర్ ఎలీప్‌లో స్టూడెంట్ ఇన్నోవేటర్ ప్రోగ్రామ్ కొనసాగుతోంది. 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థుల వినూత్న ఆవిష్కరణలపై ఆలోచనలు, వాటిని మెరుగు పరిచేదిశగా, అవగాహన కల్పించేవిధంగా శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణలో భాగంగా శనివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జేఎన్‌టీయూహెచ్‌కు చెందిన డైరెక్టరేట్ ఆఫ్ ఎంట్రపెన్యూర్‌షిప్ ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్స్ డైరెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న సృజనాత్మకశక్తిని వెలికితీసి గొప్ప ఆవిష్కర్తలుగా రూపొందించడంలో ఎలీప్ వీహబ్ చేస్తున్న కృషి అమోఘమన్నారు. అనంతరం రమాదేవి మాట్లాడుతూ ఎలీప్ సంస్థ దేశ వ్యాప్తంగా నూతన ఆవిష్కరణలకు తోడ్పాటు నందిస్తూ 20 పైచిలుకు పాఠశాలలకు మద్దతుగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఎలీప్ వీహబ్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ జహురుల్లా మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడేలా ఎలక్ట్రానిక్స్, పారిశ్రామిక సంబంధిత ఉత్పత్తులను రూపొందించేందుకు విద్యార్థులకు ఎలీప్ ఆధ్వర్యంలో శిక్షణ, సలహాలు ఇస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం నుంచి భారతీయ విద్యాభవన్, ఒయాసిస్ పాఠశాల, రామన్ హైస్కూల్, సిల్వర్ ఓక్స్ పాఠశాల, ముప్కల్ జడ్పీహెచ్‌ఎస్, డిచ్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన 20 మంది విద్యార్థులు, అంకుర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు వైద్యసేవలపై అధ్యయనం





ట్రాన్స్‌జెండర్ సైంటిఫిక్ సదస్సుకు హాజరైన వైద్యనిపుణులు, వైద్యులు, జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న ప్రొ. రాజకుమారి, ఇందిర, రమాదేవి

- గాంధీ ఆస్పత్రి సదస్సులో అభిప్రాయపడిన నిపుణులు
- న్యాయపరమైన అంశాలపై స్పష్టత అవసరం
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేక వార్డులు
- త్వరలో గాంధీలో క్లినిక్ ఏర్పాటు

గాంధీఆస్పత్రి : ట్రాన్స్‌జెండర్లకు అందించాల్సిన వైద్యసేవలు, వారిలో కలిగే మానసిక, శారీరక మార్పులు, హార్మోన్ల ప్రభావం వంటి అంశాలపై మరింత లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని పలువురు వైద్యనిపుణులు అభిప్రాయపడ్డారు. సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ ఫిజియాలజీ విభాగం ఆధ్వర్యంలో అలుమ్నీ భవనంలో 'ట్రాన్స్‌జెండర్ ఫిజియాలజీ– మల్టీడిసిప్లినరీ అప్రోచ్'అనే అంశంపై కంటిన్యూస్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ (సీపీడీ) సైంటిఫిక్ సదస్సును శనివారం నిర్వహించారు. గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, ప్రోగ్రాం చైర్‌పర్సన్, ఫిజియాలజీ ప్రొఫెసర్ రమాదేవి జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా పలువురు వైద్యనిపుణులు మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ రీప్రొడెక్టివ్ హెల్త్ అండ్ ఫెర్టిలిటీ, హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ, జెండర్ కన్ఫర్మేషన్ సర్జరీ, మెంటల్ హెల్త్ మేనేజ్‌మెంట్, లీగల్, ఎథికల్ కన్సిడరేషన్ తదితర అంశాలపై ఆయా రంగాల వైద్యనిపుణులు సైంటిఫిక్ ఉదాహరణలతో వివరించారు.

32 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ట్రాన్స్‌జెండర్లకు క్లినిక్‌లు

గాంధీ ఫిజియాలజీ విభాగ ప్రొఫెసర్ రమాదేవి మీడియాతో మాట్లాడుతూ దేశంలో ట్రాన్స్‌జెండర్ల హక్కుల కోసం ఉద్యమాలు జరుగుతున్నాయని, సుప్రీంకోర్టు చేసిన సూచన మేరకు రాష్ట్రంలో 32 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక క్లినిక్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ట్రాన్స్‌జెండర్ల వైద్యసేవలపై సైంటిఫిక్ సదస్సు నిర్వహించడం దేశంలోనే ఇదే ప్రథమమన్నారు. ఈ సదస్సుకు దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన 500 మంది వైద్యులు ఆఫ్ అండ్ ఆన్‌లైన్ ద్వారా హాజరయ్యారని వివరించారు. గాంధీ ఆస్పత్రిలో ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌ను త్వరలోనే ప్రారంభించనున్నట్లు సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి తెలిపారు. ఉస్మానియాలో ఎంబీబీఎస్ చదివి, ప్రస్తుతం నిజామాబాద్ మెడికల్ కాలేజీలో ఆర్థోపెడిక్ పీజీ చేస్తున్న ట్రాన్స్‌జెండర్ వైద్యురాలు ప్రాచీ రాథోడ్ సదస్సుకు హాజరై తన స్వీయ అనుభవాలు, ఆరోగ్య, మానసిక సమస్యలు, ఎదుర్కొన్న సవాళ్లు, సమాజం తీరుతెన్నులు వంటి అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో గాంధీ వైస్ ప్రిన్సిపాల్స్ రవిశేఖరరావు, వాల్యా, డిప్యూటీ సూపరింటెండెంట్ సుబోధ్ కుమార్, రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ వైద్య కళాశాలలకు చెందిన సైకాలజీ, ఫిజియాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, ఎండోక్రైనాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్ వైద్య నిపుణులు రాకేష్‌కుమార్ సహాయ్, లావణ్య కౌశల్, జయరాణి, గోలి మహాలక్ష్మీ, పాలుకూరి లక్ష్మీ, మాలతేష్, మోహన్‌రెడ్డిలతోపాటు పలు విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే ఐక్యతా వాకథాన్



దక్షిణ మధ్య రైల్వే వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఐక్యతా వాకథాన్

ఖైరతాబాద్: దక్షిణ మధ్య రైల్వే నిఘా అవగాహన వారోత్సవాల్లో భాగంగా శనివారం నెక్లెస్ రోడ్డులోని ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ నుంచి ఇంటిగ్రిటీ వరకు ఐక్యతావాకథాన్ నిర్వహించారు. ఈ వాకథాన్‌ను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, అదనపు జనరల్ మేనేజర్ జె.వినయన్ ప్రారంభించారు. అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ 'సత్యనిష్ట అంటే నిజాయతీ మాత్రమే కాదు, మన మేథస్సు, మనసును మిళితం చేయడమని అన్నారు. ప్రతి ఒక్కరూ వారి జీవితాల్లో మంచి విలువలు, అభ్యాసాలను ఏకీకృతం చేస్తూ జీవన విధానాన్ని మార్చుకోవాలని సూచించారు. మనం చిత్తశుద్ధితో ఏది చేసినా అది మన జాతి సౌభాగ్యానికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. నిఘా అవగాహన వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు, విద్యార్థులకు, రైల్వే సిబ్బందికి అవగాహన కల్పించేందుకు శిక్షణలు, సెమినార్‌లు, పోటీలు వంటి పలు కార్యక్రమాలను చేపట్టినందుకు విజిలెన్స్ శాఖను అభినందించారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో కల్చరల్ ఆఫ్ ఇంటిగ్రిటీ ఫర్ నేషన్స్ ప్రాస్పరిటీ అనే అంశంపై నిర్వహించిన క్యారికేచర్ పోటీల విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, ఆదివారం,
3, నవంబర్, 2024



తెలుగు స్టాండప్ కామెడీ షో 6న..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో తెలుగు స్టాండప్ కామెడీ షోలకు ఆదరణ అంతకంతకూ పెరుగుతోంది. విభిన్న రకాల సమకాలీన సామాజిక అంశాలను మేళవించి హాస్యపు జల్లుల్లో ప్రేక్షకులను అలరించేవి కావడంతో పలు చోట్ల నిర్వహిస్తున్న ఈ కామెడీ షోలకు డిమాండ్ బాగుంది. కేఫ్స్‌లో ఇవి ట్రెండీగా మారిన నేపథ్యంలో కేపీహెచ్‌బీలోని ది హ్యాష్ టాగ్ కేఫ్ బుధవారం తెలుగు స్టాండప్ కామెడీ షో నిర్వహిస్తోంది. నగరానికి తెలుగు స్టాండప్ కామెడీని పరిచయం చేసిన సిల్లీ సౌత్ కామెడీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ప్రదర్శనకు సంబంధించిన అదనపు వివరాలకు, ఎంట్రీల కోసం ఆన్‌లైన్ ద్వారా నిర్వాహకులను సంప్రదించాలి.



జీవీకే వన్‌లో 'ప్లే ఎన్ లెర్న్' నేడు..

సాక్షి, సిటీబ్యూరో: ఆటల ద్వారా నేర్చుకోవడాన్ని బ్రెయిన్‌కు నేర్పేందుకు, చిన్నారుల మేధకు పదును పెట్టేందుకు బంజారాహిల్స్‌లోని జీవీకే వన్ మాల్‌లో ప్లే ఎన్ లెర్న్ పేరిట వినోదభరిత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఏడేళ్ల వయసు లోపు చిన్నారులకు మాత్రమే పరిమితమైన ఈ ఈవెంట్‌లో బాల్ పూల్, ట్రంపోలైన్, ఆర్గానిక్ సీడ్ పిట్, రోల్ ప్లే టౌన్ తదితర వైవిధ్యమైన ఆటలను ఆడుతూ.. చిన్నారులు వినోదాలతో ఆహ్లాదంగా గడపవచ్చు.

అమెజాన్ సూపర్ వాల్యూ డేస్ 7వరకూ..

సాక్షి, సిటీబ్యూరో: పండుగ సీజన్‌ను పురస్కరించుకుని ఆన్‌లైన్ విపణి అమెజాన్ ఫ్రెష్ తమ ఫెస్టివల్ సెలబ్రేషన్స్‌ను ఈ నెల 7వ తేదీ వరకూ కొనసాగిస్తోంది. ఈ విషయాన్ని అమెజాన్ నగర ప్రతినిధులు తెలిపారు. సూపర్ వాల్యూ డేస్ పేరుతో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో భాగంగా పండ్లు, కూరగాయలు తదితర నిత్యావసరాలపై విభిన్న రకాల క్యాష్ బ్యాక్, రాయితీలు అందిస్తున్నట్టు వివరించారు.

నేడు సండే సోషల్ హౌజ్ పార్టీ



సాక్షి, సిటీబ్యూరో: వయసులకు అతీతంగా అందరూ ఆనందించే విభిన్న రకాల అంశాలతో సండే హౌజ్ పార్టీ నిర్వహిస్తున్నారు. జూబ్లీహిల్స్‌లోని ఎంఆర్‌సీ కాలనీలో ఉన్న భాగ్ బీన్స్ కాఫీ అండ్ ఆర్ట్ ఆవరణలో ఆదివారం సాయంత్రం 4గంటల నుంచి ఈ ఈవెంట్ జరుగుతుంది. ఆటలు, పాటలు, సంగీతం, ఓపెన్ మైక్ తదితర వినోద విశేషాలతో కొనసాగే ఈ హౌజ్ పార్టీలో ఫుడ్, మాక్‌టైల్స్ కూడా అందిస్తారు. ఆసక్తి కలిగిన వారు ఎంట్రీలను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయాలి.

గిన్నిస్ రికార్డ్స్‌లో శాండ్‌విచ్..



ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన శాండ్‌విచ్ కూడా ఉంది. గిన్నిస్ రికార్డుల ప్రకారం.. పేరొందిన అంతర్జాతీయ చెఫ్ జోయ్ కాల్డరోన్ తయారు చేసిన గ్రిల్డ్ ఛీజ్ శాండ్ విచ్ 214 డాలర్లు అంటే దాదాపు భారతీయ కరెన్సీలో రూ.17వేల ఖరీదు చేస్తుందట. న్యూయార్క్‌లోని 3 రెస్టారెంట్స్‌లో మాత్రమే ఇది అందుబాటులో ఉంది. షాంపేన్ తదితర ఖరీదైన వాటిని ఇందులో మేళవించడమే దీనికి కారణమట.



శాండ్‌విచ్ పోషకాలు రిచ్..

శాండ్‌విచ్ నగరంలో అత్యంత క్రేజీ స్నాక్స్‌లో ఒకటి. అల్పాహారం, భోజనం లేదా సాయంత్రం స్నాక్‌గా లేదా లైట్ డిన్నర్‌గా కూడా తీసుకోగలిగిన ఏకైక ఫుడ్ ఐటమ్. దీంతో నగరంలో ఫుడ్ లవర్స్‌కి మాత్రమే కాదు యువత నుంచి ముసలి వారి వరకూ, ఉద్యోగుల నుంచి లైట్ ఫుడ్‌ని తీసుకునేవారి వరకూ బాగా దగ్గరైన ఫుట్ ఐటమ్‌గా చెప్పుకోవచ్చు. రకరకాల ఫ్లేవర్స్‌లో అందుబాటులో ఉండే ఈ రుచికరమైన శాండ్‌విచ్ పోషకాహారంగా కూడా పేరొందింది.

-సాక్షి, సిటీబ్యూరో

సిటిజనుల్లో అత్యంత ఆదరణ పొందిన ఫుడ్



బ్రిటిష్ పాలకుడు జాన్ మోంటాగు 18వ శతాబ్దంలో రెండు బ్రెడ్ ముక్కల మధ్యలో మటన్ స్లైసెస్ ఉంచి సర్వ్ చేయమని సిబ్బందిని ఆదేశించాడట. దాని వల్ల తాను అవి తింటూనే పేకాట ఆడుకోవచ్చని ఆయన భావించాడట. అలా పుట్టిన శాండ్‌విచ్ ఆ తర్వాత క్రమంలో విశ్వవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. మన భాగ్యనగరంలోనూ సిటిజనులకు ఫేవరెట్ ఫుడ్ ఐటమ్‌గా అవతరించింది. తయారీ సులువుగా ఉండడంతో పాటు అందుబాటు ధరల్లో ఉండటం కూడా శాండ్‌విచ్ పాప్యులర్ అవ్వడానికి ప్రధాన కారణం.. కనీసం రూ.100 మొదలుకుని రూ.600 దాకా కూడా నగరంలో విభిన్న రకాల శాండ్‌విచ్‌లు అందుబాటులో ఉన్నాయి.

బ్రేక్‌ఫాస్ట్ నుంచి డిన్నర్ వరకూ..

శాండ్‌విచ్‌లను చాలా సులభంగా ఇంట్లో సైతం వేగంగా తయారు చేయవచ్చు. ఉదయం బ్రేక్ ఫాస్ట్ నుంచి మిడ్ డే స్నాక్స్‌గానూ, సాయంత్రం టీ టైమ్ దాకా ఎనీ టైమ్ శాండ్‌విచ్ బెస్ట్ కాంబినేషన్.. నచ్చిన కూరగాయలను లేదా విభిన్న రకాల మేళవింపులను దీనికి జతగా ఉపయోగించవచ్చు. రుచికరమైన సాస్‌లు, చీజ్‌లతో పాటు కార్బోహైడ్రేట్స్, ప్రొటీన్, ఫైబర్ మేళవింపునకు అనుకూలం కావడంతో ఆరోగ్యకర పోషకాహారంగానూ ప్రాచుర్యం పొందింది.



రుచికరమైన శాండ్‌విచ్ చేయడానికి ఎల్లప్పుడూ చీజ్, బ్రెడ్ రెండూ కలపడం మంచిది. సోర్డోఫ్ బ్రెడ్, చీజ్ తాజా దోసకాయ ముక్కలతో దోసకాయ-చీజ్ శాండ్‌విచ్, సాయంత్రం టీ సమయంలో తినాలనిపిస్తే, బ్రెడ్ మష్రూమ్‌లను ఉపయోగించి మష్రూమ్ శాండ్‌విచ్ తయారు చేయవచ్చు. దీనికి వెల్లుల్లి, చిల్లీ ఫ్లేక్స్, ఒరేగానో, మోజారెల్లా చీజ్, బ్రెడ్ స్లైసెస్, మసాలా దినుసులు జోడించవచ్చు. మొక్కజొన్న, బ్రోకలీ, బెల్ పెప్పర్స్, టొమాటోలు వంటి తాజా కూరగాయల కలయికతో ఇంట్లో తయారుచేసిన స్ప్రెడ్‌లు, సాస్‌లతో వెజ్ శాండ్‌విచ్ తయారు చేయవచ్చు. ఇదే విధంగా చికెన్, ఎగ్స్ రకరకాల మేళవింపులతో నాన్‌వెజ్ వెరైటీలూ తయారు చేసుకోవచ్చు. సూప్స్ నుంచి తేనీటీ దాకా పీనట్ బటర్ నుంచి జామ్ దాకా ఏ కాంబినేషన్‌లోనైనా అమరిపోతాయి. రోస్ట్ చికెన్, మస్టర్డ్ శాండ్‌విచ్ స్పినాచ్ అండ్ కార్న్, రోస్టెడ్ వెజిటబుల్ అండ్ ఛీజ్ వంటి ఫిల్లింగ్స్‌తో ఇంట్లో వీట్ బ్రెడ్‌తో కూడా చేసుకోవచ్చు.



ట్రెడిషన్స్‌ను కలుపుకుంటూ టేస్టీగా..

బ్రిటీష్, డచ్ జాతీయులు యూరోపియన్ బ్రెడ్-మేకింగ్ పద్ధతులను మన నగరం స్వీకరించి సంప్రదాయ మసాలా దినుసులు. నాన్, రోటీ వంటి స్థానిక ఫ్లాట్‌బ్రెడ్‌లను కూడా ఉపయోగించి సరికొత్త శాండ్‌విచ్ రుచులను సృష్టించింది. 'టిక్కా మసాలా వంటి మన సంప్రదాయ రుచులు శాండ్‌విచ్‌లలో చేర్చారు' అని మకావు రెస్టారెంట్ హెడ్ చెఫ్ రవి చెబుతున్నారు. 'కేఫ్‌కి వెళ్లినప్పుడు, ప్రతి ఒక్కరూ వెరైటీ కోసం చూస్తారు. అందుకే సోర్‌డౌ శాండ్‌విచ్‌ల నుంచీ క్రోసెంట్ బన్స్ వరకూ మెనూలో చేరుతున్నాయి' అని చెఫ్ ఫ్రాన్సిస్ అభిప్రాయపడ్డారు. స్థానిక అభిరుచులకు గ్లోబల్ ట్రెండ్ మిళితం చేసి అవొకాడో లేదా పెస్టోతో ఓపెన్-ఫేస్డ్ శాండ్‌విచ్‌లను కూడా ఇక్కడి కేఫ్స్ పరిచయం చేశాయి. మారుతున్న ఆధునికుల అభిరుచికి అనుగుణంగా వీగాన్ శాండ్‌విచ్‌లు కూడా అందుబాటులోకి వచ్చాయి.

నగరం నలువైపులా..



నగరంలో దాదాపు అన్ని కేఫ్స్, రెస్టారెంట్స్, బేకరీల్లో రుచికరమైన శాండ్‌విచ్ వెరైటీలు లభిస్తాయి. అలా చెప్పుకోదగ్గ వాటిలో కొన్ని ఎగ్ బటర్‌తో బేక్ చేసిన ఫ్రెంచ్ బ్రెడ్ మెల్ట్ శాండ్‌విచ్‌లు ప్యాటీ మెల్ట్ పేరుతో మాదాపూర్‌లోని సిగుస్తా అందిస్తుండగా, గండిపేటలోని బృందావన్ కాలనీలోని కేఫ్ శాండ్‌విచో, అలాగే బంజారాహిల్స్ రోడ్ నెం 14లో ఉన్న రోస్టరీ కేఫ్, మాదాపూర్‌లోని బేక్‌లోర్, నగరంలో పలు చోట్ల ది బేక్ ఫ్యాక్టరీ, అమెరికన్ శాండ్‌విచ్‌లకు పేరొందిన హిమాయత్ నగర్‌లోని కింగ్ అండ్ కార్డినల్, సింధి కాలనీలోని చత్వాలా, కొండాపూర్‌లోని శాండ్‌విచ్ స్క్వేర్, జూబ్లీహిల్స్‌లోని కోర్ట్‌యార్డ్ కేఫ్స్ కూడా శాండ్‌విచ్‌లకు పేరొందాయి. ఇక శాండ్ విచ్ ఈటరీ పేరుతో నగరంలో పలు ప్రాంతాల్లో ప్రత్యేకించిన ఔట్‌లెట్స్ ఫుడ్ లవర్స్‌కి చిరునామాగా మారాయి. 'మాంసం లేదా చీజ్‌తో నిండిన బ్రెడ్ లేదా పేస్ట్రీ కలయికలు, మసాలా దినుసులు ధరించడం పురాతన కాలం నుండి ఆనందించబడింది' అని ఫ్యూ డెసర్ట్, బార్ మరియు కిచెన్‌లో ఎగ్జిక్యూటివ్ చెఫ్ జో ఫ్రాన్సిస్ వివరించారు.

మానవ తప్పిదాలు.. ప్రకృతికి నష్టం..



మానవ తప్పిదాలకు ప్రకృతి సహజత్వాన్ని కోల్పోతోంది. జీవరాసుల మనుగడకు ముప్పు వాటిల్లుతోంది. దీనిపై అందరం కలసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉంది. నేను ఆరు నెలల నుంచి ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు ప్రక్రియలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాను.

– యాదగిరి, ప్రైవేటు ఉద్యోగి, హైదరాబాద్

వాటర్ బాటిల్స్, మద్యం సీసాలే అధికం..



నా టీం సభ్యులతో కలసి నల్లగండ్ల చెరువు దగ్గర ప్రతి ఆదివారం వ్యర్థాల తొలగించే కార్యక్రమం చేపడతాను. వివిధ ప్రాంతల నుంచి వలస పక్షులు చూపరులను ఆకట్టుకుంటాయి. ప్రశాంతంగా వచ్చి కూర్చుందామంటే చెత్త చెదారం వేస్తున్నారు. అత్యధికంగా ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, తినుబండారాలకు సంబంధించిన కవర్లు, మద్యం సీసాలు లభ్యమవుతున్నాయి. పగిలిన సీసాలతో ఇబ్బందులు తప్పడంలేదు. సేకరించిన చెత్తను జీహెచ్‌ఎంసీకి అప్పగిస్తాం.

– రమ, బీహెచ్‌ఈఎల్

పరిసరాలపై విశ్వాసం

ప్లాస్టిక్ ఫ్రీ చెరువుల కోసం యత్నం

- వలస పక్షులకు ఇబ్బంది కలుగకుండా..
- సెలవు రోజుల్లో చెత్త సేకరణ పనులు
- ఆదర్శంగా నిలుస్తున్న విశ్వ సస్టైనబుల్ సొసైటీ



సాక్షి, సిటీబ్యూరో: ప్లాస్టిక్ సంచులు, ఇతర వ్యర్థాలను కాల్వలు, చెరువు కట్టలు, రహదారికి ఇరువైపులా ఎక్కడపడితే అక్కడ పడేస్తుండటం గమనిస్తాం. ఆయా ప్రాంతాలను శుభ్రం చేయాలంటే పురపాలక సిబ్బంది రావాలని అనుకుంటాం. ఆలస్యమైతే ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తాం.. అలా కాకుండా మనమే శుభ్రం చేద్దామని కంకణం కట్టుకున్నవారెంతమంది ఉంటారు? అలాంటి వారు నగరంలో చాలా అరుదనే చెప్పాలి. కొందరు యువత మాత్రం చెరువుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, మద్యం సీసాలు, ఇతర వ్యర్థాలను తొలగించే కార్యక్రమానికి నడుం బిగించారు. 2021 నుంచి నగరంలో సరూర్‌నగర్ చెరువు, అమీన్‌పూర్ చెరువు, నల్లగండ్ల చెరువు, గాంధీ చెరువు, పీరంచెరువు, ఖాజాగూడ చెరువు, తదితర ప్రాంతాల వద్ద కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రతి సెలవు రోజునా చెరువు కట్ట, పరిసర ప్రాంతాలను శుభ్రం చేయాలన్నది వారి లక్ష్యం. ఫలితంగా పర్యావరణ పరిరక్షణ, ఇతర వ్యక్తుల్లో క్లీనింగ్ పట్ల స్పృహ కల్పించడం, ఎన్నో రకాల పక్షులను ఆదుకున్నట్లవుతుందని భావిస్తున్నారు. ఐదుగురు స్నేహితులతో ప్రారంభమైన విశ్వ సస్టైనబుల్ ఫౌండేషన్ ప్రస్తుతం సుమారు 500 మందికిపైగా వలంటీర్లను జత చేసుకుంది.

బృందాలుగా ఏర్పడి...



వీరంతా బృందాలుగా ఏర్పడి చెరువులను దత్తత తీసుకుంటున్నారు. వారాంతంలో వారికి కేటాయించిన చెరువుల దగ్గర ప్రజలు వేసే చెత్త, ప్లాస్టిక్ సంచులు, తాగుబోతులు విసిరేసిన గాజు సీసాలు వంటి వ్యర్థాలను ఏరిపారేస్తున్నారు. సంచుల్లో ప్యాక్ చేసి జీహెచ్‌ఎంసీకి తరలిస్తున్నారు. దేశంలోనే మొదటి బయోడైవర్సిటీ చెరువుగా గుర్తింపు పొందిన అమీన్‌పూర్ చెరువుతో పాటు నగరంలో పలు చెరువులకు వలస పక్షులు వస్తున్నాయి. ఈ సీజన్‌లో వాటి సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. అయితే ఇలా వలస వచ్చిన పక్షులు ఇక్కడ ప్లాస్టిక్ భూతానికి బలైపోతున్నాయి. ఆహారంగా చేపలు, ఇతర కీటకాలను వేటాడే సమయంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్నాయి. ఈ క్రమంలో వాటికి ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలి. ప్రకృతి సిద్ధంగా ఉన్న చెరువులను ఆహ్లాదకరంగా మార్చాలనే పట్టుదలతో ఒక్కో చెరువునూ ఒక్కో బృందం పర్యవేక్షిస్తుంది. ప్రస్తుతం నగరంలో ఏడు బృందాలు పనిచేస్తున్నాయి.

మ్యాగ్నెటిస్ట్.. విపిన్..

వృత్తి కంటి వైద్యం.. ప్రవృత్తి ట్రావెలింగ్



- 500లకు పైగా మ్యాగ్నెట్స్ సేకరణ
- తెలంగాణ పర్యాటక ప్రదేశాలపైనా విపిన్ దృష్టి
- అరౌండ్ ది వరల్డ్ పేరుతో పుస్తక రచన

సాక్షి, సిటీబ్యూరో: జిహ్వకో రుచి.. పుర్రెకో బుద్ధి అని నానుడి.. ప్రతి ఒక్కరికీ ఏదో ఒక హాబీ ఉంటుంది. కొందరికి కాయిన్స్ సేకరించడం అలవాటు అయితే మరికొందరికి స్టాంప్స్ సేకరించడం అలవాటు. కానీ అందరికీ భిన్నంగా ఫ్రిడ్జ్ లకు అంటించే బొమ్మల మ్యాగ్నెట్స్ సేకరించడం ఆయనకు అలవాటు. ఆయన వృత్తి కంటి వైద్యం.. ఆయన ప్రవృత్తి ట్రావెలింగ్. అందరి లాగా ఏదో వెళ్లామా.. వచ్చామా అన్నట్టు కాకుండా ఆ ప్రదేశం చరిత్రను అందరికీ తెలియజేసేలా మ్యాగ్నెట్స్ సేకరించడం హాబీగా మలుచుకున్నాడు. అతడి పేరే డాక్టర్ ఆంథోనీ విపిన్ దాస్.



విపిన్ దాస్ వృత్తి రీత్యా ఎంత బిజీ అయినా కూడా ఖాళీ సమయాల్లో ట్రావెలింగ్ చేయడం ఇష్టం. ట్రావెలింగ్‌తో ఎన్నో అనుభవాలు, సంస్కృతి, సంప్రదాయాల గురించి ఎంతో తెలుసుకున్నానని విపిన్ చెబుతున్నాడు. అయితే ఏదైనా విభిన్నంగా చేయాలనే తలంపుతో కొత్తగా మ్యాగ్నెట్స్ సేకరించడం ప్రారంభించాడు. అలా దాదాపు ఏకంగా 500లకు పైగా మ్యాగ్నెట్స్ సేకరించాడు. అలా ఒక్కో ప్రదేశం చరిత్రను ఒక్కో మ్యాగ్నెట్ రూపంలో ఉండేలా చూసుకున్నాడు. అలా ఎన్నో దేశాలు, ప్రదేశాల చరిత్ర, సంప్రదాయాల గురించి ప్రజలకు తెలియజేసే ప్రయత్నం చేశాడు. ట్రావెలర్స్ కోసం ప్రత్యేకంగా ట్రావెర్నియా ఫెస్ట్‌ను నవంబర్ 15న హైటెక్స్‌లో అంగరంగ వైభవంగా జరుపనున్నారు.

ట్రావెల్లింగ్ ప్రాణం..

తెలంగాణ చరిత్ర తెలుసుకునేలా..

సాధారణంగా ఒక్కో దేశం గురించి మ్యాగ్నెట్స్ సేకరించడం విపిన్ కు అలవాటు. కానీ తెలంగాణపై మక్కువతో తెలంగాణ పర్యాటక ప్రదేశాలపై వినూత్నంగా మ్యాగ్నెట్స్ రూపొందించాడు విపిన్. అంతే కాకుండా తెలంగాణ సంస్కృతిపై మ్యాగ్నెట్స్ తో పాటు.. త్రీడీ బొమ్మలు కూడా రూపొందించారు. దీంతో పాటు అరౌండ్ ది వరల్డ్ పేరుతో తన అనుభవాలతో ఒక పుస్తకాన్ని కూడా రూపొందించాడు.



ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- భూదాన్‌పోచంపల్లిలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతుల ధర్నా



యాదాద్రి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

భూదాన్‌పోచంపల్లి: ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నివారిస్తూ ఆ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ...రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి నెల రోజులు గడిచినా తూకం వేయడం లేదన్నారు. కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం వల్ల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంటా వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని, రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూదాన్‌పోచంపల్లి పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, నాయకులు, రైతులు రావుల శేఖర్‌రెడ్డి, సామ రవీందర్‌రెడ్డి, బత్తుల శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకున్నా.. వెయ్యి కోట్ల 'సీతారామ' టెండర్లు!

- ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీల పనుల్లో నిబంధనల ఉల్లంఘన
- రూ. 1,842 కోట్లకు పిలిచిన టెండర్లలో రూ. 1,074 కోట్ల పనులకు అనుమతుల్లేని వైనం
- వివాదాస్పదంగా ప్రాజెక్టు అధికారుల తీరు.. సమీక్షలో మంత్రి ఉత్తమ్ ఆగ్రహం?

సాక్షి, హైదరాబాద్: సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా పరిపాలనా అనుమతుల్లేకుండానే సుమారు రూ. 1,074 కోట్ల అంచనా వ్యయంతో డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం, ఇతర పనులకు ప్రాజెక్టు అధికారులు టెండర్లను ఆహ్వానించడం నీటిపారుదల శాఖలో వివాదస్పదంగా మారింది. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 5 మధ్య ఏడు పనులకు రూ. 1,842 కోట్ల అంచనాతో నీటిపారుదల శాఖ టెండర్లను ఆహ్వానించింది. అయితే వాటిలో సుమారు రూ. 768 కోట్లు విలువ చేసే పనులకే ఆర్థిక శాఖ ఆమోదం తెలపగా ఆ మేరకు నీటిపారుదల శాఖ పరిపాలనా అనుమతులు జారీ చేసింది. మిగిలిన రూ. 1,074 కోట్ల పనులకు ఆమోదం తెలపడంపై నిర్ణయాన్ని ఆర్థిక శాఖ పెండింగ్‌లో ఉంచింది. అయినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా ఈ పనులకు ప్రాజెక్టు అధికారులు టెండర్లను ఆహ్వానించారు. ఈ ప్రాజెక్టుపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు శనివారం చేపట్టిన సమీక్షలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. పరిపాలనా అనుమతుల్లేకుండానే టెండర్లు పిలిచి ప్రభుత్వాన్ని తప్పుదోవపట్టించారని సంబంధిత చీఫ్ ఇంజనీర్‌పై మంత్రి ఉత్తమ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. గతంలో మంత్రులు నిర్వహించిన ఓ సమీక్షలో వెంటనే టెండర్లు పిలవాలని ఆదేశించగా.. ప్రాజెక్టు అధికారులు అనుమతులు పొందకుండానే తొందరపాటుతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చర్చ జరుగుతోంది. ప్రభుత్వం సత్వరమే టెండర్లు పిలవాలని ఆదేశిస్తే దానర్థం అనుమతుల్లేకుండానే టెండర్లు ఆహ్వానించాలని కాదని, అనుమతులన్నీ తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదేనని ఉన్నతాధికారులు అంటున్నారు.

అనుమతులు రాకుంటే ఏం చేస్తారు?

అన్ని ప్రభుత్వ ఇంజనీరింగ్ శాఖల ఈఎన్సీలు/చీఫ్ ఇంజనీర్లతో కూడిన కమిషనరేట్ ఆఫ్ టెండర్స్ (సీఓటీ) కమిటీ ఆమోదించాకే రూ. 10 కోట్లు, ఆపై విలువగల పనుల టెండర్లను ఖరారు చేయాల్సి ఉంటుంది. పనులకు అన్ని రకాల అనుమతులు ఉంటేనే సీఓటీ కమిటీ టెండర్లను ఆమోదిస్తుంది. అనుమతుల ఉత్తర్వుల్లో పేర్కొన్న పదాల్లో స్వల్ప తేడాలున్నా మళ్లీ కొత్త ఉత్తర్వులతో వస్తేనే ఆమోదముద్ర వేస్తుంది. ప్రస్తుతం సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీలకు సంబంధించిన ఆరు టెండర్లకు బిడ్ల దాఖలు గడువు ఈ నెల 8తో ముగియనుండగా మరో టెండర్ గడువు 4తో ముగియనుంది. ఆ తర్వాత ఈ బిడ్లను సీఓటీ కమిటీ పరిశీలించి ఆమోదించాల్సి ఉంది. అయితే అనుమతుల్లేకుండానే టెండర్లు జారీ కావడంతో సీఓటీ కమిటీ నుంచి వాటికి ఆమోదం లభించే అవకాశం లేదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఒకవేళ అనుమతులు లభించకపోతే టెండర్లను రద్దు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేస్తున్నాయి. కాగా, టెండర్లను ఆహ్వానించిన తర్వాత అనుమతుల్లేని పనులకు ర్యాటిఫికేషన్ (క్రమబద్ధీకరణ అనుమతులు) జారీ చేయాలని కోరుతూ నీటిపారుదల శాఖకు ప్రాజెక్టు అధికారులు విజ్ఞప్తి చేయగా అంచనాలను సమర్పించాలని నీటిపారుదల శాఖ ఆదేశించింది.

ఇప్పటికే సీతారామపై వివాదాలు...

సీతారామ ఎత్తిపోతల పథకానికి రూ. 7,926.14 కోట్ల అంచనాతో 2016 ఫిబ్రవరి 18న ప్రభుత్వం పరిపాలనా అనుమతులిచ్చింది. ఆ తర్వాత 2018 ఆగస్టులో రూ. 13,057 కోట్లకు అంచనాలను పెంచింది. ఈ ప్రాజెక్టు కింద 3,28,853 ఎకరాల కొత్త ఆయకట్టుతోపాటు 3,45,534 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరపాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే పంప్‌హౌస్‌ల పనులు పూర్తవగా డిస్ట్రిబ్యూటరీలు, ఇతర పనులు జరగాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఈ పనుల అంచనాలను భారీగా పెంచారని ప్రస్తుత ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఇదే సమయంలో పరిపాలనా అనుమతుల్లేకుండానే అధికారులు టెండర్లను నిర్వహిస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని ఉన్నతాధికారులు అంటున్నారు. ఈ అంశంపై ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్‌ను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.

చిన్నారిని చిదిమేసిన కామాంధుడు

- తిరుపతి జిల్లాలో మూడున్నరేళ్ల గిరిజన బాలికపై బంధువు కిరాతకం
- చాక్లెట్ ఆశ చూపి లైంగిక దాడి, హత్య
- బాలికను మురికి కాలువలో తొక్కేసిన కిరాతకుడు



నిందితుడు సుశాంత్

సాక్షి ప్రతినిధి, తిరుపతి: చిత్తూరు జిల్లా పుంగనూరులో చిన్నారి హత్య ఘటన మరువక ముందే తిరుపతి జిల్లా వడమాలపేటలో మరో దారుణం జరిగింది. ముక్కుపచ్చలారని మూడున్నరేళ్ల గిరిజన చిన్నారిపై ఓ కామాంధుడు అతికిరాతకంగా లైంగిక దాడి చేసి, ఆపై హత్య చేశాడు. పోలీసులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. తిరుపతి జిల్లా కేవీబీ పురం ఓళ్లూరు గిరిజన కాలనీకి చెందిన దంపతులు ఇద్దరు పిల్లలతో కలిసి దీపావళి పండుగ కోసం పది రోజుల క్రితం వడమాలపేట మండలం ఏఎం పురం ఎస్టీ కాలనీకి వచ్చారు. చిన్నారి మేనమామకు కాలు విరగడంతో ఆ బాలిక తండ్రి, కుటుంబీకులు సమీపంలోని పుత్తూరు రాచపాలెంలో శల్య వైద్యశాలకు తీసుకెళ్లారు. ఆ సమయంలో చిన్నారి తల్లితో ఉంది. చిన్నారికి వరుసకు మేనమామ అయిన ఏఎం పురానికి చెందిన సుశాంత్ ఆ బాలికకు చాక్లెట్ ఇప్పిస్తానని అంగడికి తీసుకెళ్లాడు. దుకాణం నుంచి చిన్నారిని పక్కనే ఉన్న సచివాలయం, పాఠశాల మధ్యలోకి తీసుకెళ్లి కిరాతకంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం బయటకు పొక్కకుండా చిన్నారిని పక్కనే ఉన్న మురికి కాలువలో తొక్కి అతి కిరాతకంగా చంపేశాడు. మృతదేహం పైకి కనిపించకుండా కాలువలోనే పూడ్చిపెట్టాడు. శరీరానికి బురద అంటుకోవడంతో పక్కనే స్నానం చేసి తిరిగి వచ్చాడు. సాయంత్రం వరకు చిన్నారి రాకపోవడంతో తల్లి చుట్టుపక్కల వెతికింది. ఎంతకీ కనిపించలేదు. ఈలోపు సుశాంత్ అక్కడికి రావడంతో పాప ఎక్కడ అని ప్రశ్నించింది. చాక్లెట్ ఇచ్చాక పాపను ఇంటి వద్దే వదలేశానని, నాకు తెలియదు అంటూ తడబడుతూ సమాధానం ఇచ్చాడు. గట్టిగా నిలదీయడంతో సుశాంత్ తప్పించుకునేందుకు పరుగులు పెట్టాడు. కాలనీ వాసులు సుశాంత్‌ని పట్టుకుని గట్టిగా నిలదీశారు. ఎంతకూ సమాధానం చెప్పకపోవడంతో శుక్రవారం రాత్రి చిన్నారి తల్లి, బంధువులు కలిసి అతన్ని వడమాలపేట పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేశారు. అప్పటికే అతను మద్యం, గంజాయి కూడా మత్తులో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు.

చిన్నారి ఆచూకీ కోసం రాత్రంతా గాలింపు

చిన్నారి ఆచూకీ కోసం తల్లిదండ్రులు, బంధువులు రాత్రంతా టార్చిలైట్ల వెలుతురులో పరిసర ప్రాంతాలన్నీ గాలించారు. ఎక్కడా ఆచూకీ దొరక్కపోవడంతో తిరిగి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో సుశాంత్ దారుణాన్ని ఒప్పుకున్నాడు. అతను చెప్పిన వివరాలతో శనివారం వేకువజామున మురికి కాలువలో నుంచి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం కోసం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కిరాతకుడు సుశాంత్ చిన్నతనం నుంచి ప్రవర్తన సరిగా లేదని బంధువులు చెబుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా సాగాలి

- ప్రభుత్వానికి అప్రతిష్ట తీసుకురావొద్దు
- అధికారులకు మంత్రి ఉత్తమ్ సూచన



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: ధాన్యం కొనుగోళ్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి ఎస్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వానికి అప్రతిష్ట తీసుకొచ్చే విధంగా వ్యవహరించవద్దని ఆయన అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రాష్ట్రం దేశానికే మార్గదర్శకంగా ఉండేలా చూడాలని ఉద్బోధించారు. ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లపై పౌరసరఫరాల కార్యాలయం నుంచి మంత్రి శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి కోటి న్నర మెట్రిక్ టన్నుల మేర ధాన్యం కొనుగోళ్లు ఉండొచ్చని ప్రభుత్వం అంచనా వేసిందని తెలిపారు. ఇందుకోసం రూ.30 వేల కోట్లు అవసరమవుతాయని ఆయన తెలిపా రు. ఇప్పటికే రాష్ట్ర ప్ర భుత్వం రూ.20 వేల కోట్లు ధాన్యం కొనుగోళ్ల కోసం కేటా యించిందని, అవసరమైతే అదనపు నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. ధాన్యం సేకరణలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు సృష్టించవద్దని చెప్పారు. ప్రభుత్వం, రైస్ మిల్లర్లు పరస్పరం తోడ్పాటు అందించుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు. ధాన్యం కొను గోళ్లలో మిల్లర్ల సహకారం తప్పనిసరిగా ఉండాలన్నారు. మిల్లర్లు బ్యాంకు గ్యారంటీలపై ఆందోళన చెందాల్సి న అవసరం లేదని, ధాన్యాన్ని మిల్లింగ్ చేసి సీఎంఆర్ అప్పగించిన వెంటనే బ్యాంక్ గ్యారంటీలను వాపస్ చేయ నున్నట్లు చెప్పారు. మిల్లర్ల కోరిక మేరకు ధాన్యం మిల్లింగ్ చార్జీలు పెంచినట్లు ఆయన పేర్కొన్నారు. సన్నాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ అందిస్తుందని, ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అకాల వర్షాలతో రైతులు నష్ట పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కలెక్టర్లు ఎప్పటి కప్పుడు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాలని ఆయన సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పౌర సరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి డి.యస్ చౌహాన్, కమిషనర్, జాయింట్ సెక్రటరీ ప్రియాంకా అలా, మార్కెటింగ్ డైరెక్టర్ ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

జలాశయాల రక్షణకు గ్రీన్‌సిగ్నల్!

- 'డ్రిప్'కింద రూ.645 కోట్లతో పనులకు రాష్ట్రం ఆమోదం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని జలాశయాల రక్షణ కోసం ప్రపంచ బ్యాంకు నిధులతో ప్రతిపాదించిన డ్యామ్ రిహాబిలిటేషన్ ఇంప్లిమెంటేషన్ ప్రాజెక్టు (డ్రిప్) అమలుకు అవసరమైన నిధులను విడుదల చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో 29 ప్రాజెక్టులకోసం రూ.645 కోట్లను వెచ్చించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాల్లోని 736 జలాశయాలను ఈ ప్రాజెక్టులో చేర్చిన కేంద్రం.. దీనికి రూ.10,211 కోట్లు అవుతాయని ఇప్పటికే అంచనా వేసింది. 2031 మార్చికల్లా ఈ ప్రాజెక్టును పూర్తిచేసేలా లక్ష్యాన్ని నిర్దేశించింది. తెలంగాణలో 29 ప్రధాన జలాశయాలు ఈ ప్రాజెక్టులో ఉండగా, వాటి పరిరక్షణకు గాను రూ.645 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఈ జాబితాలో నాగార్జునసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి, నిజాంసాగర్, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, జూరాల ప్రాజెక్టు, పాకాల సరస్సు, లక్నవరం, రామప్పలేక్, పాలేరు, డిండి, కోయిల్‌సాగర్, కడెం, మూసీ, ఎస్సారెస్పీ, వట్టివాగు, స్వర్ణ, ఎల్‌ఎండీ, మల్లూరు వాగు, బొగ్గుల వాగు, ఎన్టీఆర్ సాగర్, కౌలాస్‌నాల, సాత్నాలా, సింగూరు, గడ్డెన్నవాగు, అక్కనపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, పెద్ద దేవులపల్లి రిజర్వాయర్, పీపీఆర్ వంటి ప్రాజెక్టులున్నాయి. జలాశయాల ఆధునికీకరణ, మరమ్మతుల కోసం డ్రిప్ పథకంలో చేరితే వరల్డ్ బ్యాంకు నిధుల నుంచి 70 శాతం వరకు రాష్ట్రానికి రుణం అందనుంది. మరో 30 శాతం నిధుల వాటాను రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. ఆయా ప్రాజెక్టుల్లో పనుల కోసం డీపీఆర్‌లను సిద్ధం చేశారు. రూ.645.13 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఖర్చుచేసిన తర్వాత అందులో 70 శాతం రుణ రూపంలో అందుతుంది. ఇందులో 30 శాతం.. అంటే రూ.193 కోట్లను రాష్ట్రం వాస్తవంగా ఖర్చు చేయనుంది.

ఫోర్త్‌సిటీకి మెట్రో

▶ మొదటి పేజీ తరువాయి

నడుస్తున్న 69 కిలోమీటర్ల తొలిదశ మెట్రోరైలు ప్రపంచంలోనే పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో నిర్మించిన అతి పెద్ద ప్రాజెక్టు. ఐదు కారిడార్లలో 76.4 కిలోమీటర్ల రెండోదశ మెట్రోరైలు ప్రాజెక్టు నిర్మాణానికి అంచనా వేసిన రూ.24,269 కోట్లలో తెలంగాణ ప్రభుత్వం వాటా రూ. 7,313 కోట్లు (30 శాతం) కాగా, కేంద్ర ప్రభుత్వం వాటా రూ.4,230 కోట్లు (18 శాతం), జపాన్ ఇంటర్నేషన్ కోఆపరేషన్ ఏజెన్సీ (జైకా), ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ), న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) మొదలైన ఆర్థిక సంస్థల వాటా రూ.11,693 కోట్లు (48 శాతం), మరో 4 శాతం అంటే రూ.1,033 కోట్లను పీపీపీ విధానం ద్వారా సమీకరిస్తారు.

ఫోర్త్‌సిటీ మెట్రో కనెక్టివిటీకి రూ.8 వేల కోట్లు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించిన ఫోర్త్ సిటీ మెట్రో కనెక్టివిటీ లైన్ కోసం అనేక ఆకర్షణీయ ఫీచర్లతో వినూత్న రీతిలో డీపీఆర్ తయారు చేస్తున్నట్లు పురపాలక శాఖ తెలిపింది. ఈ కొత్త లైన్ డీపీఆర్ మినహా మిగిలిన ఐదు కారిడార్లకు సంబంధించిన డీపీఆర్‌ను త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి పంపుతామని అధికారులు తెలిపారు. ఫోర్త్ సిటీ మెట్రో కనెక్టివిటీకి సుమారు రూ.8,000 కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. దీంతో మొత్తం రెండో దశ ప్రాజెక్ట్‌కు అయ్యే వ్యయం దాదాపు రూ.32,237 కోట్లు (రూ.24,237 కోట్లు + రూ. 8,000 కోట్లు)గా అవుతుంది.

కొత్త హైకోర్టును కలుపుతూ..

మెట్రో రైల్ రెండో దశ డీపీఆర్‌ల రూపకల్పనపై సీఎం రేవంత్ రెడ్డి కొద్ది రోజుల క్రితం పురపాలక శాఖ సీనియర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఏఎంఎల్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మెట్రో రెండో దశ కారిడార్ల అలైన్‌మెంట్, స్టేషన్లు, ఇతర ముఖ్యమైన ఫీచర్లు తదితర అంశాల గురించి ప్రెజెంటేషన్ ఇచ్చారు. హెచ్‌ఎండీఏ కోసం సిద్ధం చేస్తున్న సమగ్ర మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ) ట్రాఫిక్ అధ్యయన నివేదిక తరువాత డీపీఆర్‌లకు తుదిరూపం ఇచ్చారు. మెట్రో మార్గాల్లో ట్రాఫిక్ అంచనాలను సీఎంపీతో క్రాస్-చెక్ చేయాల్సి ఉంటుంది. కేంద్రానికి డీపీఆర్‌లను సమర్పించడానికి ఈ అధ్యయనం తప్పనిసరి. దీంతో మెట్రో అలైన్‌మెంట్‌లు, స్టేషన్లు ఇతర అంశాలపై పూర్తిస్థాయిలో సర్వే చేసి, నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేశారు. ఆ డీపీఆర్‌లకు సీఎం ఆమోదం తెలిపారు. కాగా గతంలో ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశంలో నిర్ణయించిన ప్రకారం ఎయిర్‌పోర్ట్ మెట్రో అలైన్‌మెంట్ ను ఇప్పుడు ఆరాంఘర్, 44వ నెంబర్ జాతీయ రహదారి (బెంగళూరు హైవే)లోని కొత్త హైకోర్టు ప్రాంతం మీదుగా శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకునేలా ఖరారు చేశారు.

ఐదు కారిడార్‌ల అలైన్‌మెంట్‌లు ఇలా..

కారిడార్ -4 (ఎయిర్‌పోర్ట్ మెట్రో కారిడార్)

నాగోల్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు దాదాపు 36.6 కి.మీ. ఎల్‌బీ నగర్, కర్మన్‌ఘాట్, ఒవైసీ హాస్పిటల్, డీఆర్‌డీఓ, చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి, ఆరాంఘర్, న్యూ హైకోర్టు, శంషాబాద్ జంక్షన్ ద్వారా జాతీయ రహదారి మీదుగా ఈ మార్గం ఉంటుంది. ఇది నాగోల్, ఎల్‌బి నగర్, చాంద్రాయన్ గుట్ట వద్ద ఉన్న అన్ని మెట్రోలైన్‌లకు అనుసంధానం చేయబడుతుంది. 36.6 కి.మీ పొడవులో 35 కి.మీ పిల్లర్ల మీద (ఎలివేటెడ్), 1.6 కి.మీ మార్గం భూగర్భంలో వెళ్తుంది. విమానాశ్రయం వద్ద భూగర్భ స్టేషన్ ఉంటుంది. ఈ మార్గంలో మొత్తం 24 స్టేషన్లు ఉంటాయి

కారిడార్ 5

రాయదుర్గ్ మెట్రో స్టేషన్ నుంచి కోకాపేట నియోపోలిస్ వరకు వరకు ఈ మార్గం ఉంటుంది. బయోడైవర్సిటీ జంక్షన్, ఖాజాగూడ రోడ్, నానక్ రామ్ గూడ జంక్షన్, విప్రో సర్కిల్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట నియోపోలిస్ వరకు నిర్మిస్తారు. ఇది మొత్తం పిల్లర్ల పైనే ఉండే ఎలివేటెడ్ కారిడార్. ఇందులో 8 స్టేషన్లు ఉంటాయి.

కారిడార్ 6 (ఓల్డ్ సిటీ మెట్రో)

ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణ గుట్ట వరకు ఇది ఉంటుంది. ప్రస్తుతం జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు ఉన్న గ్రీన్ లైన్ పొడిగింపుగా 7.5 కి. మీ మేర నిర్మించబడుతుంది. ఓల్డ్ సిటీలోని మండి రోడ్, దారుల్‌షిఫా జంక్షన్, శాలిబండ జంక్షన్, ఫలక్‌నుమా మీదుగా ప్రయాణిస్తుంది. ఈ కారిడార్ సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్ నుంచి 500 మీటర్ల దూరం నుంచి వెళ్తున్నప్పటికీ చారిత్రక ప్రాముఖ్యత కారణంగా ఆ పేర్లనే స్టేషన్లకు పెట్టాలని నిర్ణయించారు. ఈ రూట్‌లో ఉన్న రోడ్లను విస్తరిస్తారు. రోడ్డు విస్తరణ, మెట్రో అలైన్‌మెంట్‌లో దాదాపు 1100 ఆస్తులు ప్రభావితమవుతాయి. ప్రభావితమైన 400 ఆస్తులకు ఇప్పటికే నోటిఫికేషన్‌లు జారీ చేశారు. ఈ మార్గంలో దాదాపు 103 మతపరమైన, వారసత్వ, ఇతర సున్నితమైన నిర్మాణాలు ఉన్నాయి. వాటన్నింటికీ తగిన ఇంజినీరింగ్ పరిష్కారాలు చూపుతారు. మెట్రో పిల్లర్ స్థానాల సర్దుబాటు ద్వారా ఆ నిర్మాణాలకు నష్టం కలుగకుండా చూస్తామని అధికారులు తెలిపారు. ఈ కారిడార్ దాదాపు 6 స్టేషన్లతో పూర్తి ఎలివేటెడ్ మెట్రో.

కారిడార్ 7

ముంబై హైవేపై రెడ్ లైన్ పొడిగింపుగా నిర్మించబడుతోంది. ప్రస్తుతం ఉన్న మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి పటాన్‌చెరు వరకున్న 13.4 కి.మీ ఈ మెట్రోలైన్ ఆల్విన్ క్రాస్ రోడ్, మదీనాగూడ, చందానగర్, బీహెచ్‌ఈఎల్, ఇక్రిసాట్ మీదుగా వెళ్తుంది. ఇది దాదాపు 10 స్టేషన్లతో ఉండే పూర్తి ఎలివేటెడ్ కారిడార్.

కారిడార్ 8

విజయవాడ హైవేపై ఎల్.బి నగర్ నుంచి ప్రస్తుతం ఉన్న రెడ్‌లైన్ పొడిగింపుగా హయత్‌నగర్ వరకు 7.1 కి.మీ మేర ఈ లైన్ నిర్మిస్తారు. ఈ లైన్ చింతలకుంట, వనస్థలిపురం, ఆటోనగర్, ఆర్టీసీ కాలనీ మీదుగా వెళుతుంది. ఇది కూడా పూర్తిగా ఎలివేటెడ్ కారిడార్. ఈ లైన్‌లో 6 స్టేషన్లు ఉంటాయి.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
ఆదివారం ॥ 3-11-2024



శునకాల పండుగ

భిన్న సంప్రదాయం



కుక్క మనిషి పట్ల చాలా విశ్వాసంగా ఉంటుంది. మరి మనిషి దానికి కృతజ్ఞత ప్రకటించే పండుగ చేసుకోవాలి గదా. నేపాలీలకు శునకాలంటే చాలా ప్రీతి. వారు దీపావళి మరుసటి రోజును 'కుకుర్ తిహార్' పేరుతో శునకాల పండుగ నిర్వహిస్తారు. ఆ రోజు పెంపుడు శునకాలకు, వీధి కుక్కలకు పూజలు చేసి వాటికి ఇష్టమైన ఆహారం పెడతారు. మూగ జీవులకు మనిషి ఆశ్రయం ఇచ్చి వాటిని పెంచాలనే సందేశం ఈ పండుగలో ఉంది.

నేపాల్‌లో శునకాల మీద ప్రేమ బాల్యం నుంచి నేర్పిస్తారు. అక్కడ దీపావళి పండుగ ఐదు రోజుల పాటు చేస్తారు. మొదటి రోజు దీపావళి అయితే రెండోరోజు 'కుకుర్ తిహార్'. అంటే శునకాల పండుగ. ఆ రోజున శునకాలకు పూజ ఎలా చేయాలో ఇళ్లల్లో ఉన్న నానమ్మలు, అమ్మమ్మలు పిల్లలకు నేర్పిస్తారు. 'పిల్లలూ... మనిషిని ఏ స్వార్థం లేకుండా ప్రేమించే జీవి కుక్క ఒక్కటే. అది మనతోపాటే ఉంటుంది. మనల్ని కనిపెట్టుకుని ఉంటుంది. అంతేకాదు... మనం చనిపోయాక స్వర్గం వరకూ దారి చూపించేది అదే. అందుకే దానికి ఆశ్రయం ఇచ్చి అన్నం పెట్టాలి. కుకుర్ తిహార్ రోజు దానికి పూజ చేసి నమస్కరించుకోవాలి' అని చెబుతారు.

నేపాలీలు తరతరాలుగా ఇలా ఈ సంప్రదాయాన్ని అందిపుచ్చుకుని 'కుకుర్ తిహార్' నిర్వహిస్తారు.

కుంకుమ బొట్టు... బంతి పూల మాల

'కుకుర్ తిహార్' రోజు పెంపుడు కుక్కలకు గాని, ఇంటి కుక్కలకు గాని ప్రతి ఇంటి వారు తప్పక పూజ చేస్తారు. పూజలో మొదట కాళ్లు కడుగుతారు. ఆ తర్వాత దానికి పసుపు, కుంకుమ బొట్లు పెడతారు. ఆ తర్వాత నేత దారంతో చేసిన దండ తొడుగుతారు. ఆపైన బంతి పూల మాల వేస్తారు. ఆ పైన హారతి ఇచ్చి నమస్కరించుకుంటారు. ఇక అప్పుడు దానికి కొత్త బంతి, కొత్త బొమ్మలు ఇచ్చి ఉడికిన గుడ్లు, బిస్కెట్లు లాంటివి తినిపిస్తారు. కుక్కలు కూడా బుద్ధిగా కూచుని ఇవన్నీ చేయించుకుంటాయి. తమ యజమానులను మరింతగా ప్రేమిస్తాయి.

విశ్వాసానికి కృతజ్ఞత

కుక్కలా విశ్వాసంగా ఉండే జీవి మరొకటి లేదు. చరిత్రలు దాదాపు 14 వేల సంవత్సరాల క్రితం నుంచే మనిషికి, కుక్కకు స్నేహం కుదిరిందని ఆధారాలు చెబుతున్నాయి. మనిషి మచ్చిక చేసుకున్న మొదటి జంతువు కుక్క. నేపాలీలు మరో అడుగు వేసి కుక్క యముడికి తోడుగా వస్తుందని భావిస్తారు. మృత్యు సమయంలో అది సహాయంగా ఉండి దారి చూపుతుందని నమ్ముతారు. అందుకే కుకుర్ తిహార్ ఎంతో శ్రద్ధగా జరుపుతారు. మరో విషయం ఏమిటంటే కుక్కలకే కాదు మూగ జీవులకు ఆశ్రయం ఇవ్వడం మనిషి బాధ్యత అని, వాటిని పోషించే ఓర్పు మనిషికి ఉండాలని చెప్పడానికి కూడా ఈ పండుగ జరుపుకుంటారు.

యువరాణి రాసిన మందు చీటీ



● మనీషా కొయిరాలా



● కేట్ మిడిల్టన్

మందు మనిషి మీద పనిచేస్తే, మాట మనసు మీద పనిచేస్తుంది.'మందు చీటీ' వంటిదే ఒక మంచి మాట. చికిత్స తీసుకుంటున్నప్పుడు.. 'నీకు తప్పక నయం అవుతుంది' అనే మాట ఎలాగైతే దివ్యౌషధంలా మనసుపై పని చేస్తుందో, కోలుకుని తిరిగి వచ్చాక 'వెల్డన్ ఛాంపియన్' అనే మాట కూడా గొప్ప సత్తువను, ఉత్సాహాన్ని ఇస్తుంది.

వేల్స్ యువరాణి కేట్ మిడిల్టన్ నుంచి మనీషా కోయిరాలాకు ఇటీవల ఒక ఉత్తరం వచ్చింది! 'కేన్సర్ నుంచి పూర్తిగా కోలుకున్న వారిలో మీరూ ఒకరని నాకు తెలిసింది. చాలా సంతోషంగా అనిపించింది. తిరిగి మీరు మునుపటిలా మీ ప్రొఫెషన్ ని కొనసాగించటం, చారిటీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనటం ఇతరులకు స్ఫూర్తిని ఇస్తుంది..' అని ఆ ఉత్తరంలో రాశారు కేట్. యువరాణి కేట్ మిడిల్టన్ కూడా కేన్సర్ నుంచి బయట పడినవారే! ప్రివెంటివ్ కీమోథెరపీతో ఆమె ఈ ఏడాదే కేన్సర్‌ను జయించారు.

యువరాణి రాసిన ఉత్తరం మనీషాకు తన జీవిత లక్ష్యాలలో మరింతగా ముందుకు సాగేందుకు అవసరమైన మానసిక బలాన్ని ఇచ్చింది. 'నేను ట్రీట్మెంట్‌లో ఉన్నప్పుడు కూడా కేన్సర్ నుంచి పూర్తిగా కోలుకున్న వారు నాకు ధైర్యాన్ని ఇస్తూ మాట్లాడ్డం నన్ను త్వరగా కోలుకునేలా చేసింది. ఈ విషయంలో (క్రికెటర్) యువరాజ్ సింగ్ కి, (నటి) లీసా రే కి నేను కృతజ్ఞతలు చెప్పాలి. వాళ్లలాగే ఇతరులకు ధైర్యం చెప్పటం, నయం అవుతుందని నమ్మకం ఇవ్వటం ఇక పై నా వంతు... ' అంటున్నారు మనీషా.

నాల్గవ స్టేజ్‌లో ఉండగా 2012 లో మనీషా లో ఒవేరియన్ కేన్సర్ ను గుర్తించారు వైద్యులు. ఐదేళ్ల చికిత్స తర్వాత 2017 లో మనీషా కేన్సర్ నుంచి బయటపడ్డారు. అప్పటి నుంచీ ఇండియా, నేపాల్ దేశాలలో కేన్సర్ కేర్ కోసం పని చేస్తున్నారు. 'యువరాణి వంటి ఒక గొప్ప వ్యక్తి నాకు వ్యక్తిగతంగా ఇలా లేఖ రాయటం నాలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. కేన్సర్ బాధితుల కోసం నేను చేస్తున్న పనికి మరింతగా శక్తిని ఇచ్చింది' అంటున్న మనీషా, కేన్సర్ తనకొక పెద్ద టీచర్ అని చెబుతున్నారు.

'కేన్సర్ నన్నెంతగా బాధించినప్పటికీ ఎంతో విలువైన జీవిత పాఠాలను కూడా నేర్పింది. 'ఆశను కోల్పోకు, మంచి జరుగుతుందని నమ్ము. ఈ క్షణంలో జీవించటం నేర్చుకో. నీకు సంతోషాన్ని చ్చేవి ఏవో కనిపెట్టు..' అని ఆ టీచర్ నాకు చెప్పింది..' అంటారు మనీషా.. కేన్సర్ గురించి.

సమ్‌థింగ్ స్పెషల్

డ్యాన్సింగ్ పోలీస్ విత్...



ముంబైకి సంబంధించినంత వరకు 'డ్యాన్సింగ్ పోలీస్' అంటే గుర్తుకు వచ్చే పేరు అమోల్ కాంబ్లే. పోలీస్ యూనిఫామ్‌లో డ్యాన్స్ చేస్తున్న అమోల్ వీడియోలు సోషల్ మీడియాలో బాగా పాపులర్ అయ్యాయి.

తాజాగా అమోల్ కాంబ్లే డ్యాన్స్‌కు టిక్‌టాక్ సెన్సేషన్ ఇసాబెల్ ఆఫ్రో డాన్స్ తోడైంది.

కాదు... కాదు... ఆమె డ్యాన్స్‌కే అమోల్ డ్యాన్స్ తోడైంది.

రద్దీగా ఉండే ముంబై వీధి మధ్యలో ఆఫ్రో డ్యాన్స్ మొదలుపెట్టగానే... చుట్టుపక్కల ఉన్న ఆటోడ్రైవర్‌లు, ఇతరులు గుమిగూడి ఆ డాన్స్‌ను తమ ఫోన్‌లలో షూట్ చేయడం మొదలుపెట్టారు.

ఇంతలో బిగ్ సర్‌ప్రైజ్.

ఎక్కడి నుంచి వచ్చాడో, ఎలా వచ్చాడో తెలియదుగానీ 'డాన్సింగ్స్ పోలీస్' అమోల్ ఆఫ్రోతో కలిసి స్టెప్పులు వేయడం మొదలుపెట్టాడు. ఎప్పుడూ యూనిఫామ్‌లో డ్యాన్స్ చేస్తూ కనిపించే అమోల్ ఈసారి మాత్రం కేవలం టోపీతో మాత్రమే కనిపించాడు.

ఇన్‌స్టాగ్రామ్‌లో ఆఫ్రో షేర్ చేసిన ఈ వీడియోను 3.4 మిలియన్‌ల మంది వీక్షించారు.

ఇంటిప్స్

చీమలు... పురుగులకు లవంగాలతో చెక్



- చక్కెరకు చీమలు పడుతుంటే డబ్బాలో నాలుగు లవంగాలు వేయాలి.
- బీరువాలో దుస్తులు ఎక్కువ కాలం నిల్వ ఉంచినప్పుడు వాసన వస్తుంటాయి. లవంగాలను పొడి చేసి పలుచని రుమాలులో కట్టి ప్రతి అరలో ఒకటి ఉంచాలి.
- పది లవంగాలను పొడి చేసి ఒక పాత్రలో వేయాలి. అందులో టేబుల్ స్పూన్ బేకింగ్ సోడా, అర కప్పు నిమ్మరసం కలిపి ఆరుగంటల సేపు కదిలించకుండా ఉంచాలి. ఈ నీటిని వంటగదిలో పురుగులు తిరుగుతున్న చోట, సింక్‌లో, వాష్ బేసిన్‌లో చల్లాలి.

హెల్త్

మెల్లగా... వద్దు వెంటనే సరిచేద్దాం...



చిన్నపిల్లలు తమ కళ్లను అటు ఇటు తిప్పి చూస్తున్నప్పుడు వాళ్ల రెండు కనుపాపలు సమానంగా ఉండాలి. అలా కాకుండా వాటిలో ఏదైనా కనుపాప పక్కకు చూస్తున్నట్లుగా ఉంది. కనుపాపల మధ్య అలైన్‌మెంట్ లోపించడాన్ని మెల్ల కన్నుగా చెప్పవచ్చు. కొంతమంది చిన్నారుల్లో ఇది చాలా సాధారణంగా కనిపించే సమస్య. అయితే ఇక్కడ గుర్తుపెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే... అప్పుడే పుట్టిన చిన్నారుల నుంచి మూడు నెలల వయసప్పటివరకు పిల్లల్లో చూపు కాస్త మసగ్గా ఉండవచ్చు లేదా పూర్తిగా అభివృద్ధి చెంది ఉండకపోవచ్చు. అందుకే చిన్నారులు తమ మూడో నెల వరకు ఒకేచోట దృష్టి కేంద్రీకరించలేరు. మూడు నెలల వయసప్పటి నుంచి పిల్లలు ఒక వస్తువు (ఆబ్జెక్ట్) మీద దృష్టి పెట్టడం మొదలుపెడతారు. మూడు నెలల వయసు దాటాక పిల్లల్లో మెల్ల కన్ను కనిపిస్తుంటే వీలైనంత త్వరగా చికిత్స అందించాలి. అంతేతప్ప మెల్ల అదృష్టమనే అపోహతో దాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. నిజానికి అది దురదృష్టం. మెల్ల ఉందని తెలుసుకోవడమెలా, కారణాలూ, చికిత్స త్వరగా ఎందుకు చేయించాలనే అనేక అంశాలపై అవగాహన కోసం ఈ కథనం.

మెల్ల ఉందని తెలుసుకోవడమెలా?

పిల్లల కనుపాపలు ఒకేలా లేకపోవడం, ఒక పక్కకు చూసినప్పుడు వాళ్లలో కేవలం ఒక కనుపాప మాత్రమే ఆ పక్కకు తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తే దాన్ని 'మెల్ల' అని అనుకోవచ్చు. పసిపాపలు బలహీనంగా ఉండి, వాళ్లలో ఏదైనా రుగ్మత ఉండటం వల్ల ఈ లక్షణం కనిపించినా దాన్ని మెల్ల అనే అనుకోవాలి. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి మూడు నెలల వయసప్పటివరకు పై లక్షణాలు కనిపిస్తే దాని గురించి అంతగా ఆందోళన అక్కర్లేదు. అయితే మూడు నెలలు దాటాక కూడా అవే లక్షణాలు కనిపిస్తే వెంటనే పూర్తిస్థాయి కంటి పరీక్షలు చేయించాలి.



డాక్టర్ రవికుమార్ రెడ్డి
సీనియర్ కంటి వైద్య నిపుణులు

కారణాలు...

మెల్లకన్ను రావడానికి ఇదీ కారణమని నిర్దిష్టంగా చెప్పడం కష్టం. కొందరిలో పుట్టుకతోనే రావచ్చు. లేదా దృష్టిలోపాలు (రిఫ్రాక్టివ్ ఎర్రర్స్) ఉండటం వల్ల... అంటే హ్రస్వ దృష్టి, దూరదృష్టి, అస్టిగ్మాటిజం, మజిల్ ఇంబాలెన్స్, నరాల సమస్యల వల్ల కూడా కనిపించవచ్చు. అయితే స్పష్టంగా కనిపించడం అన్నది కాస్త పిల్లలు పెద్దయ్యాక జరుగుతుంటుంది. మెదడుకు సంబంధించిన రుగ్మతలు, జెనెటిక్ సిండ్రోమ్స్ ఉన్నప్పుడు కూడా మెల్ల కన్ను వస్తుంది.

త్వరిత నిర్ధారణ చాలా ముఖ్యం

చిన్నారుల్లో మెల్ల కన్ను ఉన్నట్లు చూడటంగానీ లేదా అనుమానించడం గాని జరిగినప్పుడు వీలైనంత త్వరగా దాన్ని నిర్ధారణ చేయడం చాలా ముఖ్యం. మూడు నెలలు దాటాక లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే గుర్తించి, తగిన చికిత్స అందించకపోతే ఆ కండిషన్ శాశ్వతం అయ్యే అవకాశం ఉంది. మెల్లకన్ను ఉన్న పిల్లల్లో దృష్టిలోపాలు (రిఫ్రాక్టివ్ ఎర్రర్స్) ఏమైనా ఉన్నాయా అని నిర్ధారణ చేయడం కూడా చాలా ముఖ్యం. ఒకవేళ రిఫ్రాక్టివ్ ఎర్రర్స్ ఉంటే చక్కదిద్దేందుకు కళ్లద్దాలు (కరెక్టివ్ స్పెక్టకిల్స్) వాడటం తప్పనిసరి. ఆ తర్వాత కూడా డాక్టర్ చెప్పిన విధంగా పిల్లలను కంటి డాక్టర్ ఫాలో అప్‌లో ఉంచాలి.

మెల్లకన్నుకు వీలైనంత త్వరగా చికిత్స చేయించకపోతే అది ఆంబ్లోపియా (లేజీ ఐ) అనే కండిషన్‌కు / కాంప్లికేషన్‌కు దారితీయవచ్చు. అంటే... మెల్ల ఉన్న కంటిలో చూపు క్రమంగా తగ్గిపోతూ ఉంటుంది. ఆరేళ్ల లోపు దీన్ని చక్కదిద్దకపోతే ఆ దృష్టిలోపం శాశ్వతమయ్యే అవకాశాలూ ఎక్కువే.

చికిత్స

మెల్ల కన్నుల్లోని అకామడేటివ్, ఈసోట్రోపియా అనే రకాలకు 'ప్లస్' కళ్లజోళ్లను డాక్టర్లు సూచిస్తారు. ఒక కన్నులో దృష్టిలోపం ఉండి, ఒక కన్ను నార్మల్‌గా ఉన్నప్పటికీ... దృష్టిలోపం ఉన్న కన్ను క్రమంగా మెల్లకన్నులా మారుతుంది. రానురానూ ఇది 'లేజీ ఐ' (యాంబ్లోపియా) అనే కండిషన్‌కు దారితీస్తుంది. దీనికి కూడా కళ్లజోడు వాడటమే సరైన చికిత్స. అప్పుడప్పుడూ కనిపించే మెల్ల కన్ను (ఇంటర్‌మిటెంట్ స్క్వింట్) అనేది కంటి కండరాల బలహీనత వల్ల వస్తుంది. కంటి వ్యాయామాల ద్వారా దీన్ని సరిచేయవచ్చు. కొందరు చిన్నారులు పుట్టుకతోనే మెల్లకన్ను కలిగి ఉంటారు. దీనికి న్యూరాలజిస్ట్ సహాయంతో చికిత్స అందించాల్సి వస్తుంది. వీటన్నింటితోనూ సమస్య పరిష్కారం కాకపోతే అప్పుడు కంటి వైద్య నిపుణులు శస్త్రచికిత్సను సూచిస్తారు. ఈ శస్త్రచికిత్స చాలా సులువైనదీ, ఫలితాలు కూడా చక్కగా ఉంటాయి. ఇప్పటికీ చాలాచోట్ల మారుమూల పల్లెల్లో మెల్ల కన్ను అదృష్టమనే అభిప్రాయం కొందరిలో ఉంటుంది. ఇది కేవలం అపోహ మాత్రమే. చిన్నారులు తమ దృష్టి జ్ఞానం కోల్పోయే ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకుని వీలైనంత త్వరగా మెల్లకన్నుకు చికిత్స అందించడం అవసరం.

మహిళల్లో బ్రెయిన్ స్ట్రోక్ పక్షవాతానికి పక్షపాతమే!

ప్రపంచవ్యాప్తంగా స్త్రీ, పురుషులందరిలోనూ వైకల్యాలు తెచ్చిపెట్టడంలో లేదా మరణానికి దారితీసే అంశాల్లో పక్షవాతం (బ్రెయిన్ స్ట్రోక్) ప్రధానమైంది. అయితే అమెరికన్ స్ట్రోక్ అసోసియేషన్ లెక్కల ప్రకారం పురుషులతో పోలిస్తే బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశాలు మహిళల్లోనే ఎక్కువ. దీనికి గల అనేక కారణాలను నిపుణులు వివరిస్తున్నారు.



పురుషులతో పోలిస్తే మహిళల హార్మోన్లలో మార్పులు రావడం చాలా సాధారణంగా జరుగుతుంటుంది. దీనికి అనేక అంశాలు కారణమవుతుంటాయి. అవి...

మహిళల్లో తరచూ హార్మోన్లలో మార్పులు రావడం మామూలే. దీంతోపాటు నోటి ద్వారా తీసుకునే గర్భనిరోధక మాత్రల వల్ల కూడా వాళ్లలో తరచూ హార్మోన్లలో మార్పులు వస్తుంటాయి. ఈ హార్మోన్ల మార్పులే పురుషులతో పోలిస్తే మహిళల్లో పక్షవాతం ఎక్కువగా వచ్చేందుకు కారణమవుతుంటాయి.

ఇటీవల మానవులందరిలోనూ ఆయుఃప్రమాణాలు బాగా పెరిగాయి. ఇలా చాలాకాలం జీవిస్తున్న క్రమంలో హైబీపీ, దాంతోపాటు అనేక రకాల గుండె జబ్బుల (ఉదాహరణకు గుండె స్పందనలు దెబ్బతినడం వల్ల వచ్చే గుండెదడ, ఏట్రియల్ ఫిబ్రిలేషన్ అంటే గుండె పైగదుల స్పందనల్లో వేగం పెరగడం వల్ల అక్కడ రక్తం గడ్డకట్టి అవి ప్రధాన ధమనుల ద్వారా మెదడుకు చేరడం) వంటి కారణాలు బ్రెయిన్ స్ట్రోక్‌కు దారితీస్తుంటాయి.

గర్భనివారణ మాత్రలు వాడే వాళ్లలో పొగతాగే అలవాటు ఉండటం స్ట్రోక్ ముప్పును మరింత పెంచుతుంది. ఇక మహిళల్లో గర్భధారణ సమయంలో రక్తపోటు బాగా పెరిగిపోయే ప్రీ-ఎక్లాంప్సియా అనే కండిషన్ కూడా బ్రెయిన్ స్ట్రోక్ ముప్పును పెంచుతుంది.

పురుషులతో పోలిస్తే పక్షవాతం వచ్చినప్పుడు లేదా రాబోయే ముందు కనిపించే సాధారణ లక్షణాలైన తీవ్రమైన అలసట, అయోమయం, వికారం లేదా వాంతుల వంటి లక్షణాలు మహిళల్లో అంత ప్రస్ఫుటంగా కనిపించవు. దాంతో సమస్యను గుర్తించడం, సమయానికి చికిత్స అందించడం వంటివి ఆలస్యమయ్యేందుకు అవకాశాలెక్కువ.

ఇక పక్షవాతంలో ప్రస్ఫుటంగా కనిపించే లక్షణాలైన... మాటలు ముద్దముద్దగా రావడం, ముఖంలో ఒకవైపు కిందికి జారినట్లుగా అయిపోవడం వంటివి స్త్రీ, పురుషులిద్దరిలోనూ కనిపించినప్పటికీ మహిళలల్లో ఈ లక్షణాలన్నీ తలతిరిగినట్లు ఉండటం, తీవ్రమైన అలసట, ఎక్కిళ్ల వంటి మాటున అంత స్పష్టంగా కనిపించవు. అయితే ఇలా తల తిరిగినట్లుగా ఉండటం, తీవ్రమైన అలసట, నీరసం వంటివి మహిళల్లో అప్పుడప్పుడూ కనిపించేవే కావడంతో ఈ లక్షణాల మాటున పక్షవాతం దాగుండిపోయినట్లుగా అవుతుంది. దాంతో మహిళల్లో చాలాసేపటికి గాని పక్షవాతాన్ని గుర్తించడం సాధ్యపడకపోవడంతో అసలు విషయం బయటపడేసరికి ఆలస్యమయ్యే ప్రమాదం ఎక్కువ.

మహిళల చికిత్స విషయంలో మరింత ప్రాధాన్యం అవసరం..

పక్షవాతం (స్ట్రోక్) విషయంలో పురుషులకూ, మహిళలకూ ఇచ్చే చికిత్స అన్నివిధాలా సమానమే. అయితే కోలుకున్న తర్వాత వారి పనులు వారే చేసుకునే విధంగా ఇచ్చే రిహ్యాబిలిటేషన్ ప్రోగ్రామ్ విషయంలో మాత్రం మహిళలపై మరింత శ్రద్ధ చూపాల్సిన అవసరముంటుంది. ఎందుకంటే వారి రీ-హ్యాబ్, వారిలో తరచూ పునరావృతమయ్యే డిప్రెషన్, నైపుణ్యాలు నేర్చుకునే (కాగ్నిటివ్ స్కిల్స్) ప్రక్రియలు ఆలస్యం కావడం, మానసిక ఆరోగ్యం అన్ని విధాలా బాగుపడేలా చేయడం వంటి అంశాలన్నీ... మహిళలకు రీ-హ్యాబ్ సేవలు మరింత ఎక్కువకాలం అవసరమయ్యేలా చేస్తాయంటున్నారు నిపుణులు.

నివారణ మార్గాలు అనుసరించండి...

హైబీపీని అదుపులో పెట్టుకునేందుకు క్రమం తప్పకుండా మందులు వాడటం, ఆహారంలో కొవ్వులు తక్కువగా తీసుకోవడం, ఒకవేళ రక్తంలో కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటే వాటిని అదుపు చేసే మందులు వాడటం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడంతో పాటు సంతాన నిరోధక మాత్రలు వాడే మహిళలు, గర్భధారణ సమయంలో ప్రీ-ఎక్లాంప్సియా వచ్చిన వారు ఎప్పటికప్పుడు తమ ఆరోగ్యం విషయంలో క్రమం తప్పకుండా డాక్టర్ ఫాలో అప్‌లో ఉండటం, అవసరాన్ని బట్టి హార్మోన్ రీప్లేస్‌మెంట్ థెరపీ (హెచ్ ఆర్‌టీ) వంటి చర్యలతో నివారణ మార్గాలు అనుసరిస్తుంటే అది స్ట్రోక్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుందంటున్నారు వైద్య నిపుణులు.



నోట్లో పొక్కులు వస్తున్నాయా?

కొందరికి నోట్లో, నాలుక మీద పగుళ్ళు రావడం, దాంతో ఏవైనా వేడిపదార్థాలూ లేదా కారపు పదార్థాలు తిన్నప్పుడు మంట, బాధ కలుగుతుండటం చాలా సాధారణం. ఇలా నాలుక తరచూ పగలడానికి, నోట్లో తరచూ పొక్కులు రావడానికి చాలా కారణాలు ఉంటాయి. ముఖ్యంగా... విటమిన్-బి లోపంతో ఈ సమస్య రావడంతో పాటు ఎసిడిటీ, నిద్రలేమి, మానసిక ఆందోళన (యాంగ్జైటీ) వంటి కారణాల వల్ల ఈ సమస్య మరింత పెరుగుతుంది. కొందరిలో పొగాకును వాడేవారికి నోటి పొరల్లో (లైనింగ్స్‌లో) మార్పులు వచ్చి అది క్రమంగా పొక్కుల్లా కనిపించవచ్చు. ఇవి వచ్చినప్పుడు ముందుగా విటమిన్-బి కాంప్లెక్స్ టాబ్లెట్లు తీసుకుంటూ ఓ వారం పాటు చూసి, అప్పటికీ తగ్గకపోతే తప్పక డాక్టర్‌ను సంప్రదించాలి. అరుదుగా కొన్ని సిస్టమిక్ వ్యాధుల వల్ల కూడా ఇలాంటి సమస్యలు ఏర్పడే అవకాశమున్నందున డాక్టర్లు తగిన పరీక్షలు చేయించి, కారణం తెలుసుకుని, తగిన చికిత్స అందిస్తారు.



చుండ్రు తగ్గించే ఆహార నియమాలు...

చుండ్రుతో బాధపడేవారు తమ ఆహారాల్లో మైదా, పంచదార, బాగా స్ట్రాంగ్‌గా ఉండే టీ, కాఫీలు, పచ్చళ్లు, నిల్వ పదార్థాలకు దూరంగా ఉండటం మేలు. పైన పేర్కొన్న పదార్థాలు కొంతమేర చుండ్రును ప్రేరేపించే అవకాశం ఉన్నందున వాటికి దూరంగా ఉండటం మంచిది. ఇక చుండ్రును అరికట్టేందుకు ఆకుకూరలతో పాటు అన్ని రకాల కాయగూరలు, తాజా పండ్లతో కూడిన సమతుల ఆహారాన్ని తీసుకోవాలి. ఈ చుండ్రు సమస్య ఉన్నవారు మాంసాహారం తక్కువగా తీసుకోవడమే మేలు. రోజూ ఎనిమిది నుంచి పది గ్లాసుల నీరు తాగాలి. ఈ నీళ్ల వల్ల మృతకణాలు తొలగిపోయి, చర్మం ఆరోగ్యంగా బిగువుగా ఉంటుంది.



హైలో ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ ఫైనల్లో మాళవిక

సార్‌బ్రుకెన్ (జర్మనీ): భారత యువ షట్లర్ మాళవిక బన్సోద్ హైలో ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్-300 టోర్నీ మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ఆరో సీడ్ మాళవిక 23-21, 21-18తో జూలియా జాకబ్సన్ (డెన్మార్క్)పై విజయం సాధించింది. 44 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన పోరులో కీలక సమయాల్లో పాయింట్లు సాధించిన మాళవిక ప్రత్యర్థికి అవకాశం ఇవ్వకుండా ముందంజ వేసింది. ఆదివారం జరగనున్న టైటిల్ పోరులో ఏడో సీడ్ మియా బ్లిచ్‌ఫెల్ట్ (డెన్మార్క్)తో మాళవిక తలపడనుంది. మరోవైపు పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో ఆయుశ్ శెట్టి పరాజయం పాలయ్యాడు. అన్‌సీడెడ్ ఆయుశ్ శెట్టి 17-21, 13-21తో క్రిస్టో పొపొవ్ (ఫ్రాన్స్) చేతిలో ఓడాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 28వ స్థానంలో ఉన్న పొపొవ్‌పై 51వ ర్యాంకర్ ఆయుశ్ ఆధిక్యం ప్రదర్శించలేకపోయాడు. 49 నిమిషాల పాటు సాగిన పోరులో తొలి గేమ్‌లో చక్కటి ప్రదర్శనతో ప్రత్యర్థికి దీటైన పోటీనిచ్చిన ఆయుశ్... రెండో గేమ్‌లో అదే జోరు కొనసాగించలేకపోయాడు.

రసవత్తర స్థితిలో...



సాయి సుదర్శన్

విజయం దిశగా ఆస్ట్రేలియా 'ఎ'

మెకే (ఆస్ట్రేలియా): బౌలర్ల పట్టుదలకు బ్యాటర్ల క్రమశిక్షణ తోడవడంతో భారత్ 'ఎ'తో జరుగుతున్న తొలి అనధికారిక టెస్టులో ఆస్ట్రేలియా 'ఎ' విజయం దిశగా సాగుతోంది. ఓవర్‌నైట్ స్కోరు 208/2తో శనివారం మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ 'ఎ' జట్టు 100 ఓవర్లలో 312 పరుగులకు ఆలౌటైంది. సాయి సుదర్శన్ (200 బంతుల్లో 103; 9 ఫోర్లు) సెంచరీ పూర్తి చేసుకోగా... దేవదత్ పడిక్కల్ (199 బంతుల్లో 88;6 ఫోర్లు) రాణించాడు. వీరిద్దరూ సాధికారికంగా ఆడటంతో ఒక దశలో భారత్ 'ఎ' 226/2తో పటిష్ట స్థితిలో కనిపించింది. మిడిలార్డర్ కూడా రాణిస్తే... మ్యాచ్‌పై పట్టు చిక్కినట్లే అని భావిస్తే... కింది వరస బ్యాటర్లు కనీస పోరాటం చేయకుండానే చేతులెత్తేశారు. వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ (32; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) కాసేపు మెరిపించగా... బాబా ఇంద్రజిత్ (6), నితీశ్ కుమార్ రెడ్డి (17), మానవ్ సుతార్ (6) నిలువలేకపోయారు. ఆస్ట్రేలియా 'ఎ' బౌలర్లలో ఫెర్గూస్ ఓ నీల్ 4, టాడ్ మర్ఫీ మూడు వికెట్లు పడగొట్టారు. దీంతో కంగారూల ముందు 225 పరుగుల లక్ష్యం నిలవగా... శనివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా 'ఎ' రెండో ఇన్నింగ్స్‌లో 50.3 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 139 పరుగులు చేసింది. కెప్టెన్ నాథన్ మెక్‌స్వీనీ (47 బ్యాటింగ్; 5 ఫోర్లు), మార్కస్ హారిస్ (36; 4 ఫోర్లు) రాణించారు. భారత బౌలర్లలో ముకేశ్ కుమార్, ప్రసిధ్ కృష్ణ, మానవ్ సుతార్ తలా ఒక వికెట్ పడగొట్టారు. చేతిలో ఏడు వికెట్లు ఉన్న ఆస్ట్రేలియా 'ఎ' జట్టు విజయానికి మరో 86 పరుగులు చేయాల్సి ఉంది. మెక్‌స్వీనీతో పాటు వెబ్‌స్టర్ (19 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. అంతకుముందు భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 107 పరుగులకు ఆలౌట్ కాగా... ఆస్ట్రేలియా 'ఎ' జట్టు 195 పరుగులు చేసింది.

చివరి టెస్టులో రెండో రోజు 15 వికెట్లు

- భారత్ తొలి ఇన్నింగ్స్ 263 ఆలౌట్
- రాణించిన గిల్, పంత్
- రెండో ఇన్నింగ్స్‌లో కివీస్ 171/9
- తిప్పేసిన జడేజా, అశ్విన్

ఆఖరి మూడో టెస్టును స్పిన్నే దున్నేస్తోంది. రెండో రోజు 15 వికెట్లు కూలాయి. ఇంతలా గింగిర్లు తిరుగుతున్న పిచ్‌పై రిషభ్ పంత్ టెస్టులో టి20 ఆట ఆడేశాడు. దీంతో తొలి సెషన్‌లో ఆతిథ్య జట్టు వేగంగా పరుగులు సాధించింది. రెండో సెషన్‌లో ఎజాజ్ స్పిన్ భారత్‌ను చుట్టేసింది. అయితే మూడో సెషన్‌లో మన స్పిన్ ద్వయం జడేజా, అశ్విన్‌లు చెలరేగడంతో భారత్ పట్టు బిగించినట్లు కనిపించింది. ప్రస్తుతం న్యూజిలాండ్ 143 పరుగుల ఆధిక్యంలో ఉంది. నామమాత్రమైన ఆఖరి వికెట్ మిగిలుంది. ఇలాంటి కఠిన పిచ్‌పై ఇది కూడా చిన్న లక్ష్యమేమీ కాదు కాబట్టి మూడో రోజూ హోరాహోరీ పోరు ఖాయం.

ముంబై: చివరి టెస్టు రసవత్తర ముగింపునకు సిద్ధమైంది. అటో... ఇటో... ఎవరివైపో కానీ ఈ మ్యాచ్ అయితే మూడు రోజుల్లో ముగియడం ఖాయమైంది. ప్రత్యర్థి స్పిన్‌కు ఎదురీదితే భారత్ 1-2తో సిరీస్‌లో పరువు నిలుపుకుంటుంది. ఉచ్చులో పడితే మాత్రం సొంతగడ్డపై వైట్‌వాష్ అవుతుంది. రెండో రోజు ఆటలో మాత్రం భారత బ్యాటర్లే కాస్త పైచేయి సాధించారని చెప్పొచ్చు. 6 వికెట్లు సమర్పించుకున్న టీమిండియా క్రితం రోజు స్కోరుకు 177 పరుగులు జత చేసింది. శుబ్‌మన్ గిల్ (146 బంతుల్లో 90; 7 ఫోర్లు, 1 సిక్స్), రిషభ్ పంత్ (59 బంతుల్లో 60; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అదరగొట్టారు. ఎజాజ్ పటేల్‌కు 5 వికెట్లు దక్కాయి. భారత్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 28 పరుగుల కీలక ఆధిక్యం దక్కింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో 9 వికెట్లు చేజార్చుకున్న న్యూజిలాండ్ 171 పరుగులు చేసింది. విల్ యంగ్ (100 బంతుల్లో 51; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. జడేజా 4, అశ్విన్ 3 వికెట్లు తీశారు.



గిల్



పంత్

పంత్ ధనాధన్ ఫిఫ్టీ

తొలి సెషన్‌లో భారత బ్యాటర్లు రిషభ్ పంత్, శుబ్‌మన్ నిలకడగా ఆడటంతో కివీస్ బౌలర్ల ఆటలు సాగలేదు. సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్ చాప్‌మన్ లాంగాన్‌లో గిల్ ఇచ్చిన క్యాచ్‌ను, లాంగాఫ్‌లో పంత్ క్యాచ్‌ను మ్యాట్ హెన్రీ వదిలేశారు. దీన్ని సద్వినియోగం చేసుకొన్న బ్యాటర్లు ఇద్దరూ అర్ధ సెంచరీలతో ఇన్నింగ్స్‌ను కుదుట పరిచారు. శనివారం 86/4 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఆట కొనసాగించిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 59.4 ఓవర్లలో 263 పరుగుల వద్ద ఆలౌటైంది. పంత్, గిల్ కివీస్ బౌలింగ్‌ను తుత్తునియలు చేస్తూ పరుగులు సాధించారు. ముఖ్యంగా రిషభ్ టి20 ఫార్మాటల్లే చెలరేగిపోయాడు. ఎజాజ్ పటేల్, ఫిలిప్స్ బౌలింగ్‌లో చూడచక్కని బౌండరీలు, భారీ సిక్సర్లతో వేగంగా పరుగులు రాబట్టాడు. దీంతో 29వ ఓవర్లోనే భారత్ స్కోరు 150 పరుగులను దాటింది. మరుసటి ఓవర్లోనే ఇద్దరి ఫిఫ్టీలు పూర్తయ్యాయి. 30వ ఓవర్ తొలి బంతికి సింగిల్ తీసిన గిల్ 66 బంతుల్లో, నాలుగో బంతికి పరుగు తీసిన రిషభ్ 36 బంతుల్లో అర్ధసెంచరీలను పూర్తి చేసుకున్నారు. కాసేపటి తర్వాత ఇష్ సోధి... పంత్‌ను ఎల్బీగా అవుట్ చేయడంతో ఐదో వికెట్‌కు 98 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. రవీంద్ర జడేజా (14) క్రీజులోకి రాగా, టీమిండియా లంచ్ విరామానికి 195/5 స్కోరు చేసింది. అప్పటికి ఇంకా ఆతిథ్య జట్టు 40 పరుగులు వెనుకబడే ఉంది.

ఎజాజ్ దెబ్బ

రెండో సెషన్‌లో ఎజాజ్ పటేల్ స్పిన్ మాయాజాలం మొదలవడంతో భారత్ ఇబ్బందుల్లో పడింది. జట్టు స్కోరు 200 దాటగానే జడేజాను ఫిలిప్స్ అవుట్ చేయగా, స్వల్ప వ్యవధిలో ఎజాజ్... సర్ఫరాజ్ (0), గిల్, అశ్విన్ (6)ల వికెట్లను పడగొట్టడంతో గిల్ 10 పరుగుల దూరంలో సెంచరీ అవకాశాన్ని కోల్పోగా... భారత్ భారీ ఆధిక్యం సాధించలేకపోయింది. ఆకాశ్‌దీప్ (0) రనౌట్ కావడంతో టీ విరామానికి ముందే భారత్ 263 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్ ముగిసింది. అయితే వికెట్ పూర్తిగా స్పిన్‌కు అనువుగా మారిపోవడంతో భారత సీనియర్ స్పిన్ ద్వయం అశ్విన్-జడేజా కివీస్ రెండో ఇన్నింగ్స్‌ను ఉక్కిరిబిక్కిరి చేసింది. వన్‌డౌన్ బ్యాటర్ విల్ యంగ్ తప్ప ఇంకెవరూ చెప్పుకోదగ్గ స్కోర్లే చేయలేకపోయారు. మిచెల్ (21; 1 ఫోర్, 1 సిక్స్), ఫిలిప్స్ (26; 1 ఫోర్, 3 సిక్సులు)ల అండతో యంగ్ 95 బంతుల్లో అర్ధసెంచరీ సాధించాడు. 171 పరుగుల వద్ద హెన్రీ (10)ని జడేజా బౌల్డ్ చేయడంతో రెండో రోజు ఆటను ముగించారు. ఆకాశ్‌దీప్, వాషింగ్టన్ సుందర్ చెరో వికెట్ తీశారు. ప్రస్తుతం కివీస్ 143 పరుగుల ముందంజలో ఉంది.



అశ్విన్

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 235

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) ఎజాజ్ 30; రోహిత్ (సి) లాథమ్ (బి) హెన్రీ 18; గిల్ (సి) మిచెల్ (బి) ఎజాజ్ 90; సిరాజ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ఎజాజ్ 0; కోహ్లి రనౌట్ 4; పంత్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సోధి 60; జడేజా (సి) మిచెల్ (బి) ఫిలిప్స్ 14; సర్ఫరాజ్ (సి) బ్లన్‌డెల్ (బి) ఎజాజ్ 0; సుందర్ నాటౌట్ 38; అశ్విన్ (సి) మిచెల్ (బి) ఎజాజ్ 6; ఆకాశ్‌దీప్ రనౌట్ 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (59.4 ఓవర్లలో ఆలౌట్) 263. వికెట్ల పతనం:** 1-25, 2-78, 3-78, 4-84, 5-180, 6-203, 7-204, 8-227, 9-247, 10-263. **బౌలింగ్:** మ్యాట్ హెన్రీ 8-1-26-1, విలియమ్ ఓ రూర్కే 2-1-5-0, ఎజాజ్ పటేల్ 21.4-3-103-5, గ్లెన్ ఫిలిప్స్ 20-0-84-1, రచిన్ రవీంద్ర 1-0-8-0, ఇష్ సోధి 7-0-36-1.

న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: లాథమ్ (బి) ఆకాశ్‌దీప్ 1; కాన్వే (సి) గిల్ (బి) సుందర్ 22; యంగ్ (సి అండ్ బి) అశ్విన్ 51; రచిన్ (స్టంప్డ్) పంత్ (బి) అశ్విన్ 4; మిచెల్ (సి) అశ్విన్ (బి) జడేజా 21; బ్లన్‌డెల్ (బి) జడేజా 4; ఫిలిప్స్ (బి) అశ్విన్ 26; ఇష్ సోధి (సి) కోహ్లి (బి) జడేజా 8; హెన్రీ (బి) జడేజా 10; ఎజాజ్ నాటౌట్ 7; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (43.3 ఓవర్లలో 9 వికెట్లకు) 171. వికెట్ల పతనం:** 1-2, 2-39, 3-44, 4-94, 5-100, 6-131, 7-148, 8-150, 9-171. **బౌలింగ్:** ఆకాశ్‌దీప్ 5-0-10-1, వాషింగ్టన్ సుందర్ 10-0-30-1, అశ్విన్ 16-0-63-3, జడేజా 12.3-2-52-4.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా



● మీనాక్షీ చౌదరి, వరుణ్ తేజ్

మట్కాపై ఆ నమ్మకం ఉంది

- వరుణ్ తేజ్

"నేను మాస్ సినిమా చేసి చాలా రోజులైంది. ఆ కోవలో రూపొందిన తాజా చిత్రం 'మట్కా' అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది. అలాగే మా అభిమానులందర్నీ సంతోష పెట్టే చిత్రం అవుతుంది'' అని హీరో వరుణ్ తేజ్ అన్నారు. కరుణ కుమార్ దర్శకత్వంలో వరుణ్ తేజ్, మీనాక్షీ చౌదరి జంటగా నటించిన చిత్రం 'మట్కా'. వైర ఎంటర్‌టైన్మెంట్స్, ఎస్‌ఆర్‌టీ ఎంటర్‌టైన్మెంట్స్‌పై డా. విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మించిన ఈ పాన్ ఇండియా మూవీ ఈ నెల 14న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని హీరో చిరంజీవి సోషల్ మీడియా వేదికగా రిలీజ్ చేశారు. అనంతరం జరిగిన 'మట్కా' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో వరుణ్ తేజ్ మాట్లాడుతూ– ''ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని భావిస్తున్నాను. ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని ఇవ్వడానికి మా టీమ్ అంతా ప్యాషన్‌తో ఈ సినిమా చేశాం. చిరంజీవిగారు ట్రైలర్ చూసి, చాలా మాస్‌గా ఉందని ప్రశంసించడం సంతోషంగా ఉంది'' అని తెలిపారు. కరుణ కుమార్ మాట్లాడుతూ– ''వరుణ్ తేజ్‌లోని నటుణ్ణి, తనలోని యాక్షన్ హీరోని.. ఇలా అన్ని కోణాల్ని ఈ సినిమా ఆవిష్కరిస్తుంది. 40 ఏళ్ల క్రితం జరిగిన ఓ వాస్తవ ఘటన స్ఫూర్తితో ఈ సినిమా తీశాను'' అని పేర్కొన్నారు. ''ఈ సినిమాలో అవకాశం ఇచ్చిన దర్శక– నిర్మాతలకు కృతజ్ఞతలు'' అని మీనాక్షీ చౌదరి చెప్పారు. ''మట్కా' మంచి మాస్ ఎంటర్‌టైనర్. ఈ సినిమాపై నమ్మకంగా ఉన్నాం'' అన్నారు రజనీ తాళ్లూరి. ''మా సినిమాని ఇంత అద్భుతంగా తీసిన కరుణ కుమార్‌గారికి ధన్యవాదాలు'' అని డా. విజయేందర్ రెడ్డి చెప్పారు.



● శివ కార్తికేయన్, రజనీకాంత్

అమరన్‌కి ప్రశంసలు

శివ కార్తికేయన్ హీరోగా రూపొందిన చిత్రం 'అమరన్'. ఈ చిత్రబృందాన్ని హీరో రజనీకాంత్ ప్రశంసించారు. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సాయి పల్లవి హీరోయిన్‌గా నటించారు. కమల్‌హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మించిన ఈ సినిమా అక్టోబరు 31న తమిళ, తెలుగు భాషల్లో విడుదలైంది. ఈ చిత్రాన్ని తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్ పతాకంపై సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి రిలీజ్ చేశారు. కాగా సూపర్ స్టార్ రజనీకాంత్ 'అమరన్' చిత్రాన్ని ప్రత్యేకంగా వీక్షించారు. ఆ తర్వాత కమల్‌హాసన్‌కు ఫోన్ చేసి, అద్భుతమైన చిత్రాన్ని నిర్మించారని మెచ్చుకున్నారు. అలాగే హీరో శివ కార్తికేయన్, దర్శకుడు రాజ్‌కుమార్, నిర్మాత ఆర్. మహేంద్రన్, సినిమాటోగ్రాఫర్ సాయిలని ప్రత్యేకంగా అభినందించారు. చిత్రకథ, కథనం, నటీనటుల నటన అద్భుతంగా ఉన్నాయని రజనీకాంత్ ప్రశంసించారు.



● మృణాళ్ ఠాకూర్

మీరు చేసిన పని ఏం బాగోలేదు!

● ఫొటో మార్ఫింగ్ చేసిన నెటిజన్‌పై మృణాళ్ ఆగ్రహం

హీరోయిన్ మృణాళ్ ఠాకూర్ ఓ నెటిజన్‌పై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇందుకు కారణం ఫొటో మార్ఫింగ్. విజయ్ దేవరకొండ, మృణాళ్ ఠాకూర్ జంటగా నటించిన 'ఫ్యామిలీ స్టార్' చిత్రం గుర్తుండే ఉంటుంది. 2023 దీపావళి సందర్భంగా 'ఫ్యామిలీ స్టార్' చిత్రంలోని ఓ దీపావళి ఫొటోను అప్పట్లో చిత్రయూనిట్ విడుదల చేసింది. అయితే ఆ ఫొటోను మార్ఫింగ్ చేసి, విజయ్ దేవరకొండ ముఖానికి తన ముఖాన్ని అతికించాడు ఓ నెటిజన్. అంతటితో ఆగకుండా... 'దీపావళి ఫొటో ఎడిటింగ్... బాలీవుడ్ నటి ఫొటోషూట్' అంటూ ఓ క్యాప్షన్ జోడించి, ఫొటో షేరింగ్ సోషల్ మీడియా యాప్ ఇన్‌స్టాలో షేర్ చేశాడు. ఈ ఫొటో మృణాళ్ ఠాకూర్ కంట పడింది. దీంతో ఆ నెటిజన్‌కు ఇన్‌స్టా వేదికగానే కామెంట్ రూపంలో స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు మృణాళ్. ''బ్రదర్... మీరు చేసిన పని బాగుందని మీరు అనుకుంటున్నారా? అస్సలు బాగోలేదు'' అంటూ ఆ నెటిజన్‌కు మృణాళ్ ఠాకూర్ కౌంటర్ ఇచ్చారు. ఈ విషయంలో మృణాళ్‌కు ఇతర నెటిజన్ల నుంచి మద్దతు లభిస్తోంది.



● లక్ష్మీ రాయ్

ఐపీఎస్ ఝాన్సీ

లక్ష్మీ రాయ్ లీడ్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'ఝాన్సీ ఐపీఎస్'. గురుప్రసాద్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాని ఆర్‌కే ఫిలిమ్స్ పతాకంపై డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ తెలుగులో ఈ నెల 22న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ– ''తమిళ్‌లో సూపర్ హిట్ అయిన 'ఝాన్సీ ఐపీఎస్' చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. లక్ష్మీ రాయ్ త్రిపాత్రాభినయం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ. ఆమె చేసిన మూడు క్యారెక్టర్స్ డిఫరెంట్ షేడ్స్‌లో ఉంటాయి. థ్రిల్లర్ మంజు కంపోజ్ చేసిన ఎనిమిది ఫైట్స్ ఆమె కెరీర్‌లో మైలురాయిగా నిలుస్తాయి. 'కర్తవ్యం' చిత్రంతో విజయశాంతిగారు లేడీ సూపర్ స్టార్‌గా ఎదిగారు. ఆ సినిమాలా మా 'ఝాన్సీ ఐపీఎస్' కూడా విజయం సాధిస్తుంది'' అన్నారు. డాన్సర్, నటి ఆక్సా ఖాన్, నటుడు జేవీఆర్ మాట్లాడారు.

Gold Memories

మనిషి జీవితానికి ప్రతిబింబం సినిమా. ఎన్నో అద్భుతమైన చిత్రాలు మన మదిలో జ్ఞాప కాలుగా ఉన్నాయి. అవి బంగారు జ్ఞాపకాలు. అందుకే 'సాక్షి యూట్యూబ్' ఇక ప్రతి వారం ఓ సినిమాతో మీ మనసును తట్టే ప్రయత్నం చేస్తుంది 'గోల్డెన్ మెమొరీస్' రూపంలో. ఈ వారం 'గోల్డెన్ మెమొరీస్'లో ఓ ఆణిముత్యం అయిన 'మిస్సమ్మ' గురించి తెలుసుకోవాలంటే ఈ క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేస్తే చాలు.

మా ప్రార్థనలకు సమాధానం దువా

బాలీవుడ్‌లోని వన్నాఫ్ ది క్రేజీ కపుల్స్ రణ్‌వీర్ సింగ్ – దీపికా పదుకోన్ తమ కుమార్తెకు దువా పదుకోన్ సింగ్ అని నామకరణం చేశారు. ఆ పేరును ఖరారు చేసినట్లుగా వెల్లడించి, దువా కాళ్ల మాత్రమే కనిపించేలా రణ్‌వీర్–దీపికలు ఓ ఫొటోను షేర్ చేశారు. ''మా కుమార్తెకు దువా పదుకోన్ సింగ్ అనే పేరు పెట్టాం. దువా అంటే ప్రార్థన. మా ప్రార్థనలకు దువా సమాధానం. అందుకే మా కుమార్తెకు ఆ పేరు పెట్టాం'' అని పేర్కొన్నారు రణ్‌వీర్–దీపిక. 2018లో రణ్‌వీర్ సింగ్–దీపికా పదుకోన్ వివాహం చేసుకున్నారు. 2023 సెప్టెంబరులో దీపిక ఓ పాపకు జన్మనిచ్చారు.



● రణ్‌వీర్, దీపిక

దుల్కర్‌కు జోడీగా...

దుల్కర్ సల్మాన్, సాయి పల్లవి జోడీగా నటించనున్నారా? అంటే అవుననే సమాధానమే ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. దుల్కర్ సల్మాన్ హీరోగా పవన్ సాధినేని దర్శకత్వంలో 'ఆకాశంలో ఒక తార' అనే సినిమా తెరకెక్కనుంది. దుల్కర్ పుట్టినరోజు (జూలై 28) సందర్భంగా ఈ సినిమాను ఈ ఏడాది జూలైలో అధికారికంగా ప్రకటించారు. కానీ దుల్కర్ ఇతర ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉండటం వల్ల ఈ సినిమా ఇంకా సెట్స్ పైకి వెళ్లలేదు. ఈ ఏడాది చివర్లో సెట్స్‌పైకి తీసుకుని వెళ్లాలనుకుంటున్నారట. ఇక ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు సాయి పల్లవిని తీసుకోవాలని చిత్రయూనిట్ భావిస్తోందని, ఈ కథ సాయి పల్లవికి వినిపించగా, ఆమె కూడా సినిమా చేయడానికి ఒప్పుకున్నారని టాక్. మరి... దుల్కర్–సాయి పల్లవి జోడీ కుదురుతుందా? అంటే వేచి చూడాల్సిందే. స్వప్నా సినిమాస్, వైజయంతీ మూవీస్, లైట్‌బాక్స్ ఎంటర్‌టైన్మెంట్, గీతా ఆర్ట్స్ పతాకాలపై సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం ఈ సినిమాను నిర్మించనున్నారు.




● సాయి పల్లవి

ఓటీటీ ఇది చూడొచ్చు

ఊహకందని థ్రిల్లింగ్ వెకేషన్

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం 'ట్రాఫిక్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



వెకేషన్ అంటే ఆనందంగా... సరదాగా అందరితో గడిపే కాన్సెప్ట్. కానీ అదే వెకేషన్ ఊహకందని, ఊహించలేని నైట్ మేర్ అయితే... ఈ లైన్‌ను ఆధారంగా చేసుకునే హాలీవుడ్ దర్శకుడు డీన్ టేలర్ 'ట్రాఫిక్' చిత్రాన్ని రూపొందించారు. సినిమా మొత్తం గ్రిప్పింగ్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో నిండి ఉంటుంది. ఇది పెద్దల సినిమా. పౌలా పాట్టన్, ఒమర్ ఆప్స్ వంటి ప్రముఖ హాలీవుడ్ నటులు లీడ్ రోల్స్‌లో నటించారు. ఇక సినిమా కథ ప్రకారం... బ్రీ కాలిఫోర్నియాలోని ఓ దినపత్రికలో పని చేసే జర్నలిస్ట్. తాను రాసే కథనాలు సరిగ్గా పత్రికలో రావడం లేదని తపన పడుతూ ఉంటుంది. ఈ దశలో బ్రీ తన ప్రియుడు జాన్‌తో కలిసి అతని స్నేహితుడి డారెన్ గెస్ట్ హౌస్‌కి వెకేషన్‌కి వెళతారు. ఈ వెకేషన్ లొకేషన్ శాక్రిమెంటోలోని కొండ లోయల ప్రాంతంలో దూరంగా ఉంటుంది. ఈ వెకేషన్‌కి వెళ్లే సమయంలో బ్రీ, జాన్‌కు ఓ గ్యాస్ స్టేషన్‌లో కాలిఫోర్నియా బైకర్స్‌తో చిన్నపాటి ఘర్షణ జరుగుతుంది. ఇదే కథకు మలుపు. ఆ ఘర్షణతో బైకర్స్ వీళ్ళ కారును వెంబడిస్తారు. బ్రీ వాళ్ళు గెస్ట్ హౌస్‌కి వెళ్లిన తరువాత బైకర్స్ ఏం చేశారు? వాళ్లను బ్రీ ఎలా ఎదుర్కొంది? ఆ సంఘటన తర్వాత తన జర్నలిస్ట్ కెరీర్‌లో బ్రీ సాధించిన గొప్ప అంశమేంటి? అన్న విషయాలన్నీ లయన్స్ గేట్ వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'ట్రాఫిక్'లో చూడాల్సిందే. రోజు వారీ ట్రాఫిక్ కష్టాలతో సతమతమయ్యేవారు ఈ వీకెండ్ 'ట్రాఫిక్' సినిమాతో థ్రిల్లింగ్ వెకేషన్ అనుభూతి పొందుతారనేది నిజం. సో... ఎంజాయ్ ది 'ట్రాఫిక్'.

– ఇంటూరు హరికృష్ణ

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



క్రిస్టియన్ మాల/MBBS, MD/C.Govt. మెడికల్ ఆఫీసర్/1.20 Lakhs PM/6' ఎత్తు/30 సం॥ల అందమైన వరుడికి తగిన Any PG, SWE, Govt. వధువు కావలెను. Ph: 9908222406 [HA-16435]

SC హిందూ మాదిగ/MA/C.Govt. స్టేషన్ మాస్టర్/రైల్వే/70,000/-PM/5'11" ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-16435]

క్రిస్టియన్ మాల/కట్నం ప్రసక్తి లేదు/28/5'8"/B.Tech/C.Govt.కస్టమ్స్ ఇన్స్‌పెక్టర్/90,000/-PM/అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 6309258463 [HA-16435]

వడ్డెర/కట్నం ప్రసక్తి లేదు / B.Tech/ SWE / 80,000/-PM /5'10"ఎత్తు /28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. Ph: 7075953400 [HA-16435]

CNB కాపు నాయుడు/35/5'7"/ M.Tech / MS / @ USA Working on H1 Visa/SWE Job Well Settled వరుడికి తగిన వధువు కావలెను Ph: 9347695780 [HA-16439]

క్రిస్టియన్/30 / 5'9"/Govt. Job. M.Tech (సెంట్రల్ రైల్వే) 12L P/A Won House Hyd Well Settle వరుడికి తగిన వధువు కావలెను. కట్నం ప్రసక్తి లేదు. Ph: 9391646037 [HA-16439]

ముదిరాజ్ / C.Govt Executive Engineer (E.E) / 6' ఎత్తు / 29 సం॥లు మంచి జీతం, సొంత ఇల్లు, మంచి ఆస్తి గల వరుడికి Well Settled Family నుండి వధువు కావలెను. Contact : 9014235862. [Z-7879]

SC-Mala-Hindu-CNB / 2nd Marriage/ 40/PG/5'10"/Own Visa Consultancy/ 1,60,000/- PM/Wants good Hindu Bride only. 8187861989-Direct Contact: No Brokers [H-782787]

★

Suitable Bride Wanted for SC Mala Boy. Govt. Doctor MD Gen Med. 39yrs/5'8". Ph: 9177192732 [HA-05753]

★★

డైరెక్ట్. 5'5"/50Yrs/కాపు. కుల పట్టింపు లేదు. నెలకు సుమారు రూ.యాభై వేల ఆదాయం కలిగి రూ.40 లక్షల స్థిరాస్తి గల వ్యక్తికి మంచి మనసున్న వధువు కావలెను. ఆర్థిక ఇబ్బందులు ఉండవు. Ph : 8341482731 [H-1177749]

డైరెక్ట్ కాంటాక్ట్: ఆర్యవైశ్య 46Yrs/5'.5"/ బిజినెస్, జాబ్, 30 కోట్ల స్థిరాస్తి గల ఏకైక అబ్బాయికి అందమైన అమ్మాయి కావలెను. (నో బ్రోకర్స్). 7995585722, 9848817137. [T-2364]

డైరెక్ట్/45/ ప్రభుత్వ ఉద్యోగము చేయు చున్న వరుడికి కుల, మత, వయసు, ఆస్తి ప్రసక్తి లేని వధువు పెళ్ళి లేదా తోడు కొరకు కావలెను. డైరెక్ట్-Ph: 85199 34926. [L-796382]

వరుడు కావలెను



రెడ్డి/2nd / (విడో)/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/ Age: 32/ Degree/బిజినెస్‌లు, అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) అన్ని కులాల వారికి 1వ, 2వ సంబంధములు కలవు. Ph: 9515673252 [H-796649]

SC హిందూ మాల/ఏకైక కుమార్తె/ M.Com/ Govt.Asst. స్టాటిస్టికల్ ఆఫీసర్/MRO ఆఫీస్/ 60,000/-PM/5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-16435]

పద్మశాలి/ M.Sc /Govt.R.I / రెవెన్యూ Dept /62000/-PM / 5'5"ఎత్తు /26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను Ph: 9618007652 [HA-16435]

రజక/B.Tech/Govt.Asst.Exq. ఇంజనీర్ /ఇరిగేషన్ Dept/80,000/-PM/ 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-16435]

యాదవ/B.Tech / Govt.క్లర్క్ / SBI/ 30,000/-PM / 5'4"ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7075953400 [HA-16435]

రజక/B.Tech /Govt. Asst. ఇంజనీర్/ ట్రాన్స్‌కో/60,000/-PM / 5'4"ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7075953400 [HA-16435]

హిందూ మాల/ 25 / 5'4" / B.Tech / C. Govt. Asst. మేనేజర్/ఇండియన్ బ్యాంక్ / 60,000/-PM / అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 6309258463 [HA-16435]

రెండవ పెళ్ళి/విడో/50y/Fair/ఆంధ్ర/Hydలో Own House(Rents) Own Lands/ పిల్లలు లేని Well Settled ఏ బాదరబందీలేని వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 7997175138 [H-782787]

పద్మశాలి/విడో/49y/MA, B.Ed/Education Dept(VRS) /90K PM/Garment Business/Own House (Rents)/ Lands/ 2L PM/ఫ్యాక్టరీని కొల్పోయిన వధువుకు FC/BC ఇల్లరికపు వరుడు కావలెను (పిల్లలు ఉన్నా OK) Ph: 7702043224 [H-782787]

కాపు/విడో/50y/పిల్లలులేరు/వైజాగ్‌లో సొంత ఫ్లాటు /Hydలో సొంత బిజినెస్, రెంట్స్ మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. అర్జెంట్ ఇల్లరికం OK (నో బ్రోకర్స్). Ph: 7799083500, 7386660643 [H-782787]

కుల పట్టింపు లేదు/ 36yrs / Govt. ఎంప్లాయ్ / 2,00,000/- (PM) / డైవర్స్ / వెల్ సెటిల్డ్ అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. సంప్రదించండి : 8332006483 [H-796649]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Contact : K.C. Reddy, Hyderabad. Ph : 9849321309 / 9347807015. Please Check my Whatsapp Status. Email: kcreddy43@gmail.com, Facebook.com / Subscribe Telegram Channel- kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/USA Citizen/Now in Hyd/ V. Handsome Boy/1995/BS/ MBA/ Startup/120Cr/5'10" * Cont: K.C. Reddy- Hyd. Ph: 9347807015

Reddy/B.Tech/MS/H1/USA/Handsome Boy/1990/5'7"/40K/20Cr *1995/ 5'8"/ 125K/20Cr * Cont: K.C.Reddy-Hyd- Ph: 9849321309/9347807015

Reddy/ BE (BITS) MBA(IIM) Job Officer / V. Handsome Boy/ 1994/ 5'11"/70L/yr/25Cr *Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/MS/USA/V.Handsome Boy/ 1997/6'/400Cr *1998/6'/300Cr * Cont: K.C. Reddy Mar Bureau-Hyd- Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/MS/H1/USA/1991/5'11" /140K/200Cr *1998 / 6'/110K / 80Cr * Cont. K.C. Reddy Mar Bureau- Hyd- Ph: 9347807015/9849321309

Reddy / B.Tech/MS/H1/USA/1990/ 5'7"/120K/ 50Cr *1996/6'/ 130K/ 10Cr * Cont : K.C. Reddy Mar-Bureau- Hyd. Ph :9849321309 /9347807015

Reddy/IIT/B.Tech/Job / India *1994/ 5'11"/1Cr/yr/10Cr *1998/ 5'11"/50L/yr/ 8Cr *1994/5'9"/1Cr/yr/30Cr * Cont : K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/Good Business/ B.Tech/ MBA/ 1990/5'10"/40L/M/25Cr *1993/5'7"/50Cr *1995/5'9"/500Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/Divorcee/B.Tech/ MS / MBA /Business/1981/5'8"/500Cr /50L/M Income * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015/ 9849321309

Reddy/MBBS / MD / USA-Doctor/ 1995/5'8"/10Cr * 1989/5'9"/ 30Cr * Cont: K.C. Reddy Mar-Burea-Hyd. Ph: 9849321309/9347807015

వరుడు కావలెను

Reddy/Divorcee/Most Beautiful/ B.Tech/ Own Business/ 1989/ 5'3"/ 100Cr/40L/M income. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/B.Tech/Most Beautiful /1994/ 5'5"/15Cr *1995/5'5"/70Cr *1997/5'4"/ 150Cr *1995/5'8"/100Cr * Cont : K.C. Reddy-Hyd- Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech / 1995/5'5"/ 100Cr *1999/ 5'7"/100Cr *2001/5'3"/20Cr *1994/ 5'3"/ 200Cr *1991 / 5'4"/10Cr * Cont. K.C. Reddy-Hyd. Ph: 9347807015/ 9849321309

Reddy/B.Tech/1999/5'8"/25Cr *1998/5'5"/50Cr *1993/5'7"/100Cr *1988/ 5'3"/200Cr. * Cont : K.C. Reddy -Mar-Bureau-Hyd-Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/MS/H1/USA/1997/5'4"/100Cr *1996/5'3"/20Cr *2002/5'6"/20Cr *1997/5'5"/30Cr *Cont: K.C. Reddy-Hyd.Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/MS/H1/USA/1998/5'4"/ 10Cr *1994/5'4"/10Cr *1999/5'6/100Cr *1997/5'5"/10Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/MS/H1 / USA/1996/5'5"/ 12Cr *1996/5'6"/30Cr *1996/5'5"/10Cr *1990/5'3"/10Cr *1988/5'4"/50Cr * Cont : K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/MBBS/PG *2001/5'6"/100Cr *1993/5'2"/20Cr *1994/5'6"/100Cr *1995/ 5'5"/ 100Cr *1998/5'7"/50Cr * Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309/ 9347807015

Reddy/Divorcee/MBBS/PG *1987/5'5"/ 15Cr *1994/5'5"/50Cr *1986/5'6"/50Cr *1992/ 5'5"/10Cr *1993/5'8"/40Cr * Cont : K.C. Reddy- Hyd-Ph: 9347807015

Reddy/Divorcee *B.Tech/1993/5'4"/10Cr *1991/ 5'4"/10Cr *1985/5'5"/400Cr *1987/ 5'6"/15Cr *1992/ 5'5"/ 50Cr * Cont : K.C.Reddy-Hyd. Ph: 9347807015 [D-657]

రెడ్డి/2nd మ్యారేజ్/(కుల, ఆస్తి) పట్టింపు లేదు/ 31Y (జాబ్-వ్యాపారం-మంచి స్థిరాస్తి) వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) అన్ని వయస్సుల వారికి 1st-2nd సంబంధాలు కలవు. Ph: 9573002847 [H-796649]

రెడ్డి/విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు / Age: 35/ B.Com / Pvt. Job కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం అయినా OK) All Cast marriages Available. Ph: 7729931358 [H-796649]

2వ పెళ్ళి/3,00,000 PM/బాగా స్థిరపడిన, కోట్ల ప్రాపర్టీ కల్గిన అందమైన వధువుకి, అందమైన వరుడు కావలెను. కులముతో సంబంధం లేదు, Propertyతో అవసరం లేదు. పిల్లలు ఉన్నా OK. ఇల్లరికం. Cell: 9381696641 [H-796649]

ఆర్యవైశ్య/25/5'4"/B.Tech/MBA/SWE /Job / 15L P/A/Well Settled Family(అమ్మాయి పేరుపై సొంత ఫ్లాట్ కలదు) అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8897091964 [HA-16439]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి BE, 24, 6', SWE, 10 L /A, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 29, 5' 7", SWE, 22 L P/A, 12 Crores, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 31, 5' 8", Analyst, 175 K, 15 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Australia, BE, MS, 27, 5' 6", Manager, Handsome, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE (BITS), MS, 26, 5' 10", SWE, 100 K, 50 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Europe, BE, MS, 29, 5' 11", 6 Crores, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, DM, 27, 5' 11", PG Doctor, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, MBA, 45, 5' 10", SWE, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BA, LLM, 24, 5' 5", Associate, 100 Crores, Hyd, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 5", SWE, 10 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, MBA, 27, 5' 3", Rich Family, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (BITS), MS, 27, 5' 8", SWE, H1, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 26, 5' 4", Engineer, 20 L P/A, 8 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBA, MS, 28, 5' 2", 1.5 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 29, 5' 4", PG Doctor, 25 Crores, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, MS, 33, 5' 3", SWE, 20 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818. [LETTER]

క్రిస్టియన్/27/5'4"/B.Tech/MBA/Govt. Job (AEE)/10L P/A/Well Settled Family వధువుకు వరుడు కావలెను. Ph: 9391646037 [HA-16439]

మాల/26/5'5"/ M.Tech/ SWE/Job/ 18L P/A/Well Settled in Hyd వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 7702195227 [HA-16439]

రెడ్డి/ఆస్తి, కుల పట్టింపు లేదు/25y / 5'3"/ B.Tech/ 2 కోట్ల స్థిరాస్తి పేరెంట్స్ లేని వధువుకు వరుడు కావలెను. మీ ఫోటో బయోడేటా వాట్సాప్ లో పంపించండి. Ph: 8142060040 [HA-16439]

కుల పట్టింపు లేదు/21y&23y 25y&27y &29y &31y&33y&34y& 35y& 37y&39y& 40y & 41y &43y&45y&46y&48y&50y/"మా సేవ" మ్యారేజ్ బ్యూరో (Since 1998): PH/WA: 9291503949 [HA-16439]

యాదవ కన్వర్టెడ్ క్రిస్టియన్, 27/5'4"/ B.Tech/SWE/Wipro, Hyd అందమైన వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 8919759359 [HA-16439]

OC/50y / విడో/ MRO/వెండి Shop/ 50 ఏకర్స్ Land/18 Lac income /FC / BC వరుడు కావలెను. Ph: 7075194750 [H-783505]

UA INTERNATIONAL MATRIMONY

UA INTERNATIONAL MATRIMONY (Elite People for Reddy, Kamma, Kapu, Velama & Cast no bar) specialised in Doctors & Industrialists Families. Contact: 9177950666, 9100324999.

వధువు కావలెను

Reddy/29/5'10" Fair, M.Tech (IIT) Business, Hyd, 500 Crs. * 29/5'11" Fair, BS(Hons) UK, Business, Hyd, 500 Crs. * 30/6' Fair, BE, MBA(IIT Chennai), Business Chennai, 50 Crs. Cont : 9177950666

Reddy/32/5'9" Fair, IPS, WELL TO DO. * 34/5'10" Fair, B.Tech, 1.2Cr income, Rich. * 29/5'9" Brown, MBA(ISB), Business, 100 Crs. Cont: 9177950666

Reddy/32/6' Fair, MS, Business, Hyd, 200 Crs. * 29/5'10" Fair BS(Hons) ED in reputed group, Hyd, 300 Crs.* 29/6' Fair, B.E, ED & CFO, 100 Crs. Cont: 9177950666

Reddy/29/6' Fair, MBA (ISB) Const Business, Hyd, 1000 CRS. * 30/ 5'8" FAIR, IAS, 50 Crs. * 28/5'11" Fair, IAS Well to do. Cont : 9100324999

Kamma/28/6'2" Fair, BS, MS, USA, 500 Crores, * 28/5'11" BS, US Starting Company 1000 Crs., 28/5'8" Wheatish, MBA, Business 100Crs., Cont: 9177950666

Kamma/32/5'11" Fair, DM(Oncology)- 200 Crs., Requirement: Medical or Non - Medical., * 30/6' Fair, MD(Gen Med) - 40 Crs., Cont: 9177950666

Kamma/26/5'10" V.Fair MBA, 350 Crs., Business in Hyd, *29'/6' Fair, M.Tech(IIT) - Startup, 35 Crs., Cont: 9177950666

Kamma/28/5'10" Fair, MS, 2Cr P/A, 75 Crs. * 29/6'1" Fair, 25 Crs., Residency in Internal medicine, Seeks USMLE Steps Cleared Doctors. Cont: 9100324999

Kapu /29/6' Fair, MS, UK startup company at Hyd,500 Crs. * 29/5'10" V.Fair, MBA (ISB), Business Hyd,150 Crs.* 34/5'11' Fair, IRAS, Top Position in Rly, 30 Crs.Cont : 9177950666

Kapu/30/6'1" Fair, BE, MBA(USA) Industrialist, Hyd, 300 Crs. *32/6'2" Fair, MBA, Const. Business, Bangalore, 150 Crs. *28/5'8" Fair, MBA, Business, 150 Crs. Cont: 9177950666

వరుడు కావలెను

Reddy/26/5'6" Fair, MBBS, 300 Crs, Seeks P.G Doctor/Industrialist. * 28/5'5" Fair M. Arch, Business in Chennai 100 Crs. * 36/5'5" Fair, MD(Radio), 300 Crs. Cont: 9177950666

Reddy/27/5'4" Fair, MD (Derm), 10 Crs. * 28/5'4" Fair, MBA, 20 Crs. * 27/5'3" V.Fair, M.Tech, 20 Crs. Cont : 9177950666

Reddy/34/5'4" Fair, MD(Derm), 200 Crs.* 30/5'4" Fair, MD(Pead),100 Crs.* 30/5'4" Fair, MD(Radio), Rich, Seeks P.G Doctor/Business Cont : 9177950666

Reddy/27/5'3" Fair, MD(Radio), Rich, Seeks PG Doctor/Business. * 30/5'4" Fair, MD(Pead), 20 Crs. * 29/5'4" Fair, MS UK, 100 Crs. Cont : 9177950666

Kamma/28/5'6" Fair,MD(Derm), 50Crs, Requires PG Doctors or Business Family only Hyd. * 26/5'7" Fair, B.Tech, 75 Crs., Hyd settled Groom only. Cont : 9177950666

Kamma/27/5'6" Fair,MBA, (ISB), 100 Crs.* 33/5'8" Fair, CA, 250 Crs.* 28/5'5" Fair, B.Tech, MBA, 30 Crs. Cont : 9177950666.

Kamma /26/5'4" Fair, MS, USA/ India, 500 Crs.* 27/5'5" Fair, M.S (Gynic), 100 Crs.* 25/ 5'6" Fair, MS,India - Business, 1000 Crs. Cont : 9177950666

Kapu/27/5'5" Fair,MBA,100 Crs, Seeks Hyd Business Family. * 27/5'6" V.Fair, MS USA, 130K P/A, 30 Crs.* 28/5'6" MBA, USA, Rich. Cont : 9177950666

Kapu/29/5'8" Fair, B.Arch, 100 Crs.* 29/5'3" Fair, DM(Neum) Seeks DM or Business. *27/5'5" Fair, MS, USA, Rich. Cont: 9177950666

Cast No Bar: Brahmin/28/5'5" Fair, MBA, UK, 500 Crs.Seeks Industrialist Families in Hyd, Bangalore or Chennai. * Kshatriya 29/5'8" Fair, MS(Gen Surg), 150 Crs, seeks Medical or Non medical.Cont: 9177950666 [HA-14746]

కమ్మ/వైశ్య/విడో / 49y / 5'5"/Govt. Rtd ప్రిన్సిపాల్ / V.Fair / షాపింగ్ కాంప్లెక్స్/సొంత ఇల్లు/ రెంట్స్/28 ఎకరాల పొలం/వెల్ సెటిల్ వధువుకి వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. 9492718486 [H-783505]

FC/విడో / 54y/Fair / Central Govt. Emp/ VRS/పెన్షనర్/3 ఎకరాల పంట భూమి/సొంత ఇల్లు గల వధువుకు స్నేహ పూర్వకమైన వరుడు కావలెను. Ph: 8897485623 [H-783505]

పద్మశాలి/50y / విడో/ 5'4"/ బిజినెస్/ 1,00,000Rs/సొంత ఇల్లు/ఆంధ్రాలో పొలాలు / పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను/కుల ప్రసక్తి లేదు. Ph: 8309789736 [H-783505]

వేదికలు



కావ్య మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ లేట్ మ్యారేజెస్, డైవర్స్, విడోస్, విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులాల వారికి త్వరగా కుదుర్చబడును. (స్త్రీలకు ఫ్రీ) Ph: 7702526428 [H-782787]

మాల మాదిగ స్పెషల్ : IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK. Ph: 7396915712 [HA-16439]

రెడ్డి, కాపు & గౌడ్, ఇతర అన్ని కులాల 1వ, 2వ డాక్టర్స్, ఇంజనీర్స్, Govt, NRI సాఫ్ట్‌వేర్, బిజినెస్ మరియు మీరు కోరిన సంబంధాలు చూపబడును. Ph: 9502732389, 8125831394 [HA-16439]

రజక/ డాక్టర్స్, ఇంజనీర్స్, లాయర్స్, ఇండియా, అబ్రాడ్, గవర్నమెంట్ జాబ్ వధూవరుల వివాహ సంబంధాలకై సంప్ర॥ కోట్ల శ్రీనివాస్. Ph: 9391265304/8106303155 [H-783505]

డాక్టర్స్ స్పెషలిస్ట్-MBBS, MD, DM, BDS, BAMS, BHMS, B.V.Sc అన్ని కులములకు, అన్ని ప్రాంతాలకు పెళ్లి సంబంధాలు చూడబడును. పూర్ణ మ్యాట్రిమోని, తిరుపతి, ✆ 7093722724. [T-3202]

★

Free Registration: బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt., Doctors, MNC, Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9533608887 (Whatsapp) [HA-1164]

కాపు వధూవరుల స్వయంవరం. Free Register 15/Dec/2024 న కమలానగర్ వెల్ఫేర్ ఆఫీస్ ECIL, Hyderabad నందు Ph: 9704656103, 9533608887 Whatsapp [HA-1121]

మూసీ ప్రక్షాళనను వ్యతిరేకిస్తే హైదరాబాద్‌కు ద్రోహం చేసినట్లే

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



సాక్షి, న్యూఢిల్లీ: మూసీ నది ప్రక్షాళనను ఎవరు వ్యతిరేకించినా హైదరాబాద్‌కు ద్రోహం చేసిన వారే అవుతారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పేర్కొన్నారు. ఫిరంగి నాలా ఖాళీ చేయించి మూసీ నది ప్రక్షాళన చేయాలని మొదట్నుంచీ తాము చెబుతున్నామని గుర్తు చేశారు. ఢిల్లీలో నారాయణ విలేకరులతో మాట్లాడుతూ...పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఈ విషయంలో తాను పాదయాత్ర చేశానన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మూసీ నది ప్రక్షాళన చేయాల్సిందేనని అయితే..ఏ ఒక్కరూ ఇల్లు, ఆశ్రయం పోయిందని బాధితులుగా మిగలవద్దనేదే తమ లక్ష్యమన్నారు. వారికి ప్రత్యామ్నాయం కల్పించిన తర్వాతే ఖాళీ చేయించాలనే తమ ప్రతిపాదనకు కట్టుబడి ఉన్నామని, మూసీ బాధితుల తరఫున బాధ్యత తీసుకుని పార్టీ తరఫున పోరాడతామని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం కూడా ఈ విషయంలో జాగ్రత్త తీసుకోవాలని కోరారు. మూసీపై బీజేపీ, బీఆర్‌ఎస్‌లు పోటీ పడి పోరాటం చేస్తున్నాయన్నారు. బీజేపీలో రెండు ధోరణులున్నాయని, ఒక వర్గం మూసీకి మద్దతు ఇస్తుంటే.. మరో వర్గం వ్యతిరేకిస్తున్నదని, దీనిని బీజేపీ పరిష్కరించుకోవాలని సూచించారు.

కర్తవ్యంతోపాటు అప్రమత్తత అలవాటు చేసుకోవాలి

- శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేశ్ భగవత్



సాక్షి, హైదరాబాద్: ఉద్యోగులు తమ కర్తవ్యంతోపాటు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండే అలవాటును పెంపొందించుకోవాలని శాంతిభద్రతల అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ సూచించారు. ఎస్పీడీసీఎల్ విజిలెన్స్ అవగాహన వారం-2024 కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అక్టోబర్ 28న ప్రారంభమైన ఈ అవగాహన కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా మహేశ్ భగవత్ మాట్లాడుతూ సమగ్రత, పారదర్శకత, నిబద్ధత, అంకితభావం ప్రాముఖ్యతలను ఆయన ప్రస్తావించారు. విశ్వసనీయత పెంచుకోవాలని ఉద్యోగులకు సూచించారు. ఎస్పీడీసీఎల్ సీఎండీ (అడిషనల్ చార్జ్) అమితవ ముఖర్జీ మాట్లాడుతూ పారదర్శకతతో వ్యవస్థలను బలోపేతం చేయాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు.

టిమ్స్‌కు మంగళం..!

గచ్చిబౌలిలోని ప్రాంగణం వైఏటీసీకి బదిలీ

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- క్రీడాకారులకు రెసిడెన్షియల్ కోచింగ్ క్యాంప్‌గా మార్పు

సాక్షి, హైదరాబాద్: కోవిడ్-19 ఉధృతంగా ఉన్న సమయంలో గచ్చిబౌలిలో వెయ్యికిపైగా ఐసీయూ పడకలతో ఏర్పాటు చేసిన తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్)కు రాష్ట్ర ప్రభుత్వం మంగళం పాడింది. టిమ్స్ భవనాలు, సంబంధిత భూములను యూత్ అడ్వాన్స్‌మెంట్ టూరిజం అండ్ కల్చర్ (వైఏటీసీ) విభాగానికి బదిలీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో టిమ్స్ భవనాలు, ప్రాంగణాన్ని రెసిడెన్షియల్ కోచింగ్ క్యాంప్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా మార్పు చేయనుంది. గచ్చిబౌలిలో 9.16 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న టిమ్స్ ప్రాంగణం ప్రస్తుతం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ అదీనంలో ఉంది. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో ఈ భూమి, భవనాలను వైఏటీసీకి బదలాయించగా.. దీనిని శాట్‌కు అప్పగించనున్నారు. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ కోసం ఈ స్థలాన్ని వినియోగించనున్నారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు అవసరమైన రెసిడెన్షియల్ కోచింగ్ క్యాంప్స్‌ను ఇక్కడ ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

కోవిడ్-19 రోగులకు విస్తృత సేవలు..

రాష్ట్రంలో కోవిడ్-19 కేసుల సంఖ్య ఉధృతమవుతున్న తరుణంలో అప్పటి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన టిమ్స్‌ను ఏర్పాటు చేసింది. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి అథ్లెటిక్ స్టేడియాన్ని టిమ్స్ ఆస్పత్రిగా మారుస్తూ 2020 ఏప్రిల్ 22న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ భవనాలు, ప్రాంగణం మొత్తాన్ని వైద్య, ఆరోగ్య శాఖకు బదిలీ చేసింది. అనంతరం వైద్య, ఆరోగ్య శాఖ దీనిని ప్రత్యేకించి కోవిడ్ రోగుల కోసం కేటాయించి, అన్ని రకాల



ఏర్పాట్లు చేసింది. మొత్తం 1,261 ఐసీయూ పడకలను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేసి, వెయ్యికి పైగా వైద్య సిబ్బందితో నడిపించింది. అయితే కరోనా తీవ్రత తగ్గిన తర్వాత ఇన్‌పేషంట్ల సేవలను నిలిపివేశారు. కేవలం కొద్దిమంది వైద్య సిబ్బందితో అవుట్ పేషంట్ల విభాగాన్ని మాత్రమే కొనసాగించారు. వాస్తవానికి టిమ్స్‌ను మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిగా, రీసెర్చ్ సెంటర్‌గా మార్పు చేయాలని ప్రభుత్వం భావించింది. అయితే కోవిడ్ సమస్య తగ్గిపోయిన తర్వాత ఈ ఆస్పత్రిని ప్రభుత్వం పట్టించుకోలేదు. తాజాగా టిమ్స్‌ను తిరిగి క్రీడల కోసం కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

తెలంగాణ చర్మ పరిశ్రమ అభివృద్ధి కార్పొరేషన్ పునరుద్ధరణ

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్




సాక్షి, హైదరాబాద్: తెలంగాణ చర్మ పరిశ్రమ అభివృద్ధి కార్పొరేషన్ (లిడ్‌క్యాప్) ను పునరుద్ధరించడంతో పాటు తోళ్ల పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెల్లడించారు. ఈ మేరకు త్వరలో పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్‌బాబుతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. లక్ష్మణ్ కుమార్ అధ్యక్షతన శనివారం తెలంగాణ రాష్ట్ర చర్మ పరిశ్రమ అభివృద్ధి కార్పొరేషన్ సమావేశం జరిగింది. పరిశ్రమల శాఖ డైరెక్టర్ జి.మల్సూర్‌తో పాటు కార్పొరేషన్ ఎండీ శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు. చర్మకార సంఘాల నాయకులు, లిడ్‌క్యాప్ ట్రెయినర్స్ ఈ భేటీలో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో తోలు పరిశ్రమ అభివృద్ధి జరగలేదని, లిడ్‌క్యాప్ భూములు అన్యాక్రాంతం అయ్యాయని ఆరోపించారు. గచ్చిబౌలితో పాటు జిల్లాల్లో ఉన్న కార్పొరేషన్ భూముల్లో తోలు పరిశ్రమ అభివృద్ధి సంబంధిత వృత్తిపై ఆధారపడిన వారికి ఉపాధి కల్పిస్తామన్నారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో తోలు పరిశ్రమకు సంబంధించిన నైపుణ్య శిక్షణ కోర్సులను ప్రవేశ పెట్టాలనే సూచనలు ఈ సమావేశంలో అందాయి. రాష్ట్రంలో కబేళాల్లో రోజూ వేలాది మేకలు, గొర్రెలను వధిస్తున్నా తోళ్లు మాత్రం తమిళనాడుకు వెళ్తున్నాయని సంఘాల నేతలు ప్రస్తావించారు. లిడ్‌క్యాప్ ద్వారా తోలు శుద్ధి పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ భేటీలో పలు సంఘాల నేతలు సతీశ్ మాదిగ, ఆరెపల్లి రాజేందర్, విజయ్ ఆర్య, చింత స్వామి, శ్రీనివాస్, కూసపాటి శ్రీనివాస్, రాజలింగం, ప్రొఫెసర్ మురళీదర్శన్, మొలుగు రాజు, జాన్ దర్శనం, గుమ్మడి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

మరో మూడు సీడీఈడబ్ల్యూ సెంటర్లు

- సేఫ్ సిటీ ప్రాజెక్టుపై డీజీపీ సమీక్షలో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా మరో మూడు సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ విమెన్ (సీడీఈడబ్ల్యూ) సెంటర్లను మంజూరు చేయాలని తెలంగాణ పోలీస్‌శాఖ అంగీకరించింది. ఈ కొత్త సెంటర్లను రాచకొండ పోలీస్‌కమిషనరేట్ పరిధిలోని చౌటుప్పల్, భువనగిరి, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కూకట్‌పల్లిలో ఆ యా కేంద్రాలను ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. అదేవిధంగా నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ కేంద్రాన్ని, జెహ్రానగర్‌లోని సీడీఈడబ్ల్యూ కేంద్రాన్ని త్వరగా పూర్తి చేయాలని పోలీస్ హౌసింగ్ అధికారులను డీజీపీ ఆదేశించారు. మహిళా భద్రతకోసం అమలు చేస్తున్న సేఫ్ సిటీ



ప్రాజెక్టుపై సీఐడీ డీజీ శిఖా గోయెల్, శాంతి భద్ర తల అదనపు డీజీ మహేశ్ ఎం భగవత్, పోలీస్ కమి షనర్లు అవినాశ్ మహంతి, సుధీర్ బాబు తదితరులతో డీజీపీ డాక్టర్ జితేందర్ శనివారం సమీక్షించారు. సేఫ్ సిటీ ప్రాజెక్ట్ ప్రస్తుత పరిస్థితులపై డీజీపీ సమీక్షలో భాగంగా ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు, భరోసా కేంద్రాలు, సీసీటీవీ కెమెరాలు, ఫోరెన్సిక్ ల్యాబ్స్, పెలికాన్ సిగ్నల్స్ తదితర ఏర్పాట్ల పనితీరుపై చర్చించారు. సేఫ్ సిటీ ప్రాజెక్ట్ నోడల్ అధికారి తరఫున డీసీపీ డి.కవిత ప్రాజెక్ట్ పరిస్థితిని వివరించారు. సమీక్షలో డీసీపీలు ఉషా విశ్వనాథ్, కె.సృజన, డి.సాయిశ్రీ , జీహెచ్ ఎంసీ డీఈ మమత, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి అఖిలేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ విద్యావ్యవస్థను దెబ్బ తీశారు

- 'ఖనిజాభివృద్ధి' చైర్మన్ ఈరవత్రి అనిల్

సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ సీఎం అయ్యాక విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయిందని, ఎస్సీ, ఎస్టీ, బీసీలు చదువుకుంటే కేసీఆర్ ఓర్చుకోలేకపోయారని రాష్ట్ర ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ హయాంలో విద్యాశాఖలో ఖాళీలను భర్తీ చేయలేదని, పేద విద్యార్థులకు విద్యను దూరం చేశారని, దాదాపు 5వేల పాఠశాలలు మూసివేశారని విమర్శించారు. మరో పక్క ప్రైవేటు యూనివర్సిటీలను తీసుకొచ్చి ప్రభుత్వ యూనివర్సిటీలను పక్కకు పెట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ఎన్నో మార్పులు తీసుకొచ్చిందన్నారు. విద్యాశాఖను సీఎం రేవంత్‌రెడ్డి తన వద్దే ఉంచుకుని అభివృద్ధి చేస్తున్నారని, 11 వేల టీచర్ పోస్టులను భర్తీ చేశారని, వర్సిటీలకు వీసీలను నియమించారని వివరించారు.

పోలీసులు దర్యాప్తు కొనసాగించవచ్చు

మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడి హిట్ అండ్ రన్ కేసులో హైకోర్టు తీర్పు



సాక్షి, హైదరాబాద్: చార్జిషీట్ దాఖలు చేసిన తర్వాత.. సమాచారం అందించి కోర్టు అనుమతితో పోలీసులు దర్యాప్తు కొనసాగించవచ్చని హైకోర్టు స్పష్టం చేసింది. దర్యాప్తు అధికారులు అనుమతి కోరితే అనుమతించే అధికారం కోర్టుకు ఉందని స్పష్టం చేసింది. ఇలాంటి అంశాల్లో నిందితుల వాదన వినాలన్న నిబంధన ఎక్కడా లేదని తేల్చిచెప్పింది. రెండేళ్ల క్రితం జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ చిన్నారి మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. కారుపై స్టిక్కర్ ఆధారంగా మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు చెందినదిగా గుర్తించిన పోలీసులు.. ప్రమాద సమయంలో కారులో షకీల్ కొడుకు రాహిల్, స్నేహితులు ఆఫ్నాన్, మాజ్ ఉన్నట్లు నిర్ధారించారు. అయితే అనూహ్యంగా కారు తానే నడిపాను అంటూ ఆఫ్నాన్ అనే యువకుడు పోలీసులకు లొంగిపోయాడు. కేసును రీ ఓపెన్ చేసిన పోలీసులు ఈ కేసులో ఏ1గా ఉన్న రాహిల్‌ను ఏప్రిల్ 8న అరెస్ట్ చేశారు. ఇదిలా ఉండగా, ఈ కేసు తదుపరి దర్యాప్తునకు అనుమతిస్తూ కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహిల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.సుజన విచారణ చేపట్టారు. కింది కోర్టులో విచారణ ప్రక్రియ ప్రారంభించాక, సాక్షుల వాంగ్మూలం నమోదు దశలో దర్యాప్తునకు అనుమతించడం చట్టవిరుద్ధమని పిటిషనర్ న్యాయవాది వాదించారు. రాజకీయ కారణాలతోనే కేసును తిరగదోడుతున్నారన్నారు. కింది కోర్టు ఉత్తర్వులు చట్టబద్ధమేనని ప్రభుత్వ తరఫు న్యాయవాది చెప్పారు. గతంలో దర్యాప్తు లోపభూయిష్టంగా ఉందంటూ డీసీపీ ఫిబ్రవరిలో ఇచ్చిన నివేదిక ఆధారంగా తదుపరి దర్యాప్తునకు ఉన్నతాధికారులు ఆదేశించారని వెల్లడించారు. వాదనలను విన్న న్యాయమూర్తి.. జూబ్లీహిల్స్ కేసులో విచారణ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని అభిప్రాయపడ్డారు. కేసులో దర్యాప్తు కొనసాగించినంత మాత్రాన నిందితులకు ఇబ్బంది ఏం కాదంటూ చెప్పారు. రాహిల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేశారు.

థర్డ్ డిగ్రీ ప్రయోగించిన అటవీ అధికారులపై చర్యలు తీసుకోండి

- బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: సిర్పూర్ కాగజ్ నగర్ ఫారెస్ట్ అధికారులు దారుణంగా వ్యవహరించారని, ఏడుగురు రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి, చిత్ర హింసలకు గురిచేశారని బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సోమవారంలోగా అధికారులపై చర్యలు తీసుకోకపోతే.. సిర్పూర్ అటవీ శాఖ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. అడవి పందులను చంపుతున్నారని, తన నియోజకవర్గం రైతులపై అధికారులు థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారని మండిపడ్డారు. అటవీ శాఖ మాఫియాలాగా పని చేస్తోందని, అక్రమ సంపాదన కోసం అటవీ అధికారులు ఇలాంటి చర్యలకు దిగుతున్నారని హరీశ్‌బాబు ఆరోపించారు. అటవీ శాఖమంత్రి కొండా సురేఖను కలిసి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారన్నారు.

స్పష్టత ఇవ్వని స్వతంత్ర ఓటర్లు

అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలను శాసించేది వీరే

- ఓటు నమోదు చేసుకున్న వారిలో 43% ఇండిపెండెంట్ ఓటర్లే
- ఏ పార్టీకి చెందనివారే స్వతంత్రులు
- ప్రస్తుత ఏడు బ్యాటిల్ గ్రౌండ్ స్టేట్స్‌లో వీరే కీలకం





అమెరికా నుంచి సాక్షి టీవీ ప్రతినిధి ఇస్మాయిల్

అమెరికా అధ్యక్ష ఎన్నికలపై అటు డెమొక్రాట్‌లు ఇటు రిపబ్లికన్‌లు పూర్తిగా విడిపోయిన నేపథ్యంలో ఒక వర్గం మాత్రం మౌనం వహిస్తోంది. అటు హారిస్‌కు కానీ ఇటు ట్రంప్‌కు గానీ మద్దతు ఇవ్వడంపై వీరు ఎలాంటి నిర్ణయాన్ని వెల్లడించడం లేదు. వారే స్వతంత్ర ఓటర్లు. 2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలను శాసించేది వీరే. నువ్వా నేనా అన్నట్టు జరుగుతున్న అమెరికా ఎన్నికల్లో ఏడు బ్యాటిల్ గ్రౌండ్ స్టేట్స్‌లో విస్తరించి ఉన్న స్వతంత్ర ఓటర్లే నిర్ణాయకం కాబోతున్నారు.

పెరుగుతున్న స్వతంత్ర ఓటర్ల సంఖ్య

ప్రముఖ శాంపిల్ సర్వే గాలప్ పోల్ డేటా ప్రకారం 2024 అధ్యక్ష ఎన్నికల్లో ఓటు రిజిస్ట్రేషన్ చేసుకున్నవారిలో 43 శాతం తమను తాము ఇండిపెండెంట్ ఓటర్లుగా చెప్పుకుంటున్నారు. 27% మంది రిపబ్లికన్ పార్టీ మద్దతుదారులుగా, మరో 27 శాతం మంది డెమొక్రటిక్ పార్టీ మద్దతుదారులుగా ప్రకటించుకున్నారు. 1990లో కేవలం 32 శాతం మంది ఓటర్లు మాత్రమే తమను తాము ఇండిపెండెంట్ ఓటర్లుగా ప్రకటించుకున్నారు. కాలంతో పాటు ఇండిపెండెంట్ ఓటర్ల సంఖ్య పెరుగుతోందని గణాంకాలు చెబుతున్నాయి.

7 రాష్ట్రాల్లో కీలకం

➤ అమెరికాలో పార్టీతో అనుబంధం అనేది చాలా సాధారణ మైన అంశం. ముఖ్యంగా అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి ప్రైమ రీస్‌లో ఓటు వేసేందుకు చాలామంది పార్టీ ఓటర్లుగా రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. ప్రైమరీస్ అంటే ఒక పార్టీ నుంచి ఎవరు అధ్యక్ష అభ్యర్థిగా పోటీ చేయాలనే విషయంపై జరిగే పోలింగ్. సాధారణ ఓటర్లు ఈ పోలింగ్‌లో పాల్గొంటారు. వీరు ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనాలంటే చాలా రాష్ట్రాల్లో కచ్చితంగా ఏదో ఒక పార్టీ ఓటరుగా నమోదు చేసుకోవాలి. ఈ డేటా ప్రకారమే చాలామందిని అమెరి కాలో డెమొక్రాట్ ఓటర్లు, రిపబ్లికన్ ఓటర్లుగా పిలుస్తారు. అమెరికాలో సర్వే సంస్థలు తాము చేసే సర్వేల ఆధారంగా పార్టీ ఓటర్ల సంఖ్యను లెక్కగడుతోంది. దీని ఆధారంగానే ఏ పార్టీకి ఎంతమంది ఓటర్లు ఉన్నారు అనే విషయం తేలుతుంది. ఈ గణాంకాల ఆధారంగానే చాలా రాష్ట్రాలను బ్లూస్టేట్స్, రెడ్ స్టేట్స్‌గా తేలుస్తారు. డెమొక్రాట్ ఓటర్లు ఎక్కువగా ఉంటే అది బ్లూ స్టేట్ అని రిపబ్లికన్ ఓటర్లు ఎక్కువగా ఉంటే రెడ్ స్టేట్ అని తేలిపోతుంది. ఈ రాష్ట్రాల్లో ఎన్నికల ఫలితాలు దాదాపు ఊహించిన దానికి అనుకూలంగానే ఉంటాయి. ఎక్కడైతే రెండుపార్టీల మద్దతు దారుల మధ్య తేడా మూడు శాతం కంటే తక్కువగా ఉంటుందో దానిని బ్యాటిల్ స్టేట్ లేదా పర్పుల్ స్టేట్‌గా పిలుస్తారు. ఇప్పుడు ఏడు బ్యాటిల్ గ్రౌండ్ స్టేట్స్ ఉన్నాయని భావిస్తుండగా..వీటిల్లో ఈ ఇండిపెండెంట్ ఓటర్లే నిర్ణాయక శక్తిగా మారారు.

కొత్త తరం ఓటర్లే ఎక్కువ..

అమెరికాలోని కొత్త తరం ఎక్కువగా స్వతంత్ర భావాలు కలిగి ఉంది. ముఖ్యంగా మిలేనియల్స్ లేదా జనరేషన్ వై ఎక్కువగా ఇండిపెండెంట్ ఓటర్లుగా ఉన్నారని పరిశోధనలో తేలింది. స్వతంత్ర ఓటర్లలో 1981–96 మధ్యలో జన్మించిన జనరేషన్ వైకి చెందిన వారే 36% మంది ఉన్నారు. ఇక తరువాతి తరం అంటే 1997– 2012 మధ్య జన్మించిన జెన్‌జీ స్వతంత్ర ఓటర్లలో 26% ఉన్నారు. అంటే స్వతంత్ర ఓటర్లలో 52% మంది వై, జీ తరంవారే. ఇక ఓటర్ల మూలాలను పరిశీలిస్తే 31% మంది నల్ల జాతీయులు, 52% మంది లాటినోస్, 43% మంది ఏషియన్ అమెరికన్‌లు తమను తాము ఇండిపెండెంట్ ఓటర్లుగా ప్రకటించు కున్నారు. మాజీ సైనికులు సైతం పెద్ద ఎత్తున తమను తాము ఇండిపెండెంట్ ఓటర్లుగా చెప్పుకుంటున్నారు. 18–49 సంవత్సరాల మధ్య ఉన్న దాదాపు 59% మంది మాజీ సైనికులు తమను తాము స్వతంత్ర ఓటర్లుగా చెప్పుకుంటున్నారు.

పేరుకే స్వతంత్ర ఓటర్లు

➤ అమెరికన్ అధ్యక్ష ఎన్నికల్లో ఓటువేసే ఈ స్వతంత్ర ఓటర్లపై చాలాకాలంగా చర్చ జరుగుతోంది. ముఖ్యంగా సర్వేల్లో తమను తాము స్వతంత్ర ఓటర్లుగా చెప్పుకునే వీరంతా నిజంగానే స్వతంత్ర ఓటర్లా? అన్న విషయంపై చాలా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా మీరు ఏ పార్టీ భావజాలాన్నినమ్ముతున్నారన్నప్పుడు వీరిలో చాలామంది రిపబ్లికన్ లేదా డెమొక్రాట్ పార్టీకి మద్దుతుదారు లుగా తేలిందని కీత్ అనే అమెరికన్ పొలిటికల్ అనలిస్ట్ 'ది మిత్ ఆఫ్ ఇండిపెండెంట్ ఓటర్'పుస్తకంలో వివరించడం గమనార్హం. చాలామంది తమను తాము ఇండిపెండెంట్ ఓటర్‌గా చెప్పుకున్నప్పటికీ ఏదో ఒక స్థాయిలో రాజకీయ పార్టీలతో అనుబంధం కలిగి ఉన్నారని పరిశోధనల్లో బయటపడింది. ఈ నేపథ్యంలోనే అమెరికాలో 10 శాతానికి మించి నిజమైన స్వతంత్ర ఓటర్లు లేరని అక్కడి రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

కొత్త అభ్యర్థుల వైపే వీరి మొగ్గు

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కొత్త అభ్యర్థుల వైపే ఇండిపెండెంట్ ఓటర్లు ఎక్కువగా మక్కువ చూపుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. 2008లో బరాక్ ఒబామా పోటీ చేసిన సందర్భంగా దాదాపు 54% స్వతంత్ర ఓటర్లు ఆయనకు ఓటువేశారు. 2016లో ట్రంప్‌కు 52% మంది ఇండిపెండెంట్ ఓటర్లు మద్దతు పలికారు. ఇక 2020లో జో బైడెన్‌కు అత్యధికంగా 56.5 శాతం మంది మద్దతు తెలిపారు.

ఇండిపెండెంట్ ఓటర్లలో 75శాతం మంది ఓటర్లు తమ వ్యక్తిగతమైన ఆర్థిక స్థితిని ప్రభావితం చేయగల అంశాలే తమ ప్రాధాన్యత అని చెబుతున్నారు.


73 శాతం మంది నేరాలను అదుపు చేసేవారికే తమ ఓటు అని చెబుతున్నారు.

63 శాతం మంది అమెరికా తన మిత్రదేశాల కోసం అత్యధికంగా ఖర్చు చేయడం సరికాదంటున్నారు.

57 శాతం అబార్షన్ హక్కులే తమ ప్రాధాన్యత అంటున్నారు

56 శాతం జాత్యహంకారం తీవ్రమైన సమస్యగా పరిగణిస్తున్నారు.

టుడేస్ గ్రాఫిక్



చనిపోయినా.. చచ్చేంత సంపాదన

చచ్చీచెడీ సంపాదించాననే మాట వినే ఉంటారు. కానీ నిజంగానే చనిపోయినా వందల కోట్ల రూపాయల్లో సంపాదిస్తున్నవారు ఎందరో ఉన్నారు? సాధారణంగా మ్యూజీషియన్లు, సింగర్లు, రైటర్లకు వారి పాటలను, రచనలను వాడుతున్నవారు రాయల్టీగా కొంత సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. సృష్టించినవారు చనిపోయినా.. వారి పేరిట రాయల్టీ వసూలై వారసులకు అందుతూనే ఉంటుంది. మరి ఇలా 'చనిపోయినా' అత్యధికంగా సంపాదిస్తున్నవారు ఎవరో తెలుసా? - సాక్షి, సెంట్రల్ డెస్క్



పాఠాలు విని.. చదివించి..

సిరిసిల్ల: జిల్లా కలెక్టర్లు టీచర్లుగా మారి పిల్లలకు పాఠాలు బోధించడం చూశాం. కానీ రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శనివారం విద్యార్థిగా మారిపోయారు. ఉపాధ్యాయురాలు బోధిస్తుండగా తరగతి గదిలో బెంచీలో కూర్చుని పాఠం విన్నారు. సిరిసిల్ల పట్టణ పరిధిలోని పెద్దూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) ను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 8, 9 తరగతులు కొనసాగుతుండగా.. తరగతి గదుల్లోకి వెళ్లి పిల్లలతో కలిసి కూర్చుని, పాఠాలు విన్నారు. 8వ తరగతిలో ఇంగ్లిష్ ఉపాధ్యాయు రాలు బోధనాతీరును పరిశీలించారు. పలువురు విద్యార్థులతో ఇంగ్లిష్ పాఠ్యాంశాలు చదివించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్, సోషల్ పాఠ్యాంశాలపై విద్యార్థులు పట్టు సాధించేలా ప్రతీ రోజు చదివించడం, రాయించడం చేయాలని కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ పావనికి సూచించారు.

ఈ నెల 28 వరకు ఓటర్ల నమోదు

- జనవరి 6న తుది ఓటర్ల జాబితా విడుదల: సీఈఓ సుదర్శన్‌రెడ్డి
- ఇప్పటివరకు 8,02,805 మంది కొత్త ఓటర్ల నమోదు
- 4,14,165 మంది అనర్హులైన ఓటర్ల తొలగింపు
- వచ్చే ఏడాది 18 ఏళ్లు నిండబోయే వారూ దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం –2025లో భాగంగా కొత్త ఓటర్ల నమోదు, ముసాయిదా ఓటర్ల జాబి తాపై అభ్యంతరాలు, ఇతర మార్పులు, చేర్పుల ప్రక్రియ కొనసాగుతోందని రాష్ట్ర ఎన్ని కల ప్రధానాధికారి (సీఈఓ) సి.సుదర్శన్‌రెడ్డి తెలిపారు. వీటికి సంబంధించి ఈ నెల 28వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని వెల్లడించారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండేవారంతా ఓటరు నమోదు కోసం దర ఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. దర ఖాస్తులు, అభ్యంతరాలను పరిష్కరించి జనవరి 6న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తా మని వెల్లడించారు. శనివారం సి.సుదర్శన్‌రెడ్డి బీఆర్‌కేఆర్ భవన్‌లోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండబోయే వారు కూడా ముందస్తు దరఖాస్తు చేసుకోవచ్చని.. వారికి 18 ఏళ్లు నిండిన తర్వాత ఓటు హక్కు కల్పిస్తామని సీఈఓ తెలి పారు. ఓటర్ల సౌకర్యం కోసం వచ్చే శని, ఆది వారాల్లో (9, 10 తేదీల్లో) ఓటర్ల నమోదు కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మని చెప్పారు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్ (eci.gov.in), ఓటర్ హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ద్వారా సైతం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

8 లక్షలకుపైగా కొత్త ఓటర్లు

➤ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా గత నెల 29న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించామని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 3,34,26,323 మంది ఓటర్లుండగా.. అందులో 1,66,16,446 మంది పురుషులు, 1,68,07,100 మంది మహిళలు, 2,777 మంది మూడో జెండర్ ఓటర్లు ఉన్నారని వివరించారు. 15,948 మంది సర్వీస్ ఓటర్లు, 3,578 మంది ప్రవాసీ ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 8 నుంచి అక్టోబర్ 20 మధ్యలో 8,02,805 మంది కొత్త ఓటర్లు నమోదుకాగా.. 4,14,165 మంది అనర్హులైన ఓటర్లను తొలగించామని, మరో 5,93,956 మంది ఓటర్ల వివరాలను సరిదిద్దామని వెల్లడించారు. రాష్ట్రంలో 18–19 ఏళ్ల యువ ఓటర్ల సంఖ్య 8.51 లక్షల నుంచి 10.03 లక్షలకు పెరిగిందని తెలిపారు. 85 ఏళ్లు పైబడిన ఓటర్లు 2,25,462 మంది, వికలాంగ ఓటర్లు 5,28,085 మంది ఉన్నారని వివరించారు.

మోత మోగిన కాలుష్యం



దీపావళికి దద్దరిల్లిన హైదరాబాద్

- గాలి కంటే శబ్ద కాలుష్యమే అధికం
- గత ఏడాది దీపావళికంటే ఎక్కువ శబ్దం
- కాలుష్య నియంత్రణ మండలి నివేదికలో వెల్లడి
- సాధారణ సమయంలో పెరుగుతున్న ఆక్సైడ్‌లు

సాక్షి, హైదరాబాద్: దీపావళి సందర్భంగా ఈ ఏడాది వాయు కాలుష్యంకంటే శబ్దకాలుష్యం అధికంగా నమోదైంది. ప్రధానంగా హైదరాబాద్ మహానగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు, మరికొన్ని చోట్ల శబ్ద స్థాయిలు గతం కంటే అధికంగా నమోదయ్యాయి. దీపావళి రోజు నమోదైన వాయు, శబ్ద నాణ్యతలపై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీపీసీబీ) నివేదిక విడుదల చేసింది. గత ఏడాది దీపావళి పండుగ రోజుతో పోల్చితే ఈ ఏడాది శబ్ద కాలుష్య స్థాయిలు ఎక్కువ రికార్డయ్యాయి. ముఖ్యంగా హైదరాబాద్‌లో పండుగ రోజు రాత్రి పగలు అనే తేడా లేకుండా పటాకులు కాల్చటంతో కమర్షియల్, నివాస, సెన్సిటివ్ (ఆసుపత్రులు, స్కూళ్లు, జూ పార్కు ఇతర సున్నిత ప్రాంతాలు) ప్రదేశాల్లో శబ్ద స్థాయిలు (డెసిబుల్స్) అధికంగా నమోదయ్యాయి. ఐతే పారిశ్రామిక ప్రాంతాల్లో మాత్రమే ప్రామాణిక స్థాయిల కంటే తక్కువగా శబ్ద స్థాయిలు నమోదయ్యాయి. మిగతా మూడు కేటగిరీల్లో మాత్రం శబ్ద కాలుష్యం అధికంగా రికార్డ్ కావడం గమనార్హం.

(శబ్దాలు డెసిబుల్స్‌లో)	గత ఏడాది	ఈ ఏడాది	స్టాండర్డ్-ప్రామాణికం
	పగలు / రాత్రి	పగలు / రాత్రి	పగలు / రాత్రి
పారిశ్రామిక ప్రాంతం	59.5 / 54.6	69.4 / 64.5	75 /70
కమర్షియల్	66.30/ 67.2	70.69 / 68.23	65 / 55
రెసిడెన్షియల్	62.43 / 59.3	68.89 / 65.68	55 /45
సెన్సిటివ్	61.4 / 59	62.7 / 63.3	50 / 40

వాయునాణ్యత కాస్త మెరుగు..

గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది దీపావళి రోజు వాయు నాణ్యత కాస్త మెరుగ్గా నమోదైంది. ముఖ్యంగా పర్టిక్యులేట్ మ్యాటర్ 2.5 (పీఎం 2.5–అతి సూక్ష్మ ధూళి కణాలు) ఈ ఏడాది తగ్గింది. ఇది గత ఏడాది దీపావళి రోజు 119 పాయింట్లు నమోదుకాగా, ఈ ఏడాది 84 పాయింట్లు రికార్డయ్యింది. పీఎం 10 (సూక్ష్మ ధూళికణాలు) గత ఏడాది 188 పాయింట్లు ఉండగా, ఈ ఏడాది 184 పాయింట్లుగా రికార్డయింది. పీఎం 2.5 వాయు కాలుష్య స్థాయిలు గత ఏడాది మామూలు రోజుల్లో 35 పాయింట్లుగా ఉండగా, ఈ ఏడాది 44 పాయింట్లుగా ఉంది. సాధారణ రోజుల్లో గత ఏడాది 85 పాయింట్లుగా ఉన్న పీఎం 10 సాంద్రత, ఈ ఏడాది 111 పాయింట్లుగా నమోదైంది.

ఇతర కాలుష్యాలూ ఎక్కువే..

ఆక్సైడ్స్ ఆఫ్ నైట్రోజన్ వంటి వాయు కాలుష్య కారకం గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది అధికంగా రికార్డయింది. సల్ఫర్ డై ఆక్సైడ్ కాలుష్యకారకం కూడా గత ఏడాది కంటే ఈ ఏడాది కొంత ఎక్కువగానే నమోదైంది. గత ఏడాది దీపావళి సందర్భంగా నైట్రోజన్ ఆక్సైడ్ 30.6 పాయింట్లు నమోదుకాగా.. ఈ ఏడాది 40 పాయింట్లుగా నమోదైంది. గత ఏడాది దీపావళి సమయంలో 12 పాయింట్లు ఉన్న సల్ఫర్ డై ఆక్సైడ్, ఈ ఏడాది 14 పాయింట్లుగా రికార్డయింది. 2023లో మామూలు రోజుల్లో 6.2 పాయింట్లుగా ఉన్న సల్ఫర్ డై ఆక్సైడ్, ఈ ఏడాది సాధారణ రోజుల్లో 12 పాయింట్లుగా అంటే రెండింతలుగా నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది.అదేవిధంగా నైట్రోజన్ ఆక్సైడ్ గత ఏడాది మామూలు రోజుల్లో 23.4 పాయింట్లు ఉండగా, ఈ ఏడాది 32.6 పాయింట్లుగా నమోదైంది. దీనిని బట్టి దీపావళి నాడే కాకుండా మామూలు రోజుల్లో కూడా వాయు కాలుష్యం పెరుగుతున్నట్టు స్పష్టమవుతోంది. రాష్ట్రంలో హైదరాబాద్‌తోపాటు వివిధ ప్రదేశాల్లో ధూళి కణాలు, కలుషిత వాయువులు, శబ్ద స్థాయిలను టీపీసీబీ క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తోంది. దీపావళి సందర్భంగా పర్యావరణ పరిస్థితి పర్యవేక్షణ అక్టోబర్ 24వ తేదీ నుంచి నవంబర్ 7 దాకా కొనసాగిస్తున్నారు.

తల్లి యోగాసనం వేస్తుండగా ఫోన్‌లో చిత్రీకరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి



అమ్మను అభినందించే 'యోగ'ం



కరీంనగర్ అర్బన్: క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో ప్రతిభ చూపిన వారికి కలెక్టర్ బహుమతులు అందిస్తుండటం సహజమే. కానీ, తన తల్లికే ప్రశంసాపత్రం, పురస్కారం అందజేస్తే ఆ సందర్భం ఆనందం కలిగించేదే. జిల్లా క్రీడలు యువజన శాఖ, యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో శనివారం జిల్లా స్థాయి ఆహ్వానిత యోగాసన పోటీలు నిర్వహించారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాతృమూర్తి ప్రవమయి ఆచార్య ఓ సాధారణ క్రీడాకారిణిగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. మంచి ప్రతిభను కనబరిచి రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. దీంతో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తన కూతురైన కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి నుంచి ప్రవమయి ఆచార్య ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నారు. ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం తమ జీవితంలో మరపురాని ఘట్టమని తల్లీకూతుళ్లు ఆనందం వ్యక్తం చేశారు.

పేద విద్యార్థి చదువుకు స్పందించిన దాతలు

సాక్షి ఎఫెక్ట్

రూ.1.30 లక్షల విరాళాలు

అనంతగిరి: 'సాయం చేస్తే డాక్టర్ అవుతా' శీర్షికన సాక్షి దినపత్రిక ప్రధాన సంచికలో గత నెల 31న ప్రచురితమైన కథనానికి దాతలు స్పందించారు. వికారాబాద్‌లోని మైనార్టీ రెసిడెన్షియల్ కాలేజీలో ఇంటర్ చదివిన సంతోష్.. నీట్‌లో సత్తాచాటి బీహెచ్‌ఎంఎస్ సీటు సాధించాడు. ఇటీవలే తండ్రి మరణించడం, తల్లికి రూ.2 లక్షల ఫీజు చెల్లించే స్తోమత లేదని సాక్షిలో వచ్చిన కథనాన్ని చూసిన దాతలు చలించిపోయారు. ఇప్పటివరకు సంతోష్ బ్యాంక్ ఖాతాలో లక్షా ముప్పై వేల రూపాయలు జమచేశారు. ముంబైలోని పవయి ఫ్రెండ్స్ వాట్సాప్ గ్రూప్ ఆధ్వర్యంలో రూ.15,015 అందజేశారు. తెలుగు రైటర్స్ అసోసియేషన్ ఆఫ్ మహారాష్ట్ర (త్వమ్) ప్రతినిధులు రూ.12,122 అందజేశారు. వీరితో పాటు వికారాబాద్ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు అఫ్జల్ షకీల్, మైనార్టీ నాయకుడు షరీఫ్, మహమ్మద్ సద్దాం, చాంద్‌పాషా కలిసి రూ.30 వేలు అందజేశారు. సంగారెడ్డి జిల్లా కంది మైనార్టీ స్కూల్ ఉపాధ్యాయులు రూ.14,350 అందజేశారు. సంతోష్ ప్రస్తుతం అడ్మిషన్ పొందిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లింగరాజు సైతం స్పందించి, మిగతా ఖర్చులన్నీ తానే భరిస్తానని చెప్పినట్లు విద్యార్థి తెలిపాడు. తన సమస్యను వెలుగులోకి తెచ్చిన సాక్షితో పాటు ఆర్థిక చేయూతనిచ్చిన దాతలందరికీ సంతోష్ ధన్యవాదాలు తెలిపారు.

లాంచీ సర్వీసుల లాంచింగ్

- నాగార్జునసాగర్–శ్రీశైలం, సోమశిల–శ్రీశైలం యాత్రలు ప్రారంభం
- 110 కిలోమీటర్ల మేర నదిలో ఆహ్లాదకర ప్రయాణం.. టికెట్ పెద్దలకు రూ.2 వేలు, పిల్లలకు రూ.1,600
- సాగర్ నుంచి ప్రారంభించిన నందికొండ మున్సిపల్ చైర్‌పర్సన్



నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలానికి బయల్దేరిన లాంచీలో పర్యాటకులు



సోమశిల నుంచి శ్రీశైలానికి ప్రయాణికులతో బయల్దేరిన లాంచీ

నాగార్జునసాగర్/ కొల్లాపూర్ రూరల్: ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలంకు కృష్ణానదిలో ఒకేరోజు రెండు ప్రధాన కేంద్రాల నుంచి లాంచీ సర్వీసులు ప్రారంభమయ్యాయి. నాగార్జునసాగర్ నుంచి ఒకటి, సోమశిల నుంచి మరొక లాంచీ సర్వీస్‌ను శనివారం ప్రారంభించారు. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో వీటిని నడుపుతున్నారు. కార్తీకమాసం తొలిరోజున శనివారం నాగార్జునసాగర్ నుంచి నందికొండ మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ జెండా ఊపి లాంచీని ప్రారంభించారు. నాగార్జునసాగర్ జలాశయంలో సరిపడా నీటి లభ్యత లేకపోవడం, కరోనా తదితర కారణాలతో ఐదు సంవత్సరాలుగా నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలానికి లాంచీ ప్రయాణాన్ని నిలిపివేశారు. ఈ సంవత్సరం విస్తృతంగా వర్షాలు కురిసి నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాలు పూర్తిస్థాయిలో నిండటంతో పర్యాటకశాఖ లాంచీ ప్రయాణాన్ని పునఃప్రారంభించింది. నదిలో సుమారు 110 కిలోమీటర్ల దూరం ఐదు గంటలపాటు ఈ లాంచీ ప్రయాణం కొనసాగుతుంది. లాంచీలో ప్రయాణికులు నాగార్జునసాగర్ నుంచి నందికొండ మీదుగా ఏలేశ్వరం, సలేశ్వరం, తూర్పు కనుమలు, నల్లమల అటవీ అందాలను వీక్షించేలా ప్రయాణం ఉంటుందని పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. మరోవైపు నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల నుంచి కూడా శ్రీశైలం వరకు శనివారం లాంచీ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. 110 మంది ప్రయాణికులు ప్రయాణించేలా ఏసీ లాంచీని అందుబాటులోకి తెచ్చినట్లు అధికారులు తెలిపారు. నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలంవరకు లాంచీ ప్రయాణానికి పెద్దలకు రూ.2 వేలు, పిల్లలకు రూ. 1,600 ధర నిర్ణయించారు. సోమశిల నుంచి శ్రీశైలంకు రాను పోను ప్రయాణ టికెట్ పెద్దలకు రూ.3 వేలు, పిల్లలకు 2,400గా నిర్ణయించారు. సోమశిల నుంచి శ్రీశైలం వరకు ఒక ట్రిప్పుకు మాత్రమే అయితే పెద్దలకు రూ.2వేలు, పిల్లలకు రూ.1,600గా టికెట్‌ను నిర్ణయించారు. తొలిరోజు సోమశిల నుంచి 50 మంది ప్రయాణించారు. నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం 575 అడుగులు ఉన్నంత వరకు, ప్రయాణికుల రద్దీనిబట్టి శ్రీశైలానికి లాంచీలు నడపనున్నారు. కార్యక్రమంలో లాంచీ మేనేజర్ హరి, ఉద్యోగుల సంఘం నాయకులు నర్సింహ పాల్గొన్నారు.



తెలిమంచు అందాలు..



పొగమంచు కమ్మేసింది. శీతాకాలం ఆరంభంలోనే పొగమంచు పరుచుకోవడంతో శనివారం ఉదయం వాకింగ్‌కు వచ్చిన వారందరూ ఆ దృశ్యాన్ని చూసి పులకించిపోయారు. పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని రోడ్లు, గ్రామాలు దట్టమైన పొగమంచుతో ఇలా నిండిపోయాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి/సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
ఆదివారం ׀ 3-11-2024





'మంచు' చిత్రాలు! దట్టంగా అలముకున్న పొగమంచులోనే మొదలైన సామాన్యుడి బతుకు పోరాటం.. చలి వణికిస్తున్నా ఆగని పరుగు.. ఇంకా మరెన్నో 'మంచు'చిత్రాలు కనువిందు చేశాయి. శనివారం ఉదయం పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని రోడ్లు, పలు గ్రామాలను దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఆ సమయంలో కనిపించిన దృశ్యాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి/సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

ప్రైవేట్‌కు దీటుగా 'సింగరేణి' విద్య

వచ్చే విద్యాసంవత్సరం నుంచి సీబీఎస్‌ఈ సిలబస్

- పైలట్ ప్రాజెక్టుగా ఆర్జీ
- రామగుండం–2 ఏరియాలోని సెక్టార్–2లో ఏర్పాటు
- పోటీ పరీక్షలకు సైతం శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు
- సింగరేణిలో విద్యావ్యవస్థ పటిష్టతకు సంస్కరణలు

సింగరేణి (కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఉన్నత విద్యాప్రమాణాలపై దృష్టి సారించింది. ప్రస్తుతం సంస్థ పరిధిలో ఉన్న 9 పాఠశాలల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యనందించేందుకు కసరత్తు చేపట్టింది. ఇందులో భాగంగా వచ్చే విద్యాసంవత్సరం (2025–26) నుంచి సీబీఎస్‌ఈ సిలబస్ అమలుకు సన్నాహాలు చేస్తోంది. తొలుత రామగుండం–2 ఏరియాలోని సెక్టార్–2 పాఠశాలను పైలట్ ప్రాజెక్టుగా గుర్తించింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) నిబంధనల ప్రకారం తరగతి గదులు, ల్యాబ్, లైబ్రరీ, మైదానం, కంప్యూటర్ ల్యాబ్ తదితర ఏర్పాట్లపై ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు (డైరెక్టర్) పర్యవేక్షించి అనుమతుల కోసం సన్నాహాలు మొదలుపెట్టారు.

'కారుణ్య' ఉద్యోగుల పిల్లలపై నజర్

గత ఏడేళ్లలో సింగరేణిలో కారుణ్య నియామకాల ద్వారా సుమారు 16 వేల మందికి ఉద్యోగాలు కల్పించారు. వీరిలో కొందరికి వివాహం జరగగా, పలువురు అవివాహితులు కూడా ఉన్నారు. అయితే వివాహమైన వారు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించకుండా.. వారికి మెరుగైన భవిష్యత్ ఇచ్చేందుకు కేంద్రీయ విద్యాలయాలు, ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా సింగరేణి విద్యావ్యవస్థను బలోపేతం చేయనున్నారు. సింగరేణిలో పాఠశాలల ఏర్పాటు సమయం (1975)లో అడ్మిషన్ కావాలంటే ఉన్నతాధికారి సిఫారసు కావాల్సి వచ్చేది. కానీ నేడు సింగరేణి వ్యాప్తంగా ఉన్న తొమ్మిది పాఠశాలలో కేవలం వెయ్యి మంది మాత్రమే చదువుతున్నట్లు అంచనా. ఈ తరుణంలో సింగరేణి పాఠశాలలను మళ్లీ అగ్రస్థానంలో నిలిపేలా సీఎండీ ఎన్.బలరామ్ ప్రత్యేక దృష్టి సారించారు.

తరగతులపై అనునిత్యం పర్యవేక్షణ

గతంలో సింగరేణి పాఠశాలలో 10వ తరగతి ఫలితాలపైనే దృష్టి ఉండేది. కానీ ప్రస్తుతం అనునిత్యం అన్ని తరగతుల నిర్వహణ, పరీక్షలకు ప్రశ్నపత్రాల తయారీ, ఫలితాలపై అధ్యయనం చేస్తున్నారు. అంతేకాక డైరెక్టర్ స్థాయి అధికారులు వారంలో ఒక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేస్తున్నారు. అంతేకాకుండా విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచి ఉన్నత స్థానాలకు చేరుకునేలా సన్నద్ధం చేసేందుకు ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్నారు.



రామగుండంలో సీబీఎస్‌ఈ సిలబస్ అమలుచేయనున్న సింగరేణి పాఠశాల

అన్ని రంగాల్లో రాణించేలా కృషి



సింగరేణిలో విద్యావ్యవస్థ ప్రక్షాళనతో పాటు నూతన కోర్సుల్లో శిక్షణ ఇప్పిస్తాం. ప్రతి ఆరు నెలలకోసారి జాబ్‌మేళాలు నిర్వహిస్తాం. సింగరేణి విద్యాసంస్థలో చేరితే కళాశాల చదువు పూర్తయ్యేనరికి ఉద్యోగం సిద్ధంగా ఉండాలనేది మా భావన. అలాగే, ఇంగ్లిష్ ల్యాబ్‌లు కూడా ఏర్పాటుచేస్తున్నాం.

– గుండా శ్రీనివాస్, ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ

కార్మికుల పిల్లల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యం



సింగరేణి కార్మికుల పిల్లలను రూ.లక్షలు వెచ్చించి ప్రైవేట్ పాఠశాలల్లో చదివిస్తున్నారు. అలాకాకుండా వారికి మంచి భవిష్యత్‌ను అందించేలా సింగరేణి పాఠశాలల్లోనే బోధన అందుబాటులోకి తీసుకొస్తున్నాం. పాఠశాల విద్యతో పాటు పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ కాలేజీల్లో కొత్త కోర్సులు ప్రవేశపెట్టి నైపుణ్యాలు పెంపొందించడం ద్వారా ఉజ్వల భవిష్యత్ అందిస్తాం.

– ఎన్.బలరామ్, సింగరేణి సీఎండీ

ప్రతివారంలో ఒక పరిశ్రమకు..

విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాల కోసం ఆసక్తి పెంచేలా వారంలో ఒకరోజు పరిశ్రమకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఆయా పరిశ్రమల్లో ఏం తయారుచేస్తారు, ముడిసరుకు లభ్యత, తయారైన ఉత్పత్తుల మార్కెటింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించి వారిలో ఆలోచనాశక్తిని పెంపొందించాలనేది ఈ కార్యక్రమ లక్ష్యం. అంతేకాకుండా ఆటపాటలు, మార్షల్ ఆర్ట్స్‌పై నిత్యం రోజూ ఒక గంటపాటు తరగతులు నిర్వహిస్తున్నారు.

'గిరి' సీమల్లో 'జుగా' వెలుగులు

'పీఎం జుగా' అమలుతో తీరనున్న విద్యుత్ సమస్య

- విద్యుత్ సౌకర్యం లేని గ్రామాలు, గూడేలకు విద్యుత్ లైన్ నిర్మాణం
- టీజీ ఎన్పీడీసీఎల్‌లో విద్యుత్ సౌకర్యం లేని గిరిజన ఇళ్ల గుర్తింపు..
- ఉచితంగా విద్యుత్ కనెక్షన్
- 26,125 గృహాల విద్యుదీకరణకు కార్యాచరణ
- రూ.144.42 కోట్లతో ప్రాజెక్టు రిపోర్టు తయారీ



హన్మకొండ: అన్ని గిరిజన గ్రామాల్లో విద్యుత్ కాంతులు విరజిమ్మనున్నాయి. ప్రతీ ఇంటిని విద్యుదీకరించాలని కేంద్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. మెజారిటీ గిరిజన జనాభా ఉండి ఇప్పటివరకు విద్యుత్ సౌకర్యానికి నోచుకోని గ్రామాల్లో వెలుగులు నిండనున్నాయి. ప్రతీ ఇంటికి ఉచితంగా విద్యుత్ కనెక్షన్ ఇస్తారు. అవసరమైన చోట నూతనంగా విద్యుత్ లైన్లు వేయడంతోపాటు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తారు. అటవీ ప్రాంతంతోపాటు ఇతర కారణాలతో విద్యుత్ లైన్లు వేయలేని గ్రామాల్లో సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పిస్తారు. తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) పరిధిలో మెజారిటీ గిరిజన జనాభా కలిగిన 1,049 గ్రామాలు, తెలంగాణ సదరన్ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీఎస్‌ఎల్) పరిధిలో 229 గ్రామాల్లోని గిరిజన ఇళ్లలో వెలుగులు నింపనున్నారు. ఈ మేరకు ఎన్పీడీసీఎల్ సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ను తయారు చేసింది. మెజారిటీ గిరిజన జనాభా ఉన్న 695 గ్రామాల్లోని 25,393 గృహాలకు, 732 ప్రభుత్వ, ప్రభుత్వ రంగ కార్యాలయాలకు విద్యుత్ సౌకర్యం కల్పించనున్నారు. మొత్తం రూ.144.42 కోట్ల వ్యయం అంచనాతో డీపీఆర్ రూపొందించగా.. దీన్ని కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి పంపనున్నారు.

దేశంలో 5 కోట్ల మందికి లబ్ధి

గిరిజనులకు మెరుగైన సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగు పరిచేందుకు, గ్రామాల్లో కనీస వసతులు, సౌకర్యాల కల్పన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జన్‌జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ (పీఎం జుగా) అమలు చేస్తోంది. దేశవ్యాప్తంగా 63 వేల గ్రామాల్లో 5 కోట్ల మంది గిరిజనులకు ప్రయోజనం చేకూర్చాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని తెచ్చింది. ఈ స్కీమ్ ద్వారా 25 రకాల సహాయాలు అందుతాయి. 17 మంత్రిత్వ శాఖలు అమలు చేస్తున్నాయి. సామాజిక మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, విద్య, జీవనోపాధిలో ఉన్న కీలకమైన అంతరాలను పూడ్చేలా ఈ స్కీమ్‌ను రూపొందించారు.

రూ.144.42 కోట్ల వ్యయంతో..

ఇప్పటికే ప్రధానమంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ ద్వారా జనసమూహాలకు దూరంగా ఉండి మౌలిక సదుపాయాలకు నోచుకోని కోలం, తొట్టి గిరిజనులు నివాసముండే ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లోని 257 ఆవాసాల్లో 3,345 గృహాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించారు. అదే విధంగా దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామ జ్యోతి ద్వారా రూ.125కే విద్యుత్ పంపిణీ సంస్థ సొంతగా ఖర్చులు భరించి పేదలకు విద్యుత్ సౌకర్యం కల్పించింది. అయినా ఇప్పటికీ విద్యుత్ సౌకర్యానికి దూరంగా ఉన్న మెజారిటీ గిరిజనులున్న గ్రామాలు, గృహాల కోసం కేంద్రం 'పీఎం జుగా'ను తెచ్చింది. ఎన్పీడీసీఎల్ పరిధిలోని 15 జిల్లాల్లో జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లో విద్యుత్ సౌకర్యం లేని గృహాలేమీ లేవు. మిగతా 13 జిల్లాల్లో 1,049 మెజారిటీ గిరిజన జనాభా కలిగిన గ్రామాలు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో 25,393 గృహాలు, 732 ప్రభుత్వ కార్యాలయాలు (మొత్తం 26,125) ఉన్నాయి. కాగా ఆన్ గ్రిడ్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించే వీలున్న గ్రామాలు 24,753 ఉన్నాయి. వివిధ కారణాలవల్ల విద్యుత్ సౌకర్యం కల్పించడం వీలుకాని 640 గ్రామాల్లో సోలార్ ద్వారా గృహాలను విద్యుదీకరించనున్నారు. ఈ గ్రామాలు, గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడానికి రూ.144.42 కోట్ల వ్యయంతో 352 కిలోమీటర్ల మేర 11 కేవీ లైన్, 592 కి.మీ. సింగిల్ లైన్, 1,668 కి.మీ. ఎల్‌టీ లైన్ నిర్మించనున్నారు. 1,565 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు బిగించనున్నారు. ఈ స్కీమ్ అమలుకు కావాల్సిన ఖర్చులన్నీ కేంద్రమే భరిస్తుంది.

● 'ఈ' వ్యాపారం..

మూడు నగరాలు.. ఆరు గ్రామాలు

- ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, మొబైల్, హోం, సౌందర్య సాధనాలకు అధిక డిమాండ్
- మొత్తం సెల్‌ఫోన్ అమ్మకాల్లో 75 శాతానికి పైగా చిన్న పట్టణాల నుంచే..
- ఆ ప్రాంతాలపై ఈ–కామర్స్ దిగ్గజ సంస్థల దృష్టి
- మౌలిక వసతుల పెంపునకు చర్యలు

ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన ఆన్‌లైన్ షాపింగ్

సాక్షి, హైదరాబాద్: దేశంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, గ్రామీణ ప్రాంతాలపై ఈ–కామర్స్ దిగ్గజ సంస్థలు దృష్టి సారించాయి. ప్రస్తుత పండుగల సీజన్‌లో ఆయా ప్రాంతాల్లో ఆన్‌లైన్ షాపింగ్‌కు డిమాండ్ పెరగడంతో.. అటువైపు ఈ సంస్థలు దృష్టికేంద్రీకరిస్తున్నాయి. ప్రధాన నగరాలు, పట్టణాలకు దూరంగా ఉండే ప్రదేశాల్లో వాణిజ్య, వ్యాపార కార్యకలాపాల విస్తరణ సవాళ్లతో కూడుకున్నది. అందుకు అనుగుణంగా తమ వ్యూహాల్లో మార్పులు, చేర్పులకు ఈ సంస్థలు మొగ్గుచూపుతున్నాయి. ఆయా ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు అంతబాగా లేకపోవడం, వాతావరణంలో మార్పులు, విస్తీర్ణం ఎక్కువగా ఉండడం తదితర సమస్యలు ఎదురవుతున్నాయి. కానీ ఈ ప్రాంతాల్లో పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గట్టుగా మౌలిక సదుపాయాలు, టెక్నాలజీ, ఇతర సౌకర్యాల పెంపునకు ఈ సంస్థలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, మీషో తదితర ఈ–కామర్స్ దిగ్గజ సంస్థలు తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నాయి. ఫ్లిప్‌కార్ట్ ఇటీవల 'ద బిగ్ బిలియన్ డేస్' సేల్ నిర్వహించింది. ఈ సందర్భంగా 2,800 చిన్న పట్టణాలు, కమలాపురం, వాడర్, సిహోర్, బన్సాతర్ ఖేడా, వెరంగ్టే, ఖోటా (టయర్–4 సిటీస్ తో సహా) వంటి ప్రాంతాల్లో వాల్యూ–కామర్స్ ప్లాట్‌ఫామ్ షాప్ అమ్మకాల్లో మంచి పురోగతి కనబరిచింది. ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ డిమాండ్ అంతకంతకు పెరుగుతున్నట్టుగా ఈ –కామర్స్ విక్రయాల పెరుగుదలను బట్టి అవగతమౌతోంది. గ్రామీణ ప్రాంతాల నుంచే ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, మొబైల్, హోం, సౌందర్య సాధనాలకు అధిక డిమాండ్ పెరుగుతున్నట్లుగా ఆయా సంస్థలు గుర్తించాయి. మొత్తం సెల్‌ఫోన్ అమ్మకాల్లో 75 శాతానికి పైగా చిన్న పట్టణాల నుంచి ఉండడంతో.. అక్కడే ఈ సంస్థలు అధికంగా దృష్టి పెడుతున్నాయి. ఇదే సమయంలో.. చిన్నపట్టణాలు, నగరాల్లో ఈ–కామర్స్ సర్వీసులు అంతకంతకు పెరుగుతున్న క్రమంలో.. స్థానికంగా ఉన్న వివిధ రంగాలకు చెందిన వారికి ఉపాధి అవకాశాలు కూడా పెరగడం కలిసొచ్చే అంశంగా పరిగణిస్తున్నారు.



ప్రస్తుతం పండుగల సీజన్‌లో..

ఫ్లిప్‌కార్ట్ సంస్థ తొమ్మిది నగరాల్లో 11 నూతన ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయడం ద్వారా.. 40 ప్రాంతాల్లో లక్ష మందికి పైగా ఉపాధి అవకాశాల కల్పన జరిగినట్టుగా అంచనా వేస్తున్నారు. ఈ ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు స్థానికంగా ఉంటున్న వివిధ వర్గాల ఆర్థిక పురోగతికి దోహదపడుతున్నాయి. ఇవి ప్రధానంగా రవాణా, ప్యాకేజింగ్, రిటైల్ రంగాల్లో వృద్ధికి ఇతోధిక సహాయాన్ని అందిస్తున్నాయి. అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్–2024లో భాగంగా (సెప్టెంబర్ 27న మొదలై నెల పాటు సాగింది) ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల నుంచి డిమాండ్ గణనీయంగా పెరిగినట్టుగా వెల్లడైంది. అమెజాన్ ద్వారా 'నో–కాస్ట్ ఈఎంఐ' లావాదేవీలు 40 శాతానికి పైగా పెరిగినట్టు స్పష్టమైంది. మొబైల్స్, వాషింగ్ మెషీన్లు, టీవీలు, రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, వీడియో గేమ్‌ల వంటి వాటికి మంచి డిమాండ్ ఏర్పడినట్టుగా తేలింది. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల నుంచే 75వ శాతానికి పైగా స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు జరిగినట్టు వెల్లడైంది. అందులోనూ అన్ని ప్రీమియం స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు 70 శాతం (రూ.30 వేలకు పైగా) జరిగాయి. చిన్న నగరాలు, పట్టణాల నుంచి 80 శాతం టీవీ కొనుగోలు ఆర్డర్లు వచ్చినట్టు తెలుస్తోంది. అమెజాన్ తన రెండువేల డెలివరీ స్టేషన్ల ద్వారా మారుమూల ప్రాంతాలను చేరుకునేందుకు ఏర్పాట్లు చేసింది. సముద్రమట్టానికి 1,372 మీటర్ల ఎగువనున్న ఉత్తరాఖండ్ గజోలిలోని మహరిషీ ఆశ్రమానికి నిత్యావసర వస్తువులు సరఫరా చేసిన మొట్టమొదటి ఈ–కామర్స్ ప్లాట్‌ఫామ్‌గా అమెజాన్ రికార్డ్‌ను నెలకొల్పడం విశేషం. ఈ సంస్థ తన వస్తు సరఫరాను అండమాన్ నికోబార్ దీవులకు కూడా విస్తరించింది. భారత రైల్వేలు, ఇండియా పోస్ట్‌ల భాగస్వామ్యంతో అమెజాన్ ఎయిర్ సర్వీస్‌ను కూడా నిర్వహిస్తోంది. మరోవైపు మీషో సంస్థ కూడా తన మెగా బ్లాక్‌బస్టర్ సేల్‌తో గ్రామీణ ప్రాంతాల్లోకి చొచ్చుకెళ్లింది.



శివోహం..

కార్తీకమాసం ఆరంభమైంది. చిన్నా పెద్దా తేడాలేకుండా భక్తులు శివాలయాలకు పోటెత్తుతున్నారు. విజయవాడ పాతశివాలయం వద్ద సోమవారం ఉదయం ఓ చిన్నారి భక్తి పారవశ్యంతో శివున్ని మొక్కుతున్న దృశ్యం – కిశోర్, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ప్లీజ్.. మా పిల్లి జాడ చెప్పరూ..

పెంపుడు జంతువు తప్పిపోతే యజమాని ఆందోళన ఎలా ఉంటుందనేదానికి ఈ చిత్రం ఉదాహరణ. తమ పెంపుడు పిల్లా రాఖీ కనిపించకపోవడంతో దాని ఆచూకీ చెప్పినవారికి రూ. 5 వేలు బహుమతి ఇస్తామంటూ విశాఖ నగరంలో ఓ వ్యక్తి ఇలా బ్యానర్ ఏర్పాటు చేశారు. – ఎండీ నవాజ్, సాక్షి, ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



సాహసం శ్వాసగా..

గంగపుత్రుల జీవితం నిరంతరం కత్తిమీద సామే.. కెరటాలకు ఎదురొడ్డి నావను నడిపిస్తేనే కడుపుకింత దొరికేది..నెల్లూరు మైపాడు బీచ్‌లో పడవను కెరటాలపై నుంచి దాటిస్తూ చేపల కోసం వల వేస్తున్న మత్స్యకారులు – విజయ్ క్రిష్ణ, సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

క్లుప్తంగా...

కేజీబీవీ వద్ద క్షుద్రపూజల కలకలం!

సుండుపల్లె: అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల వద్ద క్షుద్ర పూజల అనుమానంపై కలకలం రేగింది. శనివారం ఉదయం పాఠశాల వద్ద ప్రధాన రహదారిపై పసుపు, కుంకుమ, వేపమండలు, పగిలిన టెంకాయ చిప్పలు తదితరాలు కనిపించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో ఆందోళన అలుముకుంది. అసలు ఇక్కడ పూజలు చేయాల్సిన అవసరం ఏముందన్న అనుమానాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా దురుద్దేశ్యంతో ఇలా చేశారా అన్న భయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై విద్యాశాఖ అధికారులు, పోలీసులు దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

తండ్రిని చంపిన తనయుడు అరెస్టు



వాకాడు: తిరుపతి జిల్లా వాకాడు మండలంలోని తండ్రిని హత్య చేసిన కేసులో తనయుడు రమేష్‌ని శనివారం అరెస్టు చేసినట్లు సీఐ హుస్సేన్‌బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వాకాడు మండలం పులింజేరివారిపాళెం గ్రామానికి చెందిన తుపాకుల చినరామయ్యను కుటుంబ గొడవల్లో భాగంగా కన్న కొడుకే హతమార్చాడు. ఈ కేసులో పరారీలో ఉన్న కొడుకు రమేష్‌ని ఊరు చివారు ప్రాంతంలోని జామాయిల్ తోటలో పట్టుకుని అరెస్టు చేశామన్నారు. నిందితుడ్ని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు సీఐ తెలిపారు. ఎస్సై నాగబాబు, సిబ్బంది ఉన్నారు.

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 3,385 మంది పింఛన్లకు దూరం

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 3,385 మంది లబ్ధిదారులు పింఛన్లకు దూరమయ్యారు. శనివారం రాత్రి అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం నవంబర్ నెల పింఛన్ల పంపిణీలో చిత్తూరు జిల్లాలో 99.34 శాతం, తిరుపతి జిల్లాలో 99.39 శాతం నమోదైంది. చిత్తూరు జిల్లాలో 2,68,021 మందికి పింఛన్లు మంజూరు చేయగా ఇందులో 2,66,258 మందికి అందజేశారు. అదే విధంగా తిరుపతి జిల్లాలో 2,65,488 మందికి పింఛన్లు మంజూరు చేయగా 2,63,866 మందికి పంపిణీ చేశారు. చిత్తూరు జిల్లాలో 1,763 మందికి, తిరుపతి జిల్లాలో 1,622 మందికి పింఛన్లు ఇవ్వలేకపోయారు. పింఛన్లు పొందేందుకు శనివారం రాత్రి 12 గంటల వరకు సమయం ఉంటుంది. ఆ తర్వాత ఆదివారం ఉదయం లబ్ధిదారులు పింఛన్‌లు పొందాలన్నా అవకాశం ఉండదని అధికారులు వెల్లడిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధమైన డ్యూటీలు రద్దు చేయాలి

ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గ్రామ రెవెన్యూ సహాయకులకు(వీఆర్‌ఏ) కూటమి ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధమైన డ్యూటీలు వేస్తోందని, తక్షణమే వాటిని రద్దు చేయాలని, పే స్కేల్ అమలు చేసి ఆదుకోవాలని ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు కోరారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడుతూ.. వీఆర్‌ఏలకు రాత్రి వేళల్లో కార్యాలయాల వద్ద కాపలా, ఇసుక ర్యాంపులు, రైస్ మిల్లుల వద్ద డ్యూటీలు వేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వీఆర్‌ఏలు చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలలో వీఆర్‌ఏల జీతాల పెంపు, ప్రమోషన్స్ అమలు వంటి అంశాలపై చర్చించి పరిష్కరించాలని కోరారు. వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నవంబర్ నాలుగో తేదీన కలెక్టరేట్లు, 18వ తేదీన మంగళగిరిలోని సీసీఎల్‌ఏ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వీఆర్‌ఏలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

తెలుగువారి బాహుబలి

ఇనుప కండలు..ఉక్కు నరాలు

'తిండి కలిగితె కండకలదోయ్.. కండకలవాడేనుమనిషోయ్' అని చెప్పిన మహాకవి గురజాడ నడయాడిన ఉత్తరాంధ్ర నేలపైనే ప్రపంచం మెచ్చిన మల్లయోధుడు కోడిరామ్మూర్తి నాయుడు కూడా తిరుగాడారు. కలియుగ భీముడిగా, ఇండియన్ హెర్క్యులస్‌గా, మల్లమార్తాండగా ప్రపంచదేశాల్లో భారత కీర్తిప్రతిష్టలు చాటిచెప్పారు. తన భుజ బలంతో పాశ్చాత్యులను నోరెళ్లబెట్టేలా చేశారు. బండరాళ్లను గుండెపై పెట్టి పగలగొట్టించడం, ఒకటిన్నర టన్నుల బరువును గుండెలపై పెట్టించి మోయడం, ఏనుగును ఛాతీపై ఎక్కించుకోవడం వంటి వళ్లు గగుర్పొడిచే విన్యాసాలు చేసిన రామ్మూర్తినాయుడు గురించి 20వ శతాబ్దం ఆరంభంలో ప్రజలు కథలు కథలుగా చెప్పకునేవారు. శరీరానికి కట్టిన ఉక్కు గొలుసులను ఒంటిచేత్తో తెంచేసిన ఆయన బలానికి ఆంగ్లేయులు శభాష్ అన్నారు. ప్రస్తుత పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం కోడి రామ్మూర్తి నాయుడు స్వస్థలం.

నేడు ఈ మల్లయోధుడి 142వ జయంతి



వీరఘట్టంలో రామ్మూర్తినాయుడు జన్మించిన గృహం ఇదే

కలియుగ భీముడు.. కోడి రామ్మూర్తినాయుడు

- ప్రపంచదేశాల్లో భారత ఖ్యాతిని చాటిచెప్పిన మల్లయోధుడు
- గుండెపై ఒకటిన్నర టన్ను బరువు పెట్టించుకుని మోసిన ఇండియన్ హెర్క్యులస్
- ఏనుగును ఛాతీపై ఎక్కించుకుని ఐదు నిమిషాలు నిలిపిన బలశాలి

వీరఘట్టం: కోడి రామ్మూర్తినాయుడు 1883 నవంబర్ 3వ తేదీన కోడి వెంకన్ననాయుడు, అప్పలకొండ దంపతులకు వీరఘట్టంలో జన్మించారు. చిన్నతనంలోనే తల్లిని కోల్పోయాడు. తల్లిలేని పిల్లాడు కావడంతో రామ్మూర్తిని తండ్రి వెంకన్ననాయుడు ఎంతో గారాబంగా చూసేవారు. ఈ గారబంతో రామ్మూర్తి నాయుడు బాల్యంలో బడికి వెళ్లకుండా డుమ్మా కొడుతూ వీరఘట్టంకు సమీపంలో ఉన్న రాజ చెరువు వద్దకు రోజూ వెళ్లి వ్యాయామం చేస్తుండేవాడు. కొడుకును చదివించాలనే దృష్టి ఉన్న వెంకన్న రామ్మూర్తిని విజయనగరంలో ఉన్న తన తమ్ముడు నారాయణ స్వామి ఇంటికి పంపించాడు. అక్కడికి వెళ్లినా రామ్మూర్తి చదువు కంటే వ్యాయామం వైపే మొగ్గు చూపుతుండటంతో పినతండ్రి రామ్మూర్తిని మద్రాస్ పంపి వ్యాయామ కళాశాలలో చేర్పించాడు. తర్వాత విజయనగరంలో తను చదివిన కళాశాలలోనే రామ్మూర్తి నాయుడు వ్యాయామ ఉపాధ్యాయునిగా బాధ్యతలు స్వీకరించారు. వ్యాయామ విద్యను బోధిస్తూనే వాయు స్తంభన, జలస్తంభన విద్యపై పట్టు సాధించారు. ఇలా వ్యాయామం, దేహదారుఢ్యం, యోగ విద్యలను అలవోకగా ప్రదర్శించేవారు. ఇన్ని విద్యలు తెలిసిన రామ్మూర్తి అలానే ఉంటే ఆయన చరిత్ర ఇన్ని మలుపులు తిరిగి ఉండేది కాదు. కొన్నాళ్లకు విజయనగరంలో రామ్మూర్తి ఒక సర్కస్ కంపెనీ స్థాపించారు. ఇది ఆయన పేరును అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లింది.

ఊపిరి బిగబట్టి.. ఉక్కు గొలుసులు తెంపి

రామ్మూర్తి తన 20 ఏళ్ల వయసులోనే గుండె మీద ఒకటిన్నర టన్ను బరువును మోసి చూపించేవారు. సర్కస్‌లో మరింత కఠినమైన విన్యాసాలు చేసేవారు. రామ్మూర్తిని ఉక్కు గొలుసులతో బంధించేవారు. ఊపిరితిత్తుల నిండా గాలి పూరించి, ఆ గొలుసులను తెంచేవారు. రెండు కార్లకు గొలుసులు కట్టి, వాటిని తన భుజాలకు తగిలించుకునే వారు. కార్లను ఎంతవేగంగా నడిపించినా అవి కదిలేవి కాదు. ఏనుగును ఛాతి మీద ఎక్కించి దాదాపు ఐదు నిమిషాలు నిలిపేవారు. అందుకే ఆయన సర్కస్‌కు విశేషమైన ఆదరణ ఉండేది. లోకమాన్య బాలగంగాధర్ తిలక్ ఆహ్వానం మేరకు రామ్మూర్తినాయుడు పూణె వెళ్లి సర్కస్ ప్రదర్శన ఇచ్చారు. రామ్మూర్తి ప్రతిభను చూసి విస్తుపోయిన తిలక్ ఆయనకు 'మల్లమార్తాండ' అనే బిరుదు ఇచ్చి సత్కరించారు. 1920 సంవత్సరంలో కార్లను ముందుకు వెళ్లకుండా గొలుసులతో పట్టి ఆపుతున్న రామ్మూర్తి ప్రదర్శన చూసి బ్రిటిష్ వైస్రాయ్ లార్డ్ మింటో ఆశ్చర్యపోయారు. రామ్మూర్తి బృందాన్ని ఇంగ్లండ్ తీసుకెళ్లి బకింగ్‌హాం ప్యాలెస్‌లో ఇంగ్లండ్ రాణి, అప్పటి రాజు ఐదో జార్జ్ చక్రవర్తి ముందుప్రదర్శన ఇప్పించారు. రామ్మూర్తి నాయుడు ప్రదర్శనకు మెచ్చిన ఇంగ్లండ్ రాణి అతనికి 'ఇండియన్ హెర్క్యులస్' అనే బిరుదుతో సత్కరించారు. యూరప్‌లో పలు ప్రదర్శనలు ఇచ్చిన రామ్మూర్తినాయుడు అనంతరం జపాన్, చైనా, బర్మా దేశాల్లో కూడా సర్కస్ ప్రదర్శనలు ఇచ్చారు. బర్మాలో హత్యాయత్నం జరగడంతో విదేశీ ప్రదర్శనలను నిలిపివేసి స్వదేశంలో స్థిరపడ్డారు.



చేతికి ఎముకలేని దాత

కండల వీరుడు కోడి రామ్మూర్తినాయుడు నిత్య బ్రహ్మచారి. శాఖాహారి, ఆంజనేయస్వామికి పరమ భక్తుడు. చిన్నతనంలో వీరఘట్టం సమీపంలోని రాజచెరువు వద్ద వ్యాయామం చేస్తున్న సమయంలో ఓ సాధువు రామ్మూర్తిని పిలిచి మంత్రోపదేశం చేసారని, అప్పటినుంచి ఆయన దైవచింతనలో ఉండేవారని చెబుతారు.

ఆ సాధువు నుంచే రామ్మూర్తి జలస్తంభన, వాయుస్తంభన విద్యలు నేర్చుకున్నాడు. సర్కస్ కంపెనీ ద్వారా అప్పట్లోనే లక్షల రూపాయలు సంపాదించిన రామ్మూర్తి భారీగా దానధర్మాలు, విరాళాలు అందించేవారు. భారత స్వాతంత్ర్యోద్యమానికి సైతం తనవంతు సాయం అందించారు. జీవిత చరమాంకంలో రామ్మూర్తినాయుడు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొన్నారు. అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు ఆయన్ని చుట్టుముట్టాయి. కొంతమంది శిష్యులతో కలిసి ఒడిశాలోని కలహండి సంస్థానాధీశుని పోషణలో ఉండగా 1942 జనవరి 16వ తేదీన రామ్మూర్తినాయుడు కన్నుమూశారు.

'కోడి' బయోపిక్..

కోడి రామ్మూర్తినాయుడి జీవిత చరిత్ర ఆధారంగా బయోపిక్ తీసేందుకు రెండేళ్ల కిందట కొంత మంది సినిమావాళ్లు వీరఘట్టం గ్రామానికి వచ్చి ఇక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. వారం రోజులు వీరఘట్టంలో ఉండి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సినీ నటుడు దగ్గుబాటి రాణా కోడి రామ్మూర్తిగా నటించనున్నారని అప్పట్లో వార్తలు కూడా వచ్చాయి. అనంతరం ఈ విషయంలో ఎటువంటి పురోగతి కనిపించలేదు.

ఆయన ఖ్యాతిని ప్రభుత్వం గుర్తించాలి



కోడి రామ్మూర్తినాయుడంటే అమెరికాలో కూడా మంచి గుర్తింపు ఉంది. అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ కీర్తి ప్రతిష్టలను చాటిచెప్పిన అటువంటి మహానుభావుని చరిత్రను భారత ప్రభుత్వం గుర్తించాలి. రామ్మూర్తి నాయుడు జీవిత చరిత్ర ఎందరికో ఆదర్శం.

– కోడి రాజశేఖర్, రామ్మూర్తినాయుడి కుటుంబ సభ్యుడు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, నార్త్ కరోలినా, అమెరికా

పాఠ్యాంశంగా చేర్చాలి



1985–1995 మధ్య కాలంలో కోడి రామ్మూర్తినాయుడు జీవిత చరిత్రపై తెలుగులో ఒక పాఠ్యాంశం ఉండేది. కాలక్రమేణ సిలబస్ మారడంతో దాన్ని తొలగించారు. ఇటువంటి మహానుభావుల జీవిత చరిత్రలు విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తాయి. ప్రభుత్వం ఆయన ఘనతను గుర్తించి ఆయన జీవితాన్ని పాఠ్యాంశంగా చేర్చాలి.

– ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ, యజ్ఞకర్త, వీరఘట్టం

అధికారం మాది.. మాకు ఎదురులేదు!

- అధికారుల అండతో షాప్ సీజ్ చేసిన టీడీపీ నేతలు

కర్నూలు (రూరల్): లక్కీ డిప్‌లో దుకాణం దక్కినప్పటి నుంచి బెదిరిస్తున్నా అతను తలొగ్గలేదు. చంపేస్తామన్నా వెనకడుగు వేయలేదు. దాడులు చేసినా భయపడకుండా ధైర్యంగా దుకాణాన్ని ప్రారంభించాడు. అయితే టీడీపీ నేతలు అన్నట్లుగానే బరితెగించారు. తమను కాదని షాప్ నిర్వహించలేవు అని చెప్పి చివరకు అధికారాన్ని అడ్డం పెట్టుకుని దుకాణాన్ని సీజ్ చేశారని బాధితుడు వాపోతున్నాడు. కర్నూలు మండల పరిధిలోని పంచలింగాల గ్రామంలో నిర్వహిస్తున్న నిరీక్షణ వైన్స్ (షాప్ 22)ను శనివారం అధికారులు సీజ్ చేశారు. దేవదాయ శాఖ స్థలంలో మద్యం దుకాణాన్ని నిర్వహించకూడదని ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు ఆధ్వర్యంలో కర్నూలు ఆర్డీవో కిడారి సందీప్ కుమార్, కర్నూలు రూరల్ తహసీల్దార్ టీవీ రమేష్ బాబు, దేవాదాయ శాఖ ఈవో దినేష్ సమక్షంలో వైన్ షాప్‌ను సీజ్ చేశారు. నోటీసు ఇవ్వకుండా ఎలా సీజ్ చేస్తారని దుకాణ నిర్వాహకుడు తెలంగాణ రాష్ట్రం దేవరకద్ర గ్రామ వాసి వింజమూరి కృష్ణారెడ్డి అధికారులను ప్రశ్నిస్తున్నా వినకుండా షాప్‌కు తాళం వేశారు.

గిరిజన చిన్నారిపై అత్యాచారం దారుణం

- ఏపీ ట్రైకార్ మాజీ చైర్మన్ సురేంద్ర



సాక్షి, అమరావతి: తిరుపతి జిల్లా, నగిరి నియోజకవర్గం ఏఎం.పురం ఎస్టీ యానాది కాలనీలో ముక్కుపచ్చలారని మూడేళ్ల గిరిజన చిన్నారిపై అత్యాచారం, హత్య దారుణమని ఏపీ ట్రైకార్ మాజీ చైర్మన్ గుండా సురేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యం కారణంగానే రాష్ట్రంలో వరుస ఘటనలు జరుగుతున్నాయని ఆయన శనివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ముచ్చుమర్రి ఘటనతోనైనా ప్రభుత్వం మేల్కొని శాంతిభద్రతల విషయంలో కఠిన చర్యలు తీసుకుని ఉంటే ఈ ఘటన జరిగేది కాదన్నారు. గిరిజన బాలిక ఘటనలో సత్వర న్యాయం చేయకపోయినా, ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవడంలో అలసత్వం ప్రదర్శించినా జాతీయ ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయిస్తామని సురేంద్ర హెచ్చరించారు.

పరిశ్రమలో ప్రమాదం.. కార్మికుడి మృతి

గూడూరు రూరల్: తిరుపతి జిల్లా గూడూరు రూరల్ పరిధిలోని ఓ పరిశ్రమలో శనివారం జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చవటపాళెం సమీపంలోని ఓ పరిశ్రమ కోర్ మిషన్ వద్ద పనిచేస్తుండగా ఒక్కసారిగా మిషన్ ఆన్ కావడంతో గోపి (33) అనే కార్మికుడి తలకు తీవ్ర గాయమైంది. వెంటనే సహచర కార్మికులు పరిశ్రమ అంబులెన్స్‌లో అతనిని గూడూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అతను అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గోపి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరుకు చెందిన వాడని, అతను కొన్ని సంవత్సరాలుగా పరిశ్రమలో పనిచేస్తున్నాడు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 20 గంటలు


తిరుమల: తిరుమలలో శనివారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోయాయి. క్యూ ఏటీజీహెచ్ వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 67,785 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 27,753 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.2.38 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

బంగారు తిరుచ్చిపై వెంకన్న అభయం



చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వర స్వామి శనివారం బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు, అభిషేకాలు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామివారికి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. తదుపరి స్వామివారు తన దేవేరులతో కలిసి బంగారు తిరుచ్చి వాహనాన్ని అధిష్టించి నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

కపిలతీర్థంలో విశేష పూజలు ప్రారంభం




తిరుపతి కల్చరల్: తిరుపతి నగరంలోని కపిలతీర్థంలో వెలసిన కపిలేశ్వరస్వామి ఆలయంలో శనివారం గణపతి హోమంతోపాటు విశేష పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆలయంలో నెల రోజులు హోమాలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. 02టీపీఎల్34- విశేష పూజ,హోమ మహోత్సవాలలో కొలువైన పంచమూర్తులు

వేడుకగా గోవర్ధన పూజ



తిరుపతి కల్చరల్: శ్రీకృష్ణ భగవానుడు తన చిటికెన వేలితో గోవర్ధనగిరిని ఎత్తి గోవులు, యాదవులను కాపాడిన రోజును పురస్కరించుకుని ఇస్కాన్ మందిరంలో శనివారం గోవర్ధన పూజను అత్యంత వేడుకగా నిర్వహించారు.

త్రికోటేశ్వరునికి విశేష అభిషేకాలు



నరసరావుపేట రూరల్: పవిత్ర కార్తిక మాసం తొలి రోజున కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అభిషేకాల్లో పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు చేశారు.

రేపు తిరుపతిలో జాబ్‌మేళా

తిరుపతి అర్బన్ : తిరుపతిలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సెంటర్‌లో సోమవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఆఫీస్, సీడప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఉదయం 9గంటల నుంచి మేళా ప్రారంభమవుతుందని వెల్లడించారు. పలు కంపెనీ ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు చేపట్టనున్న జాబ్ మేళాకు పదోతరగతి నుంచి ఇంటర్ ఏదైనా డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులని వివరించారు. ఆసక్తిగలవారు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. సర్టిఫికెట్ల తోపాటు ఆధార్ జెరాక్స్‌లు అందించాలని చెప్పారు. వివరాల కోసం 9703437472 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్యా సమాచారం

నేడు 'యశస్వి' వేణుగోపాలరావు అవార్డు ప్రదానోత్సవం

గుంటూరు వెస్ట్: 'యశస్వి' సద్రాజు శ్రీవేణుగోపాలరావు స్మారక ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల పురస్కార కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్థానిక లక్ష్మీపురంలోని త్యాగరాజ సాంస్కృతిక సంఘంలో నిర్వహిస్తామని సంస్కృతి సంస్థ వ్యవస్థాపకులు సద్రాజు బాలచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయునిగా, కవిగా, గాయకునిగా విభిన్న పాత్రలను విజయవంతంగా నిర్వహించిన శ్రీవేణుగోపాలరావు ఎందరికో ఆదర్శనీయమన్నారు. ప్రస్తుతం ఆయన శిష్యులు దేశ,విదేశాల్లో ఉన్నత స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా రుద్రవరం గ్రామం సంతనూతలపాడు జెడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు ఉన్నం జ్యోతివాసు, కవి, గాయకుడు, గేయ రచయిత, తెలుగు పండితుడు ఖమ్మం జిల్లా గోళ్ళపాడు జెడ్పీహెచ్ఎస్ అసిస్టెంట్ మేడగాని శేషగిరి రావులకు సంగీత, సాహిత్య, నృత్య, నాటక సంస్థ సంస్కృతి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. విశిష్ట అతిదులుగా కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, లేమల్లె పాడు ఎంటిఏస్ ఉపాధ్యాయుడు మోదుగుల రవికృష్ణతోపాటు అనేక మంది వక్తలు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రవేశం ఉచితమని పేర్కొన్నారు.

విజ్ఞాన్ ఆధ్వర్యంలో వరద బాధితులకు దుస్తులు పంపిణీ

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం దాములూరు, చిలుకూరు గ్రామాల్లోని వరద బాధితులకు రూ.10 లక్షల విలువగల దుస్తుల కిట్లు పంపిణీ చేసినట్లు వీసీ పి.నాగభూషణ్ శనివారం తెలిపారు. వైస్ చాన్సలర్ మాట్లాడుతూ ఇటీవల వరద ప్రాంతాల్లో ముంపునకు గురైన దాములూరు గ్రామంలోని 850 కుటుంబాలకు, చిలుకూరు గ్రామంలోని 400 కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేశామని పేర్కొన్నారు. బాధితులకు అందజేసిన దుస్తుల కిట్‌లో చీర, పంచ, 2 టవళ్లు, దుప్పట్లు ఉంటాయని వివరించారు.



Gold Memories

'మిస్సమ్మ'లో జమున, ఎన్టీఆర్, సావిత్రి

తెలుగు వెండితెరకు మణిమాణిక్యం మన మిస్సమ్మ



1955 జనవరి 12న విడుదలైన 'మిస్సమ్మ' టాలీవుడ్ ఆల్ టైం క్లాసిక్. చక్రపాణి నిర్మాతగా ఎల్వీ ప్రసాద్ దర్శకత్వంలో తెరకెక్కింది. 'మిస్సమ్మ' మంచి రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్. ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎస్వీ రంగారావు, సావిత్రి వంటి దిగ్గజ నటులు ప్రధాన పాత్రలు పోషించారు. హీరోయిన్ సావిత్రికి జమున చెల్లిగా నటించారు. సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది 'మిస్సమ్మ'. అప్పటికే ఎన్టీఆర్, ఏఎన్నార్ హీరోలుగా నిలదొక్కుకున్నారు. అయినప్పటికీ ఈ సినిమాలో ఎలాంటి కమర్షియల్ హంగులూ ఉండవు. చక్కని హాస్యం, భావోద్వేగాలు, గిల్లికజ్జాలతో సాగుతుంది. సాలూరి రాజేశ్వరరావు అందించిన మ్యూజిక్ ఓ మ్యాజిక్.

భానుమతి ప్లేస్‌లో సావిత్రి

'మిస్సమ్మ'లో ఎస్వీ రంగారావు, సావిత్రి నటన... ఎన్టీఆర్, ఏఎన్నార్‌లను డామినేట్ చేసేలా ఉంటుంది. సావిత్రి హీరోయిన్‌గా ఎదుగుతున్న రోజుల్లో వచ్చిన ఈ సినిమా ఆమె కెరీర్‌కి చాలా ప్లస్ అయ్యింది. తన ఇమేజ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. ఇందులో ఆత్మవిశ్వాసం కలిగిన స్ట్రాంగ్ లేడీ రోల్ సావిత్రిది. అలాగే ముక్కోపి. ఈ పాత్రకు భానుమతి కరెక్ట్ అని తొలుత దర్శక-నిర్మాతలు భావించారు. అప్పటికే ఆమె పరిశ్రమకు వచ్చి చాలా ఏళ్లయింది. 'మల్లీశ్వరి' వంటి బ్లాక్ బస్టర్‌లో నటించారు. నిజ జీవితంలో భానుమతి వ్యక్తిత్వం... 'మిస్సమ్మ'లో మేరీ పాత్రలా ఉంటుంది. భానుమతితో 'మిస్సమ్మ' షూటింగ్ కొంత మేర జరిగింది కూడా. అయితే ఓ రోజు ఆమె షూటింగ్‌కి ఆలస్యంగా వచ్చారట. దీంతో నిర్మాత చక్రపాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం షూటింగ్ అయితే మధ్యాహ్నం రావడమేంటి క్షమాపణలు చెప్పాలన్నారట. అయితే... ఆలస్యమవుతుందని మేనేజర్‌తో కబురు పంపానని... కాబట్టి క్షమాపణలు చెప్పేది లేదన్నారట భానుమతి. దీంతో చక్రపాణి ఆమెను సినిమా నుంచి తొలిగించి అప్పటి వరకు షూట్ చేసిన రీల్స్‌ను తగలబెట్టేశారట. అలా 'మిస్సమ్మ'లో మెయిన్ హీరోయిన్‌గా చేస్తున్న భానుమతి స్థానంలోకి సావిత్రి వచ్చారు. లేదంటే హీరోయిన్ చెల్లెలుగా చేసిన జమున పాత్ర చేయాల్సి వచ్చేది. బెంగాలీ నవల మన్మొయీ గర్ల్స్ స్కూల్ అనే హాస్య రచన ఆధారంగా నిర్మాత చక్రపాణి 'మిస్సమ్మ' తెలుగు కథను సమకూర్చారు. సినిమా చిత్రీకరణంతా మద్రాసు చుట్టు పక్కలే జరిగింది. 'మిస్సమ్మ'ను తమిళంలో మిస్సియమ్మగా ఏక కాలంలో చిత్రీకరించారు. ఇందులో జెమినీ గణేశన్, సావిత్రి నటించారు. తెలుగు, తమిళ వెర్షన్లు రెండూ కూడా కమర్షియల్‌గా బంపర్ హిట్టయ్యాయి. 1957లో ఏవీఎం ప్రొడక్షన్స్ ఈ సినిమాను హిందీలోనూ తీసింది. హిందీలో మేరి పాత్రను మీనాకుమారి పోషించగా 'మిస్ మేరి'గా నిర్మించారు. ఇది ఎల్వీ ప్రసాద్‌కి బాలీవుడ్‌లో దర్శకుడిగా తొలి చిత్రం.

- ఇంటూరు హరికృష్ణ

ప్రభాస్ బ్రహ్మరాక్షస?



● ప్రభాస్

ప్రభాస్ ప్రస్తుతం ఫుల్ బిజీగా ఉన్నారు. మారుతి దర్శకత్వంలో 'రాజా సాబ్', హను రాఘవపూడి దర్శకత్వంలో 'ఫౌజి' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రాలు చేస్తున్నారు ప్రభాస్. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా చేయాల్సిన 'స్పిరిట్' సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయి. జనవరిలో చిత్రీకరణ ప్రారంభం కానుంది. అయితే ప్రభాస్ తర్వాతి చిత్రాలపై ఫిల్మ్‌నగర్‌లో కొత్త విషయాలు వినిపిస్తున్నాయి. 'హను-మాన్' ఫేమ్ ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో 'బ్రహ్మరాక్షస' (ప్రచారంలో ఉన్న టైటిల్) సినిమాను ప్రభాస్ చేస్తారని, అలాగే తమిళ దర్శకుడు లోకేష్ కనగరాజ్ డైరెక్షన్‌లో ఓ కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే టాక్ వినిపిస్తోంది. అంతేకాదు... బాలీవుడ్ ప్రముఖ దర్శకుల్లో ఒకరైన రాజ్‌కుమార్ హిరాణీ కూడా ప్రభాస్‌తో ఓ సినిమా చేసేందుకు సంప్రదింపులు జరుగుతున్నాయని బాలీవుడ్ టాక్. మరి... 'రాజాసాబ్, ఫౌజి, స్పిరిట్' చిత్రాల తర్వాత ప్రభాస్ తర్వాతి చిత్రం ఎవరి డైరెక్షన్‌లో ఉంటుంది? అనే విషయంపై ఓ క్లారిటీ రావాలంటే మరి కొన్ని రోజులు ఎదురు చూడక తప్పదు. ఈ సంగతి ఇలా ఉంచితే... 'బ్రహ్మరాక్షస' సినిమాలో ప్రభాస్ పాత్రలో నెగటివ్ షేడ్స్ ఉంటాయట. ఇక ఈ సినిమాను రణ్‌వీర్ సింగ్‌తో చేయాలనుకున్నారు ప్రశాంత్ వర్మ. కొన్ని కారణాల వల్ల ప్లాన్ మార్చి, ప్రభాస్‌తో చేయాలనుకుంటున్నట్లుగా తెలుస్తోంది.

జోడీ కుదిరిందా?



● నాగ చైతన్య

● జాన్వీ కపూర్

నాగచైతన్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'తండేల్'. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. జనవరిలో విడుదలయ్యే అవకాశం ఉంది. కాగా 'తండేల్' చిత్రం తర్వాత దర్శకుడు శివ నిర్వాణతో నాగచైతన్య ఓ లవ్‌స్టోరీ ఫిల్మ్ చేయనున్నారనే టాక్ వినిపిస్తోంది. శివ నిర్వాణ ఓ కథ తయారు చేశారని, ఈ కథతో సినిమా చేసేందుకు నాగచైతన్య కూడా సిద్ధంగా ఉన్నారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. అంతేకాదు... ఈ చిత్రంలోని హీరోయిన్ పాత్ర కోసం జాన్వీ కపూర్‌ను తీసుకునే ఆలోచనలో ఉన్నారట శివ నిర్వాణ. జాన్వీతో శివ నిర్వాణ సంప్రదింపులు జరుపుతున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. చైతన్య-జాన్వీల జోడీ దాదాపు కుదిరిందని టాక్. ఈ సంగతి ఇలా ఉంచితే... 2019లో నాగచైతన్య హీరోగా శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందిన 'మజిలీ' సినిమా సూపర్‌హిట్‌గా నిలిచిన సంగతి గుర్తుండే ఉంటుంది.

'అట్లుంటది బిగ్ బాస్‌తో'



మామూలుగా ఒక్క టికెట్ మీద ఒక సినిమానే చూడగలం. అలాగే వేరే టికెట్ మీద వేరే సినిమా చూడగలం. కాని అదే ఒక్క టికెట్ మీద డజనుకు పైగా సినిమాలు దాదాపు వంద రోజులు చూడగలిగితే అదే బిగ్ బాస్ కార్యక్రమం. మనం చూసే సినిమా సినిమాకీ ప్రత్యేకత కోరుకుంటాం. ఓ చిన్న సన్నివేశం కానీ, అంతెందుకు కనీసం చిన్న ప్రదేశం కానీ... ఒక సినిమాలోది మరో సినిమాలో కనబడితే నానా యాగీ చేస్తాం. కానీ బిగ్ బాస్ కార్యక్రమం మాత్రం ఇందుకు మినహాయింపు. గడచిన 8 సిరీస్‌లలో బిగ్ బాస్ కార్యక్రమ అంశం కానీ, కంటెస్టెంట్లు ఆడిన టాస్కులు కానీ అంతెందుకు వాళ్లున్న సెట్ అంతా ఒకటే. కాకపోతే సెట్‌కు కాస్త రంగులు మారుస్తారు. సిరీస్‌కు కంటెస్టెంట్లు మారతారు. అయినా ప్రతి సిరీస్‌కు బిగ్ బాస్‌కున్న ఆదరణ పెరుగుతుందే కానీ తరగట్లేదు. బిగ్ బాస్ కార్యక్రమానికి ప్రేక్షక అభిమానం ఆకాశమంత ఎత్తయితే, విమర్శకుల దురభిమానం అంతరిక్షమంత ఎత్తు అని చెప్పవచ్చు. ఈ వారం మెగా ఛీఫ్ ఎంపిక (విష్ణుప్రియ) ఓ విడ్డూరమయితే వారం మధ్యలో తన నటనతో గంగవ్వ చేసిన హారర్ ఎపిసోడ్ ఓ అద్భుతమనే అనాలి. యథావిధిగా కంటెస్టెంట్లు మూడు లవ్ ఎపిసోడ్లు నాలుగు ఫ్లర్టింగ్ ఎపిసోడ్లతో ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నారు. వారాంతంలో దీపావళి స్పెషల్ ఎపిసోడ్‌గా ప్రసారమయిన ఫార్మెట్ కూడా పేలవంగా అనిపించింది. కాకపోతే కొత్త సినిమాల సెలబ్రిటీస్‌తో కాస్త కళకళలాడించడానికి ప్రయత్నించాడు బిగ్ బాస్. వారమంతా కాస్త టాస్కులలో తన సత్తా చాటుతూ స్క్రీన్ స్పేస్ మిగతావారి కన్నా ఎక్కువ షేర్ చేసుకున్నా మెహబూబ్‌కు మొండి చేయి చూపించి ఎలిమినేట్ చేశాడు బిగ్ బాస్. ఈ వారం ఎపిసోడ్ ట్విస్ట్ ఏంటంటే అవినాష్ కూడా తాను అనారోగ్య కారణాలతో హౌస్ బయటకు వెళుతున్నట్టు ఎపిసోడ్ చివర ప్రోమోలో చూపించారు. పోయిన సారి మన విశ్లేషణలో చెప్పుకున్నట్టు హౌస్‌లోని కంటెస్టెంట్లు తమ ఉనికి, ఉపాధి కోసం తమ ఆరోగ్యాలను కూడా లెక్క చేయడంలేదు. ఇన్ని జరుగుతున్నా బిగ్ బాస్ మాత్రం తన షో లాభాలను లెక్క పెట్టుకుంటూనే ఉన్నాడు. ఏదేమైనా అట్లుంటది బిగ్ బాస్‌తో.

అందుకే ఆ పాటలు ఫ్రీగా చేశాను!

నోరా ఫతేహి... పరిచయం అక్కర్లేని పేరు. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ చిత్రాల్లో ప్రత్యేక పాటల్లో తనదైన డ్యాన్సులతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారామె. ఆమె అద్భుతమైన డ్యాన్సర్ మాత్రమే కాదు... మంచి నటి, గాయని, మోడల్ కూడా. తెలుగులో తొలిసారి ఎన్టీఆర్ హీరోగా నటించిన 'టెంపర్' సినిమాలో 'ఇట్టాగే రెచ్చిపోదాం...' అనే సాంగ్‌లో తళుక్కుమన్నారు నోరా ఫతేహి. అయితే ప్రభాస్ హీరోగా ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన 'బాహుబలి: ది బిగినింగ్' (2015) సినిమాలో 'మనోహరి..' అనే ప్రత్యేక పాట ఆమెకు ఎంతో క్రేజ్ తీసుకొచ్చింది. ఆ తర్వాత తెలుగులో 'కిక్, షేర్, లోఫర్, ఊపిరి' సినిమాల్లో ప్రత్యేక పాటలతో అలరించారు నోరా ఫతేహి. అలాగే 'దిల్ బర్, సాకీ సాకీ..' వంటి ఎన్నో ప్రత్యేక పాటలతో ఆమె బాలీవుడ్‌లోనూ ఎంతో పాపులారిటీ సంపాదించుకున్నారు. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో నోరా ఫతేహి మాట్లాడుతూ... తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి చెప్పారు. ''నేను ఫారిన్ వెళ్తున్న సమయంలో 'సత్యమేవ జయతే' లో 'దిల్‌బర్' సాంగ్, 'స్త్రీ' చిత్రంలో 'కమరియా..' పాట చేసే అవకాశం వచ్చింది. అయితే నన్ను నేను నిరూపించుకోవడానికి ఇదే మంచి సమయం అని భావించాను. అందుకే ఆ రెండు పాటలకు రెమ్యునరేషన్ తీసుకోకుండా ఉచితంగా చేశాను. కానీ ఆ సమయంలో నాకు డబ్బు అవసరం చాలా ఉంది. అయినా సరే ఫ్రీగా చేశాను'' అని తెలిపారు. కాగా వరుణ్ తేజ్ హీరోగా నటించిన 'మట్కా' సినిమాలో 'లే లే రాజా..' అనే స్పెషల్ సాంగ్ చేశారు నోరా ఫతేహి. ఈ సినిమా ఈ నెల 14న రిలీజ్ కానుంది.



● నోరా ఫతేహి

ఆ మాటలతో చాలా భయపడ్డాను!

''సల్మాన్ ఖాన్‌కి చెప్పు... ఆయన ప్రియురాలిని మేము కిడ్నాప్ చేయనున్నామని అంటూ అండర్‌వరల్డ్ నుంచి ఫోన్ కాల్ రావడంతో చాలా భయపడ్డాను'' అని హీరో సల్మాన్ ఖాన్ మాజీ ప్రేయసి, నటి సోమీ అలీ అన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ-''నేను బాలీవుడ్‌లో పని చేస్తున్నప్పుడు దావూద్ ఇబ్రహీం, చోటా షకీల్ వంటి వారి గురించి చాలా మంది నటీనటులు మాట్లాడుకోవడం విన్నాను. వీరిలో ఎవరూ ప్రత్యక్షంగా మాట్లాడుకునేవారు కాదు. 'అండర్ వరల్డ్... అని పరోక్షంగా చెప్పేవారు. సల్మాన్, నేను డేటింగ్‌లో ఉన్నప్పుడు మూడేళ్లు కలిసే ఉన్నాం. ఆ సమయంలో సల్మాన్‌కి ఓసారి అండర్‌వరల్డ్ నుంచి బెదిరింపు కాల్ వచ్చింది. ఇంటిలోని ఫోన్ నేను రిసీవ్ చేసుకున్నాను. ఎవరు చేశారో తెలియదు కానీ.. 'సల్మాన్‌కు చెప్పు.. ఆయన ప్రియురాలిని మేము కిడ్నాప్ చేయనున్నాం' అన్నారు. ఆ మాటలు నన్ను ఎంతో భయపెట్టాయి. వెంటనే ఆ విషయాన్ని సల్మాన్‌కు చెప్పాను. ఆయన కూడా ముందు కంగారుపడ్డారు. ఆ తర్వాత పరిస్థితులు చక్కబడేలా చేశారు. ఆ ఫోన్ చేసిన వ్యక్తి ఎవరో తెలుసుకుందామని ఎన్నోసార్లు ప్రయత్నించాను. సల్మాన్‌నూ అడిగా. ఇలాంటి విషయాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని ఆయన అన్నారు'' అని సోమీ అలీ పేర్కొన్నారు. కాగా మూడేళ్ల పాటు డేటింగ్‌లో ఉన్న సల్మాన్ ఖాన్, సోమీ అలీ ఆ తర్వాత విడివిడిగా ఉంటున్నారు.



● సల్మాన్ ఖాన్



● సోమీ అలీ

అనంత శ్రీరామ్‌కి ఐఫా అవార్డు



● సాయి రాజేశ్, అనంత్ శ్రీరామ్, ఎస్‌కేఎన్

పాటల రచయిత అనంత శ్రీరామ్ ఐఫా(ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ అవార్డ్స్) అవార్డు అందుకున్నారు. 'బేబి' సినిమాలోని 'ఓ రెండు మేఘాలిలా..' అనే పాటకు ఆయనకు ఈ అవార్డు వచ్చింది. ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య ప్రధాన పాత్రల్లో సాయి రాజేశ్ దర్శకత్వం వహించిన చిత్రం 'బేబి'. మాస్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ సినిమా 2023 జూలై 14న విడుదలై, సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ చిత్రానికిగానూ 'ఓ రెండు మేఘాలిలా..' పాటకు బెస్ట్ లిరిక్ రైటర్‌గా అనంత శ్రీరామ్ తాజాగా ఐఫా అవార్డు అందుకోవడంతో ఎస్‌కేఎన్, సాయి రాజేశ్ కలిసి అనంత శ్రీరామ్‌ను అభినందించారు. ''బేబి' మూవీకి ఇప్పటిదాకా ఫిలింఫేర్, సైమా, గామా వంటి అనేక గొప్ప పురస్కారాలు దక్కాయి. తాజాగా ఐఫా దక్కడం ఆనందంగా ఉంది. ఈ సినిమాకు ప్రేక్షకుల రివార్డ్స్‌తో పాటు ప్రతిష్టాత్మక అవార్డులు దక్కుతున్నాయంటే ఆ ఘనత సాయి రాజేశ్‌కే దక్కుతుంది. ఈ ప్రేమ కథను హృద్యంగా తెరపై ఆవిష్కరించారాయన'' అని మేకర్స్ తెలిపారు. కాగా ఎస్‌కేఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్‌లో 'బేబి' సినిమా బాలీవుడ్‌లో రీమేక్ అవుతోంది.

పుష్పరాజ్‌తో స్టెప్స్‌కి ఊ అన్నారా?



● శ్రీలీల

పుష్పరాజ్‌తో స్పెషల్ స్టెప్పులేయనున్నారట శ్రీలీల. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'పుష్ప: ది రూల్'. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. అయితే రెండు పాటల చిత్రకరణ బ్యాలెన్స్ ఉంది. ఇందులో ఒకటి స్పెషల్ సాంగ్. ఈ నెల మొదటివారంలో ఈ స్పెషల్ సాంగ్‌ను చిత్రీకరించాలని ప్లాన్ చేశారు. తొలి భాగం 'పుష్ప: ది రైజ్'లో ఉన్న 'ఊ అంటావా మావా...' సాంగ్ తరహాలో రెండో భాగంలో ఈ స్పెషల్ సాంగ్‌ని చాలా స్పెషల్‌గా ప్లాన్ చేస్తున్నారట. గణేష్ ఆచార్య కొరియోగ్రఫీ చేస్తారని టాక్. అయితే ఈ స్పెషల్ సాంగ్‌లో బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ కనిపిస్తారని ప్రచారం సాగింది. అయితే శ్రద్ధాకపూర్ నటించడం లేదని, ఈ చాన్స్ శ్రీలీలకు లభించిందని ఫిల్మ్‌నగర్ సమాచారం. మరి... పుష్పరాజ్‌తో స్పెషల్ స్టెప్స్‌కి శ్రీలీల ఊ అన్నారా? అనేది తెలియాలి. ఇక పుష్పరాజ్‌గా అల్లు అర్జున్ టైటిల్ రోల్ చేస్తున్న ఈ సినిమాలో హీరోయిన్‌గా శ్రీవల్లి పాత్రను రష్మికా మందన్నా చేస్తున్నారు. ఈ చిత్రంలో ఫాహద్ ఫాజిల్, అనసూయ, సునీల్, ధనుంజయ, జగపతి బాబు ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 5న విడుదల కానుంది. ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త.

సాక్షి ప్లస్
ఆదివారం । 3-11-2024

బిజినెస్ రీల్

కొత్త మొబైల్ యాప్‌ని లాంచ్ చేసిన ఎన్‌ఎస్‌ఈ

తెలుగు సహా 11 ప్రాంతీయ భాషల్లో వెబ్‌సైట్



ముంబై: ఇన్వెస్టర్ల విస్తృత ప్రయోజనాల దృష్ట్యా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ(ఎన్‌ఎస్‌ఈ) కొత్త మొబైల్ యాప్‌ను లాంచ్ చేసింది. అలాగే, తన ఎన్‌ఎస్‌ఈ వెబ్‌సైట్ సేవలు మరింత మెరుగుపరిచింది. తెలుగుతో సహా 11 ప్రాంతీయ భాషల్లోకి అందుబాటులోకి తెచ్చింది. దీంతో ఇన్వెస్టర్లు తమకు నచ్చిన ప్రాంతీయ భాషల్లోని డేటాను యాక్సెస్ చేసుకోవచ్చు. కాగా, ఎన్‌ఎస్‌ఈ మొబైల్ యాప్ యాపిల్ స్టోర్, ఆండ్రాయిడ్ ప్లే స్టోర్ రెండింటిలోనూ అందుబాటులో ఉంది. మార్కెట్‌కు సంబంధించిన ఇండికేషన్లు, అప్‌డేట్లు, ట్రెండింగ్, ఆప్షన్ డేటా ట్రేడింగ్ సంబంధిత కాల్స్, పుట్స్ తదితర సమగ్ర సమాచారం ఇందులో ఉంది. పెట్టుబడిదారులు సురక్షితమైన సమాచారాన్ని ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.

అక్టోబర్‌లో ఆల్‌హైకి టీవీఎస్ మోటార్ అమ్మకాలు




ముంబై: టీవీఎస్ మోటార్ కంపెనీ విక్రయాలు అక్టోబర్‌లో రికార్డు గరిష్టానికి చేరాయి. గత నెలలో మొత్తం అమ్మకాలు 4.89 లక్షలుగా నమోదయ్యాయి. కంపెనీ నెలవారీ విక్రయాల్లో ఇదే ఇప్పటి వరకు అత్యధికం. కిందటేడాది ఇదే నెలలో డీలర్లకు పంపిణీ చేసిన 4.34 లక్షల వాహనాలతో పోలిస్తే ఇవి 13% అధికం. మొత్తం ద్విచక్ర వాహన రిజిస్ట్రేషన్లు 14% వృద్ధితో 4,20,610 నుంచి 4,78,159 నుంచి చేరాయి. ఇందులో మోటార్‌సైకిల్ విక్రయాలు 14% 2,30,822 యూనిట్లకు చేరగా, స్కూటర్ల అమ్మకాలు 17% పుంజుకొని 1,93,439 యూనిట్లకు చేరాయి. ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు 45% పుంజుకొని 20,153 యూనిట్ల నుంచి 29,308 యూనిట్లకు చేరాయి. అయితే త్రిచక్ర వాహన అమ్మకాలు 23% తగ్గి 10,856 యూనిట్లకు దిగివచ్చాయి. గతేడాది ఇదే అక్టోబర్‌లో 14,104 వాహనాలు అమ్ముడయ్యాయి. ఎగుమతులు 9% వృద్ధితో 87,952 నుంచి 95,708 యూనిట్లకు చేరాయి.

ఎన్‌ఎస్‌ఈ క్లయింట్ అకౌంట్లు @ 20 కోట్లు



న్యూఢిల్లీ: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదైన మొత్తం క్లయింట్ ఖాతాల సంఖ్య 20 కోట్ల మార్కును దాటింది. డిజిటల్ పరివర్తన, నూతన సాంకేతిక ఆవిష్కరణలు ఇందుకు కారణమని సంస్థ తెలిపింది. ఎనిమిది నెలల క్రితం 16.9 కోట్ల స్థాయిలో ఉండగా స్వల్ప వ్యవధిలోనే ఈ మైలురాయిని దాటినట్లు పేర్కొంది. భారత వృద్ధి గాథపై ఇన్వెస్టర్లకున్న పటిష్టమైన విశ్వాసానికి ఇది నిదర్శనమని ఎన్‌ఎస్‌ఈ చీఫ్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీరామ్ కృష్ణన్ తెలిపారు. మహారాష్ట్ర నుంచి అత్యధికంగా 3.6 కోట్ల ఖాతాలు ఉండగా, ఉత్తర్‌ప్రదేశ్ (2.2 కోట్లు), గుజరాత్ (1.8 కోట్లు), చెరి 1.2 కోట్ల ఖాతాలతో రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

ఎన్‌సీసీకి రూ. 3,496 కోట్ల ఆర్డర్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అక్టోబర్ నెలలో రూ. 3,496 కోట్ల విలువ చేసే (జీఎస్‌టీ కాకుండా) ఆర్డర్లు లభించినట్లు ఎన్‌సీసీ వెల్లడించింది. వీటిలో రూ. 2,684 కోట్ల ఆర్డర్లు బిల్డింగ్ విభాగానికి సంబంధించినవి కాగా రూ. 538 కోట్లు ఎలక్ట్రికల్ డివిజన్‌వి, రూ. 274 కోట్లు వాటర్.. ఇతరత్రా విభాగాలకు సంబంధించినవని తెలిపింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీలతో పాటు ప్రైవేట్ కంపెనీ నుంచి వీటిని పొందినట్లు కంపెనీ వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

3-11-2024

విశాఖ	550-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550-00
విజయవాడ	555-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	540-00
వరంగల్	542-00
రిటైల్ ధర	6.00

ఆభరణాల ఎగుమతులకు కొత్త ప్రమాణాలు

- వేస్టేజీ నిబంధనలకు సవరణలు
- జనవరి 1 నుంచి అమల్లోకి



న్యూఢిల్లీ: బంగారం, వెండి, ప్లాటినం ఆభరణాల ఎగుమతులకు సంబంధించి సవరించిన వేస్టేజీ (తరుగు/వృథా) నిబంధనలను కేంద్రం శుక్రవారం విడుదల చేసింది. ఇవి జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఆభరణాల తయారీ సమయంలో కొంత లోహం వృథా అవుతుందని తెలిసిందే. ఎగుమతి చేసే ఆభరణాలకు సంబంధించి ఈ వేస్టేజీ పరంగా పరిమితులు ఉన్నాయి. ఈ వేస్టేజీని తగ్గిస్తూ ఈ ఏడాది మే 27న కేంద్రం కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. వీటిపట్ల పరిశ్రమ ఆందోళన వ్యక్తం చేయడంతో 2024 డిసెంబర్ చివరి వరకు అమలును వాయిదా వేసింది. కొంత వెసులుబాటుతో సవరించిన నిబంధనలను కేంద్రం తాజాగా విడుదల చేసింది. ''ఎగుమతి చేసే ఆభరణాలకు సంబంధించి ప్రామాణిక ఇన్‌పుట్-అవుట్‌పుట్, అనుమతించిన వేస్టేజీ నిబంధనలను సవరించడమైనది''అంటూ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారీన్ ట్రేడ్ ప్రకటించింది. ఆభరణాల తయారీ ప్రక్రియకు తగ్గట్టు వేస్టేజీని వాస్తవికంగా నిర్ణయించాలని పరిశ్రమ కోరడం గమనార్హం. అలాగే, కొత్త నిబంధనల అమలుకు తగినంత సమయం ఇవ్వాలని కూడా కోరింది. సాధారణ బంగారం, ప్లాటినం ఆభరణాల తయారీలో వేస్టేజీని 2.5 శాతం నుంచి 0.5 శాతానికి, వెండి ఆభరణాలకు వేస్టేజీని 3.2 శాతం నుంచి 0.75 శాతానికి తగ్గిస్తూ మే నెలలో ప్రకటించిన నిబంధనల్లో కేంద్రం పేర్కొంది. అదే స్టడెడ్ జ్యుయలరీ విషయంలో బంగారం, వెండి, ప్లాటినం ఆభరణాల తయారీలో వేస్టేజీని 0.75 శాతానికి తగ్గించింది. అంతకుముందు ఇది 5 శాతంగా ఉండేది.

కొంత వెసులుబాటు..: తాజాగా విడుదల చేసిన నిబంధనల ప్రకారం.. చేతితో తయారు చేసిన బంగారం, ప్లాటినం ఆభరణాలకు సంబంధించి గరిష్ట వేస్టేజీని 2.5% వరకు అనుమతించనున్నారు. చేతితో చేసిన వెండి ఆభరణాలకు 3.2 % వేస్టేజీ అమలు కానుంది. మెషిన్లపై చేసిన బంగారం ఆభరణాలకు 0.45% వేస్టేజీ, వెండికి 0.5% అమలు కానుంది. చేతితో చేసిన బంగారం, వెండి, ప్లాటినం స్టడెడ్ ఆభరణాలకు 4 శాతం, మెషిన్‌పై చేసిన స్టడెడ్ ఆభరణాలు అయితే 2.8% మేర వేస్టేజీని అనుమతించనున్నారు. ఆభరణాలతోపాటు విగ్రహాలు, కాయిన్లు, పతకాలు, ఇతర వస్తువులకు సైతం ఇవే వేస్టేజీ నిబంధనలు అమలవుతాయి.

దేశ ప్రగతి కొన్ని కంపెనీలపైనే ఆధారపడరాదు

- వృద్ధి విస్తృతంగా ఉండాలి
- మరిన్ని కంపెనీలు పురోగమించాలి
- వెటరన్ బ్యాంకర్ ఉదయ్ కోటక్



ముంబై: దేశ అభివృద్ధి అన్నది కేవలం కొన్ని కంపెనీలు లేదా కొన్ని గ్రూపులపైనే ఆధారపడి ఉండరాదని ప్రముఖ బ్యాంకర్, కోటక్ మహీంద్రా బ్యాంక్ నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉదయ్ కోటక్ అభిప్రాయపడ్డారు. దేశమంతటా మరిన్ని కంపెనీలు వృద్ధి చెందేలా విస్తృతంగా ఉండాలన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ స్థూలంగా చూస్తే ఆశావహంగానే కనిపించినా.. సూక్ష్మంగా చూస్తే కంపెనీలు సవాళ్లను ఎదుర్కొంటున్నట్టు ఉదయ్ కోటక్ పేర్కొన్నారు. భారత కంపెనీలు రక్షణాత్మక ధోరణి కంటే పోటీతత్వంపైనే ఎక్కువ దృష్టి సారించాలని కోరారు. దీపావళి సందర్భంగా ఇన్వెస్టర్లకు ఉదయ్ కోటక్ ఈ మేరకు వీడియో సందేశం ఇచ్చారు. కంపెనీలకు సాయం చేయడం ద్వారా 'వెయ్యి పువ్వులు వికసించనివ్వండి' అనే సామెతను ఆచరణ దాల్చేలా క్యాపిటల్ మార్కెట్లు చూడాలన్నారు. గతేడాది ఈక్విటీలు, ఫైనాన్షియల్ మార్కెట్లకు గొప్ప సంవత్సరంగా ఉండిపోతుందంటూ, ఇన్వెస్టర్లకు అద్భుతమైన రాబడులు వచ్చినట్టు పేర్కొన్నారు. అయినప్పటికీ ఉద్ధాన పతనాలకు ఇన్వెస్టర్లు సిద్ధంగా ఉండాలన్నారు. భౌగోళిక రాజకీయ పరిస్థితులు క్షీణిస్తుండడంతో అప్రమత్తతో కూడిన ఆశావహ ధోరణితో ఉన్నట్టు చెప్పారు. ద్రవ్యోల్బణం, ద్రవ్యలోటు, కరెంటు ఖాతా లోటు ప్రస్తుతం నియంత్రణలోనే ఉన్నాయంటూ, వీటిపై భారత్ ఓ కన్నేసి ఉంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వ మాజీ ముఖ్య ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్ సైతం కేవలం కొన్ని గ్రూపులే కార్పొరేట్ రంగాన్ని నడిపిస్తుండడం పట్ల ఆందోళన వ్యక్తం చేయడం గమనార్హం.

తుక్కు విక్రయంతో రూ.4.5 కోట్లు

కేంద్ర ఆర్థిక శాఖ స్వచ్ఛత కార్యక్రమం



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంక్‌లు (పీఎస్‌బీలు), ఆర్థిక సంస్థలు తుక్కు విక్రయం ద్వారా రూ.4.5 కోట్లు సమకూర్చుకున్నాయి. అక్టోబర్ 2-31 తేదీల మధ్య కేంద్ర ఆర్థిక శాఖ స్వచ్ఛత కార్యక్రమాన్ని (ప్రత్యేక ప్రచారం 4.0) చేపట్టింది. కస్టమర్ అనుకూల చర్యలు, వసతిని మెరుగ్గా వినియోగించుకోవడం, పరిసరాలను పరిశుభ్రంగా మార్చుకోవడం, తుక్కును వదిలించుకోవడం ఈ కార్యక్రమంలో భాగంగా ఉన్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు, బీమా సంస్థలతో పాటు, నాబార్డ్, సిడ్బీ, ఎగ్జిమ్ బ్యాంక్, ఎన్‌హెచ్‌బీ, ఐఐఎఫ్‌సీఎల్ ఇందులో పాల్గొన్నాయి. వ్యర్థాలను వదిలించుకోవడం ద్వా రా 11.79 లక్షల చదరపు అడుగుల వసతి అదనంగా వినియోగంలోకి వచ్చిందని, రూ.4.50 కోట్లు సమకూరాయని కేంద్ర ఆర్థిక సేవల విభాగం ప్రకటించింది. ప్రజల ఫిర్యాదులు, అప్పీళ్లు పరిష్కరించినట్టు, ప్రధానమంత్రి కార్యాలయం, ఎంపీల సూచనలను పరిగణనలోకి తీసుకున్నట్టు తెలిపింది.

తయారీలో సహకారంపై భారత్, సౌదీ చర్చలు



న్యూఢిల్లీ: పునరుత్పాదక ఇంధనం, డిజిటల్ మౌలిక సదుపాయాలు, తయారీ తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవడంపై భారత్, సౌదీ అరేబియా దృష్టి పెడుతున్నాయి. రెండు రోజుల సౌదీ పర్యటన సందర్భంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియుష్ గోయల్, ఆ దేశ మంత్రులతో ఈ అంశాలపై ద్వైపాక్షిక చర్చలు జరపనున్నట్లు ప్రభుత్వం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. అలాగే, ఫ్యూచర్ ఇన్వెస్ట్‌మెంట్ ఇనీషియేటివ్ కార్యక్రమంలో పాల్గొంటారని, పలువురు అంతర్జాతీయ దిగ్గజ ఇన్వెస్టర్లతో కూడా భేటీ అవుతారని వివరించింది. వ్యవసాయం, ఆహార భద్రత, ఇంధనం, టెక్నాలజీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర రంగాలపై ప్రధానంగా దృష్టి పెడుతూ ఇండియా-సౌదీ స్ట్రాటెజిక్ పార్ట్‌నర్‌షిప్ కౌన్సిల్ కింద ఎకానమీ-ఇన్వెస్ట్‌మెంట్ కమిటీ రెండో సమావేశానికి కో-చెయిర్‌గా వ్యవహరిస్తారు. సౌదీ అరేబియాకు భారత్ రెండో అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. భారత్‌కు సౌదీ అరేబియా నాలుగో అతి పెద్ద భాగస్వామి. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 2023-24లో 43 బిలియన్ డాలర్లుగా ఉంది. ఎల్‌అండ్‌టీ, టాటా, విప్రో తదితర దిగ్గజ భారతీయ కంపెనీలు సౌదీ అరేబియాలో కార్యకలాపాలు సాగిస్తున్నాయి. 2000 ఏప్రిల్ నుంచి 2024 జూన్ మధ్య కాలంలో భారత్‌లో సౌదీ అరేబియా 3.22 బిలియన్ డాలర్ల మేర ప్రత్యక్ష పెట్టుబడులు పెట్టింది.

పుంజుకున్న పెట్రోల్ విక్రయాలు

- అక్టోబర్‌లో 7 శాతం అధికం
- పండుగల సందర్భంగా పెరిగిన వినియోగం
- డీజిల్ వినియోగం 3 శాతం డౌన్



న్యూఢిల్లీ: పండుగల సీజన్ మద్దతుతో దేశవ్యాప్తంగా పెట్రోల్ అమ్మకాలు అక్టోబర్ నెలలో 7.3 శాతం పెరిగాయి. కానీ, డీజిల్ అమ్మకాలు మాత్రం 3.3 శాతం తక్కువగా నమోదయ్యాయి. ఇంధన మార్కెట్లో 90 శాతం వాటా కలిగిన మూడు ప్రభుత్వరంగ ఆయిల్ కంపెనీలు (హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐవోసీ) అక్టోబర్‌లో 3.1 మిలియన్ టన్నుల పెట్రోల్‌ను విక్రయించాయి. క్రితం ఏడాది ఇదే నెలలో అమ్మకాలు 2.87 మిలియన్ టన్నులుగా ఉన్నాయి. డీజిల్ విక్రయాలు మాత్రం 3.3 శాతం తక్కువగా 6.7 మిలియన్ టన్నులకు పరిమితమయ్యాయి. పండుగల సందర్భంగా వ్యక్తిగత వాహనాల (టూవీలర్లు, ప్యాసింజర్ కార్లు) వినియోగం సాధారణంగా పెరుగుతుంది. ఇది పెట్రోల్ విక్రయాల వృద్ధికి దారితీసినట్టు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. సాగు రంగం నుంచి డిమాండ్ తక్కువగా ఉండడం డీజిల్ అమ్మకాలు తగ్గడానికి కారణమని తెలిపాయి. గడిచిన కొన్ని నెలల నుంచి డీజిల్, పెట్రోల్ అమ్మకాలు స్తబ్దుగానే కొనసాగుతున్నాయి. దేశవ్యాప్తంగా అధిక వర్షాలకుతోడు, సాగు రంగం నుంచి డిమాండ్ తగ్గడం వాహనాల వినియోగాన్ని పరిమితం చేసింది. ఇక సెప్టెంబర్ నెల గణాంకాలతో పోల్చి చూసినా అక్టోబర్‌లో పెట్రోల్ విక్రయాలు 7.8 శాతం పెరిగాయి. డీజిల్ అమ్మకాలు 20 శాతం అధికంగా నమోదయ్యాయి. సెప్టెంబర్ నెలలో పెట్రోల్ వినియోగం 2.86 మిలియన్ టన్నులు, డీజిల్ వినియోగం 5.59 మిలియన్ టన్నుల చొప్పున ఉంది. 40 శాతం వాటాతో డీజిల్ అధిక వినియోగ ఇంధనంగా ఉంటోంది. 70 శాతం డీజిల్‌ను రవాణా రంగమే వినియోగిస్తుంటుంది. ఆ తర్వాత వ్యవసాయ రంగంలో ట్రాక్టర్లు, ఇతర పరికరాల కోసం దీన్ని ఎక్కువగా వాడుతుంటారు.

2.5 శాతం అధికంగా ఏటీఎఫ్ అమ్మకాలు

ఇక విమానయాన ఇంధనం (ఏటీఎఫ్) విక్రయాలు అక్టోబర్ నెలలో క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చి చూస్తే 2.5 శాతం పెరిగి 6,47,700 టన్నులుగా ఉన్నాయి. సెప్టెంబర్ నెలలో వినియోగం 6,31,100 టన్నుల కంటే 2.6 శాతం తగ్గింది. వంటగ్యాస్ (ఎల్‌పీజీ) అమ్మకాలు 7.5 శాతం పెరిగి 2.82 మిలియన్ టన్నులుగా ఉన్నాయి. సెప్టెంబర్ నెలలో వంటగ్యాస్ అమ్మకాలు 2.72 మిలియన్ టన్నులుగా ఉండడం గమనార్హం.

దుస్తుల ఎగుమతుల్లో 9-11 శాతం వృద్ధి

2024-25పై ఇక్రా అంచనా



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారతీయ దుస్తుల ఎగుమతిదారులు 9-11 శాతం ఆదాయ వృద్ధి నమోదు చేస్తారని ఇక్రా రేటింగ్స్ అంచనా వేస్తోంది. ప్రధాన మార్కెట్లలో నిల్వలు తగ్గిపోవడం, వివిధ దేశాలు భారత్ నుంచి కొనుగోళ్లను పెంచడం ఇందుకు కారణమని తెలిపింది. 'భారతీయ దుస్తుల ఎగుమతులకు దీర్ఘకాలిక అవకాశాలు అనుకూలంగా ఉన్నాయి. రిటైల్ మార్కెట్లలో భారతీయ ఉత్పత్తులకు అంగీకారం, అభివృద్ధి చెందుతున్న వినియోగదారుల పోకడలు, ఉత్పత్తి-సంబంధిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం, ఎగుమతి ప్రోత్సాహకాలు, యూకే, ఈయూతో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం ఇందుకు కారణం. అధిక రిటైల్ ఇన్వెంటరీ, కీలక మార్కెట్ల నుండి మందగించిన డిమాండ్, ఎర్ర సముద్ర సంక్షోభం, పొరుగు దేశాల నుండి పెరిగిన పోటీతో సహా సరఫరా సమస్యల కారణంగా గత ఆర్థిక సంవత్సరంలో ఎగుమతులు 2 శాతం క్షీణించాయి. మూలధన వ్యయాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం, 2025-26లో టర్నోవర్‌లో 5-8 శాతం మధ్య ఉండే అవకాశం ఉంది. స్థూల ఆర్థిక వాతావరణం ఒత్తిడి, భౌగోళిక రాజకీయ సమస్యల మధ్య కొన్ని కీలక మార్కెట్లలో డిమాండ్ అనిశ్చితి చుట్టూ సవాళ్లు కొనసాగుతున్నాయి. అధికం అవుతున్న కార్మిక వ్యయాలు, సరుకు రవాణా ఖర్చులు, ఇతర నిర్వహణ ఖర్చుల పెరుగుదలతో పరిశ్రమ యొక్క నిర్వహణ మార్జిన్లు 2024-25లో 30-50 బేసిస్ పాయింట్లు తగ్గుతాయని అంచనా. బంగ్లాదేశ్‌లో ఇటీవలి భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతల కారణంగా భారత్‌సహా పలు దేశాల్లో సామర్థ్యం జోడించే అవకాశం ఉంది. పీఎల్ఐ పథకం కింద తాజా సామర్థ్య జోడింపుల నుండి పొందే ప్రయోజనాలతో పాటు, పీఎం మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్, అపారెల్ స్కీమ్ ద్వారా మానవ నిర్మిత ఫైబర్ ఉత్పత్తిలో దేశ ఉనికిని బలోపేతం చేయడంతో.. ప్రపంచ దుస్తుల వ్యాపారంలో భారత్ దూసుకెళ్తుందని పరిశ్రమ భావిస్తోంది' అని నివేదిక వివరించింది.

డిమాండ్‌పై ఆందోళనలేదు

- ఐపీవో నేపథ్యంలో స్విగ్గీ వెల్లడి
- రూ. 11,330 కోట్ల సమీకరణకు రెడీ
- షేరుకి రూ. 371-390 ధరలో ఇష్యూ



ముంబై: పట్టణ ప్రాంతాలలో డిమాండ్ తగ్గుతుండటంపట్ల తమకెలాంటి ఆందోళనా లేదని ఫుడ్ డెలివరీ యాప్ స్విగ్గీ స్పష్టం చేసింది. రూ.11,330 కోట్ల సమీకరణకు వీలుగా పబ్లిక్ ఇష్యూకి రానున్న నేపథ్యంలో తాజాగా స్విగ్గీ ఇచ్చిన వివరణకు ప్రాధాన్యంఏర్పడింది. దేశవ్యాప్తంగా 650 నగరాలు, పట్టణాలలో కార్యకలాపాలు విస్తరించిన సంస్థ ఐపీవో నవంబర్ 6న ఆరంభమై 8న ముగుస్తుంది. షేరు ధర రూ.371- 390 శ్రేణిలో ఉండనుంది. ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో ఇప్పటికే స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్‌కాగా.. ఐపీవో తదుపరి ఫుడ్ డెలివరీ విభాగంలో రెండో లిస్టెడ్ కంపెనీగా స్విగ్గీ ఆవిర్భవించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 38 షేర్లకు (ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. కాగా.. ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థలో కనిపిస్తున్న విభిన్న పరిస్థితులు కంపెనీపై ఎలాంటి ప్రతికూల ప్రభావాన్ని చూపటం లేదని కంపెనీ సీఎఫ్‌వో రాహుల్ బోత్రా చెప్పారు. 1.4 కోట్లమంది యూజర్లకు సర్వీసులు అందిస్తున్నట్లు తెలియజేశారు.

వర్చువల్ గలాక్సీ ఐపీవో బాట

ఎన్‌ఎస్‌ఈకి ప్రాస్పెక్టస్ దాఖలు



న్యూఢిల్లీ: బీఎఫ్‌ఎస్‌ఐపై ప్రత్యేక దృష్టిపెట్టిన సాస్(ఎస్‌ఏఏఎస్) సేవల సంస్థ వర్చువల్ గలాక్సీ ఇన్ఫోటెక్ పబ్లిక్ ఇష్యూ సన్నాహాలు ప్రారంభించింది. ఇందుకు వీలుగా స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్‌ఎస్‌ఈ ఎమర్జ్‌కు ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా 66 లక్షల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. నిధుల్లో రూ. 34 కోట్లు అదనపు అభివృద్ధి కేంద్రాల ఏర్పాటుకు, రూ. 19 కోట్లు ప్రస్తుత ప్రొడక్టుల ఆధునీకరణ, విస్తరణ తదితరాలకు వినియోగించనుంది. మరో రూ. 14 కోట్లు బిజినెస్ డెవలప్‌మెంట్, మార్కెటింగ్ కార్యకలాపాలపై వెచ్చించనుంది. కాగా.. జులైలో ప్రీఐపీవో నిధుల సమీకరణలో భాగంగా సుప్రసిద్ధ ఇన్వెస్టర్ల నుంచి రూ. 21.44 కోట్లు సమకూర్చుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి ఆరు నెలల్లో(ఏప్రిల్-సెప్టెంబర్) రూ. 72 కోట్ల ఆదాయం, రూ. 19 కోట్ల నికర లాభం ఆర్జించింది.

టయోటాకు సుజుకీ ఈవీలు

గుజరాత్ ప్లాంటులో తయారీ • వచ్చే ఏడాది నుంచి సరఫరా



న్యూఢిల్లీ: పూర్తి స్థాయి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని టయోటా మోటార్ కార్పొరేషన్‌కు సుజుకీ మోటార్ కార్పొరేషన్ సరఫరా చేయనుంది. ఈ మేరకు ఇరు సంస్థలు తమ సహకారాన్ని మరింత విస్తరింపజేశాయి. ఈ మోడల్‌ను 2025 ప్రారంభంలో గుజరాత్ ప్లాంటులో తయారు చేయనున్నట్లు సుజుకీ మోటార్ కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. మారుతీ సుజుకీ ఇండియా వచ్చే ఏడాది పూర్తి స్థాయి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని విడుదల చేయాలని యోచిస్తోంది. ఈ మోడల్ కోసం తీసుకున్న బీఈవీ యూనిట్, ప్లాట్‌ఫామ్‌లను సుజుకీ, టయోటాతో పాటు డైహట్సు మోటార్ కార్పొరేషన్ సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. 'ప్రపంచవ్యాప్తంగా టయోటాకు మా మొదటి బీఈవీ (బ్యాటరీ ఎలక్ట్రిక్ వెహికల్) సరఫరా చేస్తాం. ఈ విధంగా రెండు కంపెనీల మధ్య సహకారం మరింతగా కొనసాగినందుకు చాలా సంతోషంగా ఉంది. పోటీదారులుగా కొనసాగుతూనే ఇరు కంపెనీలు విభిన్న మార్గాల ద్వారా కార్బన్-న్యూట్రల్ సొసైటీని సాకారం చేయడంతో సహా సామాజిక సమస్యలను పరిష్కరించడంలో మరింత సహకరించుకుంటాయి'' అని సుజుకీ ప్రెసిడెంట్ తోషిహిరో సుజుకీ తెలిపారు. ఉత్పత్తులను ఇచ్చిపుచ్చుకోవడం, తయారీ కేంద్రాల వినియోగానికై భాగస్వామ్యం కోసం టయోటా మోటార్ కార్పొరేషన్, సుజుకీ మోటార్ కార్పొరేషన్ 2017లో అవగాహన ఒప్పందంపై సంతకం చేశాయి. మారుతీ సుజుకీలో... సుజుకీ కార్పొరేషన్‌కు దాదాపు 58 శాతం వాటా ఉంది.

యాపిల్‌లో మరింత తగ్గిన బఫెట్ వాటా



ముంబై: టెక్ దిగ్గజం యాపిల్ సంస్థలో బెర్క్‌షైర్ హాత్‌వే అధిపతి వారెన్ బఫెట్ వాటా మరింత తగ్గింది. సెప్టెంబర్ క్వార్టర్‌లో షేర్లను విక్రయించినట్లు బెర్క్‌షైర్ హాత్‌వే తెలిపింది. దీంతో యాపిల్‌లో మొత్తం వాటా విలువ 69.9 బిలియన్ డాలర్లకు దిగివచ్చింది. ఆగస్టు త్రైమాసికంలో 75 బిలియన్ డాలర్ల విలువైన షేర్ల(సగానికి పైగా వాటా)ను అమ్మింది. ఈ ఏడాదిలో యాపిల్‌తో పాటు బ్యాంక్ ఆఫ్ అమెరికా షేర్లను భారీ విక్రయించడంతో పాటు ఎలాంటి ప్రధాన కొనుగోళ్లు జరపకపోవడంతో బెర్క్‌షైర్ హాత్‌వే నగదు రిజర్వు 325 బిలియన్ డాలర్లకి చేరింది.

కాంట్రాక్ట్ రిసర్చ్‌లో 10 శాతం వాటా

- 2033 నాటికి భారత్‌కు సాధ్యం
- మెకిన్సే తాజా నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా 2033 నాటికి కాంట్రాక్ట్ రిసర్చ్ డెవలప్‌మెంట్, మాన్యుఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్స్‌కు (సీఆర్‌డీఎంవో) అప్పగించిన పనిలో భారత్ 8-10 శాతం వాటా పొందే అవకాశం ఉందని మెకిన్సే అండ్ కంపెనీ నివేదిక తెలిపింది. ఈయూ, యూఎస్ నుంచి ప్రాజెక్టులను ఆసియాలోని సీఆర్‌డీఎంవోలకు పెద్ద ఎత్తున బదిలీ ఇందుకు కారణమని వివరించింది. 'అంతర్జాతీయంగా సీఆర్‌డీఎంవో పరిశ్రమ అనేక ఆసియా దేశాలలో ఔట్‌సోర్సింగ్ వర్క్‌ల పునర్‌పంపిణీకి సాక్ష్యమివ్వబోతోంది. 2033 నాటికి భారత్, కొరియాలు కొత్త పవర్‌హౌస్‌లుగా అవతరించబోతున్నాయి. ఈ వృద్ధి ఎక్కువగా అభివృద్ధి చెందుతున్న భౌగోళిక రాజకీయ వాతావరణం ద్వారా నడపబడుతుంది. భారతీయ సీఆర్‌డీఎంవోలు తమ కొత్త వ్యాపారంలో 20-40 శాతం ఈ మార్పుల వల్ల ఉత్పన్నమవుతాయని ఆశిస్తున్నాయి. మార్కెట్ అంచనాల ప్రకారం ప్రస్తుతం అంతర్జాతీయంగా పరిశ్రమ 224 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇది 2032 నాటికి 465 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా. భారతీయ సీఆర్‌డీఎంవోలు పరిశ్రమకు అందించే విలువను బయోఫార్మా రంగం ఎక్కువగా గుర్తిస్తోంది. విలువ చేకూర్చడం, ఆవిష్కరణలపై బలమైన దృష్టితో ఆరోగ్య సంరక్షణ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో భారతీయ సీఆర్‌డీఎంవోలు కీలక పాత్ర పోషించడానికి సిద్ధంగా ఉన్నాయి' అని నివేదిక తెలిపింది.

మోస్తరు స్థాయికి వ్యాపార సెంటిమెంట్

చురుగ్గా ఆర్థిక కార్యకలాపాలు • క్యూ2పై ఎన్‌సీఏఈఆర్-ఎన్‌ఎస్‌ఈ సర్వే



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం(క్యూ2)లో ఆర్థిక కార్యకలాపాలు చైతన్యంగానే ఉన్నాయని, కాకపోతే మోస్తరు స్థాయిలో కొనసాగినట్టు ఎన్‌సీఏఈఆర్-ఎన్‌ఎస్‌ఈ వ్యాపార అంచనాల సర్వే వెల్లడించింది. వరుసగా రెండు త్రైమాసికాల పాటు మెరుగుపడిన వ్యాపార సెంటిమెంట్, సెప్టెంబర్ త్రైమాసికంలో మోస్తరు స్థాయికి తగ్గినట్టు తెలిపింది. వ్యాపార సెంటిమెంట్ 134.3గా నమోదైంది. జూలై త్రైమాసికంలో ఇది 149.8గా ఉంటే, 2023-24 సెప్టెంబర్ క్వార్టర్‌లో 140.7గా ఉన్నట్టు తెలిపింది. వచ్చే ఆరు నెలల్లో ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని 62.1 శాతం సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఇదే కాలంలో తమ ఆర్థిక పరిస్థితులు కూడా పుంజుకుంటాయని ఈ సంస్థలు భావిస్తున్నాయి. సర్వేలో పాల్గొన్న సంస్థలకు సంబంధించి సామర్థ్య వినియోగం 96.3 శాతంగా ఉంది. వచ్చే ఆరు నెలల్లో ఉత్పత్తి పెరుగుతుందని 67 శాతం కంపెనీలు చెప్పగా, దేశీయంగా అమ్మకాలు ఇదే కాలంలో పెరుగుతాయని అంచనా వేస్తున్నట్టు 71.5 శాతం సంస్థలు తెలిపాయి. ఇదే కాలంలో కొత్త ఆర్డర్లు సొంతం చేసుకోవడంపైనా ఆశాభావం వ్యక్తమైంది. వచ్చే ఆరు నెలల్లో ఎగుమతుల వృద్ధిపైనా ఇదే మాదిరి సానుకూల అంచనాలున్నాయి. ముడి సరుకులు, విద్యుత్, కార్మికుల వ్యయాల్లో ఎలాంటి మార్పు ఉండకపోవచ్చని ఎక్కువ సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఈ సర్వేలో 493 సంస్థలు తమ అభిప్రాయాలను వెల్లడించాయి.



ఎప్పటికీ ఆర్‌సీబీతోనే...

మరో జెర్సీలో ఊహించుకోలేను

- ఐపీఎల్ రిటెన్షన్‌పై విరాట్ కోహ్లి
- మరో మూడేళ్లు బెంగళూరుకే ఆడతానని ప్రకటన

బెంగళూరు: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో మరో జట్టు జెర్సీలో తనని తాను ఊహించుకోలేనని భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి వెల్లడించాడు. లీగ్ ప్రారంభమైనప్పటి నుంచి రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)కే ప్రాతినిధ్యం వహిస్తున్న కోహ్లి... మరో మూడేళ్ల పాటు బెంగళూరుకు ఆడటం ఖాయమే అని సూచనప్రాయంగా చెప్పాడు. 2008లో ఐపీఎల్ ప్రారంభం కాగా... అప్పటి నుంచి కోహ్లి బెంగళూరు జట్టు తరఫునే బరిలోకి దిగుతూ వస్తున్నాడు. ఐపీఎల్ చరిత్రలో ఒకే జట్టుకు ఇన్ని సీజన్‌లు ఆడిన ఏకైక ప్లేయర్‌గా విరాట్ రికార్డు నెలకొల్పాడు. ఐపీఎల్ మెగా వేలానికి ముందు తాజాగా జరిగిన రిటెన్షన్ విధానంలో ఆర్సీబీ యాజమాన్యం రూ. 21 కోట్లకు కోహ్లిని తిరిగి దక్కించుకుంది. 36 ఏళ్ల విరాట్ 2027 వరకు బెంగళూరు జట్టు తరఫున ఆడనున్నట్లు ఆర్సీబీ విడుదల చేసిన ప్రత్యేక వీడియోలో వెల్లడించాడు. ఐపీఎల్‌లో ఇప్పటి వరకు 252 మ్యాచ్‌లు ఆడిన కోహ్లి... 131.97 స్ట్రయిక్ రేట్, 38.66 సగటుతో 8004 పరుగులు చేశాడు. అందులో 8 సెంచరీలు 55 అర్ధ శతకాలు ఉన్నాయి. తాజా రిటెన్షన్ విధానం మరో మూడేళ్లు కొనసాగనుండగా... అప్పటి వరకు ఆర్సీబీ జట్టులో విరాట్ కీలక పాత్ర పోషించనున్నాడు. 'ఈ సర్కిల్ ముగిసేసరికి నాకు ఐపీఎల్‌లో 20 ఏళ్లు పూర్తవుతాయి. అప్పటి వరకు ఆర్సీబీతోనే కొనసాగడం చాలా గొప్ప విషయంగా అనిపిస్తోంది. కెరీర్ ఆరంభించిన తొలినాళ్లలో ఇన్నాళ్లు ఆడతానని అనుకోలేదు. కానీ ఫ్రాంచైజీ యాజమాన్యంతో ఉన్న అనుబంధం వల్ల ఈ ప్రయాణం సాగుతోంది. ఒకే జట్టుతో ఇన్నేళ్ల పాటు ఉండటం బాగుంది. ఆర్సీబీతో నా బంధం ఎంత బలమైందంటే... నన్ను నేను వేరే ఐపీఎల్ జెర్సీలో ఊహించుకోలేను. కొత్త సీజన్ కోసం ఆసక్తితో ఎదురుచూస్తున్నా. కొత్త జట్టును సిద్ధం చేసేందుకు నేను రెడీగా ఉన్నాను. జట్టును ముందుకు తీసుకెళ్లడంలో నా వంతు పాత్ర పోషిస్తా. ఐపీఎల్ టైటిల్ సాధించడం మా అందరి లక్ష్యం. వచ్చే మూడేళ్లలో అది సాధ్యమయ్యే దిశగా అడుగులువేస్తా' అని కోహ్లి వెల్లడించాడు. ఆర్సీబీ అభిమానుల గురించి మాట్లాడుతూ కోహ్లి భావోద్వేగానికి గురయ్యాడు. ఒక్కసారి టైటిల్ గెలవకపోయినా...గెలుపోటముల్లో ఎల్లవేళలా మద్దతునిచ్చిన ఫ్యాన్స్‌కు అతను కృతజ్ఞతలు తెలిపాడు. 'ప్రపంచంలో ఏ జట్టుకు లేనంత మంది అభిమానులు ఆర్సీబీకి ఉన్నారు. వారితో విడదీయలేని అనుబంధం ఉంది. ఆర్సీబీ అంటే నేను అనే విధంగా అభిమానులు చూపే ఆదరణకు ముగ్దుడిని అయ్యాను. ఇన్నేళ్లలోనే నేను సంపాదించుకున్న అతి విలువైనది అభిమానుల మనసు గెలవడమే. రోజు రోజుకు నాకు, అభిమానులకు మధ్య బంధం బలపడుతూ వస్తోంది. ఆర్సీబీ తరఫున బరిలోకి దిగిన ప్రతిసారి ప్రేక్షకుల అరుపులు నాకు మరింత ఉత్సాహాన్నిస్తాయి. అదే కొత్త జోష్‌లాగా ఉంటుంది. తదుపరి దశలో ఏం చేయగలననే దానిపైనే దృష్టి పెడుతున్నా.నా వరకు బరిలోకి దిగిన ప్రతిసారి వంద శాతం కష్ట పడేందుకు ప్రయత్నిస్తా. ఫలితం మన చేతిలో ఉండదు. అభిమానులు గర్వపడే ప్రదర్శన చేయడమే నా కర్తవ్యం. మైదానంలో అభిమానులు నా పేరు, ఫ్రాంచైజీ పేరుతో గోల చేయడాన్ని నాకు దక్కిన గౌరవంగా భావిస్తా' అని విరాట్ వీడియోలో వివరించాడు.

విరాట్ వెన్నెముక: ఆండీ ఫ్లవర్

ఇక బెంగళూరు హెడ్ కోచ్ ఆండీ ఫ్లవర్ మాట్లాడుతూ... రిటెన్షన్ విధానంలో సరైన ఆటగాళ్లనే ఎంపిక చేసుకున్నట్లు వెల్లడించాడు. ఆర్సీబీకి విరాట్ వెన్నెముక లాంటి ఆటగాడని ఆండీ ఫ్లవర్ పేర్కొన్నాడు. 'విరాట్ కోహ్లిని రీటైన్ చేసుకోవడం నన్నే కాదు... దేశంలో ఏ ఒక్కరినీ ఆశ్చర్య పరచలేదు. అతడు చాన్నాళ్లుగా జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. బెంగళూరు ఫ్రాంచైజీ విజయవంతం కావడానికి విరాట్ ప్రధాన కారణం. గత సీజన్‌లో అతడు అద్భుత ప్రదర్శన చేశాడు. లీగ్ తొలి అర్ధ భాగంలో జట్టు ప్రదర్శన చెప్పుకోదగ్గ స్థాయిలో లేకపోయినా... అతడి ఆటతీరుకు వంక పెట్టలేం. ఆ తర్వాత తిరిగి గాడిన పడిందంటే అది కూడా విరాట్ వల్లే' అని ఆండీ ఫ్లవర్ అన్నాడు. ఐపీఎల్ రిటెన్షన్ గడువు ముగియగా... బెంగళూరు జట్టు ముగ్గురు ఆటగాళ్లను మాత్రమే అట్టి పెట్టుకుంది. రూ. 21 కోట్లు పెట్టి విరాట్‌ను తిరిగి తీసుకున్న ఆర్సీబీ దూకుడైన బ్యాటర్ రజత్ పటిదార్‌కు రూ. 11 కోట్లు, లెఫ్టార్మ్ పేస్ బౌలర్ యశ్ దయాళ్‌కు రూ. 5 కోట్లు కేటాయించింది. ఆటగాళ్లను కొనుగోలు చేసుకునేందుకు ఒక్కో జట్టుకు అత్యధికంగా రూ. 120 కోట్లు కేటాయించగా... అందులో బెంగళూరు ఫ్రాంచైజీ 37 కోట్లు ఖర్చు పెట్టింది. వేలం కోసం ఆర్సీబీ వద్ద రూ. 83 కోట్లు మిగిలాయి. ఈ నెలాఖరున జరిగే ఐపీఎల్ వేలంలో బెంగళూరు ఎలాంటి జట్టును ఎంపిక చేసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. ముగ్గురు క్యాప్డ్ ప్లేయర్లను ఆర్టీఎమ్ ద్వారా తిరిగి దక్కించుకునే అవకాశం బెంగళూరుకు ఉండగా... ఇప్పటి వరకు జట్టును నడిపించిన ఫాఫ్ డుప్లెసిస్, ఆ్రస్టేలియా హార్డ్ హిట్టర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్, హైదరాబాద్ ఫాస్ట్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్‌ను అట్టి పెట్టుకోకుండా విడుదల చేసింది.

టైటాన్స్‌కు మూడో విజయం



- బెంగళూరు బుల్స్‌పై గెలుపు
- ప్రొ కబడ్డీ లీగ్

సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టు మూడో విజయం నమోదు చేసుకుంది. సొంతగడ్డపై ఆడిన సీజన్ తొలి పోరులో గెలిచిన తెలుగు టైటాన్స్ ఆపై మూడు ఓటముల తర్వాత వరుసగా రెండో గెలుపును అందుకుంది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 38-35 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌పై విజయం సాధించింది. టోర్నీ తొలి మ్యాచ్‌లోనూ బెంగళూరుపైనే టైటాన్స్ నెగ్గడం విశేషం. టైటాన్స్ కెప్టెన్ పవన్ సెహ్రావత్ 14 పాయింట్లతో విజయంలో కీలక పాత్ర పోషించగా... ఆశిష్ నర్వాల్ 6 పాయింట్లు సాధించాడు. బెంగళూరు బుల్స్ తరఫున అజింక్యా పవార్, పంకజ్ చెరో 9 పాయింట్లు సాధించారు. ఓవరాల్‌గా టైటాన్స్ 25 రెయిడ్ పాయింట్లు సాధిస్తే... బెంగళూరు బుల్స్ 18 పాయింట్లకే పరిమితమై పరాజయం పాలైంది. ప్రత్యర్థిని రెండు సార్లు ఆలౌట్ చేసిన టైటాన్స్... ఒక సారి ఆలౌటైంది. ఆరు మ్యాచ్‌ల్లో తెలుగు టీమ్ మూడు విజయాలు మూడు పరాజయాలు సాధించింది. శనివారమే జరిగిన మరో మ్యాచ్‌లో పట్నా పైరెట్స్ 42-37 పాయింట్ల తేడాతో యూపీ యోధాస్‌పై గెలుపొందింది. పట్నా తరఫున దేవాంక్ 11 పాయింట్లు సాధించగా.. ఆయాన్ 9 పాయింట్లతో రాణించారు. యూపీ యోధాస్ తరఫున గగన్ గౌడ 9 పాయింట్లతో పోరాడినా ఫలితం లేకపోయింది. ఒక దశలో వెనుకబడ్డ పట్నా... ఆ తర్వాత తిరిగి పుంజుకొని విజయం సాధించింది. పాయింట్ల పట్టికలో యూపీ యోధాస్ (18 పాయింట్లు) మూడో స్థానంలో ఉండగా... పట్నా పైరెట్స్ (16 పాయింట్లు) నాలుగో స్థానంలో ఉంది. ఆదివారం జరగనున్న మ్యాచ్‌ల్లో బెంగాల్ వారియర్స్‌తో హరియాణా స్టీలర్స్ (రాత్రి 8 గంటలకు), పుణేరి పల్టన్‌తో యూ ముంబా (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.



పసిడి పతకం సాధించిన తర్వాత కోచ్‌లతో క్రిష వర్మ

క్రిష వర్మ పసిడి పంచ్

అండర్-19 ప్రపంచ బాక్సింగ్

న్యూఢిల్లీ: అండర్-19 ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ బాక్సర్ క్రిష వర్మ పసిడి పతకంతో సత్తా చాటింది. ప్రపంచ బాక్సింగ్ సమాఖ్య ఆధ్వర్యంలో కొలరాడో వేదికగా జరిగిన ఈ టోర్నీలో భారత్‌కు ఒక స్వర్ణంతో పాటు ఐదు రజత పతకాలు దక్కాయి. తొలి సారి నిర్వహించిన ఈ చాంపియన్‌షిప్ మహిళల 75 కేజీల విభాగంలో క్రిష వర్మ విజేతగా నిలిచింది. తుది పోరులో క్రిష 5-0 పాయింట్ల తేడాతో సిమోన్ లెరికా (జర్మనీ)పై గెలుపొందింది. మహిళల విభాగంలో చంచల్ చౌదరీ (48 కేజీలు), అంజలీ కుమారి సింగ్ (57 కేజీలు), విని (60 కేజీలు), ఆకాంక్ష (70 కేజీలు) ఫైనల్స్‌లో ఓడి రజత పతకాలు దక్కించుకోగా... పురుషుల విభాగంలో రాహుల్ కుందు (75 కేజీలు) తుదిపోరులో తడబడి రజతానికి పరిమితమయ్యాడు. మహిళల 48 కేజీల విభాగం ఫైనల్లో చంచల్ చౌదరీ 0-5తో మియాటియా ఆటోన్ (ఇంగ్లండ్) చేతిలో... 70 కేజీల ఈవెంట్‌లో ఆకాంక్ష 1-4తో లిలల్లీ డెకాన్ (ఇంగ్లండ్) చేతిలో ఓడగా... 60 కేజీల విభాగంలో విని 2-3తో ఎల్లా లాన్స్‌డలె (ఇంగ్లండ్) చేతిలో పరాజయం పాలైంది. పురుషుల 75 కేజీల విభాగంలో రాహుల్ కుందు 1-4తో అవినోంగ్య జోసెఫ్ (అమెరికా) చేతిలో ఓడాడు. శనివారం పోటీల్లో మొత్తం ఆరుగురు భారత బాక్సర్లు పాల్గొనగా అందులో ఒకరు గెలిచి ఐదుగురు ఓటమి పాలయ్యారు. అంతర్జాతీయ బాక్సింగ్ సమాఖ్య (ఐబీఏ) స్థానాన్ని భర్తీ చేసేందుకు ప్రయత్నిస్తున్న వరల్డ్ బాక్సింగ్ ఆధ్వర్యంలో ఈ టోర్నీ జరుగుతోంది.

సబలెంక శుభారంభం

డబ్ల్యూటీఏ ఫైనల్స్ టోర్నీ

రియాద్: మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) ఫైనల్స్ టోర్నమెంట్‌లో ప్రపంచ నంబర్ వన్ అరైనా సబలెంక (బెలారస్) శుభారంభం చేసింది. శనివారం జరిగిన తొలి రౌండ్ పోరులో సబలెంక 6-3, 6-4తో చైనా స్టార్, ఏడో సీడ్ జెంగ్ కిన్‌వెన్‌ను వరుససెట్లలో ఓడించింది. రెండు సెట్లలోనూ టాప్‌సీడ్ జోరుకు ఎదురే లేకుండాపోయింది. చైనా ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన సబలెంక గంటా 24 నిమిషాల్లో మ్యాచ్ గెలిచింది. నంబర్ వన్ ప్లేయర్ 3 ఏస్‌లు సంధించి ఒకే ఒక్క డబుల్ ఫాల్ట్ చేయగా, జెంగ్ కిన్‌వెన్ 4 డబుల్ ఫాల్ట్‌లు చేసింది. 8 ఏస్‌లు సంధించినప్పటికీ టాప్‌సీడ్ జోరుకు చతికిలబడింది. ఓవరాల్‌గా వీళ్లిద్దరు ముఖాముఖిగా తలపడిన ఐదుసార్లు కూడా బెలారస్ స్టారే విజయం సాధించింది. ఈ ఏడాదే నాలుగుసార్లు చైనా ప్రత్యర్థిని ఓడించింది. ఈ సీజన్‌లో ఆ్రస్టేలియా ఓపెన్ ఫైనల్లో కిన్‌వెన్‌ను ఓడించి గ్రాండ్‌స్లామ్ గెలిచిన సబలెంక... యూఎస్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్లో చైనా ప్లేయర్‌కు ఇంటిదారి చూపింది. ఇటీవల సొంతగడ్డ వూహాన్‌లోనూ కిన్‌వెన్‌కు సబలెంక చేతిలో నిరాశే ఎదురైంది. ఈ గ్రూప్‌లోని తర్వాతి రెండు మ్యాచ్‌లలో జాస్మిన్ పావొలిని, ఎలెనా రైబాకినాలపై గెలిస్తే సబలెంక వరల్డ్ నంబర్‌వన్ స్థానానికి ఎలాంటి ఢోకా ఉండదు.



బెంగళూరుకు తొలి ఓటమి




- 3-0తో గోవా ఫుట్‌బాల్ క్లబ్ గెలుపు
- ఇండియన్ సూపర్ లీగ్

మార్గావ్: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో తిరుగులేని ఆధిక్యం ప్రదర్శిస్తున్న బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్‌కు భంగపాటు ఎదురైంది. తాజా సీజన్‌లో ఓటమి లేకుండా సాగుతున్న బెంగళూరు జట్టు... శనివారం జరిగిన పోరులో 0-3తో గోవా ఫుట్‌బాల్ క్లబ్ చేతిలో ఓడింది. సీజన్‌లో రెండో విజయం నమోదు చేసుకున్న గోవా జట్టు తరఫున ఆర్మాండో సాడికు (63వ నిమిషంలో), బ్రిసన్ ఫెర్నాండెస్ (72వ ని.లో), డెజాన్ డ్రాజిక్ (90+3వ నిమిషంలో) తలా ఒక గోల్ చేశారు. భారత జాతీయ ఫుట్‌బాల్ జట్టు కోచ్ మనోలో మార్క్వెజ్ శిక్షణలో బరిలోకి దిగిన గోవా జట్టు... మ్యాచ్‌పై సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. నిర్ణీత సమయంలో గోవా 19 షాట్లు ఆడగా... బెంగళూరు బుల్స్ 8 షాట్లు ఆడింది. లక్ష్యంపైకి ఐదు షాట్లు సంధించిన గోవా... అందులో మూడింటిని గోల్ పోస్ట్‌లోకి పంపింది. ఇప్పటి వరకు ఏడు మ్యాచ్‌లు ఆడిన బెంగళూరు 5 విజయాలు, ఒక పరాజయం, ఒక 'డ్రా'తో 16 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక అగ్రస్థానంలో కొనసాగుతోంది. మరోవైపు 7 మ్యాచ్‌ల్లో 2 విజయాలు, 2 పరాజయాలు, 3 'డ్రా'లు నమోదు చేసుకున్న గోవా 9 పాయింట్లతో పట్టికలో ఐదో స్థానంలో కొనసాగుతోంది. ఆదివారం జరగనున్న మ్యాచ్‌ల్లో నార్త్ ఈస్ట్ యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్‌తో ఒడిషా ఫుట్‌బాల్ క్లబ్‌తో... ముంబై సిటీ జట్టుతో కేరళ బ్లాస్టర్స్ ఫుట్‌బాల్ క్లబ్ తలపడతాయి.

ఫైనల్లో సాకేత్-రామ్ జోడీ

సాక్షి, హైదరాబాద్: సియోల్ ఓపెన్ ఏటీపీ-100 చాలెంజర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ ప్లేయర్ సాకేత్ మైనేని-రామ్‌కుమార్ రామనాథన్ (భారత్) జోడీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. దక్షిణ కొరియాలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ సెమీ ఫైనల్లో సాకేత్-రామ్‌కుమార్ జంట 7-6 (9/7), 6-4తో జాషువ పారిస్ (ఇంగ్లండ్)-నామ్ జి సంగ్ (జపాన్) ద్వయంపై గెలిచింది. ఒక గంట 36 నిమిషాల పాటు సాగిన పోరులో తొలి సెట్‌ను 'టై బ్రేక్'లో దక్కించుకున్న సాకేత్-రామ్‌కుమార్ ద్వయం... రెండో సెట్‌లో అదే జోరు కొనసాగిస్తూ విజయం సాధించింది. సాకేత్-రామ్‌కుమార్ జంట 6 ఏస్‌లు సంధించి ఆధిక్యం ప్రదర్శించగా... ప్రత్యర్థి జోడీ రెండు ఏస్‌లకు పరిమితమై... రెండు



డబుల్ ఫాల్ట్స్ చేసింది. ఒక టై బ్రేక్ నెగ్గిన సాకేత్-రామ్‌కుమార్ ద్వయం... ఓవరాల్‌గా 77 పాయింట్లు సాధించింది. ఆదివారం జరగనున్న ఫైనల్లో వాసిల్ కిర్కోవ్ (అమెరికా)-బార్ట్ స్టీవెన్స్ (నెదర్లాండ్స్) జంటతో సాకేత్-రామ్‌కుమార్ జోడీ తపలడనుంది.

డిసెంబర్ 1నుంచి టీటీ మిక్స్‌డ్ ప్రపంచకప్

బరిలో భారత్ సహా 16 జట్లు

లుసానే: అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) మిక్స్‌డ్ టీమ్ ప్రపంచకప్‌లో భారత్ సహా మొత్తం 16 జట్లు పోటీపడేందుకు సిద్ధమవుతున్నాయి. చైనాలోని చెంగ్డూలో వచ్చే నెల 1 నుంచి 8వ తేదీ వరకు ఈ మెగా ఈవెంట్ జరుగుతుందని, దీనికి సంబంధించిన ఫార్మాట్‌ను ఐటీటీఎఫ్ శుక్రవారం ప్రకటించింది. డిఫెండింగ్ చాంపియన్ చైనా, భారత్‌లతో పాటు ఆ్రస్టేలియా, కెనడా, చైనీస్ తైపీ, ఈజిప్ట్, ఫ్రాన్స్, జర్మనీ, హాంకాంగ్, జపాన్, దక్షిణ కొరియా, పోలాండ్, రొమేనియా, సింగపూర్, స్వీడెన్, అమెరికాలాంటి ప్రధాన దేశాలు పోటీపడనున్నాయి. మూడు దశల ఫార్మాట్‌లో ఈ మెగా టోర్నీ జరగనుంది. తొలి దశలో 16 జట్లను నాలుగు గ్రూపులుగా విభజించి రౌండ్ రాబిన్ లీగ్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఒక్కో గ్రూపు నుంచి తొలిరెండు స్థానాల్లో నిలిచిన 8 జట్లు తదుపరి రెండో దశకు అర్హత సాధిస్తాయి. ఈ ఎనిమిది జట్లన్నీ కూడా ఒక గ్రూపుగా రౌండ్ రాబిన్ పద్ధతిలో మరోసారి లీగ్ మ్యాచ్‌ల్లో తలపడతాయి. ఈ రెండు దశల్లోనూ 24 చొప్పున 48 మ్యాచ్‌లు జరుగుతాయి. అనంతరం చివరి మూడో దశ నాకౌట్ పద్ధతిలో ఉంటుంది. 8 నుంచి నాలుగు జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. ఈ దశలో నాలుగు మ్యాచ్‌లు నిర్వహిస్తారు. రెండు సెమీస్, ఒక ఫైనల్ సహా కాంస్య పతక పోటీ ఉంటుంది. ఈ విధంగా మొత్తం 52 మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ టీమ్ ఈవెంట్‌లో మిక్స్‌డ్ డబుల్స్, మహిళల, పురుషుల సింగిల్స్‌లతో పాటు డబుల్స్ పోటీలుంటాయి. బెస్టాఫ్ త్రి ఫార్మాట్‌లో మ్యాచ్‌లను నిర్వహిస్తారు. అయితే మిక్స్‌డ్ డబుల్స్‌లో ఆడిన మహిళ, పురుషుడు సింగిల్స్‌లో ఆడేందుకు వీల్లేదు. పోటీతత్వం పెరగడంతో పాటు స్థిరమైన ప్రదర్శన కనబరిచిన జట్లే తదుపరి దశలకు అర్హత సాధిస్తాయని, లింగ సమానత్వమే లక్ష్యంగా షెడ్యూల్ చేశామని ఐటీటీఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది.

లష్కరే సీనియర్ కమాండర్ సహా ముగ్గురు ఉగ్రవాదులు హతం

● నలుగురు జవాన్లకు గాయాలు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్, అనంత్‌నాగ్ జిల్లాల్లో శనివారం చోటుచేసుకున్న ఎదురుకాల్పుల ఘటనల్లో పాక్‌కు చెందిన లష్కరే తోయిబా టాప్ కమాండర్ సహా ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. నలుగురు జవాన్లు గాయపడ్డారు. నిఘా వర్గాల సమాచారం మేరకు భద్రతా బలగాలు శనివారం ఉదయం శ్రీనగర్‌లోని రద్దీగా ఉండే ఖన్యార్ ప్రాంతంలో కార్డన్‌సెర్చ్ చేపట్టాయి. ఒక ఇంట్లో దాక్కున్న ఉగ్రవాదులు బలగాలపైకి కాల్పులకు దిగారు. అనంతరం చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్‌లో ఒక ఉగ్రవాది మృతి చెందాడు. ఇతడిని పాకిస్తాన్‌కు చెందిన లష్కరే తోయిబా సీనియర్‌మోస్ట్ కమాండర్ ఉస్మాన్‌గా గుర్తించారు. కశ్మీర్ లోయలో దీర్ఘ కాలంగా పనిచేస్తున్న ఇతడికి పలు ఘటనలతో ప్రమేయం ఉందని అధికారులు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ మస్రూర్ వనీ హత్యలో ఇతడు పాల్గొన్నాడన్నారు. లష్కరేతోయిబాకే చెందిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్(టీఆర్ఎఫ్) కమాండర్ సజాద్ గుల్‌కు ఇతడు కుడిభుజంగా ఉన్నాడు. ఉస్మాన్ మృతి ఈ ప్రాంతంలో లష్కరే గ్రూపునకు పెద్ద దెబ్బగా భావిస్తున్నారు. ఈ ఘటనలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు ఇద్దరు, పోలీసులు ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను ఆర్మీకి చెందిన 92 బేస్ ఆస్పత్రికి తరలించామని, వీరి పరిస్థితి నిలకడగా ఉందని ఓ అధికారి వెల్లడించారు. మరో ఘటన.. అనంత్‌నాగ్ జిల్లా షంగూస్–లామూ ప్రాంతంలో హల్కన్ గలి వద్ద జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో భద్రతా బలగాల చేతిలో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారని అధికారులు తెలిపారు.

మేము సైతం...

స్పెయిన్‌లో ఇటీవలి భారీ వర్షాలు, వరదల్లో 210 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, చాలా మంది జాడ తెలియకుండా పోయారు. ఒక్క వలెన్సియాలోనే 155 మంది చనిపోయారు. సునామీ స్థాయిలో సంభవించిన తుపాను కారణంగా పెద్ద ఎత్తున ఆస్తి నష్టం సంభవించడం తెలిసిందే. ప్రభుత్వం ఇక్కడ పెద్ద ఎత్తున సహాయక పనులకు చేపట్టింది. వేలాదిగా ఆర్మీని రంగంలోకి దించింది. వరదలతో దెబ్బతిన్న వలెన్సియా నగర వీధుల్లో పేరుకుపోయిన బురదను తొలగిస్తున్న ప్రజలు..



సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటామంటూ స్వచ్ఛందంగా తరలివచ్చిన వారితో శుక్రవారం వలెన్సియాలోని సిటీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ కల్చరల్ కాంప్లెక్స్ ఆవరణ కిక్కిరిసిపోయిందిలా..!



అన్‌మోల్ బిష్ణోయ్‌ను అమెరికా నుంచి రప్పిస్తాం

● ముంబై క్రైం బ్రాంచి పోలీసుల వెల్లడి



ముంబై: జైల్లో ఉన్న లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు అన్‌మోల్ బిష్ణోయ్‌ను భారత్‌కు రప్పించేందుకు ముంబై పోలీసులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ హత్య సహా పలు హైప్రొఫైల్ నేరాలతో ఇతడికి సంబంధాలున్నాయని ఓ అధికారి తెలిపారు. అన్‌మోల్ తమ దేశంలోనే ఉన్నట్లు అమెరికా అధికారులు ఇటీవల ధ్రువీకరించారు. దీంతో ముంబై పోలీసు క్రైం బ్రాంచ్ అధికారులు మహారాష్ట్ర వ్యవస్థీకృత నేరాల నియంత్రణ చట్టం(మోకా) కోర్టులో అఫిడవిట్ వేశారు. కోర్టు అంగీకరించడంతో పరారీలో ఉన్న నేరస్తుడు అన్‌మోల్‌ను తమకు అప్పగించాలంటూ కేంద్ర హోం శాఖకు గత నెలలో పంపిన ప్రతిపాదన అమెరికాకు చేరిందని ఓ అధికారి వివరించారు. ముంబైలోని బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ నివాసం వద్ద ఏప్రిల్ 14వ తేదీన జరిగిన కాల్పుల ఘటనకు లారెన్స్, అన్‌మోల్ బిష్ణోయ్‌లే కారణమని పోలీసులు ఆరోపిస్తున్నారు. అన్‌మోల్ బిష్ణోయ్‌ను పట్టిచ్చిన వారికి జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) రూ.10లక్షల రివార్డు ప్రకటించింది. ఏప్రిల్‌లో ఇతడిపై లుకౌట్ నోటీస్ జారీ అయ్యింది. లారెన్స్ బిష్ణోయ్ ప్రస్తుతం గుజరాత్‌లోని సబర్మతి జైలులో ఉన్నాడు.

చొరబాటుదార్లను తరిమికొట్టాలి

లేకపోతే జార్ఖండ్‌లో హిందువుల జనాభా సగానికి పడిపోతుంది

● అస్సాం ముఖ్యమంత్రి హిమంతబిశ్వ శర్మ వ్యాఖ్యలు



రాంచీ: అస్సాం ముఖ్యమంత్రి హిమంతబిశ్వ శర్మ వివాదాస్పద మరోసారి వ్యాఖ్యలు చేశారు. జార్ఖండ్ నుంచి చొరబాటుదారులను తరిమికొట్టాలని అన్నారు. లేకపోతే రాష్ట్రంలో హిందువుల జనాభా మరో 20 ఏళ్లలో సగానికి పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జార్ఖండ్‌లో జేఎంఎం కూటమి ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం చొరబాట్లను ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. సనాతన ధర్మాన్ని కాపాడుకోవడానికి హిందువులంతా ఐక్యంగా ఉండాలని కోరారు. శనివారం పాలాములో బీజేపీ ఎన్నికల ప్రచార సభలో హిమంతబిశ్వ శర్మ ప్రసంగించారు. ఆయన జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సహ–ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. చొరబాటుదార్లను బయటకు వెళ్లగొట్టడానికి, హిందువులను కాపాడడానికి ఈ ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పారు. జార్ఖండ్‌లో పలు ప్రాంతాల్లో హిందువుల జనాభా ఇప్పటికే భారీగా తగ్గిపోయిందని గుర్తుచేశారు. భారతదేశాన్ని హిందువులు కాపాడుతున్నారని, జైశ్రీరామ్ అని నినదించడానికి అందరూ ఐక్యమత్యంతో ఉండాలని పిలుపునిచ్చారు. ఓ వర్గం ప్రజలు ఎల్లప్పుడూ జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీకే ఓటు వేస్తున్నారని, హిందువుల ఓట్లు మాత్రం పార్టీల వారీగా చీలిపోతున్నాయని తెలిపారు. అలా కాకుండా హిందువులంతా ఒక్కటై జేఎంఎం కూటమిని ఓడించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై హిమంతబిశ్వ శర్మ మండిపడ్డారు. రాహుల్ విభజన రాజకీయాలు చేస్తున్నారని, హిందువుల మధ్య చిచ్చుపెట్టి విడదీస్తున్నారని ఆరోపించారు. జార్ఖండ్‌లో అభివృద్ధి జరగాలంటే బీజేపీని గెలిపించాలని ప్రజలను కోరారు.

అస్సాంలో జార్ఖండ్ గిరిజనులకు గుర్తింపేదీ?: హేమంత్ సోరెన్

అస్సాంలో జార్ఖండ్ గిరిజనుల గుర్తింపును హిమంతబిశ్వ శర్మ ప్రభుత్వం చెరిపేస్తోందని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఆరోపించారు. జార్ఖండ్ నుంచి వెళ్లిన గిరిజనులకు అస్సాంలో ఎస్టీ హోదా కల్పించడం లేదని విమర్శించారు. శనివారం కుంతీ జిల్లాలో ఎన్నికల ప్రచారంలో సోరెన్ మాట్లాడారు. జార్ఖండ్ మూలాలున్న ప్రజలు అస్సాం టీ తోటల్లో పని చేస్తున్నారని, వారి బతుకులు దుర్భరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. అస్సాం ప్రభుత్వం వారిని పట్టించుకోవడం లేదని ఆక్షేపించారు. బీజేపీపై సోరెన్ నిప్పులు చెరిగారు. ఆ పార్టీ కుల మతాల పేరిట సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తోందని దుయ్యబట్టారు. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో తాము ఘన విజయం సాధిస్తామని, మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని హేమంత్ సోరెన్ ధీమా వ్యక్తంచేశారు.

రిచర్డ్ మూర్‌కు మరణశిక్ష అమలు

● క్షమాభిక్ష వినతిని తోసిపుచ్చిన గవర్నర్

కొలంబియా: స్టోర్ క్లర్క్‌ను కాల్చి చంపిన 1999నాటి కేసులో నల్ల జాతీయుడు రిచర్డ్ మూర్(59)కు సౌత్ కరోలినా జైలు అధికారులు శుక్రవారం మరణ శిక్ష అమలు చేశారు. అతడికి క్షమాభిక్ష ప్రసాదించిన శిక్షను జీవిత కారాగారంగా మార్చాలంటూ కేసును విచారించిన ముగ్గురు జ్యూరర్లు, ఒక జడ్జితోపాటు పాస్టర్లు, జైలు మాజీ డైరెక్టర్, మూర్ కుటుంబం చేసిన వినతిని గవర్నర్ హెన్రీ మెక్‌మాస్టర్ తోసిపుచ్చారు. దీంతో, జైలు అధికారులు శుక్రవారం సాయంత్రం రిచర్డ్ మూర్‌కు విషం ఇంజెక్షన్ ఇచ్చి శిక్షను అమలు చేశారు. 1999 సెప్టెంబర్‌లో స్పార్టన్‌బర్గ్‌లోని ఓ రిటైల్ స్టోర్‌కు వెళ్లిన మూర్‌ను జేమ్స్ మహోనీ అనే వ్యక్తి తుపాకీతో కాల్చాడు. చేతికి గాయం కాగా వెంటనే స్పందించిన మూర్ అతడి మరో చేతిలోని తుపాకీని లాక్కుని ఛాతీపై కాల్చడంతో మహోనీ అక్కడికక్కడే చనిపోయాడు. కేసు విచారణ చేపట్టిన కోర్టు.. ఘటన సమయంలో మూర్ డ్రగ్స్ ప్రభావంతో ఉన్నాడని పేర్కొంటూ మరణ శిక్ష విధించింది. అయితే, మూర్ నేర చరితుడు కాడని, జైలులో ఉన్న సమయంలో సత్ప్రవర్తనతో మెలిగినట్లు తోటి ఖైదీలు తెలిపారంటూ అతడి తరఫు లాయర్లు గవర్నర్ మెక్ మాస్టర్‌కు తెలిపారు. అటువంటి వ్యక్తి మరణశిక్ష బదులుగా క్షమాభిక్ష ప్రసాదించాలని, పెరోల్‌కు అవకాశం లేని జీవిత ఖైదుగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపిన మూర్‌కు మరణ శిక్ష విధించడం అన్యాయమని వాదించారు. మూర్ కేసును విధించిన జ్యూరీలో ఆఫ్రికన్ అమెరికన్లు ఒక్కరూ లేని జ్యూరీలో మరణ శిక్ష పడిన ఏకైక నల్లజాతీయుడు మూర్ అని వారు శుక్రవారం రాసిన లేఖలో గుర్తు చేశారు. అయినా క్షమాభిక్ష ఇచ్చేందుకు మెక్ మాస్టర్ నిరాకరించారు. మూర్ కుమారుడు, కుమార్తె ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. తమ తండ్రి తమ జీవితాలపై ఎంతో సానుకూల ప్రభావం చూపారన్నారు. తండ్రి కోరిక మేరకే ఎయిర్ ఫోర్స్‌లో చేరానంటూ అలెగ్జాండ్రా మూర్ తెలిపింది. స్పెయిన్ మిలటరీ బేస్‌లోని తమ నివాసంలో ఫోన్ మోగినప్పుడల్లా 'తాత ఫోన్ చేశాడా?'అంటూ తన ఐదేళ్ల కూతురు అడుగుతూ ఉంటుందని అలెగ్జాండ్రా అన్నారు. సౌత్ కరోలినాలో 50 ఏళ్ల క్రితం మరణ శిక్షను పునరుద్ధరించాక 45 మందికి ఆ శిక్షను విధించారు. ఇందులో ఒక్కరికి కూడా క్షమాభిక్ష ఇచ్చిన దాఖలాలు లేవు.



మరణ శిక్ష ఆపాలంటూ కొలంబియాలోని జైలు వెలుపల ప్లకార్డులతో నిరసనకారులు (ఇన్‌సెట్‌లో) మూర్

వ్యోమగాముల కోసం క్రూ కేబిన్లు, స్లీపింగ్ క్వార్టర్లు

● అభివృద్ధి చేసిన స్పేస్‌ఎక్స్ సంస్థ

వాషింగ్టన్: చందమామపైకి మానవ సహిత యాత్రకు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' సిద్ధమవుతోంది. ఆర్టిమిస్–3ప్రయోగానికి సన్నాహాలు చేస్తోంది. వ్యోమగాములతో కూడిన అంతరిక్ష నౌకను 2026లో చంద్రుడిపైకి పంపించేందుకు ప్రణాళిక సిద్ధమైంది. ఈ ప్రయోగానికి స్పేస్‌ఎక్స్ సంస్థ తన వంతు తోడ్పాటు అందిస్తోంది. స్పేస్‌ఎక్స్ అభివృద్ధి చేసిన హెచ్ఎల్ఎస్ స్టార్‌షిప్‌ను ప్రైమరీ లూనార్ ల్యాండర్‌గా ఎంపిక చేశారు. వ్యోమగాములను చందమామ ఉపరితలంపైకి చేర్చడంలో స్టార్‌షిప్ కీలక పాత్ర పోషించబోతోంది. ఇదిలా ఉండగా, స్టార్‌షిప్‌లో వ్యోమగాములు సౌకర్యవంతంగా ప్రయాణించడానికి, చంద్రుడిపై పరిశోధనలు చేసుకోవడానికి వీలుగా క్రూ కేబిన్లు, స్లీపింగ్ క్వార్టర్లను స్పేస్‌ఎక్స్ సంస్థ రూపొందించింది. క్రూ కేబిన్ చాలా విశాలంగా ఉందని, ఒకరి కంటే ఎక్కువ మంది ఆస్ట్రోనాట్స్ ఇందులో సౌకర్యవంతంగా ఉండొచ్చని, కనీస సదుపాయాలు ఇందులో లభిస్తాయని ఆ సంస్థ వెల్లడించింది. ఆహారం తీసుకోవడానికి, నిద్రించడానికి, పరిశోధనలు చేసుకోవడానికి వీలుగా ఇందులో అన్ని సౌకర్యాలు ఉన్నాయని పేర్కొంది. కేవలం చంద్రుడిపై పరిశోధనలకే కాకుండా, భవిష్యత్తులో ఇతర గ్రహాలపైకి వెళ్లే వ్యోమగాములకు ఈ క్రూ కేబిన్లు, స్లీపింగ్ క్వార్టర్లు తోడ్పడుతాయని స్పేస్‌ఎక్స్ వెల్లడించింది.



స్పేస్ ఎక్స్ రూపొందించిన క్రూ కాబిన్

ప్రపంచంలోనే అతిపెద్ద మొసలి.. కాసియస్ ఇక లేదు!

క్వీన్స్‌ల్యాండ్: సుమారు 18 అడుగుల పొడవు.. టన్ను బరువుండే మొసలి కాసియస్ చనిపోయింది. ఆస్ట్రేలియాలోని సంరక్షణ కేంద్రంలో ఎన్‌క్లోజర్‌లో విగతజీవిగా ఉన్న కాసియస్‌ను శనివారం ఉదయం సిబ్బంది గమనించారు. దీని వయస్సు 110 ఏళ్ల పైమాటేనని గ్రీన్‌ల్యాండ్‌లోని కైర్న్‌లో ఉన్న మెరైన్‌ల్యాండ్ మెలనేసియా క్రొకోడైల్ హ్యాబిటాట్ తెలిపింది. భారీ ఆకారంలో ఉండే ఈ మొసలి మొదట్లో జంతువులు, మనుషులపై దాడి చేసేది. దీనిని ఈ సంరక్షణా కేంద్రాన్ని నెలకొల్పిన జార్జి క్రెయిగ్ 1987లో ఇక్కడికి తీసుకువచ్చాడు. అప్పటి నుంచి ఇక్కడి సందర్శకులకు కాసియస్ ప్రత్యేక ఆకర్షణగా మారింది. జార్జి క్రెయిగ్ వేరే ప్రాంతానికి బదిలీ అయిన అక్టోబర్ 15వ తేదీ నుంచి కాసియస్ ఆరోగ్యం క్షీణించడం మొదలైందని సంరక్షణ కేంద్రం తెలిపింది. సాధారణ మొసళ్ల కంటే చాలా ఎక్కువ కాలమే బతికిన కాసియస్ తమకు మంచి మిత్రుడంటూ నివాళులర్పించింది.



ఎన్‌క్లోజర్ వద్ద కాసియస్‌తో క్రెయిగ్ (ఫైల్‌ఫొటో)

పోలీసు వాహనాల్లో డబ్బు మూటలు

● అధికార కూటమి అభ్యర్థులకు అందిస్తున్నారు

● ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్

బారామతి: పోలీసు వాహనాల్లో నగదును తరలించి అధికార మహాయుతి కూటమి అభ్యర్థులను అందజేస్తున్నారని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ ఆరోపించారు. పవార్ శనివారం నాడిక్కడ తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. పోలీసు వాహనాల్లో డబ్బును తరలిస్తున్నారనే అంశంపై తాను చాలా మాట్లాడాలని అనుకున్నా.. తనకు సమాచారమిచ్చిన అధికారుల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సంయమనం పాటిస్తున్నట్లు తెలిపారు. చాలా జిల్లాల నుంచి డబ్బు తరలింపుపై అధికారులు సమాచారం అందించారని వివరించారు. అధికార మహాయుతి కూటమిలో శివసేన (షిండే), బీజేపీ, ఎన్సీపీ (అజిత్ పవార్)లు భాగస్వామ్యపక్షాలుగా ఉన్న విషయం తెలిసిందే. లడ్కీ బహిన్ యోజన తదితర జనాకర్షక పథకాలు అధికార కూటమికి అనుకూలిస్తాయని అనుకుంటున్నారా? అని అడగ్గా.. 'ఈ పథకం కింద నగదును అందుకున్నామని పలువురు మహిళలు చెబుతున్నారు. మీరు సంతోషంగా ఉన్నారా? అని ప్రశ్నించగా.. కిరోసిన్, వంటనూనెల ధరలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక చేతితో ఇచ్చి మరో చేతితో లాక్కొంటున్నారని వాపోయారు' అని శరద్ పవార్ బదులిచ్చారు. ఇలాంటి పథకాల్లో తర్కం లేదని, ఇవన్నీ వంచనతో కూడినవి పవార్ ఆరోపించారు. కేంద్ర ఆర్థిక శాఖ గణాంకాల ప్రకారం మహారాష్ట్ర ర్యాంకింగ్ పడిపోయిందని, ఇది పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందని ఆయన అన్నారు. దీనికి ప్రభుత్వాన్ని మార్చడమొకటే పరిష్కారమని పేర్కొన్నారు. మహారాష్ట్రను ఆర్థికంగా బలోపేతం చేయగల మహా వికాస్ అఘాడి (ఎంవీఏ... కాంగ్రెస్, ఎన్సీపీ– ఎస్పీ, శివసేన– యూబీటీ)కి అధికారాన్ని కట్టబెట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆర్థికరంగాన్ని బలోపేతం చేయడంపై ప్రధాని, ఆయన సహచరులు దృష్టి పెట్టడం లేదని, రాజకీయాలతో సమస్యలకు పరిష్కారాలు లభించవని చురకలంటించారు.

ప్రధానమంత్రి పదవి ఔన్నత్యాన్ని దెబ్బతీస్తున్నారు

● నరేంద్ర మోదీపై ప్రియాంకా గాంధీ ఆగ్రహం



న్యూఢిల్లీ: దేశంలో 140 కోట్ల మంది ప్రజలకు నరేంద్ర మోదీ పదేపదే డొల్ల హామీలు ఇస్తూ ప్రధానమంత్రి పదవి గౌరవాన్ని, ఔన్నత్యాన్ని దెబ్బతీస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ వాద్రా ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ గురించి ఆందోళనను పక్కనపెట్టి, ప్రధాని పదవి గౌరవాన్ని పెంచడంపై ఇకనైనా దృష్టి పెట్టాలని మోదీకి హితవు పలికారు. ఈ మేరకు ప్రియాంక శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. సత్యమే దేవుడు, సత్యమేవ జయతే అని జాతిపిత మహాత్మాగాంధీ తరచుగా బోధిస్తూ ఉండేవారని పేర్కొన్నారు. వేలాది సంవత్సరాల మన సంస్కృతికి సత్యమే ఆధారమని ఉద్ఘాటించారు. ఉన్నతమైన పదవిలో ఉన్న వ్యక్తి అబద్ధాలు చెప్పడం, డొల్ల హామీలు ఇవ్వడం సరైందని కాదని స్పష్టంచేశారు. తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాయన్ని వెల్లడించారు. గ్యారంటీలతో ప్రజల సొమ్మును ప్రజలకు అందజేస్తున్నాయని తెలిపారు. నరేంద్ర మోదీ ఎన్నో హామిలిచ్చారని, వాటిలో ఎన్ని నెరవేర్చారో చెప్పాలని ప్రియాంక గాంధీ డిమాండ్ చేశారు. మోదీ హామీలన్నీ బూటకమేనని తేలిపోయిందన్నారు. 'అచ్చే దిన్' ఎక్కడున్నాయో చెప్పాలని నిలదీశారు.

రూ.1.36 లక్షల కోట్ల బొగ్గు బకాయిలివ్వండి

● కేంద్రానికి జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ వినతి

● ప్రధాని నరేంద్ర మోదీ లేఖ



రాంచీ: తమ రాష్ట్రానికి రావాల్సిన రూ.1.36 లక్షల కోట్ల బొగ్గు బకాయిలు చెల్లించాలని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తాను చేతులు జోడించి వేడుకుంటున్నానని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా జార్ఖండ్‌లో పర్యటించబోతున్నారని, ఈ నేపథ్యంలోనే బొగ్గు బకాయిల కోసం మరోసారి విజ్ఞప్తి చేస్తున్నానని చెప్పారు. ఈ నిధులు జార్ఖండ్‌కు ఇప్పుడు చాలా కీలకమని పేర్కొన్నారు. ఈ మేరకు సోరెన్ శనివారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. ఈ నిధులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎంపీలను, నాయకులను సైతం సోరెన్ కోరారు. బకాయిల కోసం ప్రధాని మోదీకి రాసిన లేఖను 'ఎక్స్'లో షేర్ చేశారు. కోల్ ఇండియా వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి తమ రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, ఇవి రాకపోవడంతో అభివృద్ధి ఆగిపోతోందని, ప్రజలకు నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని గతంలో పలుమార్లు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకుండాపోయిందన్నారు. మైనింగ్, రాయల్టీ బకాయిలు పొందడం రాష్ట్రాల హక్కు అంటూ ఇటీవల సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని హేమంత్ సోరెన్ గుర్తుచేశారు. ఇదిలా ఉండగా, రూ.1.36 లక్షల కోట్ల బకాయిలు చెప్పుడిస్తారని కేంద్రాన్ని ప్రశ్నిస్తూ జార్ఖండ్‌లో పలు చోట్ల హోర్డింగ్‌లు వెలిశాయి. రాష్ట్రంలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న సంగతి తెలిసిందే.

98 శాతం పాఠశాలల్లో బాలికలకు ప్రత్యేక టాయిలెట్లు

● సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ: దేశంలోని 97.5 శాతం పాఠశాలల్లో బాలికలకు ప్రత్యేక టాయిలెట్లు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు బడులన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే బాలికలకు ఈ మేరకు ప్రత్యేక టాయిలెట్లు ఉన్నాయని వివరించింది. ఆరు నుంచి 12 తరగతుల విద్యార్థినులకు సానిటరీ ప్యాడ్లను ఉచితంగా అందించాలని, ప్రభుత్వ, ఎయిడెడ్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో బాలికలకు ప్రత్యేక టాయిలెట్లను సమకూర్చాలని కాంగ్రెస్ నేత జయా ఠాకూర్ సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనికి కేంద్రం బదులిస్తూ అఫిడవిట్‌ను దాఖలు చేసింది. ఢిల్లీ, గోవా, పుదుచ్చేరిలు 100 శాతం లక్ష్యాలను సాధించాయని కేంద్రం వివరించింది. 10 లక్షల ప్రభుత్వ పాఠశాలల్లో 16 లక్షల బాలుర టాయిలెట్లు, 17.5 బాలికల టాయిలెట్ల నిర్మాణం జరిగిందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఎయిడెడ్ పాఠశాలల్లో 2.5 లక్షల టాయిలెట్లు బాలురకు, 2.9 లక్షల బాలికల ప్రత్యేక టాయిలెట్ల సదుపాయాలు కల్పించామని వివరించింది. పశ్చిమబెంగాల్‌లో 99.9 శాతం స్కూళ్లలో బాలికలకు ప్రత్యేక టాయిలెట్లు ఉన్నాయని తెలిపింది.

సాక్షి ప్లస్
ఆదివారం : 3-11-2024

పోర్ట్‌ఫోలియో విధానాన్ని ప్రవేశపెట్టిన వైస్రాయ్ ఎవరు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ



భారత రాజ్యాంగ పరిణామ క్రమం

1. రాజ్యాంగ భావనను తొలిసారి శాస్త్రీయంగా వివరించిన తత్త్వవేత్త ఎవరు?
   1) సోక్రటీస్ 2) అరిస్టాటిల్
   3) మాఖియవెల్లి 4) రూసో
2. కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) ప్రపంచంలో మొదటి లిఖిత రాజ్యాంగం – అమెరికా
   బి) ప్రపంచంలో మొదటి అలిఖిత రాజ్యాంగం – బ్రిటన్
   1) ఎ సరైంది 2) బి సరైంది
   3) ఎ, బి సరైనవి 4) ఏదీకాదు
3. రాజ్యాంగ పాలన ప్రజల్లో చైతన్యానికి, స్ఫూర్తి నింపడానికే తప్ప నియంత్రణకు, బానిసత్వానికి సంకేతం కాదని పేర్కొన్న రాజనీతిజ్ఞుడు ఎవరు?
   1) డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్
   2) ఉడ్రో విల్సన్
   3) అరిస్టాటిల్ 4) లాక్
4. ఫోర్త్ ఎస్టేట్‌కు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   1) బ్రిటన్ పార్లమెంట్‌లో సభ్యుడు ఎడ్‌బర్గ్ ఈ పదాన్ని తొలిసారి ప్రయోగించాడు
   2) ప్రభుత్వ అంగాలైన శాసన నిర్మాణ శాఖను మొదటి ఎస్టేట్‌గా, కార్యనిర్వాహక శాఖను రెండో ఎస్టేట్‌గా, న్యాయశాఖను మూడో ఎస్టేట్‌గా వ్యవహరిస్తారు
   3) పత్రికలను లేదా ఎలక్ట్రానిక్ మీడియాను ఫోర్త్ ఎస్టేట్‌గా వ్యవహరిస్తారు
   4) పైవన్నీ సరైనవే
5. రెగ్యులేటింగ్ చట్టం – 1773కి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) భారతదేశానికి సంబంధించిన తొలి లిఖిత చట్టం
   బి) ఈ చట్టాన్ని 1773 మే 18న అప్పటి బ్రిటిష్ ప్రధాని లార్డ్ వార్త్ బ్రిటిష్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాడు
   సి) బెంగాల్ గవర్నర్ హోదాను గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్‌గా మర్చారు
   డి) ఈ చట్టం ప్రకారం మొదటి గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్స్
   1) ఎ, బి మాత్రమే సరైనవి
   2) బి, డి, మాత్రమే సరైనవి
   3) ఎ, బి, సి, డి 4) ఏదీకాదు
6. రెగ్యులేటింగ్ చట్టం – 1773కి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
   1) ఈ చట్టం ఆధారంగా 1774లో కలకత్తాలోని పోర్ట్ విలియంలో సుప్రీంకోర్టును ఏర్పాటు చేశారు
   2) ఒక ప్రధాన న్యాయమూర్తి, ముగ్గురు సాధారణ న్యాయ మూర్తులు ఉన్నారు
   3) మొదటి ప్రధాన న్యాయమూర్తి సర్ ఎలిజా ఇంపే
   4) పైవన్నీ సరైనవే
7. రెగ్యులేటింగ్ చట్టం–1773లోని లోపాలను సవరించడానికి బ్రిటిష్ పార్లమెంట్ పిట్స్ ఇండియా చట్టాన్ని ఎప్పుడు చేసింది?
   1) 1780 2) 1784 3) 1793 4) 1833
8. దేశంలో మొదటిసారిగా ద్వంద్వ పాలనకు నాంది ప్రస్తావన చేసిన చట్టం ఏది?
   1) రెగ్యులేటింగ్ చట్టం – 1773
   2) రెగ్యులేటింగ్ చట్టం –1784
   3) భారత కౌన్సిల్ల చట్టం – 1909
   4) రెగ్యులేటింగ్ చట్టం – 1861
9. పిట్స్ ఇండియా చట్టం–1784కి సంబంధించి కింది వాటిలో సరైంది?
   1) ఈ చట్టం ప్రకారం ఇండియాలోని పరిపాలనాంశాలను రెండు రకాలుగా వర్గీకరించారు
   2) రాజకీయ వ్యవహారాలు– బోర్డ్ ఆఫ్ కంట్రోలర్, వాణిజ్య వ్యవహారాలు కోర్ట్ ఆఫ్ డైరక్టర్స్
   3) గవర్నర్ కార్యనిర్వాహక మండలి సంఖ్య నాలుగు నుంచి మూడుకు తగ్గించారు
   4) పైవన్నీ సరైనవే
10. చార్టర్ చట్టం–1793 చేసినప్పుడు గవర్నర్ జనరల్ ఎవరు?
    1) వారెన్ హేస్టింగ్స్ 2) కారన్ వాలీస్
    3) విలియం బెంటింక్ 4) ఎవరూకాదు
11. భారత్‌లో క్రైస్తవ మిషనరీలు, చర్చిలు, క్రైస్తవ మిషనరీ హాస్టళ్లను ఏ చట్టం ద్వారా నెలకొల్పారు?
    1) రెగ్యులేటింగ్ చట్టం –1773
    2) రెగ్యులేటింగ్ చట్టం –1784
    3) రెగ్యులేటింగ్ చట్టం –1793
    4) రెగ్యులేటింగ్ చట్టం –1813
12. పన్నులు విధించడానికి, అవి చెల్లించడానికి, చెల్లించని వారిపై చర్యలను తీసుకొనే అధికారాన్ని స్థానిక సంస్థలకు ఏ చట్టం ద్వారా కల్పించారు?
    1) రెగ్యులేటింగ్ చట్టం –1813
    2) భారత కౌన్సిల్ల చట్టం – 1909
    3) భారత కౌన్సిల్ల చట్టం – 1919
    4) భారత ప్రభుత్వ చట్టం – 1935
13. చార్టర్ చట్టం–1813కి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
    1) భారతీయ విద్యాభివృద్ధికి ఒక లక్ష రూపాయాలతో నిధి ఏర్పాటు చేశారు
    2) సివిల్ సర్వెంట్లకు శిక్షణా సదుపాయాన్ని కల్పించారు
    3) ఈ చట్టం ద్వారా మత మార్పిడులకు అవకాశం ఏర్పడింది
    4) మత నియోజక వర్గాలను ఏర్పాటు చేశారు
14. చార్టర్ చట్టం–1833కి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
    ఎ) బెంగాల్ గవర్నర్ జనరల్ హోదాను ఇండియన్ గవర్నర్ జనరల్‌గా మార్చరు
    బి) తొలి ఇండియన్ గవర్నర్ జనరల్ విలియం బెంటింక్
    1) ఎ సరైంది, బి సరికాదు
    2) ఎ సరైంది కాదు, బి సరైంది
    3) ఎ, బి రెండూ సరైనవే
    4) ఎ, బి రెండూ సరైనవి కాదు
15. చార్టర్ చట్టం–1833 ప్రకారం భారతీయ లా కమిషన్ అధ్యక్షుడు ఎవరు?
    1) లార్డ్ మెకాలే 2) లార్డ్ కారన్ వాలీస్
    3) లార్డ్ మింటో 4) ఎవరూ కాదు
16. 1935 భారత ప్రభుత్వ చట్టాన్ని ఉద్దేశించి 'బానిసత్వానికి ఒక నూతన చట్టాన్ని భారతదేశంపై రుద్దారు. ఇంజన్ లేకుండా గట్టి బ్రేకులున్న యంత్రం' అని వ్యాఖ్యానించిన వారు?
    1) జవహర్ లాల్ నెహ్రూ
    2) గాంధీజీ 3) జిన్నా
    4) సుభాష్ చంద్రబోస్
17. చార్టర్ చట్టాల్లో చివరిది ఏది?
    1) చార్టర్ చట్టం – 1853
    2) చార్టర్ చట్టం – 1833
    3) చార్టర్ చట్టం – 1813
    4) చార్టర్ చట్టం – 1793
18. జతపరచండి.
    జాబితా–I
    i) సివిల్ ప్రొసిజర్ కోడ్
    ii) ఇండియన్ పీనల్ కోడ్
    iii) క్రిమినల్ ప్రొసిజర్ కోడ్
    iv) POTA చట్టం
    జాబితా–II
    a) 1859 b) 1860
    c) 1861 d) 2002
    1) i-a, ii-b, iii-c, iv-d
    2) i-d, ii-c, iii-b, iv-a
    3) i-b, ii-a, iii-d, iv-c
    4) i-c, ii-d, iii-a, iv-b
19. భారత ప్రభుత్వం చట్టం – 1858 (కౌన్సిల్ చట్టాలు)లో పొందుపరిచిన అంశం ఏది?
    1) గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా హోదాను వైస్రాయ్ ఆఫ్ ఇండియాగా మార్చారు
    2) తొలి వైస్రాయ్ లార్డ్ కానింగ్
    3) బోర్డ్ ఆఫ్ కంట్రోల్ రద్దు
    4) పైవన్నీ
20. భారత ప్రభుత్వ చట్టం – 1935కి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
    1) సమాఖ్య వ్యవస్థ ప్రతిపాదన
    2) ఆర్‌బీఐ ఏర్పాటు
    3) ఫెడరల్ న్యాయస్థానం ఏర్పాటు
    4) సార్వజనీన ఓటు హక్కు
21. పిట్స్ ఇండియా చట్టం–1784 ద్వారా ప్రవేశపెట్టిన బోర్డ్ ఆఫ్ కంట్రోల్/ కోర్ట్ ఆఫ్ డైరక్టర్స్ అనే ద్వంద్వ పాలన ఏ చట్టం ద్వారా రద్దయింది?
    1) భారత కౌన్సిల్ చట్టం –1858
    2) కౌన్సిల్ల చట్టం – 1861
    3) కౌన్సిల్ల చట్టం – 1792
    4) భారత కౌన్సిల్ల చట్టం–1909
22. భారత కౌన్సిల్ల చట్టం – 1858 ప్రకారం వైస్రాయ్ పదవీకాలం ఎన్నేళ్లు?
    1) 3 2) 5 3) 1 4) 4
23. భారత కౌన్సిల్ల చట్టం –1858 సారాంశాన్ని వైస్రాయ్ లార్డ్ కానింగ్ ఏ నగరంలో చదివి వినిపించాడు?
    1) ఢిల్లీ 2) ఆగ్రా
    3) అలహాబాద్ 4) లండన్
24. పోర్ట్‌ఫోలియో విధానం ప్రవేశపెట్టిన వైస్రాయ్ ఎవరు?
    1) లార్డ్ కానింగ్ 2) మింటో
    3) విలియం బెంటింక్ 4) వెవేల్
25. ఇండియా పాలన బ్రిటిష్ చక్రవర్తి లేదా రాణి ఆధీనంలో వచ్చినట్లు బ్రిటిష్ విక్టోరియా రాణి ఎప్పుడు ప్రకటన చేసింది?
    1) 1857 నవంబర్ 1 2) 1857 డిసెంబర్ 1
    3) 1858 అక్టోబర్ 11 4) 1858 నవంబర్ 1
26. భారత వైస్రాయ్/ గవర్నర్ జనరల్‌కు ఆర్డినెన్స్ జారీ చేసే అధికారం కల్పించిన చట్టం?
    1) రెగ్యులేటింగ్ చట్టం – 1861
    2) భారత ప్రభుత్వ చట్టం –1935
    3) భారత కౌన్సిల్ల చట్టం – 1909
    4) రెగ్యులేటింగ్ చట్టం – 1858
27. 1860లో బ్రిటిష్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పద్ధతి ఏది?
    1) పోర్ట్‌పోలియో పద్ధతి 2) బడ్జెట్ పద్ధతి
    3) 1, 2 4) ఏదీకాదు
28. బ్రిటిష్ ప్రభుత్వం సివిల్ సర్వీస్‌ల వయోపరిమితిని 1878లో 19 ఏళ్లకు తగ్గించింది. మళ్లీ ఏ సంవత్సరం నుంచి దాన్ని 24 సంవత్సరాలకు పెంచారు?
    1) 1892 2) 1905 3) 1895 4) 1891
29. మతతత్వ నియోజక వర్గాల పితామహుడిగా ఎవరిని పిలుస్తారు?
    1) వారన్ హేస్టింగ్స్ 2) లార్డ్ కానింగ్
    3) విలియం బెంటింక్ 4) లార్డ్ మింటో
30. మత ప్రాతిపదికన తొలిసారి నియోజకవర్గ గణాల ఏర్పాటుకు అవకాశం కల్పించిన చట్టం?
    1) భారత కౌన్సిల్ల చటం–1919
    2) భారత ప్రభుత్వ చట్టం – 1935
    3) భారత కౌన్సిల్ల చటం–1909
    4) భారత స్వాతంత్ర్య చట్టం–1947
31. భారత కౌన్సిల్ల చట్టం–1909కి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
    ఎ) ఈ చట్టాన్ని మింటో – మార్లే సంస్కరణలు అని పేర్కొంటారు
    బి) అప్పటి గవర్నర్/ వైస్రాయ్ లార్డ్ – మింటో, భారత వ్యవహారాల కార్యదర్శి – మార్లే
    సి) గవర్నర్ కార్యనిర్వాహక మండలిలో తొలిసారి భారతీయులకు సభ్యత్వాన్ని కల్పించారు
    డి) సభ్యత్వాన్ని పొందిన తొలి భారతీయుడు సత్యేంద్ర ప్రసాద్ సిన్హా
    1) ఎ, బి సరైనవి 2) బి, సి సరైనవి
    3) సి, డి సరైనవి 4) ఎ, బి, సి, డి
32. భారత కౌన్సిల్ల చట్టం – 1909ను ఉద్దేశించి హిందువులకు, ముస్లింలకు మధ్య వేర్పాటు బీజాలు వేసి, వారి మధ్య అడ్డుగోడలు సృష్టించిందని, భారత విభజనకు నాంది పలికిందని వ్యాఖ్యానించింది ఎవరు?
    1) డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 2) గాంధీజీ
    3) జవహర్‌లాల్ నెహ్రూ 4) ఎవరూకాదు
33. 1919 చట్టానికి సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
    ఎ) 1919భారత ప్రభుత్వ చట్టాన్ని మాంటేగు – ఛేమ్స్‌ఫర్డ్ సంస్కరణలు అని పేర్కొంటారు
    బి) నాటి భారత కార్యదర్శి మాంటేగు
    సి) నాటి భారత వైస్రాయ్ ఛేమ్స్‌ఫర్డ్
    డి) ఈ చట్టాన్ని 1919లో రూపొందించినప్పటికీ 1921 నుంచి అమల్లోకి వచ్చింది
    1) ఎ, బి, సి, డి 2) ఎ, డి
    3) ఎ, బి, సి 4) పైవేవీకాదు
34. మాంటెగు – చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు –1919కు సంబంధించి కింది వాటిలో సరైంది?
    1) రాష్ట్రస్థాయిలో ద్వంద్వ పాలనను ప్రవేశపెట్టారు
    2) దేశంలో మొదటిసారిగా ద్విసభా పద్ధతిని ప్రవేశపెట్టారు
    3) భారత హైకమిషనర్ అనే పదవిని సృష్టించారు
    4) పైవన్నీ సరైనవే
35. ఏ కమిటీ సూచన మేరకు భారత్‌కు విడిగా ఒక పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేశారు?
    1) లీ కమిషన్ 2) సైమన్ కమిషన్
    3) క్రిప్స్ కమిషన్ 4) ఏదీకాదు
36. మత ప్రాతినిధ్యం ప్రకారం సిక్కులకు, క్రిస్టియన్లకు, ఆంగ్లో ఇండియన్లకు, ఐరోపా వారికి ప్రత్యేక నియోజక వర్గాలను ఏ చట్టం ప్రకారం ప్రకటించారు?
    1) భారత కౌన్సిల్ల చట్టం – 1909
    2) భారత కౌన్సిల్ల చట్టం –1919
    3) భారత ప్రభుత్వ చట్టం–1935
    4) భారత స్వాతంత్ర్య చట్టం – 1947
37. '1919 సంస్కరణలు అసంతృప్తి, నిరాశతోపాటు సూర్యుడులేని ఉదయం'గా ఉందని అభిప్రాయపడింది ఎవరు?
    1) బాలగంగాధర్ తిలక్
    2) బిపిన్ చంద్రపాల్
    3) లాలా లజపతిరాయ్
    4) అరవింద ఘోష్
38. ఏ సంస్కరణలను బ్రిటిషర్లు ప్రకటించి ఉండాల్సింది కాదని, ఏ చట్టాన్ని భారతీయులు స్వీకరించడం తగదని శ్రీమతి అనీబిసెంట్ ఏ చట్టాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు?
    1) భారత కౌన్సిల్ల చట్టం – 1919
    2) భారత కౌన్సిల్ల చట్టం –1909
    3) భారత ప్రభుత్వ చట్టం–1935
    4) భారత స్వాతంత్ర్య చట్టం – 1947
39. సైమన్ కమిషన్‌ను బ్రిటిష్ ప్రధాని బాల్విన్ ఎప్పుడు ప్రకటించాడు?
    1) 1927 జనవరి 2) 1927 ఆగస్టు
    3) 1927 నవంబర్ 4) 1927 డిసెంబర్
40. సైమన్ కమిషన్ భారతదేశానికి ఏ సంవత్సరంలో వచ్చింది?
    1) 1927 2) 1928
    3) 1929 4) 1930
41. సైమన్ కమిషన్‌ను భారతీయులు ఎందుకు వ్యతిరేకించారు?
    1) ఈ కమిటీలో సభ్యులందరూ భారతీయులు అయినందుకు
    2) ఈ కమిటీలో సభ్యులందరూ బ్రిటిషర్లు కావడం వల్ల
    3) ఈ కమిటీలోని సభ్యులందరూ మహిళలు కావడం వల్ల
    4) ఈ కమిటీలో సభ్యుడిగా గాంధీజీ ఉండటం వల్ల
42. సైమన్ కమిషన్‌ను ఇంగ్లండ్ ప్రభుత్వం ఎందుకు నియమించింది?
    1) భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వడానికి
    2) భారత ప్రభుత్వం చట్టం 1919లో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సంస్కరణలను సమీక్షించడానికి
    3) రాజ్యాంగ పరిషత్ ప్రతిపాదనను పరిశీలించడానికి
    4) డొమినియన్ ప్రతిపత్తిని సమీక్షించడానికి
43. సమాఖ్య అనే పదాన్ని తొలిసారి సూచించింది?
    1) సైమన్ కమిషన్ 2) మకల్ కమిషన్
    3) మౌంట్ బాటెన్ కమిషన్
    4) ఏదీకాదు
44. సైమన్ కమిషన్‌లో సభ్యుల సంఖ్య ఎంత?
    1) ఒక అధ్యక్షుడు, ఆరుగురు సభ్యులు
    2) ఒక అధ్యక్షుడు, ఐదుగురు సభ్యులు
    3) ఒక అధ్యక్షుడు, ఏడుగురు సభ్యులు
    4) ఒక అధ్యక్షుడు, ముగ్గురు సభ్యులు
45. మోతీలాల్ నెహ్రూ నివేదిక ఏ సంవత్సరంలో వెలువడింది?
    1) 1927 2) 1928
    3) 1959 4) 1930
46. రాష్ట్రాల్లో ఉన్న ద్వంద్వ పాలనను రద్దుచేసి కేంద్రంలో ద్వంద్వ ప్రభుత్వాన్ని ప్రవేశపెట్టిన చట్టం ఏది?
    1) భారత కౌన్సిల్ల చట్టం – 1909
    2) భారత కౌన్సిల్ల చట్టం – 1919
    3) భారత ప్రభుత్వ చట్టం – 1935
    4) భారత స్వాతంత్ర్య చట్టం – 1947
47. ఏ చట్టం ద్వారా బర్మా (మయన్మార్)ను భారతదేశం నుంచి వేరు చేశారు?
    1) 1858 చట్టం 2) 1909 చట్టం
    3) 1935 చట్టం 4) 1919 చట్టం

సమాధానాలు

1) 2	2) 3	3) 3	4) 4	5) 3
6) 4	7) 2	8) 2	9) 4	10) 2
11) 4	12) 1	13) 4	14) 3	15) 1
16) 1	17) 1	18) 1	19) 4	20) 4
21) 1	22) 2	23) 3	24) 1	25) 4
26) 1	27) 3	28) 1	29) 4	30) 3
31) 4	32) 3	33) 1	34) 4	35) 1
36) 2	37) 1	38) 1	39) 3	40) 2
41) 2	42) 2	43) 1	44) 1	45) 2
46) 3	47) 3			

'కనికట్టు' విద్యను ప్రదర్శించే జానపదులు?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
ఎస్‌ఏ /తెలుగు పండిట్స్ ప్రత్యేకం

జానపద సాహిత్యం

డీఎస్సీలో 'జానపద సాహిత్యం' తప్పనిసరి అంశం. లాంగ్వేజ్ పండిట్–తెలుగు, స్కూల్ అసిస్టెంట్ –తెలుగు ఇలా పరీక్షల స్వభావాన్ని బట్టి మార్కుల ప్రాధాన్యముంటుంది. అభ్యర్థులు ఈ విభాగంలో మార్కులు సాధించాలంటే డా॥ జి.ఎస్. మోహన్ **'జానపద విజ్ఞానాధ్యయనం'**, ఆర్వీయస్ సుందరం **'ఆంధ్రుల జానపద విజ్ఞానం'** గ్రంథాలను సేకరించి అధ్యయనం చేయాలి. ప్రత్యేకంగా నోట్స్ తయారు చేసుకోవాలి. అప్పుడే మంచి స్కోరు సాధించవచ్చు. ఈ విభాగంలో ప్రత్యేకించి 'జానపద సాహిత్య పరిచయం – లక్షణాలు – వర్గీకరణ – జానపద సాహిత్య సేకరణలో తెలుగువారి కృషి – పాశ్చాత్యుల కృషి – జానపద సాహిత్య విశేషాలు – జానపద కళారూపాలు – జానపద కళాకారులు, వారి వాద్య విశేషాలు – జానపద సాహిత్యంపై వచ్చిన పరిశోధనలు' మొదలైన అంశాలను క్షుణ్నంగా అధ్యయనం చేయాలి.

రిచర్డ్ ఎం. డార్సన్ 1972లో 'ఫోక్‌లోర్ అండ్ ఫోక్‌లైఫ్' గ్రంథ ఉపోద్ఘాతంలో జానపద విజ్ఞానాన్ని నాలుగు విధాలుగా వర్గీకరించారు. అవి..

1. **మౌఖిక జానపద విజ్ఞానం:** జానపద గేయాలు, కథా గేయాలు, జానపద పురాణాలు, ఇతిహాసాలు, గద్య కథనాలు, సామెతలు, పొడుపు కథలు, మాండలికాలు, నుడికారాలు, తిట్లు, ఒట్లు మొదలైనవన్నీ ఈ విభాగంలోకి వస్తాయి.
2. **సాంఘిక జానపదాచారాలు:** పుట్టుక, వివాహం, మరణం తదితరాంశాలకు సంబంధించిన ఆచారాలు, కుటుంబం, సంబంధ బాంధవ్యాలు, పండుగలు, వినోదాలు, ఆటలు, జానపద వైద్యం, మతం, నమ్మకం మొదలైనవన్నీ ఈ విభాగంలో చేరతాయి.
3. **వస్తు సంస్కృతి:** భౌతిక జీవితానికి సంబంధించిన అన్ని వస్తువులే కాకుండా కళారూపాలు కూడా వస్తు రూపంలో ఉంటే ఈ విభాగంలోనే చోటు పొందుతాయి. చిత్రకళ, వాస్తుకళ, వివిధ వృత్తుల పరికరాలు, దుస్తులు, అలంకరణ, ఆభరణాలు, ఆహార సామగ్రి, పూజా సామగ్రి, శిలా విగ్రహాలు, దారు విగ్రహాలు తదితర వస్తు రూపాంశాలెన్నో ఈ విభాగంలో వస్తాయి.
4. **జానపద కళలు:** సంగీతం, నృత్యం, అభినయం ఉండే ప్రదర్శన కళలన్నీ ఈ విభాగంలో చేరతాయి. గాత్ర సంగీతం, వాద్య సంగీతం, తోలు బొమ్మలాటలు, యక్షగానం, వీధి భాగోతం, కోలాటం, పగటి వేషాలు, బహురూపుల గారడీ విద్యలు మొదలైనవి ఈ విభాగంలో వస్తాయి.

జానపద సాహిత్యాన్ని ఎవరు ఎలా పిలిచారు

1. దేశిసారస్వతం – శ్రీపాద గోపాల కృష్ణమూర్తి
2. ప్రజావాఙ్మయం – ఖండవల్లి లక్ష్మీరంజనం
3. పదవాఙ్మయం – తల్లావఝ్ఝల శివశంకర శాస్త్రి
4. మధుర గీతాలు – వేటూరి ప్రభాకర శాస్త్రి
5. అనాదృత వాఙ్మయం – మల్లంపల్లి సోమశేఖర శర్మ

భిక్షకులు - ఆశ్రయం

1. పిచ్చుకుంట్ల – రెడ్డి కులాశ్రితులు
2. వీరముష్టివారు – వైశ్యాశ్రితులు
3. భట్రాజులు – క్షత్రియాశ్రితులు
4. విప్రవినోదులు – బ్రాహ్మణాశ్రితులు

జానపద సిద్ధాంతాలు - ప్రతిపాదకులు

1. మానవ శాస్త్రీయ– ఆంథ్రూలాంగ్ సిద్ధాంతం
2. భారతమూల– థియొడర్ బెన్ఫె సిద్ధాంతం
3. వలసవాదం – థియొడర్ బెన్ఫె
4. ఇండో –యూరోపి – గ్రిమ్ సోదరులు యన్ సిద్ధాంతం
5. స్వప్నమూల – లుడ్విగ్, లైస్నర్ సిద్ధాంతం
6. చారిత్రక భౌగోళిక – ఫిన్నిస్ (ఫిన్నిస్ వాదం) సిద్ధాంతం

జానపద సాహిత్యం- పరిశోధనలు

1. జానపద గేయ సాహిత్యం – బిరుదురాజు రామరాజు
2. జానపద గేయగాథలు – నాయని కృష్ణకుమారి
3. జానపద కళాసంపద – తూమాటి దోణప్ప
4. జానపద కళారూపాలు – మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
5. తోలుబొమ్మలాట – మొదలి నాగభూషణశర్మ
6. వీరగాథ వాఙ్మయం– తంగిరాల సుబ్బారావు
7. యక్షగాన వాఙ్మయం – ఎస్వీ జోగారావు
8. జానపద కథా స్రవంతి – కె.సుమతి
9. జానపద సాహిత్యం – పురాగాథలు – రావి ప్రేమలత
10. తెలుగు సామెతలు – చిలుకూరి నారాయణరావు
11. స్త్రీల రామాయణ పాటలు – శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

మాదిరి ప్రశ్నలు

1. 'Folk Lore' అంటే?
   1) జానపదుల అధ్యయనం
   2) జానపద విజ్ఞానం
   3) జానపద సాహిత్యం
   4) జానపదుల మూఢనమ్మకం
2. జానపద గేయాల ప్రధాన లక్షణాలు?
   1) లిఖిత ప్రచారం, ఏక కర్తృకం
   2) మౌఖిక ప్రచారం, జ్ఞాత కర్తృకం
   3) ఆశురచన, అనామక కర్తృతం
   4) అకృతక శైలి, గానయోగ్యతారాహిత్యం
3. ఆంధ్రుల జానపద సాహిత్య సేకరణలో తీవ్ర కృషి చేసినవారు?
   1) ఆర్వీయస్ సుందరం
   2) నేదునూరి గంగాధరం
   3) జి.ఎస్.మోహన్
   4) బిరుదురాజు రామరాజు
4. 'జానపద వాఙ్మయోద్ధారక' బిరుదాంకితులు?
   1) నేదునూరి గంగాధరం
   2) బిరుదురాజు రామరాజు
   3) తంగిరాల సుబ్బారావు
   4) ఆర్వీయస్ సుందరం
5. శారద కాంధ్రు ఏ ప్రాంతానికి చెందినవారు?
   1) తెలంగాణ 2) కోస్తాంధ్ర
   3) రాయలసీమ 4) బీదర్
6. 'తోలుబొమ్మలాట' జానపద విజ్ఞానంలో ఏ విభాగానికి చెందింది?
   1) మౌఖిక జానపద విజ్ఞానం
   2) సాంఘిక జానపదాచారాలు
   3) వస్తు సంస్కృతి
   4) జానపద కళలు
7. తెలుగు జానపద సాహిత్యాన్ని మానవశాస్త్ర దృష్టితో పరిశీలించిన తొలి మహిళా పరిశోధకురాలు?
   1) నాయని కృష్ణకుమారి
   2) కుసుమ కుమారి
   3) డి. లలిత కుమారి
   4) రావి ప్రేమలత
8. యక్షగానం దేనికి సంబంధించింది?
   1) జానపద కళ 2) శిల్పకళ
   3) నాట్య కళ 4) అదృశ్య కళ
9. 'పసిడిపలుకులు', 'మిన్నేరు', 'సెలయేరు' జానపద రచనలు ఎవరు చేశారు?
   1) బిరుదురాజు రామరాజు
   2) ఆర్వీఎస్ సుందరం
   3) నేదునూరి గంగాధరం
   4) జి.ఎస్. మోహన్
10. జానపద సాహిత్య స్వరూపం ఎవరి రచన?
    1) నేదునూరి గంగాధరం
    2) ఆర్వీఎస్ సుందరం
    3) జి.ఎస్. మోహన్
    4) బిరుదురాజు రామరాజు
11. 'జానపద కళాసంపద' పేరుతో ఎనిమిది ఉత్తమ వ్యాస సంపుటాలను ఎవరు వెలువరించారు?
    1) నేదునూరి గంగాధరం
    2) ఆర్వీఎస్ సుందరం
    3) తంగిరాల సుబ్బారావు
    4) తూమాటి దోణప్ప
12. జానపద కళారూపాలపై విశిష్ట గ్రంథం రాసిందెవరు?
    1) యస్వీ జోగారావు
    2) మొదలి నాగభూషణ శర్మ
    3) శ్రీపాద గోపాలకృష్ణమూర్తి
    4) మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
13. సంగీత, నృత్య ప్రధానమైన దేశీ రూపకం?
    1) కోలాటం 2) తప్పెటగుళ్లు
    3) యక్షగానం 4) బుర్రకథ
14. ఏ ప్రక్రియకు ప్రాచీన రూపంగా 'కొర వంజిని'ని పేర్కొంటారు?
    1) కథా కావ్యం 2) యక్షగానం
    3) చారిత్రక కావ్యం 4) ఇతిహాసం
15. జానపదుల కథల మీద విశేషంగా కృషి చేసిన పాశ్చాత్యుడు?
    1) రిచర్డ్ ఎం. డార్సన్
    2) స్టిత్ థాంప్సన్
    3) జె.ఎ.బోయల్
    4) సి.పి. బ్రౌన్
16. తెలుగులో జానపద గేయాలను ప్రచురించిన వారిలో మొదటివారు?
    1) నేదునూరి గంగాధరరావు
    2) నందిరావు చలపతిరావు
    3) జె.ఎ.బోయల్ 4) సి.పి. బ్రౌన్
17. తోలుబొమ్మలాట, వీధి భాగవతం అనేవి ఏ కళలలోకి వస్తాయి?
    1) జానపద కళలు 2) నృత్య కళలు
    3) నాటక కళలు 4) సంగీత కళలు
18. వంతపాట గల కళారూపమేది?
    1) హరికథ 2) బుర్రకథ
    3) తోలుబొమ్మలాట 4) ప్రహసనం
19. కృష్ణ చెంచులక్ష్మీ సంవాదం, గంగా గౌరీ సంవాదం అనే జానపద గేయాల్లో ఉన్న రసమేది?
    1) శృంగారం 2) హాస్యం
    3) కరుణ 4) అద్భుతం
20. 'జానపద గేయవాఙ్మయ పరిచయం' ఎవరు రచించారు?
    1) ఆచార్య నాయని కృష్ణకుమారి
    2) ఆచార్య బి. రామరాజు
    3) ఆచార్య యస్వీ జోగారావు
    4) హరి ఆదిశేషువు
21. 'ఆంధ్రుల జానపద విజ్ఞానం' రచయిత?
    1) ఆర్వీయస్ సుందరం
    2) బి. రామరాజు
    3) తంగిరాల సుబ్బారావు
    4) యస్వీ జోగారావు
22. 'తెలుగు హరికథా సర్వస్వం' జానపద పరిశోధన గ్రంథం ఎవరిది?
    1) తూమాటి దోణప్ప
    2) బిరుదురాజు రామరాజు
    3) తంగిరాల సుబ్బారావు
    4) ఆర్వీయస్ సుందరం
23. తెలుగులో జానపద గేయాల్లో పల్నాటి వీర చరిత్ర కథాగేయాన్ని ఎవరు సేకరించారు?
    1) సి.పి. బ్రౌన్ 2) జె.ఎ.బోయల్
    3) మెకంజీ 4) కాంప్‌బెల్
24. జుట్టు పోలిగాడు, కేతిగాడు, బంగారక్క పాత్రలున్న కళారూపం?
    1) ఒగ్గు కథ 2) తోలు బొమ్మలాట
    3) వీధి భాగోతం 4) పగటి వేషాలు
25. గోండుల నృత్య విశేషం?
    1) బంజారా 2) మామిడి
    3) గుస్సాడి 4) లంబాడీ
26. జానపద కళాకారులగు బవనీల వాద్య విశేషం?
    1) డమరుకం 2) తప్పెట
    3) గంట, శంఖం 4) జమిడిక
27. 'కనికట్టు' విద్యను ప్రదర్శించే జాన పదులు?
    1) బుడబుక్కలోళ్లు 2) బవనీలు
    3) కాటిపాపలు 4) బైరూపులోళ్లు
28. వీరగాథ చిత్రానికి ఇది ఉదాహరణ?
    1) సర్వాయి పాపడి కథ
    2) బాలనాగమ్మ కథ
    3) కాటమరాజు కథ
    4) బొబ్బిలి కథ
29. బ్యాలడ్ అనే పదం ఏ భాష నుంచి వచ్చింది?
    1) గ్రీకు 2) లాటిన్
    3) ఇంగ్లిష్ 4) ఫ్రెంచ్
30. జానపద సంగీతం దేనిలో అంతర్భాగం?
    1) వస్తు సంస్కృతి
    2) ప్రదర్శన కళలు
    3) మౌఖిక సాహిత్యం
    4) జానపద ఆచారం
31. కెప్టెన్ ఎం.డబ్ల్యు.కార్ రచించిన గ్రంథం?
    1) పసిడి పలుకులు
    2) ఆంధ్ర లోకోక్తి చంద్రిక
    3) లోకోక్తి ముక్తావళి
    4) తెలుగు సామెతలు
32. జానపద విజ్ఞాన వస్తు ప్రదర్శనశాలల వల్ల ప్రయోజనం?
    1) జానపద గేయ సేకరణ
    2) సంస్కృతి పరిరక్షణ
    3) ఆచారాల సంరక్షణ
    4) వీధిగాథల సంగ్రహణ
33. తత్త్వాలు పాడే వీధి గాయకుల వాయిద్యం?
    1) తంబూర 2) ఏకతార
    3) మద్దెల 4) పిల్లనగ్రోవి
34. ఆర్.ఎస్. బాగ్స్ జానపద విజ్ఞాన వర్గీకరణలో 'V' అనే అక్షరం దేన్ని సూచిస్తుంది?
    1) పొడుపు కథ 2) వాక్కు
    3) నమ్మకం 4) సామెత

సమాధానాలు

1) 2;	2) 3;	3) 2;	4) 1;	5) 1;
6) 4;	7) 1;	8) 1;	9) 3;	10) 2;
11) 4;	12) 4;	13) 3;	14) 2;	15) 2;
16) 3;	17) 1;	18) 2;	19) 2;	20) 4;
21) 1;	22) 1;	23) 1;	24) 2;	25) 3;
26) 4;	27) 3;	28) 1;	29) 2;	30) 2;
31) 2;	32) 2;	33) 1;	34) 4.	

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

'రాజుల్లో సూర్యుడు' అని పేరొందిన వారెవరు?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

వరల్డ్ హిస్టరీ

మాదిరి ప్రశ్నలు

1. 'పునరుజ్జీవనోద్యమ సాహిత్య పిత'గా ఎవరిని పేర్కొంటారు?
   1) గిట్టో 2) బొకాషియో
   3) పెట్రార్క్ 4) డ్యూరర్
2. జతపరచండి.
   జాబితా - I
   i) కాక్స్‌టన్ ii) జాన్ గూటన్‌బర్గ్
   iii) ఛాసర్ iv) డాంటే
   జాబితా - II
   ఎ) జర్మనీలో ముద్రణా యంత్రం నెలకొల్పాడు
   బి) ఇంగ్లండ్‌లో ముద్రణా యంత్రం నెలకొల్పాడు
   సి) డివైన్ కామెడీ గ్రంథం రాశాడు
   డి) ఆంగ్ల కవితాపిత
   1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
   2) i- డి, ii- బి, iii- సి, iv-ఎ
   3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి
   4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
3. 'ఈ విశ్వాన్ని సృష్టించింది, నడిపిస్తున్నదీ మేధస్సే' అని వ్యాఖ్యానించిన వారు?
   1) థామస్ అక్వినాస్ 2) ఫ్రాన్సిస్ బేకన్
   3) జాన్ గూటన్ బర్గ్ 4) గెలీలియో
4. జతపరచండి.
   జాబితా - I
   i) విప్లవాల మాత ii) పార్లమెంట్‌ల మాత
   iii) ఐరోపా జబ్బు మనిషి
   iv) దైవ శాపగ్రస్థ దేశం
   జాబితా - II
   ఎ) జర్మనీ బి) టర్కీ
   సి) ఇంగ్లండ్ డి) ఫ్రాన్స్
   1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
   2) i- డి, ii- సి, iii- బి, iv-ఎ
   3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి
   4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
5. వ్లాదిమిర్ ఇల్విచ్ ఉల్యనోవ్ అనేది ఎవరి అసలు పేరు?
   1) లెనిన్ 2) స్టాలిన్
   3) టాట్కీ 4) మొదటి జేమ్స్
6. ఆంగ్లేయ మహా విప్లవం ఎప్పుడు సంభవించింది?
   1) క్రీ.శ. 1666 2) క్రీ.శ. 1676
   3) క్రీ.శ. 1688 4) క్రీ.శ. 1698
7. పార్లమెంట్ అనే పదానికి మూలమైన 'పార్లీ' అనే పదానికి అర్థం?
   1) చర్చలు, సంప్రదింపులు
   2) రాయడం, వ్యాఖ్యానించడం
   3) ఆసక్తి, పరిశీలన 4) ఆదాయం, వ్యయం
8. కింది వాటిలో ఇంగ్లండ్ 'బిల్ ఆఫ్ రైట్స్'లో ఉండే అంశం ఏది?
   1) పార్లమెంట్ అనుమతి లేనిదే పన్నులు వసూలు చేయకూడదు
   2) పార్లమెంట్‌ను ఎన్నుకోవాలి, తరచూ సమావేశాలు నిర్వహించాలి
   3) శాంతి నెలకొన్న తరుణంలో పార్లమెంట్ అనుమతి లేకుండా శాశ్వత సైన్యాన్ని పోషించకూడదు
   4) పైవన్నీ సరైనవే
9. జతపరచండి.
   జాబితా - I
   i) లాంగ్ పార్లమెంట్ (ఇంగ్లండ్)
   ii) మొదటి చార్లెస్ (ఇంగ్లండ్) పాలనాకాలం
   iii) లెనిన్ (రష్యా) పాలనాకాలం
   iv) 15వ లూయీ (ఫ్రాన్స్) పాలనాకాలం
   జాబితా - II
   ఎ) 1625 - 1649 బి) 1640 - 1660
   సి) 1715 - 1774 డి) 1917 - 1924
   1) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
   2) i- డి, ii- సి, iii- బి, iv-ఎ
   3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి
   4) i- బి, ii- ఎ, iii- సి, iv-డి
10. అమెరికాలో సంపూర్ణ స్వాతంత్ర్య ప్రకటన చేసిన ప్రాంతం ఏది?
    1) ఫిలడెల్ఫియా 2) జార్జియా
    3) న్యూయార్క్ 4) వర్జీనియా
11. బ్రెజిల్ పోర్చుగల్ నుంచి ఎప్పుడు స్వాతంత్ర్యం పొందింది?
    1) 1813 2) 1822 3) 1833 4) 1843
12. 'ప్రపంచ కార్మికులారా ఏకంకండి. పోరాడితే పోయేదేమీ లేదు. బానిస సంకెళ్ల తప్ప' అని పిలుపునిచ్చిందెవరు?
    1) ఫ్రెడరిక్ ఏంజెల్ 2) కారల్ మార్క్స్
    3) బెనిటో ముస్సోలిని
    4) నెపోలియన్ బోనాపార్టే
13. వర్జీనియాలోని యార్క్‌టౌన్ ద్వీపకల్పం వద్ద అమెరికా సేనలకు లొంగిపోయిన బ్రిటిష్ సైన్యాలకు నాయకుడు ఎవరు?
    1) వారన్ హేస్టింగ్స్ 2) వెల్లస్లీ
    3) రాబర్ట్ క్లైవ్ 4) కారన్ వాలీస్
14. కింది వాటిలో సరికాని జత ఏది?
    1) న్యూడీల్ పథకం-ఎఫ్.డి.రూజ్‌వెల్ట్(అమెరికా)
    2) నూతన ఆర్థిక విధానం - లెనిన్ (రష్యా)
    3) రక్తపాత విధానం-ఆటోవాన్ బిస్మార్క్ (జర్మనీ)
    4) కాల్బర్టిజం - నెక్కర్ (ఫ్రాన్స్)
15. రెండో నల్లమందు యుద్ధానికి తక్షణ కారణం ఏది?
    1) లోర్చాయాలో నౌక ఉదంతం
    2) చైనా మకావో ఓడరేవును మూసి వేయడం
    3) ఇంగ్లండ్‌లో చైనా వారు అసాంఘిక కార్య కలాపాలకు పాల్పడటం
    4) చైనా భూగర్భంలో తలపెట్టిన రైలు మార్గ నిర్మాణం
16. 'విముక్తినిచ్చిన జార్' అని ఎవరిని అంటారు?
    1) జార్ మొదటి అలెగ్జాండర్
    2) జార్ మొదటి నికోలస్
    3) జార్ మూడో అలెగ్జాండర్
    4) జార్ రెండో అలెగ్జాండర్
17. నాజీ పార్టీ స్థాపకుడు ఎవరు?
    1) అడాల్ఫ్ హిట్లర్ 2) డ్రెక్టర్
    3) రిబ్బెన్ ట్రాప్ 4) వాన్‌రూన్
18. గ్రంథం, దాని రచయితకు సంబంధించి కింది వాటిలో సరికాని జత ఏది?
    జాబితా - I
    i) మైన్‌కాంఫ్
    ii) ఎ స్టడీ ఆఫ్ ఫిజికల్ కల్చర్
    iii) సోషల్ కాంట్రాక్ట్
    iv) స్పిరిట్ ఆఫ్ లాస్
    జాబితా - II
    ఎ) మాహాట్బేటుంగ్ బి) అడాల్ఫ్ హిట్లర్
    సి) మాంటెస్క్యూ డి) రూసో
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
    2) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
    3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి
    4) i- బి, ii- ఎ, iii- సి, iv-డి
19. కింది వాటిలో సరైన జత ఏది?
    1) ఇండల్జెన్సెస్ - పాప పరిహార పత్రాలు
    2) లెజాఫేర్ - జోక్యం చేసుకోకు
    3) అపార్థీడ్ - వర్ణ వివక్ష
    4) పైవన్నీ సరైనవే
20. యూరప్‌లో ఆచరణలో ఉన్న 'పుట్టింగ్ ఔట్ పద్ధతి' అంటే?
    1) ముడి సరుకులను వృత్తి పని వారికి అప్పగించి పని చేయించడం
    2) ఓడరేవులను కార్మికులకు అప్పగించడం
    3) సముద్రాలపై వ్యాపార గుత్తాధిపత్యం కలిగి ఉండటం
    4) వ్యవసాయాన్ని వాణిజ్యీకరణ చేయడం
21. 'ది ప్రిన్స్' గ్రంథ రచయిత ఎవరు?
    1) మాఖియవెల్లి 2) రాఫెల్
    3) డ్యూరర్ 4) ఎరాస్మస్
22. జతపరచండి.
    జాబితా - I
    i) దైవ దత్తాధికార సిద్ధాంతం అనుసరించిన వారు
    ii) మానవుడు సమాజం అనే సంకెళ్లలో బంధించబడ్డాడు అని వ్యాఖ్యానించిన వారు
    iii) 'వర్గ పోరాటపు రికార్డే చరిత్ర' అని పేర్కొన్నవారు
    iv) 'నేనే రాజ్యం' అని వ్యాఖ్యానించిన వారు
    జాబితా - II
    ఎ) 14వ లూయీ బి) కారల్ మార్క్స్
    సి) రూసో డి) మొదటి జేమ్స్
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
    2) i- డి, ii- సి, iii- బి, iv-ఎ
    3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి
    4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
23. 'రాజుల్లో సూర్యుడు' అని పేరొందిన వారెవరు?
    1) 4వ హెన్రీ 2) 14వ లూయీ
    3) 15వ లూయీ 4) 16వ లూయీ
24. 'ఫ్రెంచ్ ఈస్టిండియా కంపెనీ'ని ఎప్పుడు స్థాపించారు?
    1) 1664 2) 1654 3) 1668 4) 1678
25. పవిత్ర రోమన్ సామ్రాజ్యాన్ని విచ్ఛిన్నం చేసిందెవరు?
    1) 16వ లూయీ 2) నెపోలియన్ బోనాపార్టే
    3) 7వ హెన్రీ 4) రెండో ఛార్లెస్
26. జతపరచండి.
    సంవత్సరం
    i) 1865 ii) 1869 iii) 1898 iv) 1929
    ప్రాధాన్యం
    ఎ) ప్రపంచ ఆర్థిక మాంద్యం
    బి) అబ్రహం లింకన్ హత్య
    సి) చైనాలో వంద రోజుల సంస్కరణలు
    డి) సూయజ్ కాలువ తెరవడం
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
    2) i- బి, ii- డి, iii- సి, iv-ఎ
    3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి
    4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
27. 'ఉదయించే సూర్యుడి భూమి'గా పేరొందిన దేశం?
    1) జర్మనీ 2) జపాన్ 3) ఇంగ్లండ్ 4) ఫ్రాన్స్
28. 'కార్బొనారీ' అంటే?
    1) బొగ్గు కాల్చేవారు 2) స్వేచ్ఛాపుత్రులు
    3) పన్నులు చెల్లించేవారు 4) విద్యాధికులు
29. జతపరచండి.
    జాబితా - I
    i) ది మోనాలిసా చిత్రం
    ii) ప్రైస్ ఆఫ్ పాలీ గ్రంథం
    iii) గైడ్ టు జాగ్రఫీ
    iv) ది లాస్ట్ జడ్జిమెంట్ చిత్రం
    జాబితా - II
    ఎ) టాలమీ బి) మైఖెలాంజిలో
    సి) ఎరాస్మస్ డి) లియోనార్డో డావెన్సీ
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
    2) i- బి, ii- డి, iii- సి, iv-ఎ
    3) i- డి, ii- సి, iii- ఎ, iv- బి
    4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
30. కింది వాటిలో హిట్లర్ స్థాపించనిది ఏది?
    1) గెస్ట్ పో (రహస్య పోలీస్ దళం)
    2) పీపుల్స్ అబ్జర్వర్ (పత్రిక)
    3) రెడ్ షర్ట్స్ (ఎర్ర చొక్కాల దళం)
    4) ఎలైట్ గార్డ్స్ (అత్యున్నత రక్షక దళం)
31. జతపరచండి.
    ప్రముఖుడు
    i) బెనిటో ముస్సోలిని ii) హిట్లర్
    iii) జోసెఫ్ మాజినీ iv) ఆలీవర్ క్రాంవెల్
    బిరుదు
    ఎ) ఫ్యూరర్ బి) ఇల్‌డ్యూస్
    సి) లార్డ్ ప్రొటెక్టర్
    డి) ఇటలీ జాతీయోద్యమ ప్రవక్త
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
    2) i- బి, ii- డి, iii- సి, iv-ఎ
    3) i- డి, ii- సి, iii- ఎ, iv- బి
    4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
32. 'అన్ని సముద్రాలు కలిసే ఉన్నాయి' అనే విషయాన్ని తొలిసారి తన భౌగోళిక యాత్రల ద్వారా వివరించిందెవరు?
    1) ఫెర్డినాండ్ మాజిలాన్ 2)క్రిస్టఫర్ కొలంబస్
    3) వాస్కోడిగామా 4) ఫ్రెడరిక్ బార్బోసా
33. 'రినైజాన్స్' అనేది ఏ భాషాపదం?
    1) ఫ్రెంచ్ 2) జర్మన్ 3) గ్రీక్ 4) స్పానిష్
34. మధ్యయుగం నాటి ఐరోపా వాస్తు శైలిని ఏమంటారు?
    1) సమురాయ్ 2) పైటా
    3) మీర్ 4) గోథిక్
35. కింది వాటిలో సరికాని జత ఏది?
    1) నిజమైన క్రైస్తవుడు - జాన్ కాల్విన్
    2) మత సంస్కరణోద్యమానికి వేగు చుక్క - జాన్ విక్లిఫ్
    3) ది నావిగేటర్ - హెన్రీ
    4) ఆధునిక జస్టీనియన్ - లూయీ ఫిలిప్
36. 1830 నాటికి ప్రపంచంలోనే తొలి రైలు ఏయే ప్రాంతాల మధ్య నడిచింది?
    1) మాంచెస్టర్ - బ్రిస్టల్
    2) బ్రిస్టల్ - లివర్‌పూల్
    3) లివర్‌పూల్ - మాంచెస్టర్
    4) స్టాకేటన్ - డార్లింగ్‌టన్
37. జతపరచండి.
    జాబితా - I
    i) మరమగ్గం ii) ఆవిరి యంత్రం
    iii) వాటర్ ఫ్రేమ్ iv) స్పిన్నింగ్ మ్యూల్
    జాబితా - II
    ఎ) రిచర్డ్ ఆర్క్‌రైట్ బి) శామ్యూల్ క్రాంప్టన్
    సి) ఎడ్మండ్ కార్ట్‌రైట్ డి) జేమ్స్‌వాట్
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
    2) i- బి, ii- డి, iii- సి, iv-ఎ
    3) i- సి, ii- డి, iii- ఎ, iv-బి
    4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
38. ఫ్రాన్స్ జాతీయ దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహించుకుంటారు?
    1) జూన్ 14 2) జూలై 14
    3) ఆగస్టు 14 4) సెప్టెంబర్ 14
39. 'ఫ్రెంచ్ విప్లవానికి బైబిల్' అని ఏ గ్రంథాన్ని అంటారు?
    1) సోషల్ కాంట్రాక్ట్ 2) వెల్త్ ఆఫ్ నేషన్స్
    3) స్పిరిట్ ఆఫ్ లాస్
    4) ప్రిన్సిపియా మ్యాథమెటికా
40. ఫ్రాన్స్‌లో బానిసత్వాన్ని అధికారికంగా ఎప్పుడు రద్దు చేశారు?
    1) 1789 2) 1794 3) 1796 4) 1799
41. ఐక్య జర్మనీ తొలి రాజధాని ఏది?
    1) బెర్లిన్ 2) ఫ్రాంక్‌ఫర్ట్
    3) బ్రాండెన్‌బర్గ్ 4) ఉర్టెంబర్గ్
42. బోయర్ల యుద్ధం ఎప్పుడు జరిగింది?
    1) 1899-1902 2) 1905-1909
    3) 1907-1911 4) 1909-1912
43. సెయింట్ పీటర్స్‌బర్గ్ ప్రాంతం పేరు ఏమని మార్చారు?
    1) లెనిన్ గ్రాడ్ 2) స్టాలిన్ గ్రాడ్
    3) కెరెన్స్కీ గ్రాడ్ 4) టాట్స్కీ గ్రాడ్
44. జతపరచండి.
    జాబితా-I
    i) 1921 ii) 1945 ii) 1920 iv) 1949
    జాబితా-II
    ఎ) ఉత్తర అట్లాంటిక్ రాజ్యాల సంధి వ్యవస్థ (NATO)
    బి) నానాజాతి సమితి (LN)
    సి) నూతన ఆర్థిక విధానం (NEP)
    డి) ఐక్యరాజ్య సమితి (UNO)
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
    2) i- బి, ii- డి, iii- సి, iv-ఎ
    3) i- సి, ii- డి, iii- బి, iv- ఎ
    4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
45. 'విద్య కావాలని మన సేద్యగాళ్లు అడిగిన రోజున నీ స్థానంలో నీవు నా స్థానంలో నేను ఉండం' అని వ్యాఖ్యానించిన వారెవరు?
    1) మేరీ ఆంటువానెట్
    2) అలెగ్జాండ్రియా 3) రెండో క్యాథరిన్
    4) మొదటి ఎలిజబెత్
46. కింది వాటిలో సరికాని జత ఏది?
    1) గులాబీల యుద్ధం - 1453 -1485
    2) శతవర్ష సంగ్రామం - 1337-1437
    3) ట్యూడర్ వంశ పాలనాకాలం - 1485-1603
    4) స్టూవర్ట్ వంశ పాలనాకాలం - 1603-1688
47. పిలిగ్రిమ్ ఫాదర్స్ (ప్యూరిటన్లు) ఏ నౌకలో మెసాచూసెట్స్ చేరుకున్నారు?
    1) గ్లోబ్ 2) శాంటా 3) మే ఫ్లవర్ 4) నినా
48. 'ఆసియా ఆసియా వాసులకే' అని నినదించిన దేశం?
    1) జపాన్ 2) చైనా 3) భారత్ 4) శ్రీలంక
49. ఫ్రాన్స్ నుంచి అమెరికా కొనుగోలు చేసిన భూభాగం ఏది?
    1) న్యూయార్క్ 2) ఫిలడెల్ఫియా
    3) లూసియానా 4) వర్జీనియా
50. రెండో నల్లమందు యుద్ధానంతరం చైనా, ఇంగ్లండ్ చేసుకున్న సంధి?
    1) నాన్ కింగ్ సంధి 2) పెకింగ్ సంధి
    3) పోర్ట్స్ మౌత్ సంధి 4) బీజింగ్ సంధి

సమాధానాలు

1) 3	2) 4	3) 1	4) 2	5) 1
6) 3	7) 1	8) 4	9) 1	10) 1
11) 2	12) 2	13) 4	14) 4	15) 1
16) 4	17) 2	18) 2	19) 4	20) 1
21) 1	22) 2	23) 2	24) 1	25) 2
26) 2	27) 2	28) 1	29) 3	30) 3
31) 4	32) 1	33) 1	34) 4	35) 4
36) 3	37) 3	38) 2	39) 1	40) 2
41) 1	42) 1	43) 1	44) 3	45) 3
46) 2	47) 3	48) 1	49) 3	50) 2

What did the government do right?



BANK EXAMS

GENERAL ENGLISH

Model Questions

Directions (Q.No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Many economists and expert committees (1)/ have in the past argued that the RBI is holding (2)/ much higher capital than required (3)/ to cover all its risks and contingency. (4)/ No error (5)
2. Harmanpreet became the first Indian woman cricketer to score a century in T-20 Internationals. (1)/ Earlier this year, she is embroiled in controversy (2)/ after the Punjab government withdrew her DSP rank (3)/ saying her degree had been found to be fake. (4)/ No error (5)
3. Sri Lankan President Maithripala Sirisena on Sunday stoutly defended his controversial move (1)/ to dissolve the parliament, saying it was taken to prevent clashes (2)/ between rival lawmakers (3)/ and also blamed Speaker for not accepting his presidential powers. (4)/ No error (5)
4. The Election Commission on Friday imposed a near month-long ban (1)/ on holding exit polls (2)/ beginning November 12 (3)/ in the five poll-bound states include Telangana. (4)/ No error (5)
5. The National Flag will fly at half-mast throughout the country on Monday (1)/ to pay homage Union minister Ananth Kumar (2)/ who died in the early hours. (3)/ The Central government will also accord a state funeral to the senior BJP leader. (4)/ No error (5)

Directions (Q.No. 6-10): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. She looked at him, and laughed; a cold laugh, ____, yet not bitter.
   1) Disdainful 2) respectful
   3) deferential 4) referential
   5) reverent
7. My brother was ____; he has attached himself to the retinue of a wealthy Baroness.
   1) Servile 2) imply
   3) comply 4) entail
   5) authoritative
8. Punishment is ____ in deterring from crime only if it be certain and ____.
   1) Useless, slow 2) futile, leisurely
   3) ineffectual, dawdling
   4) vain, sluggish
   5) efficacious, speedy
9. The Trump administration's ____ indifference to European concerns boils the blood of even the most ____ of Eurocrats.
   1) simple, bustling
   2) basic, docile
   3) ambiguous, serene
   4) undetectable, quite
   5) Apparent, placid
10. The hotel's shabby, outdated exercise room was its ____ attempt at a health spa.
    1) hefty 2) paltry
    3) substantial 4) generous
    5) considerable

Directions: (Q.No. 11 - 15) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. <u>She recommended that John should take the ferry.</u>
    1) She recommended that John takes the ferry.
    2) She recommended that John is taking the ferry.
    3) She recommended that John has taken the ferry.
    4) She recommended that John take the ferry.
    5) No correction required
12. After the attack on the World Trade Center, the President ordered intelligence agencies <u>should prepare lists of who were America's most wanted terrorists.</u>
    1) would do the preparation of lists of America's most wanted terrorists
    2) preparing lists of most wanted terrorists in America
    3) the preparing of a list of the most wanted terrorists in America
    4) to prepare lists of the most wanted terrorists in America
    5) No correction required
13. The exhibit, created by painstaking craftsmanship in the jungles of Burma, consisted of hundreds of paintings, <u>each painting a tiny etched landscape inside its</u> own ceramic work of pottery.
    1) all the paintings a tiny etched landscape inside their
    2) all the paintings a tiny etched landscape inside its
    3) every painting a tiny etched landscape inside their
    4) each painting a tiny etched landscape inside their
    5) No correction required
14. More than one hundred years ago, students of ornithology reported that hummingbirds can hover <u>as insects flitting gracefully from one flower to another.</u>
    1) like insects flitting gracefully from one flower to another
    2) as insects do that flit gracefully from one flower to others
    3) like insects do that flit gracefully from one flower to others
    4) as do insects that flit gracefully from one flower to some other one
    5) No correction required
15. Forced to cut back their stock, automobile dealers in the area have cut prices; <u>have been priced to sell, and they are</u>
    1) are priced to sell, and they have
    2) are priced to sell, and they do
    3) are being priced to sell, and have
    4) had been priced to sell, and they have
    5) No correction required

Directions (Q.No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) The jump in the ranking, from 100 to 77, is correlated with an improvement in the ratings, a jump of 6.6 per cent over last year.
B) Such questions are critical to help evolve a more focussed set of policy priorities for India.
C) What was even more interesting was that construction permits and cross-border trade were two aspects that showed maximum improvement.
D) What did the government do right? If business has become so much easier, why don't we see a boom in new businesses and investment?
E) The improvement in India's "Doing Business" rankings was quite a surprise, and among the few pleasant ones in recent weeks.
F) This is the second year that India has seen a massive jump in the same ratings with its ranking going up by 23 places this year, on top of 30 places last year.

16. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) E
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
18. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
20. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q.No. 21-25) Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

Sardar Patel had no time for religious extremists of any kind. It didn't matter whether you were Muslim or Hindu; if you were misusing religion and religious sentiments to further your political power, Patel was not your friend. While he may have had more sympathy towards some Hindu traditions than Jawaharlal Nehru, neither Nehru nor Patel was blind to the fact that the Rashtriya Swayamsevak Sangh and Hindutva lot consistently bowed to the British rulers while Congress leaders, like themselves, were slammed into jail where some of them even died. After the murder of Bapu, Patel's anger towards the RSS was unimaginable, and he banned the organization. He lifted the ban only after the group signed an agreement saying they would stay away from politics. That assurance was given in shameless bad faith, and today we have the irony of that same RSS trying to hollow out the legacies of Gandhi, Nehru, Patel and Ambedkar even while building the gigantic Trojan Horse in Narmada district.

I'm sure there are people in Nagpur chortling into their falangist white shirts, thinking this is sweet revenge, that this statue of Patel will actually be a mausoleum of Gandhi's and Sardar's principles and ideology. The statue itself stares over a land destroyed to make the Narmada Dam and so-called Sardar Sarovar, where thousands of people were ripped out of their traditional lands to create an irrigation project that would benefit only a very few, a project that has failed dismally. To erect this obscene pile on the site of that robbery and disastrous planning is to add insult to injury. The insult is as much to the poor people of Gujarat as it is to Sardar Patel, one of their greatest champions. This statue may be intended as the place to inter Patel's idea of India, but in time, when history kicks back, it might well become the mausoleum for the toxic ideology of Hindutva.

21. Which of the following statements is true?
    1) Sardar Patel was tolerant towards Hindutva
    2) Sardar Patel entertained religious extremists
    3) Those who were misusing religion and religious sentiments occupied the coterie of Sardar
    4) all the above
    5) None of the above
22. What is the odd one out from the following options?
    1) Rip out 2) Relegate
    3) Expunge 4) Ratify
    5) Efface
23. The writer is ____
    1) Comparing Gandhi and Patel
    2) Demonstrating the strength of RSS
    3) Talking about Trojan horse
    4) Vehement about the project
    5) Disparaging the project
24. The synonym of dismal is:
    1) Drab 2) Grab
    3) Clutch 4) Dangle
    5) Droop
25. The antonym of obscene is:
    1) Profane 2) Pure
    3) Prurient 4) Ribald
    5) Wanton

KEY

1) 4	2) 2	3) 3	4) 4	5) 2
6) 1	7) 1	8) 5	9) 5	10) 2
11) 4	12) 4	13) 5	14) 2	15) 2
16) 1	17) 2	18) 3	19) 5	20) 3
21) 5	22) 4	23) 5	24) 1	25) 2